
'నా అక్కలూ.. చెల్లెళ్లు... తమ్ముళ్ల కళ్లలో వెలుగులు చూసినపుడే నా నిజమైన పుట్టిన రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+16 వెల: ₹ 5.00

సంపుటి: 10 సంచిక: 284

గురువారం 4-1-2018



వీళ్లనూ తిప్పి పంపేవారా?
ప్రసిద్ధ అమెరికన్ కంపెనీలకు అధిపతులుగా భారతీయులు - 5లో



నా దగ్గరా న్యూక్లియర్ బటన్
అది కిమ్ వద్ద ఉన్న దానికన్నా పెద్దది, శక్తిమంతమైనది: ట్రంప్ - 5లో

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | WARANGAL | KHAMMAM | MAHABOOBNAGAR | KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KURNOOL | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM



కవ్వాల్ పులికి 'ఫుడ్డు' సవ్వాల్!

అభయారణ్యంలోకి పులుల రాక కోసం అధికారుల ప్రయత్నాలు

రూ. 45 కోట్లు వెచ్చించి పనులు

- పశుగ్రాసం పెంపు.. నీటి చెలిమలు.. చెక్‌డ్యాంల ఏర్పాటు
- పులులకు కావాల్సిన 'ఆహారం'పై మాత్రం అంతులేని నిర్లక్ష్యం
- వేటగాళ్ల బారిన కృష్ణ జింకలు, దుప్పులు, కొండ గొర్రెలు
- యథేచ్ఛగా వేట సాగుతున్నా పట్టించుకోని అటవీశాఖ అధికారులు

సాక్షి, హైదరాబాద్

అది టైగర్ షెల్టర్ జోన్.. కానీ అక్కడే పుట్టి పెరిగిన పులి ఒక్కటంటే ఒక్కటి లేదు.. అయినా సరే పక్క రాష్ట్రాల నుంచి పులుల్ని రప్పించేందుకు అధికారులు కోట్లు వెచ్చిస్తున్నారు.. ఆ అడవిలో కృత్రిమంగా పశుగ్రాసం పెంచారు.. నీటి చెలిమలు

మిగతా 2వ పేజీలో ▶

'మహా' బంద్ హింసాత్మకం



ముంబైలోని విక్రోలి ప్రాంతంలో ఆందోళనకారులు తగలబెట్టిన ద్విచక్రవాహనం

ముంబై సహా మహారాష్ట్రవ్యాప్తంగా కొనసాగిన నిరసనలు

- రాళ్లురువ్విన ఆందోళనకారులు
- కోట్ల రూపాయల ఆస్తినష్టం.. స్తంభించిన జనజీవనం
- నిలిచిపోయిన రవాణా వ్యవస్థ
- విద్వేష ప్రసంగంతో పుణేలో జిగ్నేశ్, ఉమర్ ఖాలిద్‌లపై కేసు
- బంద్ ప్రశాంతంగా జరిగిందన్న ప్రకాశ్ అంబేడ్కర్

➤ మహారాష్ట్రలో 'భీమా–కోరేగావ్' ఘటన తాలూకు ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. బుధవారం కూడా ముంబై, పుణే సహా మహారాష్ట్రలోని పలు సున్నితప్రాంతాల్లో పరిస్థితి మరింత హింసాత్మకంగా మారింది. ముంబైలో రోడ్డు, రైలు రవాణా వ్యవస్థతోపాటుగా జనజీవనం స్తంభించింది. హార్బర్ లైన్ సహా రెండుచోట్ల రాళ్లురువ్విన ఘటనలూ చోటుచేసుకున్నాయి. భీమా–కోరేగావ్ యుద్ధానికి 200 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఓ వర్గం చేపట్టిన కార్యక్రమం హింసాత్మకంగా మారటంతో ఈ వివాదం మొదలైంది.

- వివరాలు 5లో

దద్దరిల్లిన పార్లమెంటు



- 'మహా' ఘటనపై బీజేపీ, కాంగ్రెస్ మాటల యుద్ధం
- సిట్టింగ్ జడ్జితో విచారణకు కాంగ్రెస్ డిమాండ్ -5లో

తేడా వస్తే.. తాట తీస్తారు

డ్వాక్రా మహిళలకు కరాటేలో ప్రత్యేక శిక్షణ

- ఆత్మరక్షణపై జనగామ జిల్లాలో వినూత్న కార్యక్రమం
- దాడుల నుంచి బయటపడేందుకు 15 రకాల టెక్నిక్‌లు
- ఈ నెలాఖరులో ఒకేసారి 1,25,998 మందికి శిక్షణ ఇచ్చేలా ఏర్పాట్లు



ఆత్మ రక్షణపై శిక్షణ తీసుకుంటున్న మహిళలు

సాక్షి, జనగామ: రాష్ట్రంలోనే తొలిసారిగా జనగామ జిల్లాలోని డ్వాక్రా మహిళా పొదుపు సంఘాల సభ్యులకు అధికారులు ఆత్మరక్షణపై శిక్షణ అందిస్తున్నారు. ఇంటాబయటా జరుగుతున్న దాడుల నుంచి రక్షణ పొందేందుకు మహిళల్లో ఆత్మవిశ్వాసం పెంపొందిస్తున్నారు. మెడలోంచి బంగారు ఆభరణాలను లాక్కెళ్లడం, అత్యాచార యత్నం, యాసిడ్, కత్తులతో దాడులు.. వంటి వాటి నుంచి సులువుగా బయటపడటంపై అవగాహన కల్పిస్తున్నారు. 15 రకాల టెక్నిక్‌లను నేర్పిస్తూ.. మహిళల్లో ధైర్యాన్ని నూరిపోస్తున్నారు. గతంలో పాఠశాల, కళాశాల స్థాయి బాలికలకు ఆత్మ రక్షణపై మార్షల్ ఆర్ట్స్‌ను నేర్పించారు. జనగామ కేంద్రంగా 2017 జనవరి 24న 13,686 మంది విద్యార్థినులతో 'సంఘటిత సబల'ప్రదర్శనను నిర్వహించి గిన్నిస్ బుక్ రికార్డును

మిగతా 2వ పేజీలో ▶



హైకోర్టు విభజనకు ముందడుగు

బాబు లేఖ నేపథ్యంలో న్యాయమూర్తుల భేటీ

- కొందరు న్యాయమూర్తుల భిన్నాభిప్రాయాలు
- వాడివేడి చర్చ... ఓటింగ్ నిర్వహించిన ఏసీజే
- ఏపీ హైకోర్టు భవనాల పరిశీలనకు మెజారిటీ అంగీకారం

సాక్షి, హైదరాబాద్

ఉమ్మడి హైకోర్టు విభజనకు ముందడుగు పడింది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఏర్పాటు కోసం అమరావతిలో ప్రభుత్వం గుర్తించిన భవనాలను పరిశీలించేందుకు న్యాయమూర్తులతో కూడిన ఫుల్‌కోర్టు సూత్రప్రాయంగా అంగీకరించింది. ఇందుకు ఐదుగురు న్యాయమూర్తులతో సబ్ కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. అలాగే ఉద్యోగుల విభజనకు ఓ సబ్ కమిటీ, రికార్డుల డిజిటైజేషన్ ప్రక్రియ పరిశీలనకు ఓ సబ్ కమిటీ ఏర్పాటు చేయాలని కూడా నిర్ణయించారు. ఆంధ్రప్రదేశ్‌లో హైకోర్టు ఏర్పాటుకు తాము గుర్తించిన భవనాల పరిశీలనకు కమిటీ ఏర్పాటు చేయాలంటూ ఏపీ సీఎం చంద్రబాబు గత డిసెంబర్ 27న ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్‌కు లేఖ రాయడం తెలిసిందే. ఈ నేపథ్యంలో హైకోర్టు విభజనపై

మిగతా 2వ పేజీలో ▶

'విద్యుత్'లో మరో 1,800 పోస్టులు

- టీఎస్ఎన్పీడీసీఎల్‌లో 1,800 జేఎల్ఎంల భర్తీకి కసరత్తు
- వారంలో నియామక ప్రకటన జారీ



సాక్షి, హైదరాబాద్

వరంగల్ కేంద్రంగా పని చేస్తున్న ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్ఎన్పీడీసీఎల్)లో 1,800 జూనియర్ లైన్‌మెన్ (జేఎల్ఎం) పోస్టుల భర్తీకి త్వరలో ప్రకటన జారీ కానుంది. సంస్థ పాలక మండలి సమావేశం అనంతరం మరో వారం పదిరోజుల్లో ఈ నియామక ప్రకటన జారీ చేయనున్నామని అధికారవర్గాలు తెలిపాయి. తెలంగాణ ట్రాన్స్‌కోలో 330 అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ), 174 సబ్ ఇంజనీర్ (ఎలక్ట్రికల్), 1,100 జూనియర్ లైన్‌మెన్ (జేఎల్ఎం) పోస్టులు కలిపి మొత్తం 1,604 పోస్టుల భర్తీకి ఇప్పటికే ప్రకటన జారీ కాగా, దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్ఎస్పీడీసీఎల్)లో 150 ఏఈ, 500 జూనియర్ అసిస్టెంట్, 100 జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ (జేఏఓ) పోస్టులతో పాటు 2,000 జూనియర్ లైన్‌మెన్ (జేఎల్ఎం) పోస్టుల భర్తీకి మరో వారంలో ప్రకటన రానున్న విషయం తెలిసిందే. అయితే టీఎస్ఎన్పీడీసీఎల్‌లో జేఎల్ఎం పోస్టులు తప్ప మిగతా ఏఈ, సబ్ ఇంజనీర్, ఇతర కేటగిరీల పోస్టులను ప్రస్తుతానికి భర్తీ చేయడం లేదని అధికారవర్గాలు తెలిపాయి.

వచ్చే రెండేళ్లూ ప్రారంభోత్సవాలే..

- షెడ్యూల్ ప్రకటించిన కేటీఆర్
- అయ్యప్ప సొసైటీ అండర్‌పాస్‌ను ప్రారంభించిన మంత్రి
- ఇవాంకా కోసం కాదు.. మన కోసమే అభివృద్ధి పనులు
- 'మిషన్ హైదరాబాద్'తో ఏడేళ్ల పాటు అభివృద్ధి కార్యక్రమాలు



సాక్షి, హైదరాబాద్

ప్రపంచ పారిశ్రామికవేత్తల సదస్సు(జీఈఎస్) కోసం హైదరాబాద్ వచ్చిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుమార్తె, సలహాదారు ఇవాంకా ట్రంప్ కోసమో, మరెవరి కోసమో తాము అభివృద్ధి పనులు చేయడం లేదని, నగర ప్రజల కోసమే ఈ పనులు చేపడుతున్నామని రాష్ట్ర మున్సిపల్, ఐటీ మంత్రి కె.తారకరామారావు స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచనలకు అనుగుణంగా విశ్వనగరం కోసం రూపొందించిన వ్యూహాత్మక రహదారుల పథకం(ఎస్సార్‌డీపీ)లో పలు పనులు ఈ ఏడాది ప్రారంభం కానున్నాయని తెలిపారు. ఇది పనుల అమలు సంవత్సరమని, జవాబుదారీతనంతో ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామని చెప్పారు. మిషన్ హైదరాబాద్ పేరుతో రానున్న ఏడేళ్ల పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. మాదాపూర్‌లోని అయ్యప్పసొసైటీలో రూ.44.30 కోట్లతో నిర్మించిన అండర్ పాస్‌ను హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి,

మిగతా 2వ పేజీలో ▶

ఇదం జగత్



పీహెచ్‌సీల్లో అల్ట్రాసౌండ్

- పరీక్షల నిర్వహణపై ఎంబీబీఎస్ వైద్యులకు ఆరు నెలల శిక్షణ
- పర్యవేక్షణకు ఉన్నతస్థాయి కమిటీ
- లింగనిర్ధారణ పరీక్షల నిషేధం అమలు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- గ్రామీణ మహిళలకు తప్పనున్న కష్టాలు



సాక్షి, హైదరాబాద్: గ్రామీణ ప్రాంతంలో ఉన్న పేద గర్భిణుల కష్టాలు తీరనున్నాయి. కడుపులో బిడ్డ ఏ పరిస్థితిలో ఉందో తెలుసుకోవాలంటే ఇన్నాళ్లూ పరీక్షల కోసం ఎంతో దూరం ప్రయాణించాల్సి వచ్చేది. కానీ ఇక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనే అల్ట్రా సౌండ్ పరీక్షలు అందుబాటులోకి రానున్నాయి. ఈ మేరకు సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో ప్రతి పీహెచ్‌సీలో అల్ట్రాసౌండ్ పరీక్షలు అందుబాటులోకి తెస్తూ.. వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారీ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీనితోపాటు లింగనిర్ధారణ పరీక్షల నిషేధం అమలు చేస్తూ విధివిధానాలను కూడా ఖరారు చేశారు.

ఇదీ గ్రామీణ నేపథ్యం...

ఎక్కువ మంది గ్రామీణ, పేద మహిళలు గర్భం దాల్చినప్పటి నుంచి కాన్పు వరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకే వస్తుంటారు. రాష్ట్రంలో ఏటా 6.50 లక్షల కాన్పులు జరుగుతున్నాయి. కేసీఆర్ కిట్ పథకం అమలవుతున్న నేపథ్యంలో ప్రభుత్వ ఆస్పత్రులలోనే 4.50 లక్షల కాన్పులు నమోదవుతున్నాయి. గర్భిణులు, గర్భస్థ శిశువు ఆరోగ్య పరిస్థితిని కచ్చితంగా తెలుకోవడంలో అల్ట్రాసౌండ్ పరీక్షలు కీలకంగా ఉంటాయి. అయితే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఎంబీబీఎస్ పూర్తి చేసిన వారే వైద్యులుగా ఉంటున్నారు. ప్రస్తుత నిబంధనల ప్రకారం ఎంబీబీఎస్ పూర్తి చేసిన వైద్యులు ఈ పరీక్షలను చేసేందుకు అనుమతి లేదు. దీని వల్ల గర్భిణులు, శిశువుల ఆరోగ్య పరిస్థితులు కాన్పు తర్వాత గానీ తెలియడంలేదు. తల్లీ, బిడ్డ అనారోగ్యాలకు ఈ పరిస్థితులు ఎక్కువగా కారణమవుతున్నాయి. రాష్ట్రంలో మొత్తం వెయ్యి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. వీటిలో అల్ట్రాసౌండ్ పరీక్షల పరికరాలు ఉన్నా... అక్కడ పని చేసే వారు ఎంబీబీఎస్ ఉత్తీర్ణులైన వైద్యులే ఉండటంతో అల్ట్రాసౌండ్ పరీక్షలు చేయడంలేదు. రాష్ట్ర ప్రభుత్వం తాజా ఉత్తర్వులతో ఈ పరిస్థితి మారనుంది.

ఎంబీబీఎస్ వైద్యులకు ఆరు నెలల శిక్షణ...

కేంద్రం ఆదేశాలకనుగుణంగా రాష్ట్రం కూడా నిబంధనలు మార్చింది . పీహెచ్‌సీల్లో పని చేసే ఎంబీబీఎస్ వైద్యులు సైతం అల్ట్రాసౌండ్ పరీక్షలు చేయవచ్చని పేర్కొంది. దీని కోసం ఎంబీబీఎస్ వైద్యులకు ప్రత్యేకంగా ఆరు నెలలపాటు శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. ఈ శిక్షణ పూర్తయిన వైద్యులు ప్రభుత్వ పరిధిలోని ఆరోగ్య కేంద్రాలలో అల్ట్రాసౌండ్ పరీక్షలు చేయవచ్చని పేర్కొన్నారు.

ప్రత్యేక కమిటీ: గర్భిణులకు అల్ట్రాసౌండ్ పరీక్షలు నిర్వహించే విషయంలో నిత్య పర్యవేక్షణకు వైద్య ఆరోగ్య శాఖ ముఖ్యకార్యదర్శి నేతృత్వంలో పది మందితో ఉన్నత స్థాయి కమిటీని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ కమిటీ గరిష్ఠంగా మూడు నెలలకు ఒకసారి సమావేశమై ఎప్పటికప్పుడు పరిస్థితులను అంచనా వేసి తగిన నిర్ణయాలు తీసుకోవాలన్నారు. అవసరమైన సందర్భాల్లోనూ కమిటీ భేటీ కావాలని సూచించారు.

రాజ్యసభలో 'తలాక్' రగడ

- ప్రభుత్వంపై విపక్షాల మూకుమ్మడి దాడి.. సెలెక్ట్ కమిటీకి బిల్లును పంపాలని కాంగ్రెస్ డిమాండ్ -5లో

పార్వతి పరార్!

గజల్ శ్రీనివాస్ కేసులో రెండో నిందితురాలు

- మంగళవారం సాయంత్రం నుంచి అజ్ఞాతంలోకి.. శ్రీనివాస్ కస్టడీ పిటిషన్‌పై నేడు న్యాయస్థానం తీర్పు
- సేవ్ టెంపుల్స్ సంస్థ నుంచి గజల్ శ్రీనివాస్ తొలగింపు

- వివరాలు 6లో

హైకోర్టు విభజనకు ముందడుగు

▶ మొదటి పేజీ తరువాయి

న్యాయమూర్తులందరి అభిప్రాయాలు తెలుసుకునేందుకు ఏసీజే బుధవారం తన అధ్యక్షతన ఫుల్ కోర్ట్ సమావేశం ఏర్పాటు చేశారు. న్యాయమూర్తులందరూ పాల్గొన్న ఈ భేటీ దాదాపు గంటా 10 నిమిషాలు జరిగింది. సమావేశం ఒకింత వాడివేడిగా కొనసాగినట్లు సమాచారం. హైకోర్టు తరలింపుపై కొందరు న్యాయమూర్తులు కొన్ని అభ్యంతరాలు కూడా లేవనెత్తినట్లు తెలిసింది. హైకోర్టు విభజనపై 2015 మే 1న అప్పటి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కళ్యాణ్‌జ్యోతి సేన్ గుప్తా ఇచ్చిన తీర్పులోని కీలక అంశాలను ప్రస్తావించినట్లు సమాచారం. తాత్కాలిక భవనంలో హైకోర్టు ఏర్పాటు వల్ల ఎదురయ్యే సమస్యలపైనా చర్చించినట్లు తెలిసింది. అంతేగాక న్యాయమూర్తుల నివాస సముదాయాలు, ఉద్యోగుల భత్యాల పెంపు తదితరాలపైనా న్యాయమూర్తులు చర్చించారు. ఈ రెండింటిపై తమ వైఖరిని ప్రభుత్వాలు కోరాలంటూ చెప్పాలని న్యాయమూర్తులంతా నిర్ణయించుకున్నారు. మొత్తమ్మీద హైకోర్టు విభజనపై న్యాయమూర్తుల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో ఏసీజే ఓటింగ్ నిర్వహించారు. ఏపీలో హైకోర్టు ఏర్పాటు నిమిత్తం ప్రభుత్వం గుర్తించిన భవనాల పరిశీలనకే మెజారిటీ న్యాయమూర్తులు మొగ్గు చూపారు. హైకోర్టు విభజన ప్రక్రియ నిర్ణయాల్లో న్యాయవాదులను కూడా భాగస్వాములు చేయాలన్న అంశమూ చర్చకు వచ్చింది. వారిని ఈ దశలో భాగస్వాములను చేస్తే సమస్యలు పెరుగుతాయని మెజారిటీ న్యాయమూర్తులు అభిప్రాయపడటంతో ప్రతిపాదన పక్కకు వెళ్లింది. సబ్ కమిటీ భవనాలను పరిశీలించి వచ్చాక మరోసారి సమావేశమవాలని ఫుల్‌కోర్ట్ నిర్ణయించింది. తాత్కాలిక భవనాల్లో హైకోర్టు నిర్వహణకు అనువుగాని సదుపాయాలన్నింటి విషయంలో ఎక్కడా రాజీ పడరాదని న్యాయమూర్తులంతా నిర్ణయించుకున్నారు. ఈ విషయమై తమకు ఏమేం కావాల్లో ఏపీ ప్రభుత్వానికి స్పష్టంగా తెలియజేయాలని నిర్ణయం తీసుకున్నారు. హైకోర్టు ఉద్యోగుల విభజనకు వీలైనంత త్వరగా మార్గదర్శకాలు రూపొందించాలని కూడా నిర్ణయం తీసుకున్నారు. ఒక్కో సబ్ కమిటీలో ఐదుమంది ఉండాలని నిర్ణయం జరిగింది. వీటి ఏర్పాటు అధికారాన్ని ఏసీజేకు కట్టబెట్టారు. ముందు భవనాల పరిశీలన కమిటీ, ఆ తర్వాత మిగతావి ఏర్పాటవుతాయి. మరోవైపు, 2015 నాటి జస్టిస్ సేన్‌గుప్తా ధర్మాసనం తీర్పును పరిగణనలోకి తీసుకోవాలని ఏపీ న్యాయవాదులు బుధవారం ఏసీజేను కోరారు. దాదాపు 300 మంది సంతకాలతో ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. హైకోర్టు విభజనలో తమనూ భాగస్వాములను చేయాలని కోరారు. ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం ప్రతినిధులు కూడా ఏసీజేకి ఇదే విధంగా వినతిపత్రం సమర్పించారు.

పేదల బాధల విషయంలో బాబుది రాతి గుండె

51వ రోజు

03-1-18, బుధవారం
కలికిరి,
చిత్తూరు జిల్లా.



ఈ రోజు ఉదయం శిబిరం నుంచి బయలుదేరగానే గుర్రప్ప అనే 72 ఏళ్ల తాత కలిశారు. 35 సంవత్సరాల పాటు చింతపర్తి స్కూల్‌లో పనిచేశాడట. వాచ్‌మెన్‌గా విధులు నిర్వర్తిస్తూనే ఆ స్కూల్‌లో చక్కటి గార్డెన్ కూడా ఏర్పాటు చేశాడట. ఆదర్శ ఉద్యోగిగా సన్మానాలు పొందాడట. రిటైర్ అయ్యాక పెన్షన్ మీద జీవిస్తూనే తనకెంతో ప్రీతిపాత్రమైన అదే స్కూల్‌లో పనిచేస్తున్నాడట. ఏడు పదుల వయసులో కూడా పని పట్ల ఆయనకున్న అంకితభావం చూస్తే ఆదర్శనీయమనిపించింది. అయితే ఆ తాత చెప్పిన మాటలు విని నా మనసుకు బాధ కలిగింది. 'సార్.. రెండు నెలల నుంచి పెన్షన్ రావడం లేదు. జిల్లా పరిషత్‌కు వెళ్లి అడిగితే ఇంకా ప్రభుత్వం నుంచి ఫండ్స్ రాలేదు. వచ్చాక ఇస్తామని అంటున్నారు. కుటుంబం గడవడం చాలా ఇబ్బందిగా ఉంది' అని ఆ తాత వాపోయాడు. విశ్రాంత ఉద్యోగుల పెన్షన్లు, చిరుద్యోగుల జీతాలు పెండింగ్‌లో పెట్టే బాబు గారు.. తన బినామీ కాంట్రాక్టర్లకు మాత్రం ఆగమేఘాల మీద బిల్లులు చెల్లిస్తుంటారు. పొరపాటున కూడా వారి చెల్లింపుల్లో ఆలస్యం జరగకుండా చూసుకుంటారు. పేదల బాధల విషయంలో మాత్రం ఆయనది రాతి గుండె.

అక్కడే ఆయుష్ విభాగంలో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేసే గిరిబాబు అనే యువకుడు కలిశాడు. 'అన్నా.. 2008 నుంచి పారామెడికల్ సిబ్బందిగా పని చేస్తున్నాను. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మా ఉద్యోగులందరికీ 2015 ఏప్రిల్ నుంచి జీతాలు ఇవ్వడం లేదు. 2017 మే నుంచి అయితే అసలు మీ సేవలు మాకు అవసరం లేదని అంటున్నారు. మా అందరి కుటుంబాలు రోడ్డునపడ్డాయ్' అని ఆవేదన చెందాడు. ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే 2012 జూలై 26న చంద్రబాబు గారు.. ఆయుష్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చెయ్యాలని, జీతాలు వెంటనే చెల్లించాలని, డిస్పెన్సరీలకు ఎక్కువ నిధులు కేటాయించాలని, సిబ్బంది వేతనాలు పెంచాలని అప్పటి ముఖ్యమంత్రి పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తూ స్వయంగా లేఖ రాశారు. ఎన్నికల ముందు మొసలి కన్నీరు కార్చిన చంద్రబాబు.. 'ఏరు దాటే వరకు ఓడ మల్లన్న, ఏరు దాటాక బోడి మల్లన్న' అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. ఇది చంద్రబాబు గారికి వెన్నతో పెట్టిన విద్య.

కొద్ది దూరం నడవగానే ఒక దివ్యాంగుడు నా దగ్గరకు వచ్చి 'అన్నా.. మాది ఎగువబోయపల్లె. నా పేరు మల్లికార్జున. నాకు 90 శాతం వైకల్యం ఉంది. ఆ మేరకు సర్టిఫికెట్ కూడా ఇచ్చారు. పింఛన్‌కు అప్లయి చేస్తే మీ తాతకు పింఛన్ వస్తుంది కాబట్టి నీకు ఇవ్వలేమని అంటున్నారు. ఇలా అయితే నేను బతికేది ఎట్లా అన్నా?' అని వాపోయాడు. అసలు వికలాంగులకు పెన్షన్ పథకం పెట్టిందే.. వారు కుటుంబానికి భారం కారాదని. వాళ్లలో ఆత్మస్థైర్యం నింపాలనే ఉద్దేశంతో. ఇటువంటి విషయాల్లో ప్రభుత్వం సాంకేతికపరమైన సాకులు చూపకుండా మానవీయ దృక్పథంతో వారికి సాయం చేయాల్సిన అవసరం ఎంతో ఉంది. కానీ రోజూ ఇలాంటి సంఘటనలు చూస్తుంటే ఈ ప్రభుత్వానికి అలాంటి ఆలోచన లేదనిపిస్తోంది.

ఈరోజు కూడా అడుగడుగునా రైతన్నలు తమ బాధలు వినిపించారు. ఇక్కడేమో ఇలా ఉంటే అక్కడేమో చంద్రబాబు గారు ఏమీ చేయకున్నా అందరికీ అన్నీ చేశానని గొప్పలు చెప్పుకుంటూ తిరుగుతున్నారు.

చివరగా ముఖ్యమంత్రి గారికి నాదొక ప్రశ్న. 80 శాతం పనులు పూర్తయిన ప్రాజెక్టుల్లో ఒకటి, రెండు చోట్ల అరకొర మిగిలిపోయిన పనులను చేసి మొత్తం ఘనత నాదే అని చెప్పుకొని తిరుగుతున్నారు కదా! మీ సొంత జిల్లాలోని పీలేరు దగ్గర ఉన్న అడవిపల్లి రిజర్వాయర్‌కు సంబంధించి నాన్నగారి హయాంలోనే 70 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన ఆ కాస్త పనులూ పూర్తి చేసి హంద్రీ–నీవా కాలువ ద్వారా కృష్ణా నీళ్లను ఈ ప్రాంత రైతులకు ఎందుకు అందించలేకపోతున్నారు? నాలుగేళ్ల కాలం మీకు సరిపోలేదా సీఎం గారూ?



చింతపర్తి గ్రామంలో వైఎస్ జగన్‌ను చూడటానికి 70 ఏళ్ల నాగమ్మ వచ్చింది. జగన్‌ను చూడటానికి మహిళలంతా ఒక్కసారిగా ముందుకు రావడంతో ఆమె తూలి కింద పడబోయింది. ఎడమ కాలి చెప్పు జారిపోయింది. దీన్ని గమనించిన జగన్.. 'నువ్వుండవ్వా.. నేను సరిచేస్తా..' అంటూ చెప్పును కాలికి తొడిగారు.

వై.ఎస్. జగన్

కవ్వాల్ పులికి 'ఫుడ్డు' సవ్వాల్!

▶ మొదటి పేజీ తరువాయి

తీశారు.. చెక్‌డ్యాంలు కట్టారు.. అటవీ భూమి చుట్టూ కందకాలు తవ్వించారు.. కానీ పులికి కావాల్సిన తిండిని మాత్రం మరిచారు! పస్తులైనా ఉంటుంది కానీ పచ్చిగడ్డి తినదన్న లాజిక్‌ను మరిచిన అధికారులు.. కోట్లు పోసి లేని పులిని రా.. రమ్మని పిలుస్తున్నారు! అదే సమయంలో పులికి ఆహారమైన దుప్పులు, కృష్ణ జింకలు, మచ్చల జింకలు, మనుబోతులు, కొండ గొర్రెలను నిర్లక్ష్యం చేస్తున్నారు. వేటగాళ్లు వాటిని యథేచ్ఛగా చంపేస్తున్నా కళ్లు మూసుకుంటున్నారు.

పులులే లేని చోట..

రాష్ట్ర అటవీ శాఖ కేంద్రానికి ఏం నివేదికలు పంపిందో ఏమో గానీ కేంద్ర ప్రభుత్వం కవ్వాల్ అభయారణ్యాన్ని 41వ పులుల సంరక్షణ కేంద్రం(టైగర్ షెల్టర్ జోన్)గా గుర్తించింది. 1,100 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం మేర అటవీ ప్రాంతాన్ని కవ్వాల్ టైగర్ ప్రాజెక్టుగా ప్రకటించారు. దీని అభివృద్ధికి కేంద్రం రూ.45 కోట్ల నిధులిచ్చింది. ఈ సొమ్ముతో అధికారులు పశుగ్రాసం పెంచారు. పులులు వస్తే తాగటానికి నీటి సాసర్లు, చెలిమలు తీయడంతోపాటు అన్ని ఏర్పాట్లు చేశారు. పులి ఆవాసం ఏర్పాటు చేసుకోవటానికి కనీసం 20 నుంచి 30 చ.కి.మీ. దట్టమైన అటవీప్రాంతం అవసరం. ప్రతి చదరపు కిలోమీటరుకు కనీసం 60 నుంచి 70 శాకాహార జంతువులు ఉండాలి. పులి సగటున ప్రతి మూడు రోజులకు ఒకసారైనా వేటాడుతుంది. కానీ కవ్వాల్ ప్రాంతంలో జింకలు, దుప్పులు, ఇతర అటవీ జంతువులు ఏ మేరకు ఉన్నాయన్న కచ్చితమైన లెక్కలు అటవీ శాఖ అధికారుల వద్ద లేవు. విచిత్రమేమిటంటే స్థానికంగా కవ్వాల్ అడవిలో పుట్టి పెరిగిన పెద్దపులి ఒక్కటి కూడా లేదు. అక్కడ పులుల సంచారంపై ఉట్నూరు మండలం కుమ్మరికుంటకు చెందిన భీమ్‌రావ్‌ను అడగ్గా.. ''70 ఏళ్ల నుంచి ఈ అడవిలనే బతుకుతున్న. ఎన్నడూ పులిని చూడలె. దాన్ని జూసినట్టు మా నాయిన కూడా చెప్పలె!'' అని పేర్కొన్నాడు.

ఏమో.. రాకపోతాయా?

ఈ నెలలో పులుల లెక్కింపు ఉండటంతో రాష్ట్ర అటవీ అధికారులు నానా హైరానా పడుతున్నారు. కవ్వాల్ అభయారణ్యానికి 150 కిలోమీటర్ల దూరంలో ఉన్న మహారాష్ట్రలోని తాడోబా, 100 కి.మీ. దూరంలో ఉన్న మరో టైగర్ ప్రాజెక్టు ఇంద్రావతిపైనే ఆశలు పెట్టుకున్నారు. పులుల సంచారానికి అవకాశం ఉన్న దారుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి గమనిస్తున్నారు. ఇప్పటివరకు అక్కడ్నుంచి 7 నుంచి 9 పులులు వచ్చినట్లు నివేదికలు రూపొందించారు. ఇందులో ఓ పులి 2015లో వేటగాళ్లు అమర్చిన విద్యుత్తు తీగలకు తగిలి చనిపోయింది. మిగతా పులులు కవ్వాల్ ప్రాంతంలోనే ఉన్నాయా? వెనక్కి వెళ్లాయా అన్న ప్రశ్నకు అధికారుల వద్ద సమాధానం లేదు. 'ఏమో.. ఈ నెలలో చేయబోయే పులుల జనాభా లెక్కల్లో తెలుస్తుంది' అని చెబుతున్నారు. ప్రతి చ.కి.మీ.కు కనీసం 60–70 వరకు శాకాహార జంతువులు లేకుంటే పులులు రావని జంతు శాస్త్రవేత్తలు చెబుతున్నారు.



34 గ్రామాల్లో యథేచ్ఛగా వేట

మహబూబ్‌నగర్ జిల్లా తంగడి నుంచి జూరాల ప్రాజెక్టు వరకు 27 కి.మీ. మేర కృష్ణా తీరం ఉంది. నదికి ఉత్తరాన 34 గ్రామాలున్నాయి. ఈ పల్లెల్లో వేల సంఖ్యలో జింకలు ఉన్నాయి. తీరం వెంట గడ్డి లేకపోవటంతో స్థానికంగా పంట పొలాలపై దాడి చేసి ధ్వంసం చేస్తున్నాయి. ఇది రిజర్వు ఫారెస్టు ప్రాంతం కాదు. ఫారెస్టు అధికారుల నిఘా పెద్దగా ఉండదు. ఇదే అదునుగా కర్ణాటకలోని రాయచూరు నుంచి వస్తున్న వేటగాళ్లు యథేచ్ఛగా జింకల్ని వేటాడుతున్నారు. ఈ 34 గ్రామాలకు కలిపి ఇద్దరు ఫారెస్టు వాచర్లు మాత్రమే ఉన్నారు. సాధారణంగా ఫోకస్ లైట్‌ను జింక కళ్లలోకి సూటిగా కొడితే అవి కదలకుండా నిలబడతాయి. వెంటనే మరో వ్యక్తి వెనుక నుంచి కర్రతో జింకను బలంగా కొట్టి చంపుతున్నారు.

కవ్వాల్ పక్కనే ఉన్న జింకలకు రక్షణేది..?

పులుల కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్న ఫారెస్టు అధికారులు కవ్వాల్, దాన్ని ఆనుకొని ఉన్న ప్రాణహిత నదీ తీరంలోని జింకలను పట్టించుకోవడం లేదు. అధికారుల నిర్లక్ష్యానికి మూల్యంగా వెంచపల్లి రిజర్వ్ ఫారెస్టులోని జింకలు పూర్తిగా తుడిచిపెట్టుకుపోయే దశకు వచ్చాయి. అదిలాబాద్ జిల్లా కోటపల్లి, పారుపల్లి, జనగామ, సుపాక, అర్జునగుట్ట, కిన్నారం గ్రామాల పరిధిలోని ప్రాణహిత నది ఒడ్డున వెంచపల్లి అభయారణ్యం విస్తరించి ఉంది. 1980లో వైల్డ్‌లైఫ్ అభయారణ్యంగా ఉన్న ఈ ప్రాంతంలో దాదాపు 250 నుంచి 300 వరకు కృష్ణ జింకలు ఉండేవి. క్రమంగా ఈ సంఖ్య పెరగటంతో 1999లో వెంచంపల్లిని కృష్ణ జింకల అభయారణ్యంగా ప్రకటించారు. కానీ వేటగాళ్లు ఇష్టారాజ్యంగా జింకలను వేటాడారు. 2007లో తీసిన లెక్కల ప్రకారం ఇక్కడ కేవలం 40 జింకలు మాత్రమే ఉన్నట్టు తేలింది. 2015లో మరోసారి లెక్కలు తీయగా.. కేవలం 5 కృష్ణ జింకలు ఉన్నట్టు తేలింది. ఆ తర్వాత రెండేళ్లకు చేసిన లెక్కల్ని అధికారులు బయటపెట్టలేదు.

మూడు మెట్లను వదిలి..

అటవీ ఆవరణ వ్యవస్థలో పులిది చివరి మెట్టు. తొలిమెట్టులో గడ్డిజాతులు, పొదలు, చెట్లు ఉంటే.. రెండో మెట్టులో కుందేళ్లు, జింకలు, దుప్పులు కొండ గొర్రెలు వంటి శాకాహార జంతువులు ఉంటాయి. మూడో మెట్టులో వీటిని తిని బతికే నక్కలు, తోడేళ్లు, ఎలుగుబంటు లాంటి ద్వితీయ మాంసాహార జంతువులు ఉంటాయి. నాలుగో మెట్టులో పులి ఉంటుంది. పులి ఎదగాలంటే ఈ అటవీ ఆవరణ వ్యవస్థ సమతుల్యంగా ఉండాలి. పొదలు, గడ్డిజాతులతో పాటు జింకలు, కుందేళ్లు, కొండ గొర్రెలు, మనుబోతులు తగిన స్థాయిలో ఉండాలి. రాష్ట్ర అటవీ శాఖ అధికారులు పులులను ఆకర్షించే తొలి మూడు మెట్లలోని జీవులను నిర్లక్ష్యం చేస్తూ.. టైగర్ షెల్టర్ జోన్‌ను ఏర్పాటు చేస్తుండటం గమనార్హం.

రెండేళ్లలో ప్రారంభోత్సవాలే..

▶ మొదటి పేజీ తరువాయి

రవాణామంత్రి పి.మహేందర్‌రెడ్డి తదితరులతో కలసి కేటీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. మొత్తం రూ.23 వేల కోట్లతో 4 దశల్లో ఎస్సార్‌డీపీ పనులకు ప్రణాళిక రూపొందించగా ప్రస్తుతం 19 ప్రాంతాల్లో రూ.3,200 కోట్ల పనులు వివిధ దశల్లో ఉన్నాయని చెప్పారు. మరో రూ.3 వేల కోట్ల పనులకు త్వరలో టెండర్లు పిలవనున్నట్లు తెలిపారు.

111 కి.మీ. ఎలివేటెడ్ కారిడార్ పనులు..

నగరంలో 111 కిలోమీటర్ల మేర ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి ప్రణాళిక రూపొందించామని, ఇందులో మూడు స్కైవేలు నిర్మించాలని తలపెట్టామన్నారు. వీటిల్లో రూ.వెయ్యి కోట్లతో ఉప్పల్–నారపల్లి స్కైవే పనులను త్వరలో ప్రారంభిస్తామన్నారు. మరో రెండింటికి అవసరమైన భూముల కోసం రక్షణ శాఖ అనుమతి కోసం వేచి చూస్తున్నామన్నారు. అనుమతి రాగానే జూబ్లీ బస్టాండ్ నుంచి తిరుమలగిరి రాజీవ్ రహదారి వరకు ఒక స్కైవే, ప్యాట్నీ నుంచి బోయిన్‌పల్లి వరకు మరో స్కైవే నిర్మాణం చేపడతామన్నారు. జాతీయ రహదారుల సంస్థతో కలసి పీవీ ఎక్స్‌ప్రెస్‌వేను పొడిగించాలని ప్రతిపాదించామని చెప్పారు. ఇందిరా పార్కు నుంచి వీఎస్టీ వరకు రూ.426 కోట్లతో స్టీల్ ఫ్లై ఓవర్ నిర్మించనున్నట్లు తెలిపారు. రేతిబౌలి నుంచి నానల్‌నగర్ వరకు రూ.175 కోట్లతో, అంబర్‌పేట్ వద్ద రూ.270 కోట్లతో చేపట్టిన ఫ్లైఓవర్ పనులు 2019 డిసెంబర్‌లోగా పూర్తి చేస్తామన్నారు. శిల్పారామం సౌందర్యం దెబ్బతినకుండా అక్కడ మరో ఫ్లైఓవర్‌ను నిర్మిస్తామని, రూ.2,225 కోట్ల విలువైన దీనికి టెండర్లు కూడా పూర్తయ్యాయన్నారు.

మెరుగైన నగరం.. ఓడీఎఫ్ సిటీ..

కేంద్ర ప్రభుత్వం, మెర్సర్ సంస్థల సర్వేల్లో దేశంలోనే అత్యుత్తమ జీవన ప్రమాణాలు కలిగిన నగరంగా హైదరాబాద్ మూడేళ్లు వరుసగా అగ్రస్థానంలో నిలవడం గర్వకారణమన్నారు. స్వచ్ఛభారత్ మిషన్.. హైదరాబాద్‌ను బహిరంగ మల విసర్జన రహిత(ఓడీఎఫ్) సిటీగా ప్రకటించినందుకు జీహెచ్‌ఎంసీలోని పారిశుద్ధ్య కార్మికుల నుంచి అధికారుల వరకు అందరికీ అభినందనలు తెలిపారు. నగర రోడ్లకు యుద్ధ ప్రాతిపదికన రిపేర్లు, మెరుగులు దిద్దే చర్యలు చేపట్టనున్నట్లు కేటీఆర్ తెలిపారు. రెండు దశల్లో రూ.950 కోట్లతో రోడ్లను అభివృద్ధి పరిచేందుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయని, అధునాతన సాంకేతికతను వినియోగించుకుని వర్షానికి దెబ్బతినని విధంగా రోడ్లు నిర్మిస్తామన్నారు. దేశంలో ఏ మెట్రో నగరంలో లేనివిధంగా అభివృద్ధి కార్యక్రమాలకు మున్సిపల్ బాండ్లు జారీ చేయనున్నామన్నారు. ఏడాదిలో పూర్తి కావాల్సిన అండర్‌పాస్‌ను 9 నెలల్లోనే పూర్తిచేయడంతో జీహెచ్‌ఎంసీ చీఫ్ ఇంజనీర్ శ్రీధర్‌తోపాటు ప్రాజెక్టులో పనిచేసిన ఇంజనీర్లు, అధికారులను కేటీఆర్, నాయిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో మేయర్ బొంతు రామ్మోహన్, డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

అండర్‌పాస్‌తో సమయం ఆదా

అయ్యప్ప సొసైటీ అండర్‌పాస్‌తో కొండాపూర్, గచ్చిబౌలి, మాదాపూర్ వైపు నుంచి బంజారాహిల్స్ సహా కోర్ సిటీలోని వివిధ ప్రాంతాలకు వెళ్లేవారికి ఎంతో సమయం ఆదా అవుతుంది. ట్రాఫిక్ వల్ల ప్రస్తుతం 15 నిమిషాల నుంచి అరగంట పడుతుండగా.. అండర్‌పాస్‌తో రెండు నిమిషాల్లో వెళ్లవచ్చు. పది మీటర్ల వెడల్పు ఉన్న రెండు లేన్ల ఈ అండర్ పాస్ క్యారేజ్ వే 7 మీటర్లు.

ఈసీబీసీ తొలి లైసెన్స్ అంచూరిదే..



సాక్షి, హైదరాబాద్: దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో అమలు చేస్తున్న ఎనర్జీ కన్జర్వేషన్ బిల్డింగ్ కోడ్ (ఈసీబీసీ) తొలి లైసెన్స్ హైదరాబాద్ బేగంపేటలోని ప్రకాశ్‌నగర్ విగర్‌మంజిల్‌కు చెందిన ఎస్పీ అంచూరికి దక్కింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(జీహెచ్‌ఎంసీ) అంచూరితోపాటు మరో 29 మందికి, వాణిజ్య భవనాలకు వాడే కరెంట్‌ను ఆదా చేసేందుకు ఉద్దేశించిన ఈ లైసెన్సను బుధవారం కేటాయించింది. భవనాలను నిర్మించేవారు మున్సిపల్ కార్పొరేషన్‌కు అనుమతుల కోసం దరఖాస్తు చేసే ముందు ప్రతిపాదిత నిర్మాణంలో ఎక్కడ గోడలు, అద్దాలుండాలి, ఏ స్థాయిలో ఉండాలన్న అంశాలపై ఈసీబీసీ కోడ్‌కు అనుగుణంగా వీరు డిజైన్లు రూపొందిస్తారు. ఈసీబీసీ కోడ్ లైసెన్స్‌దారులు ఆమోదం తెలిపాకే భవన అనుమతి కోసం వెళ్లాలి. ఆ తర్వాత కూడా ఈసీబీసీ నిబంధనల ప్రకారం నిర్మాణం ఉందా? అని వీళ్లు తనిఖీ చేస్తారు. వాణిజ్య భవనాల్లో విచ్చలవిడిగా విద్యుత్‌ను ఉపయోగించుకుంటున్న నేపథ్యంలో విద్యుత్‌ను ఆదా చేసే ఉద్దేశంతో జీహెచ్‌ఎంసీ ఈసీబీసీ నిబంధనలను అమలుచేస్తోంది. 'నగరంలో వెయ్యి చదరపు మీటర్లు మించిన వాణిజ్య భవనాలు నిర్మించాలంటే ఈసీబీసీను పాటించాలి. వెయ్యి చదరపు మీటర్ల ప్లాట్ లేదా 2వేల చదరపు మీటర్ల బిల్టప్ ఏరియా, ఆపై స్థలంలో భవనాలు నిర్మించాలంటే ఈసీబీసీ కోడ్‌కు అనుగుణంగానే డిజైన్, మెటీరియల్ ఉండాలి. లేకుంటే అనుమతులివ్వరు. పర్యావరణహిత నిబంధనలు అనుసరించాలి. ఈసీబీసీ లైసెన్స్‌దారుల వల్ల నగరంలో కొంతమేర విద్యుత్‌ను ఆదా చేసే అవకాశముంటుంది' అని అంచూరి తెలిపారు.

తేడా వస్తే.. తాట తీస్తారు

▶ మొదటి పేజీ తరువాయి

నెలకొల్పారు. ఇప్పుడు అదే తరహాలో డ్వాక్రా సంఘాలకు మార్షల్ ఆర్ట్స్‌లో తర్ఫీదు ఇచ్చి మరో భారీ ప్రదర్శనకు సిద్ధమవుతున్నారు.

శిక్షణ సాగుతోందిలా..

తాజాగా బదిలీ అయిన జిల్లా కలెక్టర్ అల్లమరాజు దేవసేన, డీఆర్‌డీవో మేకల జయచంద్రారెడ్డి.. డ్వాక్రా మహిళలకు కరాటే శిక్షణపై ఆలోచన చేశారు. డిసెంబర్ మొదటివారంలోనే ఈ మేరకు నిర్ణయం తీసుకుని శిక్షణ బాధ్యతలను రాణి రుద్రమదేవి సెల్ఫ్‌డిఫెన్స్ అకాడమీకి అప్పగించారు. డీఆర్‌డీఏ, మండల సమాఖ్యల నుంచి ఖర్చులను భరించి ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. తొలి విడతలో గ్రామైక్య సంఘాలు(వీఓ)ల్లోని అధ్యక్ష, కార్యదర్శులకు, చురుగ్గా ఉండే మహిళలను ఎంపిక చేశారు. గత నెల 20 నుంచి 24 వరకు జిల్లాలోని బచ్చన్నపేట, స్టేషన్‌ఘన్‌పూర్, జనగామ, లింగాలఘణపురం, నర్మెట, తరిగొప్పుల, రఘునాథపల్లి, దేవరుప్పుల, కొడకండ్ల, పాలకుర్తి, చిల్పూరు, జఫర్‌గఢ్, గుండాల మండలాల్లో 1,884 మందికి శిక్షణ ఇచ్చారు. మండల కేంద్రాల్లో రెండ్రోజుల పాటు శిక్షణ పొందిన వీఓలు, మహిళలు గ్రామాల్లో మిగిలిన డ్వాక్రా సంఘాల సభ్యులకు శిక్షణ ఇస్తారు. జిల్లాలోని 210 గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న మహిళలకు మార్షల్ ఆర్ట్స్‌పై శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళిక రచించారు. ఇలా జిల్లా వ్యాప్తంగా ఈ నెలాఖరులో అన్ని గ్రామాల్లో ఒకేసారి 1,25,998 మంది మహిళలకు మార్షల్ ఆర్ట్స్‌పై శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆత్మవిశ్వాసం పెరిగింది

ఇంటి నుంచి కాలు బయట పెట్టాలంటే భయపడే రోజులు ఇవి. ఏ వైపు నుంచి ఓ ప్రమాదం వస్తుందో తెలియదు. అన్ని సమయాల్లో అందరు తోడుగా ఉంటారని చెప్పలేం. సెల్ఫ్ డిఫెన్స్‌పై శిక్షణ తీసుకున్నాక కొంత ధైర్యం వచ్చింది. మహిళల కోసం ఇలాంటి మంచి కార్యక్రమాన్ని చేపట్టడం ఆనందంగా ఉంది.

– గొడిశాల సమత, దేవరుప్పుల


HONDA
The Power of Dreams
కలలను సాకారం చేస్తాం
ఏం షైన్ ఇది!
CB Shine
₹ 5,999# కు డౌన్ పేమెంట్ మరియు ₹ 5,999# వరకు ఆదా చేయండి
క్రోమ్ కార్బ్యురేటర్ కవర్
క్రోమ్ ఫినిష్ మఫ్లర్
ఈక్వలైజర్ సహితమైన కాంబి బ్రేక్ సిస్టమ్
BS-IV కంప్లయన్స్ గల HET
HDFC BANK
We understand your world
IndusInd Bank
TWO WHEELER LOANS
L&T Financial Services
హోండా అంటే HONDA

సాక్షి
గురువారం, జనవరి, 4

ఈ ఘటనలు సిగ్గుచేటు

సమాజంలో ఘర్షణలు తలెత్తకుండా నివారించడం, ఒకవేళ అలాంటివేమైనా జరిగితే వెనువెంటనే రంగంలోకి దిగి సాధారణ పరిస్థితులు ఏర్పడేలా చూడటం ప్రభుత్వాల కనీస కర్తవ్యం. ఈ రెండు విషయాల్లో మహారాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలం కావడం వల్ల ఆ రాష్ట్రం రెండురోజులుగా హింసతో అట్టుడుకుతోంది. పుణే సమీపంలో 30 ఏళ్ల దళిత యువకుడొకరు ప్రాణాలు కోల్పోగా ఆ వర్గానికే చెందిన పలువురు గాయాలపాలయ్యారు. భారీయెత్తున ఆస్తినష్టం సంభవించింది. అనేకచోట్ల దళితులపై దాడులు అడ్డూ ఆపూ లేకుండా కొనసాగాయి. 200 ఏళ్లక్రితం ఆధిపత్య కులాలపై సవాలు విసిరి ప్రాణాలకు తెగించి పోరాడి విజయం సాధించిన దళిత వీరుల స్మారకార్థం ఏటా జరుపుకుంటున్న సంస్మరణ ఇంతటి హింసకూ, బీభత్సానికీ కారణమైందంటే ఆశ్చర్యం కలుగుతుంది. సమాజం మునుపటిలా లేదని, స్వాతంత్య్రం వచ్చిననాటితో పోలిస్తే ఇప్పుడెంతో మెరుగైందని వాదించేవారున్నారు. దళితులకిచ్చిన రిజర్వేషన్ల అవసరమే లేదని చెప్పేవారున్నారు. దళితుల కోసం తీసుకొచ్చిన అత్యాచారాల నిరోధక చట్టంలాంటి ప్రత్యేక పరిరక్షణ చట్టాలు దుర్వినియోగమవుతున్నాయని వాదించే ఘనులున్నారు. కానీ దళితులపై ఆధిపత్య కులాల అహంకార వైఖరి ఇంకా నశించలేదని, వారిపై సామాజిక అణచివేత చర్యలు ఆగటం లేదని, కనీసం తమవారిని స్మరించుకునే హక్కును కూడా వారికి లేకుండా చేద్దామన్న ప్రయత్నం సాగుతోందని వర్తమాన మహారాష్ట్రను చూస్తే అర్థమవుతుంది.

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జన్మస్థలి మహారాష్ట్ర. అక్కడ 70వ దశకంలో పెల్లుబికిన దళిత్ పాంథర్స్ ఉద్యమం దేశవ్యాప్తంగా మాత్రమే కాదు...ప్రపంచం దృష్టినే ఆకర్షించింది. అలాంటిచోట గత కొన్ని దశాబ్దాలుగా ఏటా జనవరి 1న పుణే సమీపంలోని భీమా నది ఒడ్డున గల స్మారక చిహ్నం వద్దకు దేశం నలుమూలలనుంచీ వేలాదిమంది దళితులు రావడం తమ వీరులను స్మరించుకోవడం ఆనవాయితీ. ఈ ఏడాదితో ఆ ఉదంతం జరిగి 200 ఏళ్లు అవుతున్నది గనుక ఈసారి మరిన్ని వేలమంది అక్కడికొచ్చారు. ఇలాంటి సభ సజావుగా సాగడం కోసం ప్రభుత్వ యంత్రాంగం తగిన ముందు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. దానికి అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. సభకు వచ్చేవారిలో పిల్లలు, వృద్ధులు ఉంటారు గనుక వారిని దృష్టిలో పెట్టుకుని సదుపాయాలు కల్పించవలసి ఉంటుంది. ఇవేమీ లేకపోగా కనీస సంఖ్యలో ఉండాల్సిన పోలీసులు కూడా అక్కడ పత్తా లేరంటే అది బీజేపీ–శివసేన ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతుంది. ఆ సభకు రెండు మూడు రోజుల ముందు ఆ సమీప ప్రాంతాల్లో జరిగిన ఉదంతాల వల్ల ఉద్రిక్తత ఏర్పడి ఉంది. ఈసారి సభ జరగనిచ్చేది లేదని ఒకటి రెండు కుల సంఘాలు హెచ్చరిస్తే డాక్టర్ అంబేడ్కర్ మనవడు ప్రకాష్ అంబేడ్కర్ స్వయంగా వారి దగ్గరకెళ్లి వెళ్లి మాట్లాడి రివాజుగా జరిగే సభను అడ్డుకుంటామనడం భావ్యం కాదని హితవు చెప్పారు. పర్యవసానంగా కొందరు వెనక్కి కూడా తగ్గారు. శివరాజ్ ప్రతిష్టాన్, హిందూ ఏక్తా అఘాదీ అనే రెండు సంస్థలు ఈ విజయోత్సవంలో బ్రిటిష్ అనుకూలతను వెదికాయి. అప్పటి పీష్వాలకు వ్యతిరేకంగా బ్రిటిష్ సేనలు పోరాడి విజయం సాధించి తమ పాలనను సుస్థిరం చేసుకున్న ఈ సందర్భాన్ని విజయోత్సవంగా జరుపుకోవడమేమిటన్నది వాటి ప్రశ్న. కానీ దళితులు దీన్ని మరో కోణంలో చూసున్నారు. అంటరానితనాన్ని పాటించి తమను జంతువుల కన్నా హీనంగా చూసిన పీష్వాలపై దళితులు ప్రతీకారం తీర్చుకునేందుకే భారీయెత్తున ఈస్టిండియా కంపెనీ సైన్యంలో చేరారు, వచ్చిన అవకాశాన్ని వినియోగించుకుని తెగించి పోరాడారని అంటున్నారు. సారాంశంలో పీష్వా పాలన అంతం దళితుల విజయమని చెబుతున్నారు. ఆ సంస్థలకు అభ్యంతరం వ్యక్తం చేసే ముందు...ఇన్నేళ్లు గడిచినా ఇప్పటికీ రెండు శతాబ్దాలనాటి అమానుషత్వమే ఎందుకు రాజ్యమేలుతున్నదన్న ప్రశ్న వేసుకుంటే ఆ సభ నిర్వహణలోని ఔచిత్యమేమిటో అర్థమయ్యేది. అది ఒకానొక కాలంలో అమలైన అమానుషంగానే...అప్పటి తరంలోని ఆధిపత్య వర్గం సంకుచిత భావాలతో వ్యవహరించిన తీరుగానే పరిగణించి అన్ని వర్గాలవారూ ఆ సంస్మరణలో సమష్టిగా పాలు పంచుకునే విశాల దృక్పథం అందరిలో ఏర్పడి ఉంటే మనం సాధించిన ఏడు దశాబ్దాల స్వేచ్ఛాస్వాతంత్య్రాలకు అర్థం ఉండేది. కానీ అలాంటి పరిస్థితులు లేవు సరికదా సమీప భవిష్యత్తులో సైతం ఏర్పడబోవని మహారాష్ట్రలో చోటు చేసుకుంటున్న ఘటనలను పరిశీలిస్తే అర్థమవుతుంది. ఈ సభకు కొన్ని రోజుల ముందు అక్కడికి సమీప గ్రామంలో ఉద్రిక్తతలు రాజేయడం, సభకు వస్తున్న వారినీ, దాన్నుంచి వెళ్తున్నవారినీ లక్ష్యంగా చేసుకుని అనేకచోట్ల దాడులు చేయడం చూస్తే ఇదంతా ఒక పథకం ప్రకారం జరిగిందనిపిస్తుంది.

మహారాష్ట్ర ప్రభుత్వం చేతగానితనంవల్ల వరసగా రెండురోజులు రాష్ట్రం స్తంభించిపోయింది. ఆస్తులు దహనమయ్యాయి. పొరుగునున్న గుజరాత్‌కు సైతం ఈ ఆందోళనలు పాకాయి. 2016 డిసెంబర్‌లో మరాఠాలు తమకూ రిజర్వేషన్లు కావాలని, ఎస్సీ ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టానికి సవరణలు తీసుకురావాలని ఉద్యమించినప్పుడు కూడా దేవేంద్ర ఫడ్నవీస్ ప్రభుత్వం శాంతిభద్రతలను గాలికొదిలింది. తాజా ఘటనలపై న్యాయవిచారణ జరిపిస్తామని ఫడ్నవీస్ చెబుతున్నారు. అది చాలదు. సభకు మూడు నాలుగు రోజుల ముందునుంచీ ఉద్రిక్తతలు ఏర్పడటానికి దారితీసిన పరిస్థితుల వెనక ఉన్నదెవరో, సభ జరిగే రోజున అనేకచోట్ల దళితులపై దాడులు చేసిందెవరో కూడా విచారణాంశాల్లో చేర్చాలి. ఎన్నో రంగాల్లో ప్రగతి సాధిస్తున్నామని, ప్రపంచమంతా మనవైపే చూస్తున్నదని గొప్పలు చెప్పుకుంటున్నాం. కానీ సామాజికంగా ఇంకా మధ్య యుగాలనాటి న్యాయమే అమలవుతున్నదని భీమా–కోరెగావ్ ఉదంతం, తదనంతర పరిణామాలు రుజువు చేస్తున్నాయి. ఈ పరిస్థితిని చక్కదిద్దకపోతే మనం సాధించిన స్వాతంత్య్రానికి అర్థం ఉండదు.




వివక్ష ఎరుగని ప్రజాస్వామిక సమాజాన్ని నిర్మించాలనుకుంటే ఆ క్రమంలో మీరు ఎవరి పట్లా వివక్షను చూపడానికి వీల్లేదు.
– బయార్డ్ రస్టిన్
ఆమెరికన్ హక్కుల కార్యకర్త

గ్రహం అనుగ్రహం

శ్రీ హేవిళంబినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, పుష్య మాసం, తిథి బ.తదియ రా.2.23 వరకు, తదుపరి చవితి, నక్షత్రం పుష్యమి ఉ.10.23 వరకు, తదుపరి ఆశ్లేష, వర్జ్యం రా.10.24 నుంచి 11.55 వరకు, దుర్ముహూర్తం ఉ.10.14 నుంచి 10.57 వరకు, తదుపరి ప.2.37 నుంచి 3.22 వరకు, అమృతఘడియలు ..లేవు

సూర్యోదయం : 6.36
సూర్యాస్తమయం : 5.34
రాహుకాలం : ప 1.30 నుంచి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుంచి 7.30 వరకు



నమాజ్ వేళలు

ఫజర్ : 5.30
జొహర్ : 12.21
అసర్ : 4.19
మగ్రీబ్ : 5.55
ఇషా : 7.12

విముక్తి పోరు బావుటా కోరెగాం!



మల్లెపల్లి లక్ష్మయ్య

కోరెగాం యుద్ధం అంతస్సారంలో దళిత విముక్తి పోరాటం. సమానతకు కట్టుబడ్డ శివాజీ తదుపరి కాలంలో మెహర్‌లను అస్పృశ్యులుగా, అంటరానివారుగా నీచంగా చూసిన పీష్వాల పీచమణ చేందుకే కొన్ని వందల మంది మెహర్ సైనికులు వేల కొలది పీష్వాల సేనతో తెగించి పోరాడారు. ఏటా జనవరి ఒకటిన దళితులు భీమా నది ఒడ్డున ఉన్న స్మారక స్తూపానికి నివాళులర్పించి, స్ఫూర్తిని పొందే ఆనవాయితీ ఈనాటిది కాదు. సామాజిక అంతరాలున్నంత వరకూ చరిత్రపుటల్లో దాగిన ఆ దళిత విముక్తి పోరాటాన్ని గుర్తుచేసుకోవాల్సిందేనని అంబేడ్కర్ చెప్పారు.

కొత్త కోణం

''హం హై వీర్.. శూర్ – హం తోడే జంజీర్!''ప్రపంచమంతా నూత్న సంవత్సర వేడుకల్లో మునిగి తేలుతున్న జనవరి ఒకటవ తేదీన మహారాష్ట్ర లోని కోరెగాం ఊరేగింపులో... తరాల అంతరాలను ధిక్కరిస్తూ, అసమానతలనూ, అణచివేతలను ప్రతిఘటిస్తూ పోటెత్తిన మహాజనసంద్రం ఇచ్చిన నినాదమిది.

ముందస్తు పథకం ప్రకారం జరిగిన దాడి

భీమా నదికి దక్షిణాన నినాదాలు హోరెత్తుతున్నాయి. లక్షలాది మంది ప్రజలు.. అత్యంత శ్రద్ధాసక్తులతో పసికందు నుంచి పండు ముదుసలి వరకు. తదేక దీక్షతో జన పోరాట ప్రతీక కోరెగాం స్తూపాన్ని సందర్శించడానికి గంటల తరబడి నిలబడి సాగిపోతున్నారు. వారి క్రమశిక్షణకు తలొగ్గి సూర్యుడి తీక్షణత సైతం తగ్గేలా ఉందా జనప్రవాహం. భీమా నదికి ఒకవైపు ఇంతటి శక్తిని ప్రదర్శిస్తూ దళితులంతా తమ ఐక్యత సంకేతాన్ని నినాదంగా ప్రదర్శిస్తున్నారు. మరో వైపు భీమా నదికి అవతల ఉత్తరాన వధూ భద్రుకు గ్రామంలో కొంత మంది ఆధిపత్య కులాలు కాషాయ జెండాలతో, ఇనుప రాడ్లతో, రాళ్లతో చాటుమాటుగా పొలాల్లో దాగారు. భీమా కోరెగాంకు ప్రదర్శనగా వస్తోన్న వారిపైన వారు ముందుగా రాళ్ల దాడి చేశారు. అకస్మాత్తుగా జరిగిన ఈ దాడికి చెల్లాచెదురైన దళితులపైన వెంట తెచ్చుకున్న ఆయుధాలతో క్రూరంగా దాడి చేసారు. అక్కడే నిలిచిపోయిన వాహనాలను తగులబెట్టారు. ఈ గ్రామానికి తోడుగా దాని పక్కనే ఉన్న సన్సావాడి, శిఖరాపూర్ అనే రెండు గ్రామాల ఆధిపత్య కులాలు కూడా ఇలాగే దాడికి తెగబడ్డాయి. ఈ దాడిలో ముగ్గురు తీవ్రంగా గాయపడగా, రాహుల్ ఫతంగ్‌లే తీవ్రగాయాలతో ఆస్పత్రిలో మరణించారు.

ఈ దాడి హఠాత్తుగా ఆరోజుకారోజు జరిగింది కాదని, ముందస్తు పథకం ప్రకారమే ఈ దాడికి పాల్పడ్డారని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. రెండు రోజుల ముందే, డిసెంబర్ 29న వధూ భద్రుకు గ్రామంలో అక్కడి దళితులు నిర్మించుకున్న ఒక అమరవీరుని సమాధిని కూల్చివేసి ఆధిపత్యకులాలు ఈ ఘర్షణకు శ్రీకారం చుట్టాయి. గత మూడు నెలలుగా దేశవ్యాప్తంగా భీమా కోరెగాం విజయ యాత్రపై జరుగుతున్న చర్చ స్థానిక ఆధిపత్య కులాలకు, హిందూత్వ శక్తులకు నిద్రలేకుండా చేసినట్టు కనిపిస్తున్నది. భీమా కోరెగాం పోరాట బాటని తమ విముక్తి బాటగా భావించి దళితులు సగర్వంగా తలెత్తుకొని నిలబడ్డారు. అది అక్కడి ఆధిపత్య కులాలకు కంటగింపుగా తయారయ్యింది. అదే వారిని ఈ దాడికి ఉసిగొల్పింది. మహిళలు, పిల్లలతో కలసి వస్తున్న నిరాయుధ దళితులపైన ఈ అమానుష దాడికి ఒడిగట్టారు.

చరిత్రలో కోరెగాం ప్రత్యేకత

ప్రపంచంలో ఎన్నో యుద్ధాలు జరిగాయి. ప్రతీ యుద్ధం అధికారం కోసమో, ఆధిపత్యం కోసమో సాగిననే. కానీ 200 ఏళ్ల క్రితం కోరెగాంలో జరిగిన యుద్ధం ఆత్మగౌరవం కోసం జరిగింది. దళిత జాతి విముక్తి కోసం జరిగింది. మనిషిని మనిషిగా గుర్తించే కనీస మానవత్వపు జాడలను వెతుక్కునే ప్రయత్నంగా మాత్రమే జరిగింది. అప్పటి వరకూ మెహర్‌లను అస్పృశ్యులుగా, అంటరానివారుగా, నీచంగా చూసే పీష్వాల పీచమణచేందుకు జరిగింది. రాచరికపు అరాచకాలకు ఎదురొడ్డి, ప్రాణాలకు తెగించి పోరాడిన దళిత పోరాటాల చరితకు, ఇంకా చెప్పాలంటే దిటవు గుండెల దళిత ధిక్కారపు వాడికి వేడికి కోరెగాం అపూర్వ నిదర్శనమై నిలిచింది. ఏటా జనవరి 1న మహారాష్ట్రలోని పుణే సమీపాన ఉన్న భీమా నది ఒడ్డున నిటారుగా నింగికెగసి, సగర్వంగా తలెత్తి నిలిచిన కోరెగాం స్మారక స్తూపం వద్ద దేశవ్యాప్తంగా తరలివచ్చిన ప్రజలంతా వినమ్రంగా నివాళులర్పిస్తారు. ఇది ఈనాటిది కాదు. దోపిడీ, పీడన అణచివేత, కుల రాకాసి కోరలు పీకేందుకు పీష్వాలకెదురొడ్డి పోరాడిన మెహర్ వీరులను మదినిండా తలుచుకోవడం ఈనాటి నుంచి ప్రారంభం కాలేదు. అది 200 ఏళ్లుగా కొనసాగుతూ వస్తోంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 1922 జనవరి ఒకటవ తేదీన కోరెగాంను సందర్శించి అక్కడ సభను నిర్వహించారు. అంతరాలున్నంత వరకూ చరిత్రపుటల్లో దాగిన ఆ దళిత విముక్తి పోరాటాన్ని గుర్తుచేసుకోవాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు. ఈనాటికీ దేశంలోని దళిత ప్రజలంతా అదే ఆత్మగౌరవ స్ఫూర్తిని కొనసాగిస్తూ వస్తున్నారు.

శివాజీ తర్వాత అమలైన మనుధర్మంపై గెలుపు

జనవరి 1, 1818న భీమా నది ఒడ్డున కోరెగాం దగ్గర జరిగిన యుద్ధంలో 500 మంది మెహర్ సైనికులు 28,000 పీష్వా సైన్యంతో తలపడ్డారు. ఈ యుద్ధం పీష్వాలకూ, బ్రిటిష్ సైన్యానికీ మధ్య జరిగినదిగానే ప్రచారం జరిగింది. కానీ ఇందులో పాల్గొన్న సైనికుల్లో అత్యధికులు మెహర్‌లు కావడమూ, కేవలం కొన్ని వందల మంది సైనికులే వేల కొలదిగా గల పీష్వాల సైన్యాన్ని ఓడించడం చరిత్రలోనే అత్యంత విశేషంగా చెప్పొచ్చు. పీష్వాలకు వ్యతిరేకంగా జరిగిన ఈ యుద్ధం బ్రిటిష్ ప్రభుత్వానికి విజయాన్ని తెచ్చిపెట్టిన మాట నిజమే. కానీ అందులో మెహర్ దళిత జాతి విముక్తి నినాదం కూడా అంతర్లీనంగా ఉంది. అపూర్వమైన తెగింపును, ధైర్యసాహసాలను ప్రదర్శించి సైన్యంలో అగ్రగాములు, ప్రధాన శక్తులుగా నిలిచిన మెహర్‌ల అంతరాంతరాళాల్లో ఇమిడి ఉన్నది అదే. పీష్వా పాలనను అంతం చేస్తే తప్ప తమకు విముక్తిలేదని మెహర్‌లు భావించారు. అందువల్లనే వందల్లో ఉన్న మెహర్ సైనికులు ప్రాణాలకు లెక్కచేయక వీరోచితంగా వేలమంది పీష్వా సైనికులను ఓడించడం సాధ్యమైంది.

అప్పటికే మెహర్‌లకు వందల ఏళ్ల సైనిక వారసత్వం ఉంది. శివాజీ కాలంలోనే మెహర్‌లను సైనికులుగా చేర్చుకోవడం ప్రారంభమైంది. శివాజీ తన సమతా దృక్పథంతో మెహర్‌లకు సైన్యంలో ఎంతో ఉన్నతమైన స్థానాన్ని కల్పించారు. కానీ శివాజీ తరువాత అధికారంలోనికి వచ్చిన పీష్వాలు మను ధర్మాన్ని అమానవీయంగా, అత్యంత క్రూరంగా అమలు చేశారు. దుర్మార్గమైన పద్ధతుల్లో నీచమైన సంప్రదాయాలతో అంటరానితనాన్ని పాటించారు. అంటరాని కులాలైన మెహర్, మాంగ్, మాతంగ్ కులాలకు చెందిన వారెవరికీ గ్రామాల్లోకి అడుగుపెట్టే అర్హత ఉండేది కాదు. ఉదయం, సాయంత్రాలైతే ఎటువంటి పరిస్థితుల్లో రాకూడదు. ఆ సమయాల్లో సూర్యుడు ఏటవాలుగా ఉంటాడు కాబట్టి వారి నీడలు ఊరిలోని ఇళ్లపైన, మనుషులపైన పడే అవకాశం ఉంటుందని అటువంటి నిషేధం విధించారు. ఎప్పుడైనా అత్యవసరమైతే సూర్యుడు నడినెత్తిన ఉన్నప్పుడు మాత్రమే, అదీ వారి అనుమతితోనే, వారి అవసరాల నిమిత్తమే అనేక ఆంక్షలతో దళితులను ఊరిలోనికి రానిచ్చేవారు. దళితులు తమ అడుగుజాడలను తామే చెరిపేసుకునేలా నడుముకు వెనుకవైపు చీపురుకట్టుకోవాలి. మెహర్‌లు ఉమ్మితే ఆ స్థలం అపవిత్రమౌతుందన్నారు కాబట్టి తమ ఉమ్మి బయటపడకుండా మూతికి ముంత కట్టుకొని అందులోనే ఉమ్మివేయాలి. ఎప్పుడైనా పొరపాటున పీష్వాల వ్యాయామశాలల ముందు నుంచి వెళ్లిన మెహర్, మాతంగ్‌ల తలలను నరికి, కత్తులతో బంతాట ఆడేవారు. ఇది అక్కడ పీష్వాలు సాగించిన దుర్మార్గ పాలన.

అంటరానితనం నుంచి విముక్తే ఆ పోరు అంతస్సారం

మెహర్‌లు ఇంతటి క్రూర పాలనను అనుభవించారు కనుకనే.. చచ్చినా, బతికినా ఒకటే కాబట్టి బ్రిటిష్ సైన్యంలో చేరడానికి ఆసక్తి చూపారు. పీష్వాల క్రూర అణచివేత కారణంగానే వారిలో ప్రాణాలకు తెగించి పోరాడే కసీ, పట్టుదలా పెరిగాయి. లేకపోతే 500 మంది మెహర్ సైనికులు 28,000 మంది పీష్వా సైనికులను తరిమి తరిమి కొట్టడం సాధ్యమయ్యే పని కాదు. మెహర్‌లు చూపిన ఈ తెగువ, సాహసం, వెనుక ఎంతో చారిత్రక తాత్వికత దాగున్నది. నీచమైన బతుకు కన్నా యుద్ధరంగంలో చావడమే గౌరవమని ఆనాడు మెహర్‌లు భావించారు. కనుకనే విజయం తలవంచి వారి కాళ్లకు నమస్కరించింది. అమెరికా మానవ హక్కుల నాయకుడు, వర్జీనియా విముక్తి పోరాట యోధుడు పాట్రిక్ హెన్రీ మాటలు ఇక్కడ గుర్తుచేసుకోవాలి. ''మనం విముక్తి పొందాలంటే పోరాటం తప్పనిసరి. నా వరకైతే విముక్తి పొందడమో, వీర మరణమో కావాలి.'' కోరెగాం యుద్ధంలో మెహర్‌లు సరిగ్గా ఇలాగే అంటరానితనం సంకెళ్లను తెంచుకోవడానికి ప్రాణత్యాగాలకు సిద్ధమయ్యారు. విజయం సాధించారు. ఇది కోరెగాం విజయగాథ.

కోరెగాంలో జనవరి 1, 2018న దళితుల మీద జరిగిన దాడులు, తదనంతర నిరసన ప్రతిఘటనలపై కొందరు మేధావులు కొన్ని ప్రశ్నలను లేవనెత్తుతున్నారు. ఒకవైపు దళితులపైన జరిగిన దాడిని ఖండిస్తూనే, రెండోవైపు 200 ఏళ్ల క్రితం జరిగిన ఒక ఘటనను ఇప్పుడు గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఏమిటి? అని ప్రశ్నిస్తున్నారు. వారికి నాదొక విజ్ఞప్తి. వందల ఏళ్ల అమానుషత్వానికీ, అమానవీయతకూ, అణచివేతకూ, కట్టుబానిసత్వానికీ బలైపోయిన దళితులు చేసిన ఆ తిరుగుబాటే... వారిని తలెత్తుకొని నిలబడేలా చేయగలిగింది. అందువల్లనే వారు తరతరాలుగా ఆ విజయగాథ నుంచి స్ఫూర్తిని పొందుతూనే ఉన్నారు. నేటికీ వారి ఆత్మగౌరవ చిహ్నంగా కోరెగాం స్తూపాన్ని గుర్తుచేసుకుంటూనే ఉన్నారు. పీడనకు, అణచివేతకు, దోపిడీకి గురైన జాతి, ప్రజలు, దేశం తమ విముక్తికి కారణమైన పోరాటాల, విజయాల గాథలను గుర్తుచేసుకోవడం సహజం. ఆ విజయగాథలు వారిని నిరంతరం చైతన్యపరుస్తూనే ఉంటాయి. అటువంటిదే భారత స్వాతంత్య్రం కూడా. 70 ఏళ్ళు గడిచినప్పటికీ మనం అత్యంత గౌరవభావంగా స్వాతంత్య్ర దినోత్సవాన్ని వీధివీధినా, వాడవాడలా జరుపుకుంటూనే ఉన్నాం, ఇక ముందూ జరుపుకుంటాం. కోరెగాం సంస్మరణ కూడా అలాంటి సత్సాంప్రదాయమే. కోరెగాం విజయగాథను గుర్తుచేసుకోవడం దళితులు చేస్తున్న తప్పయితే యావద్భారతం దేశ స్వాతంత్య్ర దినోత్సవాన్ని జరుపుకోవడం కూడా తప్పిదమే అవుతుందని గుర్తించాలి.

–వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు | 97055 66213

ఆధారాల మీద కొత్త వెలుగు

ఇలాంటి ప్రయత్నం తెలుగు ప్రాంతంలోనే విజయవంతమైంది. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హిస్టారికల్ స్టడీస్, కలకత్తా సంచాలకుడు ఎస్పీ సేన్ 1978లోనే చారిత్రక ఆధారాలను పుస్తకంగా తీసుకురావాలని ఒక ప్రయత్నం చేశారు. కానీ అది సఫలం కాలేదు.



భారతదేశంలో చరిత్ర గురించి ఆలోచించేవాళ్లు, చరిత్రకారులు, చరిత్ర ఆధారంగా సృజనాత్మక రచనలు చేసేవారు కూడా పురావస్తు శాఖకు వెళ్లడం కనిపించదని ప్రఖ్యాత చరిత్రకారుడు, రచయిత విలియం డాల్రింపుల్ 'లాస్ట్ మొఘల్' పుస్తకం పీఠికలో అంటారు. అది చదివినప్పుడు మనసు చివుక్కుమనే మాట నిజం. కానీ, కాస్త ఆలోచిస్తే అందులో కొంత సత్యం ఉందనే అనిపిస్తుంది కూడా. ఎందుకంటే 20వ శతాబ్దం ఆరంభం నుంచి తెలుగు ప్రాంతాలలోను, భారతదేశంలోను కూడా చరిత్ర రచనకు ఉపక్రమించిన పలువురు మనసావాచా ఆ పనిచేశారు. ఒక ఉదాహరణ: మల్లంపల్లి సోమశేఖరశర్మ 'రెడ్డి రాజ్యాల చరిత్ర'. లేదా ఇటీవలే వచ్చిన పీవీ పరబ్రహ్మశాస్త్రి 'కాకతీయులు'గ్రంథం. పరిపూర్ణమైన రీతిలో ఆధారాలను ఉపయోగించుకున్న చరిత్ర రచన ఎంత పరిపుష్టంగా ఉంటుందో ఆ పుస్తకాలు చెబుతాయి. కానీ తరువాత ఇంత ఖ్యాతి ఉన్న రచనలు తక్కువ.

చరిత్ర రచన లేదా నిర్మాణానికి అత్యంత కీలకం– చారిత్రక ఆధారాలే. చారిత్రకత, విశ్వసనీయత ఆ ఆధారాలకు మరింత ముఖ్యం అంటుంది చరిత్రతత్త్వం. ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ వెలువరించిన 'తెలుగు ప్రజల చరిత్ర, సంస్కృతికి ఆధారాలు'చరిత్రకారులనీ, సృజనాత్మక రచనలు చేసేవారిని ముమ్మాటికీ ఆధారాల పట్ల గౌరవం పెంచుకునేటట్టు, అలాంటి బాధ్యత గురించి మరింత అవగాహన పెంచడానికి దోహదం చేస్తుంది.

చారిత్రక ఆధారాలంటే ఏమిటి? ఒక కాలపు చరిత్రను నిర్మించడానికి అనివార్యంగా తీసుకునే ఆ కాలపు ఆధారాలు. శిలాశాసనాలు, నాణేలు, విదేశీ పర్యాటకుల రచనలు, పురాతన సాహిత్యం, స్థల పురాణాలు ఆ ఆధారాలను ప్రధానంగా అందిస్తాయి. వీటిలో మళ్లీ ప్రైమరీ అనీ, సెకండరీ అనీ ఉంటాయి. ఇలాంటి ఆధారాల పరంపరను క్రోడీకరించినదే 'తెలుగు ప్రజల చరిత్ర, సంస్కృతికి ఆధారాలు'.

క్రీస్తుపూర్వం 5000 (చరిత్ర పూర్వయుగం) నుంచి, క్రీస్తుశకం 2016 వరకు జరిగిన చరిత్రకు ఆధారాలను సంపాదకులు, రచయితలు ఈ ఉద్గ్రంథంలో పొందుపరిచారు. అందుకే ఇదొక గొప్ప ప్రయత్నమని చెప్పాలి. పదహారు అధ్యాయాలలో ఈ సమాచారం మొత్తం అందించారు. పురాతన, మధ్య యుగ, ఆధునిక చరిత్రలతో పాటు, సమీప గతానికి చెందిన ఆధారాలను కూడా ఇందులో గమనిస్తాం. ద్రవిడ విశ్వవిద్యాలయం (కుప్పం), పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం (హైదరాబాద్), ఇతర వదాన్యుల సహాయ సహకారాలతో మొత్తం తొమ్మిది వాల్యూంలలో తెలుగువారి చరిత్రను దాదాపు సంపూర్ణమనదగిన రీతిలో సంకలనం చేశారు. ఆ కృషికి ఈ ఆధారాల వాల్యూం పరాకాష్ట.

చరిత్ర పూర్వయుగం, చరిత్ర ఆరంభ దశ, మధ్య యుగ చరిత్ర ఆరంభ దశ, ముసునూరి నాయకులు, రెడ్డి రాజులు, విజయనగర చరిత్ర, బహమనీలు, కుతుబ్‌షాహీల చరిత్ర, ఆధునిక ఆంధ్ర దేశ చరిత్ర, అసఫ్‌జాహీలు, కోస్తాంధ్ర, రాయలసీమ, హైదరాబాద్ స్టేట్, సమకాలీన ఆంధ్రప్రదేశ్, సాహిత్యాధారాలు, జానపద కళలు–సంస్కృతి, కళ–వాస్తు, లలితకళలు అన్న 16 అధ్యాయాలలో చారిత్రక ఆధారాలను విస్తారంగా ఇచ్చారు. అలాగే గ్రంథాలయాలు, ఇండియన్ హిస్టారికల్ రివ్యూ పత్రికలో అచ్చయిన వ్యాసాలు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ విశ్వవిద్యాలయాల చరిత్ర శాఖలలో జరిగిన కృషి, ఆంధ్రప్రదేశ్ ఆర్కైవ్స్ ప్రచురణలు, ప్రముఖుల పత్రాలు, నెహ్రూ స్మారక గ్రంథాలయం (ఢిల్లీ) వంటి చోట లభ్యమయ్యే చారిత్రక ఆధారాలు ఏవో కూడా ఇందులో తెలుసుకోవచ్చు. ఇంకా ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్‌కు సమర్పించిన పత్రాల వివరాలు, తెలుగు పత్రికల జాబితా, గౌతమి గ్రంథాలయంలో లభ్యమవుతున్న గ్రంథాలు, వేటపాలెం సారస్వత నికేతన్‌లోని గ్రంథాల వివరాలు, లండన్‌లోని ఇండియా ఆఫీస్ గ్రంథాలయంలో లభించే గ్రంథాల పేర్లు కూడా ఈ వాల్యూంలో ఇచ్చారు. ఆ విధంగా చరిత్ర రచనకు ఈ వాల్యూం చక్కని దిశను చూపిందనే చెప్పవచ్చు. ఎన్. చంద్రమౌళి, సి.సోమసుందరరావు, డి. భాస్కరమూర్తి, కె. సూర్యనారాయణ, కేఎస్ కామేశ్వరరావు, అబ్దుల్ మాజిద్, ఏఆర్ రామచంద్రారెడ్డి, వి. లలిత, కనకదుర్గ వంటి చరిత్రకారులు ఈ ఆధారాల వాల్యూం కోసం శ్రమించారు. వకుళాభరణం రామకృష్ణ సంపాదకులుగా వ్యవహరించారు. ఈ పుస్తకాన్ని మండలి వెంకటకృష్ణారావు, పీవీ పరబ్రహ్మశాస్త్రిలకు అంకితం ఇవ్వడం సముచితంగా ఉంది.

మరొక విషయం కూడా తప్పనిసరిగా ప్రస్తావించాలి. ఇలాంటి ప్రయత్నం తెలుగు ప్రాంతంలోనే విజయవంతమైంది. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హిస్టారికల్ స్టడీస్, కలకత్తా సంచాలకుడు ఎస్పీ సేన్ 1978లోనే చారిత్రక ఆధారాలను పుస్తకంగా తీసుకురావాలని ఒక ప్రయత్నం చేశారు. కానీ అది సఫలం కాలేదు. 'సోర్సెస్ ఆఫ్ ది హిస్టరీ ఆఫ్ ఇండియా'పేరుతో ఆయా యుగాలకు అవసరమైన ఆధారాలను సంకలనం చేయడం సేన్ ఉద్దేశం. కానీ మొదటి భాగం మాత్రమే ఆయన వెలువరించగలిగారు. 1999లో ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ తెలుగువారి సమగ్ర చరిత్ర రచనా యజ్ఞాన్ని ప్రారంభించింది. ఇది 2016కు పూర్తయింది. ఇప్పుడు 'తెలుగు ప్రజల చరిత్ర, సంస్కృతికి ఆధారాలు'వాల్యూంతో మొదట వచ్చిన వాల్యూమ్‌లకు పరిపూర్ణత చేకూరినట్టయింది. అందులో నిక్షిప్తం చేసిన కొన్నివేల పేజీల చరిత్రకు ఆధారాలు ఈ వాల్యూంలో లభిస్తాయి. ఈ కృషి ఒక అద్భుతం. ఈ భారాన్ని మోసిన చరిత్రకారులందరికీ తెలుగువారు కృతజ్ఞులై ఉండాలి.

('తెలుగు ప్రజల చరిత్ర, సంస్కృతికి ఆధారాలు' పుస్తకం నేడు విజయవాడ పుస్తకోత్సవంలో ఆవిష్కరిస్తున్న సందర్భంగా...ముఖ్యఅతిథి మండలి బుద్ధప్రసాద్)

–కల్హణ

మనిషి కుక్కని కరిస్తే...

అధికారం తలకెక్కినప్పటి కుసంస్కారం ఇది. ఒక్కక్షణంలో గతం మసకబారుతుంది. తాము ప్రత్యేకమైన పదార్థంతో మలిచిన మహానుభావులమనే భావం ఆకాశంలో నడిపిస్తుంది.



గొల్లపూడి మారుతీరావు

కుక్క మనిషిని కరిస్తే అది వార్త కాదు. మనిషి కుక్కని కరిస్తే అది వార్త అన్నారెవరో. ఈ మధ్య ఓ సరదా అయిన సంఘటన సిమ్లాలో జరిగింది. రాహుల్‌గాంధీ గారు ఎన్నికల ఫలితాల మీద జరిపే సమీక్షా సమావేశానికి మాజీ ముఖ్యమంత్రి వీరభద్ర సింగుగారి మేనకోడలు– ఈ మధ్యనే తాజాగా ఎమ్మెల్యేగా ఎన్నికయిన ఆషాకుమారి సభకి వచ్చారు. ఆమెని ఓ మహిళా కానిస్టేబుల్ ఆపారు. వాగ్వాదం పెరిగింది. అవతల కాంగ్రెసు మీటింగు జరిగిపోతోంది. ఎమ్మెల్యేగారికి కోపం పెరిగింది– తన పార్టీ మీటింగుకి హాజరు కావడానికి పోతుంటే ఓ కానిస్టేబుల్ తనని ఆపడమా! వెంటనే చాచి చెంపదెబ్బ కొట్టింది. సాధారణంగా ఈ కథ ఇక్కడితో ముగుస్తుంది. ఇలాంటి ముచ్చట్లు మన రాష్ట్రంలో చాలాసార్లు వింటూంటాం. పోలీసు స్టేషన్లోనే ఆఫీసర్లని కొట్టిన నాయకుల 'పెద్దరికం'మనం చదివి మురిసిపోయాం. కానీ కథ ఇక్కడ ఆగలేదు. కానిస్టేబుల్ వెంటనే అంతే బలంగా ఎమ్మెల్యే చెంప పగలకొట్టింది. ఇప్పుడు లెక్క సరిపోయింది. ఇప్పుడు ఎవరు ఎవరి మీద ఫిర్యాదు చెయ్యాలి? ఎమ్మెల్యేగారు కొట్టారని కానిస్టేబులా? లెక్క అక్కడితో సరిపెట్టేసింది కదా! మరి ఎమ్మెల్యేగారు చెయ్యాలా? 'మరి తమరు ముందు పీకారు కదా?'ఇదీ మీమాంస.

ఈ కథ తర్వాత ఏమీ జరగలేదు. కాగా ఎమ్మెల్యే ఆషా కుమారే కాస్త ఎక్కువ బాధ పడ్డారు. 'ఆవిడ నన్ను నానా మాటలూ అంది. అవమానపరిచింది. నేను ఆవిడ తల్లి వయసు దాన్ని. అయినా నేను ఆవేశ పడకుండా ఉండాల్సింది. నేను క్షమాపణ చెప్తున్నాను.'అన్నారు ఆషాకుమారి.


మన చోటా నాయకులు ఎన్నికలలో జయించగానే కాస్త గోరోజనం పెరగడం చూస్తాం. వారు సాధారణంగా నేల మీద నడవరు. వారి వెనుక చిన్న చేతి సంచి పట్టుకుని ఓ నౌకరు నడుస్తూంటాడు. వారికి చుట్టూ ప్రపంచం బొత్తిగా హీనంగా కనిపిస్తూంటుంది. వారి పక్కన నడిచే చెంచాలు వారి కంటే పెద్ద అంగలు వేస్తారు. అధికారం తలకెక్కినప్పటి కుసంస్కారం ఇది. ఒక్కక్షణంలో గతం మసకబారుతుంది. తాము ప్రత్యేకమైన పదార్థంతో మలిచిన మహానుభావులమనే భావం ఆకాశంలో నడిపిస్తుంది.

ఇంగ్లీషులో ఒక వాక్యం ఉంది When you loose your temper, you loose more than temper అని.ఇది చదువుకున్న సంస్కారి అవగాహన.

కానిస్టేబుల్ తల్లి వయసున్న, కొత్తగా ఎన్నికైన ఒక మాజీ ముఖ్యమంత్రిగారి మేనకోడలు– ఎంత సంయమనం, ఎంత మర్యాదని చూపించాలి! లోపలికి వెళ్లనీయని కారణంగా ఆ ఎమ్మెల్యే బయట అరగంట నిలిచిపోయిందని తెలిస్తే ఆ కానిస్టేబుల్ ఉద్యోగం ఏమయ్యేది? ఇప్పుడు ఎవరు ఎవరికి క్షమాపణ చెప్పవలసి వచ్చింది?

మనకన్నా చిన్నవాళ్ల మీద మనం చూపే అధికారం– కుసంస్కారం. మనకన్నా పెద్దవాళ్ల మీద ఆ అధికారాన్ని చూపగలిగితే అది 'నిజాయితీ'అనిపించుకుంటుంది. పెద్దవాళ్లు చిన్నవారి పట్ల చూపే ఆవేశం కన్నా చిన్నవాళ్లు పెద్దవారిని నిలదీసే 'ధైర్యం'వెయ్యి రెట్లు బలమైనది. షిల్లాంగులో జరిగిన ఈ సంఘటన విశాఖపట్నంలో తుపాకీలాగ పేలింది. చిన్న ఉద్యోగి చేసిన సాహసం– పెద్ద ఉద్యోగి చేసిన అనౌచిత్యాన్ని తలదన్నింది. ఇదే– ' loosing more than temper'అంటే. నిజమైన అధికారం తలొంచుతుంది. విర్రవీగదు. నిజమైన పెద్దరికం 'చెప్పుకోదు'. తెలిసేటట్టు చేస్తుంది.


జీవన కాలమ్



ఒక్క ఉదాహరణ చెప్పడానికి నేనెప్పుడూ అలసిపోను. ఆఫీసులో పనివేళలు దాటిపోయాక– తప్పనిసరిగా పనిలో తలమునకలయిన ఉద్యోగి– నాలుగో ఫ్లోర్ లిఫ్టు దగ్గర నిలబడి ఉంది. మెట్లు దిగుతున్న అధికారి చూశాడు. ఆయన్ని చూసి ఈమె కాస్త కంగారుపడింది. 'ఏమమ్మా! ఇంత ఆలస్యంగా వెళుతున్నావు?'అన్నారాయన. ఏదో నసిగింది. లిఫ్టు వచ్చేదాకా ఆయనా ఆమెతో నిలబడ్డారు– ఆమె అక్కరలేదంటున్నా. లిఫ్టులో ఆమెతో పాటు దిగి– ఆమెను కారు ఎక్కించి వెళ్లారు. ఆ ఉద్యోగి పేరు సుధ. తర్వాత ఇన్ఫోసిస్ నారాయణమూర్తిని పెళ్లి చేసుకుని 'సుధా నారాయణ మూర్తి'అయ్యారు. ఆ అధికారి జేఆర్‌డీ టాటా. ఈ దేశంలో 'భారతరత్న'గౌరవాన్ని పుచ్చుకున్న ఒకే ఒక్క వ్యాపారి ఆయన.

మన కంటే చిన్నవాడిమీద విరుచుకుపడే ఆవేశం 'ఆవేశం'అనిపించుకోదు. 'ఉడుకుమోతుతనం'అనిపించుకుంటుంది.

1990లో అహమ్మదాబాదు సమీపంలో జరిగిన రైలు ప్రయాణంలో ఒంటరిగా ప్రయాణం చేస్తున్న ఒక ప్రయాణికురాలి కోసం ఫస్టుక్లాసు కూపేలో ఉన్న ఇద్దరు నాయకులు– ఆమెకు బెర్తు ఇచ్చి– కంపార్టుమెంటులో నేల మీద దుప్పటి పరుచుకుని పడుకున్నారు. వారిద్దరు– శంకర్‌సింగ్ వాఘేలా, నరేంద్ర మోదీ అనే కార్యకర్త. వారిద్దరిలో ఒకాయన రాష్ట్ర ముఖ్యమంత్రి అయ్యారు. మరొకాయన రాష్ట్ర ముఖ్యమంత్రి, ఈ దేశపు ప్రధాని అయ్యారు. ఈ విషయాన్ని వారిద్దరు చెప్పుకోలేదు. తర్వాత రైల్వే బోర్డు జనరల్ మేనేజర్ అయిన ఆ ప్రయాణికురాలు వ్రాశారు.





కరుణానిధికి నమస్కరిస్తున్న రజనీకాంత్

కరుణానిధితో రజనీకాంత్ భేటీ

సాక్షి ప్రతినిధి, చెన్నై: ఇటీవలే రాజకీయాల్లోకి అడుగుపెట్టిన నటుడు రజనీకాంత్ బుధవారం డీఎంకే అధ్యక్షుడు కరుణానిధిని కలుసుకున్నారు. చెన్నైలో గోపాలపురంలోని కరుణానిధి నివాసానికి వెళ్లిన రజనీ ఆయనతో సుమారు 20 నిమిషాలు ముచ్చటించారు. కరుణానిధి వెంట ఆయన కొడుకు, డీఎంకే కార్యనిర్వాహక అధ్యక్షుడు స్టాలిన్ ఉన్నారు. ఆ తరువాత రజనీ మీడియాతో మాట్లాడుతూ...కరుణానిధి తనకు స్నేహితుడని, మర్యాదపూర్వకంగా కలిశానని స్పష్టం చేశారు. రాజకీయాల్లోకి రాబోతున్నందున ఆయన ఆశీర్వాదం తీసుకున్నానని తెలిపారు. ఈనెల 14వ తేదీన రజనీకాంత్ తన పార్టీ పేరు, చిహ్నం, జెండా ప్రకటిస్తారని అంచనా వేస్తున్న తరుణంలో కరుణానిధిని కలుసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. అనంతరం స్టాలిన్ మీడియాతో మాట్లాడుతూ తనది ఆధ్యాత్మిక పార్టీ అని రజనీకాంత్ చెప్పినట్లు వెల్లడించారు. ద్రవిడ సిద్ధాంతాన్ని నిర్వీర్యం చేసేందుకే రజనీ పార్టీ పెట్టారని కొందరు చిత్రీకరిస్తున్నారని, ఇది ఎవరి వల్లా సాధ్యం కాదని అన్నారు.

పెరూలో రోడ్డు ప్రమాదం.. 48 మంది మృతి



లీమా: పెరూలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానిక కాలమానం ప్రకారం మంగళవారం మధ్యాహ్నం హువాచో నగరం నుంచి రాజధాని లీమాకు బయలుదేరిన ఓ బస్సు ట్రక్కును ఢీకొనడంతో 48 మంది దుర్మరణం చెందారు. ట్రక్కును బలంగా ఢీకొట్టడంతో బస్సు కొండపై నుంచి పల్టీలు కొడుతూ దాదాపు 100 మీటర్లు కిందకు జారిపోయిందని అధికారులు తెలిపారు. ఈ ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో ఇద్దరు డ్రైవర్లతో పాటు 55 మంది ప్రయాణికులు ఉన్నారన్నారు. సముద్రతీరంలో ఉండటంతో పొగమంచు, అధిక తేమ కారణంగా ఈ రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతుంటాయి.

‘అరుణాచల్’లోకి చొచ్చుకొచ్చిన చైనా

ఇటానగర్ / న్యూఢిల్లీ: గతేడాది డోక్లామ్ ఘటన మర్చిపోకముందే చైనా మరోసారి కవ్వింపు చర్యలకు పాల్పడింది. చైనాకు చెందిన రోడ్డు నిర్మాణ సిబ్బంది డిసెంబర్ 28న అరుణాచల్‌ప్రదేశ్‌లోని టుటింగ్ ప్రాంతంలోకి కిలోమీటర్ మేర చొచ్చుకొచ్చారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. భారత బలగాలు అడ్డుకోవడంతో వారంతా వెనక్కు మళ్లారని వెల్లడించాయి. ఈ ఘటనలో చైనా సిబ్బంది నుంచి రెండు ప్రొక్లెయినర్లతో పాటు పలు యంత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నాయి. చైనీయులు వేసిన రోడ్డుమార్గానికి అడ్డంగా భారత బలగాలు రాళ్లతో గోడను నిర్మించాయన్నారు. ఈ ప్రాంతం ఇండో టిబెటిన్ బోర్డర్ పోలీస్ పరిధిలోనే ఉన్నప్పటికీ.. ప్రస్తుతం ఇక్కడ ఆర్మీ భారీ సంఖ్యలో చేరుకుందని వెల్లడించారు.

జోజిలా పాస్ సొరంగానికి కేబినెట్‌లో ఓకే

న్యూఢిల్లీ: జమ్మూ కశ్మీర్‌లో శ్రీనగర్, లేహ్‌ల మధ్య ప్రయాణ కాలాన్ని మూడున్నర గంటల నుంచి 15 నిమిషాలకు తగ్గించే జోజిలా పాస్ సొరంగ మార్గ నిర్మాణానికి కేంద్ర కేబినెట్ పచ్చజెండా ఊపింది. ప్రధాని మోదీ నేతృత్వంలో బుధవారం జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆసియాలోనే అతిపెద్ద సొరంగ మార్గమైన ప్రాజెక్టుకు 6,089 కోట్లు వ్యయం చేయనున్నారు. 14.2 కి.మీ పొడవుండే ఈ సొరంగం అందుబాటులోకి వస్తే శ్రీనగర్, కార్గిల్, లేహ్ మధ్య అనుసంధానత సాధ్యమవుతుంది. హిమాచల్‌ప్రదేశ్‌లోని బిలాస్‌పూర్‌లో ఎయిమ్స్ నెలకొల్పడానికి, జాతీయ జలమార్గం–1లోని హల్దియా–వారణాసి మార్గంలో నౌకాయానానికి ఊతమిచ్చేలా 5,369 కోట్లతో జల్ వికాస్ మార్గ్ ప్రాజెక్టుకూ కేబినెట్ ఆమోదం తెలిపింది.

అన్నాడీఎంకేకు సొంత చానల్, పత్రిక!

సాక్షి ప్రతినిధి, చెన్నై: తమిళనాడులో అధికార అన్నాడీఎంకే పార్టీ సొంత టీవీ చానల్, దిన పత్రికను ప్రారంభించాలని భావిస్తోంది. ప్రతిపక్ష డీఎంకేతో పాటు ఇటీవలే ఆర్కే నగర్ ఎమ్మెల్యేగా ఎన్నికైన టీటీవీ దినకరన్‌కూ సొంత ప్రసార మాధ్యమాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే తమ పార్టీకి కూడా సొంత మీడియా ఉండాలని అన్నాడీఎంకే వర్గాలు భావిస్తున్నాయి. మరోవైపు ఈ నెల 8 నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న వేళ రాయపేటలోని అన్నాడీఎంకే ప్రధాన కార్యాలయంలో బుధవారం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సీఎం ఎడపాడి పళనిస్వామి, ఉప ముఖ్యమంత్రి పన్నీర్ సెల్వం సొంత మీడియా ఏర్పాటుపై ఎమ్మెల్యేలతో చర్చించారు. ఈ సందర్భంగా అసెంబ్లీకి తొలిసారిగా హాజరుకానున్న దినకరన్‌ను చూసి నవ్వడం, మాట్లాడటం చేయరాదని ఎమ్మెల్యేలను ఎడపాడి, పన్నీర్ ఆదేశించారు.

ఇరాన్‌లో సమసిన సంక్షోభం: ఆర్మీ చీఫ్

టెహ్రాన్: ఇరాన్‌లో కొద్ది రోజులుగా కొనసాగుతున్న అంతర్గత సంక్షోభం సమసిపోయిందని ఆ దేశ ఆర్మీ చీఫ్ మొహమ్మద్ అలీ జఫారీ ప్రకటించారు. ప్రభుత్వానికి మద్దతుగా బుధవారం నిర్వహించిన ర్యాలీల్లో వేలాది మంది పాల్గొన్నారు. దేశ వ్యాప్తంగా సుమారు 15 వేల మంది ఆందోళనకారులను అదుపుచేయడానికి సైన్యం పరిమితంగానే జోక్యం చేసుకుందని జఫారీ తెలిపారు. ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడటానికి శిక్షణ పొంది సంక్షోభానికి కారణమైన దేశద్రోహుల్లో చాలా మందిని అదుపులోకి తీసుకున్నామని, వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆర్థిక సమస్యల కారణంగా డిసెంబర్ 28న ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలు ప్రారంభమైన తరువాత టెలిగ్రామ్, ఇన్‌స్టాగ్రామ్ లాంటి సేవలను నిలిపివేశారు. ఈ ఆందోళనల్లో 21 మంది చనిపోయారు.

క్షిపణుల కొనుగోలు ఒప్పందం రద్దు!

జెరూసలెం: ఇజ్రాయెల్‌కు చెందిన ఓ ఆయుధాల కంపెనీతో యుద్ధ ట్యాంకులను ధ్వంసం చేసే క్షిపణుల (స్పైక్) కొనుగోలు ఒప్పందాన్ని భారత్ రద్దు చేసుకుంది. దాదాపు రూ.3 వేల కోట్ల విలువైన 1,600 క్షిపణుల కొనుగోలు ఒప్పందాన్ని రద్దు చేసుకోవడంపై ఆ కంపెనీ విచారం వ్యక్తం చేసింది. త్వరలో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు భారత్‌కు రానున్న సమయంలో ఒప్పందం రద్దు చేసుకోవడం గమనార్హం. ‘ఒప్పందం రద్దు చేసుకుంటున్నట్లు భారత్ రక్షణ శాఖ నుంచి అధికారిక సమాచారం అందింది’ అని రాఫెల్ అడ్వాన్స్‌డ్ డిఫెన్స్ సిస్టమ్స్ ప్రతినిధి వెల్లడించారు.

కాళ్లు మొక్కించి బూట్లు నాకించారు!

గుజరాత్‌లో దళితుడిపై పోలీసుల దాష్టీకం

అహ్మదాబాద్: ఓ గొడవ విషయమై ప్రశ్నించిన పాపానికి ఓ దళిత వ్యక్తిని దాదాపు 15 మంది పోలీసులు కాళ్లు మొక్కించి, బూట్లు నాకించిన అమానవీయ ఘటన గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో చోటుచేసుకుంది. తాము ఉండే ప్రాంతంలో జరిగిన ఓ గొడవపై ప్రశ్నించినందుకు పోలీస్ కానిస్టేబుల్ వినోద్‌భాయ్ డిసెంబర్ 28న తనను అరెస్ట్ చేశారని బాధితుడు హర్షద్ జాదవ్(38) ఆరోపించారు. స్టేషన్‌కు తీసుకెళ్లిన తర్వాత పోలీసులు తన కులం అడిగారనీ.. తాను దళితుడినని చెప్పడంతో వినోద్‌భాయ్‌కు క్షమాపణ చెప్పాలన్నారని, వారు చెప్పినట్లు చేసిన తర్వాత దాదాపు 15 మంది పోలీసులు తమ బూట్లను నాకించారన్నారు. బెయిల్‌పై విడుదలైన అనంతరం జనవరి 1న స్థానికులతో కలిసి పోలీస్ స్టేషన్‌ను ఘెరావ్ చేసిన తర్వాతే అధికారులు కేసు నమోదుచేసినట్లు వెల్లడించారు. మరోవైపు జాదవ్ ఫిర్యాదుతో కానిస్టేబుల్ వినోద్‌పై ఎస్సీ,ఎస్టీ వేధింపుల నిరోధక చట్టం కింద కేసు నమోదుచేసినట్లు డీసీపీ గిరీశ్ పాండ్యా తెలిపారు.

‘మహా’ బంద్ హింసాత్మకం

- ముంబై సహా రాష్ట్రవ్యాప్తంగా కొనసాగిన నిరసనలు
- కోట్ల రూపాయల ఆస్తినష్టం.. స్తంభించిన జనజీవనం
- బంద్ ప్రశాంతం:ప్రకాశ్ అంబేడ్కర్





ముంబైలోని దాదర్ స్టేషన్‌లో రైలును అడ్డుకుంటున్న దళిత నిరసనకారులు ● వెస్టర్న్ ఎక్స్‌ప్రెస్ హైవేలో ట్రాఫిక్‌ను అడ్డగిస్తున్న ఆందోళనకారులు

ముంబై/పుణే: మహారాష్ట్రలో ‘భీమా–కోరేగావ్’ ఘటన తాలూకు ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. బుధవారం కూడా ముంబై, పుణే సహా మహారాష్ట్రలోని పలు సున్నిత ప్రాంతాల్లో పరిస్థితి మరింత హింసాత్మకంగా మారింది. ముంబైలో రోడ్డు, రైలు రవాణా వ్యవస్థతోపాటుగా జనజీవనం స్తంభించింది. హార్బర్ లైన్ సహా రెండుచోట్ల రాళ్లురువ్విన ఘటనలూ చోటుచేసుకున్నాయి. భీమా–కోరేగావ్ యుద్ధానికి 200 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఓ వర్గం చేపట్టిన కార్యక్రమం హింసాత్మకంగా మారటంతో ఈ వివాదం మొదలైన సంగతి తెలిసిందే. దీనికి ప్రభుత్వ వైఫల్యమే కారణమంటూ రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్పీఐ) బహుజన మహాసంఘ్, దళిత నేత ప్రకాశ్ అంబేడ్కర్ బుధవారం ఒక్కరోజు బంద్‌కు పిలుపునిచ్చారు. ముంబై, పుణేల్లో వందలమంది నిరసనకారులను పోలీసులు అరెస్టు చేశారు. మహారాష్ట్ర వ్యాప్తంగా ప్రశాంతంగా ఆందోళలు జరిగాయని ప్రకాశ్ అంబేడ్కర్ తెలిపారు. నవీ ముంబై, థానే, పుణే, ఔరంగాబాద్, నాందేడ్, పర్భణీ, వాషిం, అకోలా, సింధుదుర్గ్, రాయ్‌గఢ్, కోల్హాపూర్ ప్రాంతాల్లోనూ పరిస్థితులు ఉద్రిక్తకరంగా మారాయని పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. ఉద్రిక్తతలకు కారకులైన వారిని వదిలిపెట్టబోమని మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవిస్ స్పష్టం చేశారు. బాంబే హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరుపుతామన్నారు.

స్తంభించిన ముంబై

చెంబూర్, ఘాట్కోపర్, కామ్‌రాజ్ నగర్, దిందోషి, కాందివలి, జోగేశ్వరి, కళానగర్, మాహిమ్‌లలో బంద్ ప్రభావం తీవ్రంగా కనిపించింది. హార్బర్ లైన్‌లోని గోవండీ, మార్‌ఖుర్ద, కుర్లా, నాలా సోపారా ప్రాంతాల్లో రైల్వే ట్రాక్‌లపై నిరసనకారులు బైఠాయించారు. దీంతో ఛత్రపతి శివాజీ మహారాజ్ టెర్మినస్‌కి రావాల్సిన రైళ్లు శివారు స్టేషన్లలోనే నిలిచిపోయాయి. ముంబైకి ప్రత్యేక గుర్తింపు తెచ్చిన డబ్బావాలాలు కూడా తమ సేవలను నిలిపివేశారు. స్కూలు బస్సులు నడవకపోవటంతో బుధవారం కూడా పాఠశాలలు మూసే ఉంచారు.

పుణేలోనూ విధ్వంసం

పుణేలోనూ నిరసనకారులు బస్సులు, రైళ్లపై రాళ్లు రువ్వారు. రెండ్రోజులుగా పుణేలో జరుగుతున్న ఆందోళనల్లో 42 ఆర్టీసీ బస్సులు ధ్వంసమయ్యాయని పోలీసులు తెలిపారు. ఇవి కాకుండా నగరంలో బంద్ ప్రశాంతంగానే జరిగిందన్నారు. కాగా, ‘భీమా–కోరేగావ్’ సంస్మరణ సంబరాలను వ్యతిరేకించిన సమస్త హిందూ అఘాడీ చీఫ్ మిలింద్ ఎక్‌బోటే ఇంటికి ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించిన దళిత సంఘాల నేతలు, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు. కాగా, డిసెంబర్ 31న పుణేలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న గుజరాత్ ఎమ్మెల్యే జిగ్నేశ్ మేవానీ, జేఎన్‌యూ విద్యార్థి ఉమర్ ఖాలిద్‌లు విద్వేషపూరిత ప్రసంగం చేశారంటూ ఫిర్యాదు రావటంతో పుణే పోలీసులు వీరిపై కేసు నమోదు చేశారు.

దద్దరిల్లిన పార్లమెంటు

‘మహా’ ఘటనపై బీజేపీ, కాంగ్రెస్ మాటల యుద్ధం ● తలాక్‌పై పట్టువీడని అధికార, విపక్షాలు





అనంత్‌కుమార్ మల్లికార్జున ఖర్గే

న్యూఢిల్లీ: మహారాష్ట్రలో నెలకొన్న ‘కుల హింస’ బుధవారం పార్లమెంటును కుదిపేసింది. ఉభయసభల్లోనూ కాంగ్రెస్, బీజేపీలు పరస్పర ఆరోపణలు చేసుకున్నాయి. ఆరెస్సెస్, హిందుత్వ సంస్థలు మహారాష్ట్రలో దళితులపై దాడులకు పాల్పడుతున్నాయని కాంగ్రెస్ విమర్శించింది. ఈ దాడులపై ప్రధాని మౌనం వహించటంపై మండిపడ్డ లోక్‌సభలో కాంగ్రెస్ పక్షనేత మల్లికార్జున ఖర్గే.. మహారాష్ట్ర ఘటనపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ విమర్శలను బీజేపీ, ఆరెస్సెస్ తిప్పికొట్టాయి. వరుసగా అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలవుతున్న కాంగ్రెస్ అసహనంతోనే నోటికొచ్చిన విమర్శలు చేస్తోందని బీజేపీ విమర్శించింది. కాగా, భారత్‌లో కుల, మతాల పేరుతో చిచ్చు పెట్టేందుకు ‘బ్రేకింగ్ ఇండియా బ్రిగేడ్’ ప్రయత్నిస్తోందని పరోక్షంగా కాంగ్రెస్‌ను ఆరెస్సెస్ విమర్శించింది. 2016లో జేఎన్‌యూలో జాతివ్యతిరేక నినాదాలు చేసిన వారు, వారికి అండగా నిలిచిన వారు ఇప్పుడు హిందూ సమాజాన్ని విచ్ఛిన్నం చేసే పనిలో ఉన్నారని ఆరెస్సెస్ ముఖ్యనేత మన్మోహన్ వైద్య ఆరోపించారు.

కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ

బుధవారం లోక్‌సభ ప్రారంభం కాగానే మహారాష్ట్ర అల్లర్లపై విపక్షాలు ఆందోళన ప్రారంభించాయి. కాంగ్రెస్ పక్షనేత మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ.. ప్రభుత్వ వైఫల్యం వల్లే హిందూ శక్తులు మహారాష్ట్రలో దళితులపై దాడులకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. ‘ఈ హింస వెనక ఆరెస్సెస్, ఇతర హిందూ శక్తులున్నాయి. ఈ విషయంపై ప్రధాని నరేంద్ర మోదీ ఎందుకు నిశ్శబ్దంగా ఉన్నారు. దళితుల అంశాల్లో రాగానే ఆయన ‘మౌని బాబా’గా మారిపోతారు’ అని ఆరోపించారు. ఖర్గే వ్యాఖ్యలను బీజేపీ సభ్యులు ఖండించారు. ‘భీమా–కోరేగావ్ వివాదాన్ని కాంగ్రెస్ రాజకీయం చేస్తోంది. ఈ వివాదం ద్వారా రాజకీయ ప్రయోజనం పొందాలని చూస్తున్నారు’ అని పార్లమెంటు వ్యవహారాల మంత్రి అనంత్ కుమార్ విమర్శించారు. మంత్రి వ్యాఖ్యలతో సభలో దుమారం రేగింది. అనంతరం కీలకమైన ఓబీసీ బిల్లును కేంద్రం లోక్‌సభలో ప్రవేశపెట్టింది.అధికార, ప్రతిపక్షాల మధ్య వాగ్వాదం చెలరేగటంతో స్పీకర్ సభను గురువారానికి వాయిదావేశారు.

అట్టుడికిన రాజ్యసభ

రాజ్యసభ కార్యక్రమాలకూ ‘మహా’ హింస పలుమార్లు అవరోధం కల్గించింది. హింసపై చర్చ జరగాల్సిందేనని కాంగ్రెస్, బీఎస్పీ పట్టుబట్టడంతో సభ మూడుసార్లు వాయిదా పడింది. బీజేపీ, ఆరెస్సెస్‌లు దళిత వ్యతిరేకులని ఆజాద్ ఆరోపించారు. కాంగ్రెస్, బీఎస్పీ ఎంపీలు వెల్‌లోకి దూసుకొచ్చి ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు.



వెల్‌లోకి దూసుకొచ్చి నినాదాలు చేస్తున్న సభ్యులు

‘తలాక్’పై రాజ్యసభలో..

న్యూఢిల్లీ: ‘తక్షణ ట్రిపుల్ తలాక్’ బిల్లుపై బుధవారం రాజ్యసభ అట్టుడికింది. లోక్‌సభ ఆమోదం పొందిన ముస్లిం మహిళల (వివాహ హక్కుల పరిరక్షణ) బిల్లు – 2017పై రాజ్యసభలో చర్చ సందర్భంగా తీవ్ర గందరగోళం నెలకొంది. మహారాష్ట్ర వివాదంపై పలుమార్లు వాయిదాల అనంతరం మధ్యాహ్నం 3 గంటల సమయంలో సభ ప్రారంభం కాగానే న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ తలాక్ బిల్లును ప్రవేశపెట్టారు. దీన్ని విపక్షాలు వ్యతిరేకించాయి. సెలెక్ట్ కమిటీకి ఈ బిల్లును పంపాలని డిమాండ్ చేశాయి. సెలెక్ట్ కమిటీలో ఉండాల్సిన సభ్యుల పేర్లతో కాంగ్రెస్ నేత ఆనంద్ శర్మ ఓ జాబితాను డిప్యూటీ చైర్మన్ కు అందజేశారు. ఈ బిల్లు తీసుకురావటం ద్వారా నేరాలు పెరిగేందుకు ప్రోత్సహించేలా ముస్లింలను బీజేపీ మోసగిస్తోందని.. గులాంనబీ ఆజాద్ విమర్శించారు. ప్రజాస్వామ్యంపై నమ్మకంలేకే బీజేపీ బలప్రయోగం ద్వారా బిల్లులను ఆమోదింపజేసుకుంటోందన్నారు. విపక్షాల విమర్శలను బీజేపీ తిప్పికొట్టింది. బిల్లుపై చర్చను తప్పించుకునేందుకే కాంగ్రెస్.. సెలెక్ట్ కమిటీ నాటకమాడుతోందని బీజేపీ విమర్శించింది. ఆరోపణలు, ప్రత్యారోపణలతో సభ వేడెక్కటంతో డిప్యూటీ చైర్మన్ పీజే కురియన్ సభను గురువారానికి వాయిదా వేశారు. శీతాకాల సమావేశాలకు రెండ్రోజులే మిగిలి ఉండటంతో ఈ బిల్లును నెగ్గించుకునేందుకు ప్రభుత్వం, వ్యతిరేకించేందుకు విపక్షాలు వ్యూహ, ప్రతివ్యూహాలు పన్నుతున్నాయి.

నా దగ్గరా న్యూక్లియర్ బటన్

- అది కిమ్ వద్ద ఉన్న దానికన్నా పెద్దది, శక్తిమంతమైనది
- ఉత్తర కొరియా అధ్యక్షుడి వ్యాఖ్యలపై ట్రంప్ స్పందన
- పాలస్తీనాకూ సాయం ఆపేస్తాం



వాషింగ్టన్: ‘కిమ్ వద్ద ఉన్న దానికన్నా పెద్దదైన, శక్తిమంతమైన, బాగా పనిచేసే న్యూక్లియర్ బటన్ నా దగ్గర కూడా ఉంది’ అంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ చేసిన హెచ్చరికలపై స్పందించారు. కొత్త ఏడాది సందర్భంగా కిమ్ ప్రసంగిస్తూ అమెరికా ప్రధాన భూభాగంపై ఎక్కడైనా దాడి చేయగల అణు క్షిపణులు తన వద్ద ఉన్నాయనీ, దాడిని ప్రారంభించేందుకు అవసరమైన న్యూక్లియర్ బటన్ కూడా ఎప్పుడూ తన టేబుల్ పైనే ఉంటుందంటూ హెచ్చరించడం తెలిసిందే. దీనికి సమాధానంగా ట్రంప్ ‘న్యూక్లియర్ బటన్ ఎల్లవేళలా తన టేబుల్‌పైనే ఉంటుందని ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ చెప్పారు. దారిద్ర్యంతో, ఆకలి కేకలతో అల్లాడుతున్న ఆ దేశంలోని ఎవరైనా వెళ్లి ఆయనకు చెప్పండి నా దగ్గర కూడా అంతకు మించిన బటన్ ఉందని’ అని ట్రంప్ బుధవారం ట్వీట్ చేశారు.

పాలస్తీనాకూ సాయం ఆపేస్తాం

ఉగ్రవాదంపై పోరాటం కోసం పాక్‌కు అందిస్తున్న ఆర్థిక సాయాన్ని నిలిపివేయాలని నిర్ణయించిన అమెరికా తాజాగా పాలస్తీనాకూ అదే హెచ్చరిక చేసింది. ఇజ్రాయెల్‌తో శాంతి చర్చలను పాలస్తీనా పునరుద్ధరించకపోతే ఆర్థిక సాయాన్ని నిలిపేస్తామంది. పాలస్తీనా శరణార్థుల కోసం ఐక్యరాజ్యసమితి విభాగానికి 2016లో అత్యధికంగా అమెరికానే 368 మిలియన్ డాలర్లను సాయంగా అందించింది. ‘పాలస్తీనాకు మేం ఏటా వందల మిలియన్ డాలర్లు ఇస్తున్నా కానీ వారు మమ్మల్ని అగౌరవపరుస్తున్నారు.’ అంటూ ట్రంప్ ఓ ట్వీట్ చేశారు. అంతకుముందు ఐరాసలో అమెరికా రాయబారి నిక్కీ హేలీ మాట్లాడుతూ పాలస్తీనాకు ఆర్థిక సాయాన్ని తమ ప్రభుత్వం నిలిపేసిందన్నారు.

‘అత్యంత అవినీతి మీడియా’ అవార్డు

వచ్చే సోమవారం ‘అత్యంత అవినీతికర అమెరికా మీడియా’ అవార్డును ప్రకటిస్తానని ట్రంప్ చెప్పారు. ఈ అవార్డులు అవినీతి మీడియా, తప్పుడు వార్తలు, బ్యాడ్ రిపోర్టింగ్ కేటగిరీల్లో ఉంటాయన్నారు. ఫాక్స్ న్యూస్ మినహా మిగతా అమెరికా మీడియాతో ట్రంప్‌కు సత్సంబంధాలు లేవు. దీంతో సమాచారాన్ని ఆయన ఎక్కువగా ట్వీట్ల ద్వారానే వెల్లడిస్తుండటం తెలిసిందే.

ఆప్ రాజ్యసభ అభ్యర్థుల ఖరారు

- సంజయ్‌సింగ్, సుశీల్‌గుప్తా, ఎన్‌డీ గుప్తాలకు అవకాశం
- కుమార్ విశ్వాస్‌కు దక్కని చోటు







సంజయ్ సింగ్ సుశీల్ గుప్తా ఎన్డీ గుప్తా

సాక్షి ప్రతినిధి, న్యూఢిల్లీ: ఆమ్‌ఆద్మీ పార్టీ(ఆప్) రాజ్యసభ అభ్యర్థులుగా పార్టీ సీనియర్ నేత సంజయ్‌సింగ్, ప్రముఖ వ్యాపారవేత్త సుశీల్‌గుప్తా, చార్టర్డ్ అకౌంటెంట్ ఎన్‌డీ గుప్తా పేర్లను ఖరారు చేసింది. బుధవారం ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ నివాసంలో జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. అనంతరం ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా మీడియాతో మాట్లాడుతూ.. సుశీల్‌గుప్తా ఢిల్లీ, హరియాణాల్లో విద్య, వైద్య రంగాల్లో విశేష సేవలు అందించారని, ఆయన 15 వేల మంది విద్యార్థులకు ఉచిత విద్యను అందించారని చెప్పారు. నారాయణ్‌దాస్ గుప్తా ఐసీఏఐ మాజీ అధ్యక్షుడన్నారు. కాగా, రాజ్యసభ సభ్యత్వాన్ని ఆశించిన పార్టీ వ్యవస్థాపక సభ్యుడు కుమార్ విశ్వాస్‌కు చోటు దక్కలేదు. ఢిల్లీలోని మూడు రాజ్యసభ స్థానాలకు 16న ఎన్నికలు జరగనున్నాయి. 70 స్థానాలున్న ఢిల్లీ అసెంబ్లీలో మెజారిటీ సీట్లు దక్కించుకున్న ఆప్‌కే ఈ మూడు సీట్లు సొంతం కానున్నాయి.


నిజం చెప్పినందుకే..: కుమార్ విశ్వాస్

నిజాలు మాట్లాడినందుకే తనకు శిక్ష విధించారని ఆప్ అసంతృప్త నేత కుమార్ విశ్వాస్ ఆరోపించారు. రాజ్యసభ అభ్యర్థుల పేర్లు ఖరారు చేసిన అనంతరం ఆయన కేజ్రీవాల్‌పై మండిపడ్డారు. కేజ్రీవాల్‌తో విభేదిస్తే ఇక ఆప్‌లో కొనసాగడం సాధ్యం కాదని పేర్కొన్నారు.


వీళ్లనూ తిప్పి పంపేవారా?


ప్రసిద్ధ అమెరికన్ కంపెనీలకు అధిపతులుగా భారతీయులు














సత్యా నాదెళ్ల సుందర్ పిచాయ్ ఇంద్రానూయి అజయ్‌పాల్ సింగ్ దినేశ్ పాలివాల్ సంజయ్ ఝా

‘**అ**మెరికా ఉత్పత్తులనే కొనండి, అమెరికా జాతీయులకే ఉద్యోగాలివ్వండి’ అనే తన ఎన్నికల నినాదాన్ని ఆచరణలోకి తీసుకువచ్చే దిశగా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్–1బీ వీసాల జారీ విధానంలో కీలకమార్పులు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రస్తుతం పరిశీలన దశలో ఉన్న ప్రతిపాదనలు అమల్లోకి వస్తే ఇకపై హెచ్–1బీ వీసా పొందడం కఠినం కానుంది. తాజాగా ట్రంప్ తీసుకొచ్చిన ప్రతిపాదన ప్రకారం శాశ్వత నివాసానికి అర్హత కల్పించే ‘గ్రీన్‌కార్డు’ దరఖాస్తు పరిశీలనలో ఉండగానే హెచ్–1బీ వీసా గడువు ముగిసిన ఉద్యోగులు స్వదేశానికి తిరుగుముఖం పట్టాల్సి ఉంటుంది. ఈ నిర్ణయం అమలైతే అయిదు నుంచి ఏడున్నర లక్షల మంది భారత ఉద్యోగులపై పెనుప్రభావం పడుతుంది. అయితే.. ప్రస్తుతం ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన అనేక అమెరికన్ కంపెనీలకు సీఈఓలుగా, అధిపతులుగా ఉన్న భారతీయులు గతంలో హెచ్ –1బీ వీసాలపై అక్కడకు వెళ్లిన వారే. ఒకవేళ ఇప్పుడు ట్రంప్ యంత్రాంగం తీసుకొచ్చిన తాజా ప్రతిపాదన గతంలోనే అమలై ఉంటే వీరంతా ప్రసిద్ధ కంపెనీల్లో ఉన్నతస్థానాల్లో ఉండేవారా అన్న వాదన ముందుకొస్తోంది. గతంలో సరళమైన వీసా విధానం కారణంగానే పలువురు భారతీయులు ప్రస్తుతం ఆయా కంపెనీల్లో కార్పొరేట్ లీడర్లుగా ఉన్నారు. వీరంతా అమెరికా ఆర్థికాభివృద్ధికి విశేషంగా తోడ్పడి, ఆ దేశానికే అధిక లాభం చేకూర్చారు. వలసదారుల దేశంగా పిలిచే అమెరికాలో 20వ దశాబ్దం నుంచి వీసాలు, స్థిరనివాసం విషయంలో కఠిన నిబంధనలను సడలించారు. ఈ చర్యల ఫలితంగా అత్యుత్తమ ప్రతిభావంతులను అమెరికాకు ఆకర్షించగలిగారు.

–సాక్షి నాలెడ్జ్ సెంటర్

భారత్ నుంచి అమెరికా వెళ్లి వివిధ రంగాల్లో స్థిరపడిన కొందరు ప్రముఖులు

సత్యా నాదెళ్ల, హైదరాబాద్‌లో జననం.
హోదా : సీఈఓ, మైక్రోసాఫ్ట్
చదువు : మణిపాల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ–బీఈ, అమెరికాలోని విస్కాన్‌సిన్–మిల్‌ఔ – ఎమ్మెస్, షికాగో యూనివర్శిటీలోని బూత్ స్కూల్ ఆఫ్ బిజినెస్ – ఎంబీఏ

సుందర్ పిచాయ్, తమిళనాడులో పుట్టారు.
హోదా : సీఈఓ, గూగుల్ :
చదువు : ఐఐటీ ఖరగ్‌పూర్–బీటెక్, స్టాన్‌ఫర్డ్–ఎమ్మెస్, వార్టన్–ఎంబీఏ

ఇంద్రానూయి, చెన్నైలో జన్మించారు.
హోదా : సీఈఓ, పెప్సీకో :
అనుభవం : 1994లో ఆ సంస్థలో చేరిక. కొన్నేళ్లుగా సీఈఓగా బాధ్యతలు.. 2017లో వ్యాపార,వాణిజ్యాల్లో అత్యంత శక్తిమంతమైన మహిళల ఫోర్బ్స్ జాబితాలో ద్వితీయస్థానం

శంతను నారాయణ్, హైదరాబాద్‌లో పుట్టారు
హోదా : సీఈఓ, అడోబ్
చదువు : ఉస్మానియా విశ్వవిద్యాలయం–బీఎస్సీ, బెర్క్‌లే కాలిఫోర్నియా వర్శిటీ–ఎంబీఏ, బౌలింగ్ గ్రీన్ స్టేట్ వర్శిటీ–ఎమ్మెస్

అజయ్‌పాల్‌సింగ్ బాంగా,
హోదా : ప్రెసిడెంట్, సీఈఓ, మాస్టర్‌కార్డ్
చదువు : అహ్మదాబాద్ ఐఐఎం నుంచి ఎంబీఏ

జార్జి కురియన్, కేరళలో జన్మించారు
హోదా : ప్రెసిడెంట్ అండ్ సీఈఓ, నెట్‌యాప్
చదువు : ఐఐటీ మద్రాస్‌లో కొంతకాలం ఇంజనీరింగ్ అమెరికాలోని ప్రిన్స్‌టన్ (న్యూజెర్సీలోని) యూనివర్శిటీలో డిగ్రీ,. కాలిఫోర్నియాలోని స్టాన్‌ఫర్డ్ యూనివర్శిటీ–ఎంబీఏ

దినేష్ పాలివాల్, ఉత్తరప్రదేశ్‌లోజననం
హోదా : ప్రెసిడెంట్ అండ్ సీఈఓ, హర్మన్ ఇంటర్నేషనల్
చదువు : ఐఐటీ రూర్కీ–బీటెక్, వయామి వర్శిటీ–ఎమ్మెస్, ఎంబీఏ

సంజయ్ ఝా,
హోదా : సీఈఓ, గ్లోబల్ ఫౌండ్రీస్
అనుభవం :2014లో ఈ బాధ్యతలు చేపట్టడానికి పూర్వం మోటరోలా మొబిలిటి సీఈఓగా, క్వాల్‌కామ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్. 2008లో ఆయన మోటరోలా కో(సహ) సీఈఓగా చేరారు.

అజిత్ జైన్, ఒడిశాలో పుట్టారు.
చదువు : ఐఐటీ, హార్వర్డ్‌ల నుంచి ఉన్నతవిద్యాభ్యాసం
అనుభవం :బెర్క్‌షైర్ హాథ్‌వేలో వారెన్ బఫెట్ వారసుడిగా నియమితులయ్యే వారిలో ముందు వరుసలో ఉన్నారు.



ఐటీ క్లస్టర్ భూముల వివరాలను మ్యాపులో పరిశీలిస్తున్న మంత్రి కేటీఆర్

బుద్వేల్‌లో మరో ఐటీ క్లస్టర్!

త్వరలో ముఖ్యమంత్రి శంకుస్థాపన: మంత్రి కేటీఆర్

కంపెనీల స్థాపనకు 30 సంస్థల ఆసక్తి

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లోని బుద్వేల్, రాజేంద్రనగర్ ప్రాంతాల పరిధిలో మరో ఐటీ క్లస్టర్ ఏర్పాటు చేయనున్నామని పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన ప్రక్రియను వేగవంతం చేశామన్నారు. ఈ ప్రాంతాల్లో ఐటీ క్లస్టర్ కోసం సేకరించనున్న భూములను బుధవారం మంత్రి అధికారులతో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుద్వేల్ ఐటీ క్లస్టర్‌ను త్వరలో ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారని అన్నారు. ఈ క్లస్టర్‌లో కంపెనీలను స్థాపించేందుకు 30కిపైగా బహుళజాతి ఐటీ సంస్థలు, ప్రముఖ దేశీయ కంపెనీలు ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నాయన్నారు. త్వరలోనే ఆయా కంపెనీలతో పరిశ్రమల స్థాపనకు లాంఛనంగా ఒప్పందాలు కుదుర్చుకుంటామన్నారు. కొత్తగా ఏర్పాటు కానున్న ఈ క్లస్టర్‌లో అన్ని మౌలిక సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని టీఎస్ఐఐసీ అధికారులను మంత్రి ఆదేశించారు. ఇక్కడ పూర్తి స్థాయిలో ఐటీ కంపెనీల స్థాపన జరిగితే లక్షా పాతిక వేల కొత్త ఉద్యోగాలు వస్తాయన్నారు.

✦ ఆర్డీఎస్ రైతులకు తుంగభద్ర జలాలు

ఏపీ మంత్రి దేవినేనితో ఫోన్‌లో మాట్లాడిన మంత్రి హరీశ్

సాక్షి, హైదరాబాద్: రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ (ఆర్డీఎస్) పథకం పరిధిలోని ఆయకట్టు రైతులకు శుభవార్త. వారికి ఒకట్రెండు రోజుల్లో తుంగభద్ర జలాలు విడుదల కానున్నాయి. సుమారు 7వేల ఎకరాల్లో వేసిన ఆరుతడి పంటలకు ఈ నీరందే అవకాశం ఉంది. తుంగభద్ర జలాల్లో తెలుగు రాష్ట్రాలకు దక్కే వాటాల అంశమై మంత్రి హరీశ్‌రావు, ఏపీ మంత్రి దేవినేనితో బుధవారం ఫోన్‌లో మాట్లాడారు. తుంగభద్ర ప్రాజెక్టు నుంచి నీటి విడుదలపై చర్చించారు. నీటి విడుదలకు సంయుక్తంగా ఇండెంట్ ఇద్దామని, దీనిద్వారా ఇటు ఆర్డీఎస్‌కు అటు సుంకేసులకు నీరు చేరుతుందని తెలిపారు. హరీశ్ ప్రతిపాదనకు దేవినేని సుముఖత వ్యక్తం చేశారు.

✦ వ్యవసాయశాఖకు ప్రత్యేక బడ్జెట్



పోచారం

సాక్షి, హైదరాబాద్: ఈ ఏడాది నుంచి వ్యవసాయ శాఖకు ప్రత్యేక బడ్జెట్ ప్రవేశ పెడతామని వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. 'తెలంగాణ అగ్రి డాక్టర్స్ అసోసియేషన్ డైరీని ఆవిష్కరించారు. వ్యవసాయ శాఖ ఉద్యోగుల కోరికలను ఈ బడ్జెట్‌లో పొందుపరుస్తామన్నారు. గోరటి వెంకన్న మాట్లాడుతూ సమాజంలో నెలకొన్న అక్రమాలు, అన్యాయాలపై పాటలు పాడుతూ ఉద్యోగులను చైతన్యపరిచారు. వ్యవస్థాపక అధ్యక్షులు కె.రాములు మాట్లాడుతూ తమ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

✦ జీవాలకు సేవ చేయడం అదృష్టం



తలసాని

సాక్షి, హైదరాబాద్: జీవాలకు సేవ చేయడం ఎంతో అదృష్టమని పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. జీవాలకు అవసరమైన వైద్యం సకాలంలో అందించడంతో పాటు గ్రాసం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బుధవారం పశుసంవర్ధక శాఖ అధికారుల నూతన డైరీ, క్యాలెండర్‌ను మంత్రి ఆవిష్కరించారు. పశుసంవర్ధక శాఖలో నూతన నియామకాలు చేపట్టడంతో పాటు, పదోన్నతులు ఇచ్చామన్నారు.

✦ జాతీయ విప్‌ల సదస్సుకు హరీశ్

సాక్షి, హైదరాబాద్: రాజస్తాన్‌లోని ఉదయ్‌పూర్‌లో ఈ నెల 8,9 తేదీల్లో రెండు రోజుల పాటు ఆలిండియా విప్‌ల సదస్సు జరగనుంది. పార్లమెంటు, అసెంబ్లీ నిర్వహణపై ఇందులో చర్చించనున్నారు. శాసన వ్యవహారాల శాఖ మంత్రి టి.హరీశ్‌రావు, శాసనసభ, శాసనమండలిలో టీఆర్ఎస్ చీఫ్ విప్‌లు, విప్‌లతో పాటు శాసన సభా కార్యదర్శి నర్సింహాచార్యులు సదస్సులో పాల్గొననున్నారు.

✦ కేంద్ర సంస్థలపై రాజకీయ ప్రభావం

అందుకు ఆర్‌బీఐ మినహాయింపు కాదు: దువ్వూరి

సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలపై కొంత రాజకీయ ప్రభావం ఉంటుందని, అందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మినహాయింపు కాదని ఆర్‌బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు అభిప్రాయపడ్డారు. బుధవారం 'ఆర్‌బీఐ–మేకింగ్ ఏ డిఫరెన్స్ టు ఎవ్రీడే లైవ్స్'అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన ప్రసంగించారు. ఆర్‌బీఐ కేవలం నోట్ల ముద్రణ, పంపిణీ ప్రక్రియే కాకుండా ఆర్థిక వ్యవస్థకు కీలకంగా వ్యవహరిస్తోందన్నారు. ద్రవ్యవిధానం రూపకల్పన, ఆర్థిక సంస్థల పర్యవేక్షణలో ఆర్‌బీఐ నిర్ణయాలు ముఖ్యమైనవని తెలిపారు. నోట్ల రద్దు వల్ల నల్లధనం, ఉగ్ర కార్యకలాపాలు, దొంగనోట్ల చలామణికి అడ్డుకట్ట పడిందన్నారు. ఎఫ్ఆర్‌డీఏతో బ్యాంకులు, ఖాతాదారులకు ఎలాంటి నష్టం ఉండబోదని అభిప్రాయపడ్డారు.

✦ విమానాశ్రయ ఏర్పాటుపై అధ్యయనం

కేంద్ర మంత్రిని కోరిన ఎంపీ కవిత

సాక్షి, న్యూఢిల్లీ: నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లిలో విమానాశ్రయం ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై అధ్యయనం జరిపించాలని పౌర విమానయాన శాఖ మంత్రి అశోక్ గజపతిరాజును టీఆర్ఎస్ ఎంపీ కవిత కోరారు. ఆమె బుధవారం ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలసి ఈ మేరకు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం కేంద్ర మంత్రి సురేశ్ ప్రభును కలసి బాల్కొండ నియోజకవర్గంలో ఏర్పాటు చేస్తున్న స్పైసెస్ పార్కుకు సంబంధించిన వివరాలు అందించారు. కేంద్రం తరఫున రూ.20 కోట్లు విడుదల చేసేందుకు సురేశ్ ప్రభు సంసిద్ధత వ్యక్తం చేసినట్లు ఆమె తెలిపారు. పసుపు రైతులకు ప్రత్యేకంగా టర్మరిక్ సెల్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.

✦ నలుగురు ఐఏఎస్‌లకు పదోన్నతి

సాక్షి, హైదరాబాద్: నలుగురు ఐఏఎస్ అధికారులకు కార్యదర్శులుగా పదోన్నతి లభించింది. 2002 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన వారు ఈ జాబితాలో ఉన్నారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ రఘునందన్‌రావు, ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యదర్శి జ్యోతి బుద్ధ ప్రకాశ్, హెచ్ఎండీఏ కమిషనర్ చిరంజీవులు, కేంద్ర రక్షణ శాఖలో డిప్యుటేషన్‌పై ఉన్న సుదర్శన్‌రెడ్డి పదోన్నతులు పొందారు.

✦ పరారీలో యాంకర్ ప్రదీప్

హైదరాబాద్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ టీవీ యాంకర్ మాచిరాజు ప్రదీప్ (35) పరారీలో ఉన్నట్లు జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు వెల్లడించారు. ఈ నెల 2న బేగంపేట, గోషామహల్‌లో ట్రాఫిక్ ట్రైనింగ్ సెంటర్లకు తల్లి లేదా భార్యతో కౌన్సెలింగ్‌కు ఆయన హాజరుకావాల్సి ఉంది. అయితే ఆయన మంగళవారం కౌన్సెలింగ్‌కు హాజరు కాలేదు. దీంతో నోటీసులు అందించేందుకు పోలీసులు బుధవారం మణికొండలోని ఆయన ఇంటికి వెళ్లగా తాళం వేసి ఉంది. కూకట్‌పల్లిలోని కార్యాలయానికి వెళ్లిన పోలీసులకు అక్కడ కూడా చుక్కెదురైంది. ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ ఉంది.

✦ గవర్నర్‌కు నివేదికలు అందించిన కాగ్

సాక్షి, హైదరాబాద్: కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) తమ నివేదికలను గవర్నర్ నరసింహన్‌కు అందించింది. రాష్ట్రానికి సంబంధించి 2016– 17 ఆర్థిక సంవత్సరపు ఆర్థిక, ద్రవ్య వినిమయ ఖాతాల వివరాలతో కాగ్ ఈ నివేదికలను రూపొందించింది. ఏటా బడ్జెట్ సమావేశాల్లో కాగ్ నివేదికలను శాసన సభ ముందుంచుతారు. నిబంధనల ప్రకారం కాగ్ తమ నివేదికలను గవర్నర్‌కు అందిస్తుంది.

ఈ సంక్రాంతికి డూడూ బసవన్న రాడా?

బసవన్నకు బంధనాలు

గంగిరెద్దుల వాళ్లను యాచకులుగా పరిగణిస్తూ జైలుకు తరలింపు

హైదరాబాద్‌లో పలువురు అరెస్టు.. జీహెచ్ఎంసీ వద్ద ధర్నా

కులవృత్తి యాచన ఎలా అవుతుందంటూ ఆందోళన

'అమ్మవారికి దణ్ణంపెట్టు.. అయ్యవారికి దణ్ణంబెట్టు.. పెద్ద సారుకు దణ్ణంపెట్టు..' ఈ మాటలు వినగానే అందరికీ సంక్రాంతి గంగిరెద్దుల సందడే గుర్తొస్తుంది. ఇంటింటికీ తిరిగి పిల్లలను, పెద్దలను అలరించే బసవన్నలు సంక్రాంతికి కొత్త శోభ తెస్తాయి. శిల్పారామంలో ప్రభుత్వం స్వయంగా నిర్వహించే సంక్రాంతి ఉత్సవాల్లోనూ గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల కీర్తనలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంటాయి. అయితే ఈ ఏడాది హైదరాబాద్‌లో గంగిరెద్దుల విన్యాసాలు కనిపించకపోవచ్చు. గంగిరెద్దుల వాళ్లను యాచకులుగా పరిగణించి పోలీసులు అదుపులోకి తీసుకుంటున్న నేపథ్యంలో హైదరాబాద్ వచ్చేందుకు వందలాది మంది గంగిరెద్దుల వాళ్లు వెనకడుగు వేస్తున్నారు. – సాక్షి, హైదరాబాద్



బుధవారం జీహెచ్ఎంసీ కార్యాలయం వద్ద ధర్నాలో భాగంగా విన్యాసాలను ప్రదర్శిస్తున్న గంగిరెద్దులు

జీహెచ్ఎంసీ వద్ద ధర్నా..

తరతరాలుగా తాము గంగిరెద్దులను ఆడిస్తున్నామని, అది తమ కులవృత్తి అని గంగిరెద్దుల వాళ్లు చెబుతున్నప్పటికీ భిక్షాటనపై సర్కార్ నిషేధం విధించిన నేపథ్యంలో రెండు, మూడు రోజులుగా పోలీసులు, జీహెచ్ఎంసీ అధికారులు హైదరాబాద్‌లో తనిఖీలు నిర్వహించి పలువురిని అదుపులోకి తీసుకున్నారు. చంచల్‌గూడ జైల్లోని పునరావాస కేంద్రానికి తరలించారు. దీంతో నగరంలోని పలు ప్రాంతాల్లో తాత్కాలిక నివాసం ఏర్పాటు చేసుకున్న గంగిరెద్దుల వాళ్ల కుటుంబాలు భయాందోళనకు గురవుతున్నాయి. ఈ అరెస్టులను నిరసిస్తూ గంగిరెద్దుల వాళ్లు ఆందోళనకు దిగారు. బుధవారం జీహెచ్ఎంసీ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి.. తాము యాచకులం కాదని, తమ కులవృత్తిని గుర్తించాలని డిమాండ్ చేశారు. సీపీఎం, అత్యంత వెనుకబడిన కులాల సంఘం వీరికి మద్దతు తెలిపాయి.

బసవన్నలపై ఆంక్షలు..

సంక్రాంతి సమయంలో గంగిరెద్దుల వాళ్లు నాదస్వరంతో పాడే పాటలు, తబలా వాద్యం, రంగురంగుల దుస్తులతో గంగిరెద్దులకు చేసే అలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. వారికి డబ్బులు, పాతవస్తువులు, బియ్యం వంటివి జనం ఇస్తుంటారు. సంక్రాంతికి 15 రోజుల ముందు నుంచే కీసర సమీపంలోని అంకిరెడ్డిపల్లె, బాచారం, ఘట్కేసర్, పోచారం, తొర్రూరు, బాలాజీనగర్, రాజీవ్‌గాంధీనగర్ తదితర ప్రాంతాల నుంచి గంగిరెద్దుల వాళ్లు నగరానికి వస్తారు. ఇప్పటికే అడిక్‌మెట్, దిల్‌సుఖ్‌నగర్, మలక్‌పేట్ తదితర ప్రాంతాల్లో తాత్కాలికంగా నివాసం ఏర్పాటు చేసుకున్నారు. వీరంతా సంక్రాంతి అనంతరం తమ సొంత ఊళ్లకు తిరిగి వెళ్తారు. కానీ ప్రస్తుత అరెస్టుల నేపథ్యంలో అనేక మంది భయాందోళనకు గురవుతున్నారు.



మా పొట్ట కొట్టొద్దు: మల్లేశ్

కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ నుంచి పొట్ట చేత పట్టుకుని హైదరాబాద్ వచ్చినం. మమ్మల్ని బిచ్చగాళ్లను చేసి ఊళ్లో తిరగొద్దనడం అన్యాయం. మా పొట్టకొట్టే పని చేయొద్దని సర్కార్‌కు మొక్కుతున్నా. ఒక గంగిరెద్దుకు శిక్షణ ఇవ్వాలంటే ఎంతో వ్యయప్రయాస. దానివల్ల మేము, మా వల్ల అది బతుకుతున్నాం.



చదివినా కులవృత్తి తప్పడం లేదు: పద్మ

అందరిలాగే మేమూ డిగ్రీలు చదువుకున్నాం. కానీ ఏం లాభం ఉద్యోగాల్లేవు. సాగు చేసేందుకు భూమి లేదు. ఉన్నదల్లా మాతో పాటు పెరిగిన ఎద్దులు, ఆవులే. చదివినా ఫలితం లేక తిరిగి గంగిరెద్దు దగ్గరకే వస్తున్నాం. మా సామాజిక వర్గాన్ని గుర్తించి గౌరవించాలి.

ఉత్పత్తే లేదు.. మిగులెక్కడిది?

- కరెంట్‌పై సీఎం కేసీఆర్ చెబుతున్నవన్నీ అబద్ధాలే: ఉత్తమ్
- కాంగ్రెస్ ప్రభుత్వాల కృషి వల్లే ఇప్పుడు మిగులు విద్యుత్
- టీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క యూనిట్ అయినా ఉత్పత్తి చేసిందా?
- విద్యుత్ వాస్తవాలపై టీపీసీసీ పవర్ పాయింట్ ప్రజెంటేషన్



బుధవారం గాంధీభవన్‌లో విద్యుత్ అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను తిలకిస్తున్న పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి. చిత్రంలో వీహెచ్, షబ్బీర్, సుదర్శన్‌రెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మిగులు విద్యుత్, ప్రస్తుతం సాగుకు ఇస్తున్న 24 గంటల కరెంట్ సరఫరా కాంగ్రెస్ ప్రభుత్వాల కృషి ఫలితమేనని పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత చేపట్టిన విద్యుత్ ప్రాజెక్టుల్లో ఒక్క యూనిట్ విద్యుత్ అయినా ఉత్పత్తి చేశారా అని నిలదీశారు. ఒక్క యూనిట్ కూడా ఉత్పత్తి చేయకుండానే మిగులు విద్యుత్ ఎలా సాధించారో చెప్పాలన్నారు. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక ప్రారంభించిన యాదాద్రి, భద్రాద్రి విద్యుత్ ప్రాజెక్టుల్లో నేటికీ పనులు కూడా ప్రారంభం కాలేదన్నారు. విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందాల్లో పెద్దఎత్తున అక్రమాలు జరిగాయని దుయ్యబట్టారు. బుధవారం గాంధీభవన్‌లో విద్యుత్ అంశంపై పీసీసీ ఆధ్వర్యంలో విద్యుత్ అంశంపై ఏర్పాటు చేసిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో ఉత్తమ్ మాట్లాడారు. ''రాష్ట్రంలో ప్రైవేట్ విద్యుత్ కొనుగోళ్ల ద్వారా కోట్లు దండుకునేందుకే జెన్‌కోను నిర్వీర్యం చేశారు. దీనివల్ల జెన్ రూ.13 వేల కోట్ల అప్పుల్లో కూరుకుపోయింది. ఉమ్మడి రాష్ట్రంలో దేశానికే ఆదర్శంగా నిలుస్తూ 85 శాతం విద్యుత్ ఉత్పత్తి చేసిన జెన్‌కో.. ఇప్పుడు 69 శాతం ఉత్పత్తికే పరిమితమైంది. తెలంగాణలో గత ప్రభుత్వ హయాంలోనే భూపాలపల్లి ఫేజ్–1, ఫేజ్–2, కొత్తగూడెం, జూరాల, పులిచింతలలో విద్యుత్ ఉత్పత్తికి కావాల్సిన చర్యలు తీసుకున్నాం. ఛత్తీస్‌గఢ్, ఇతర సంస్థల నుంచి కొనుగోలు చేసిన విద్యుత్‌ను ఇక్కడి ఉత్పత్తి సామర్థ్యంలో కలిపి చూపిస్తున్నారు'' అని విమర్శించారు.

14 వేల మెగావాట్లకు ఎలా చేరింది..

రాష్ట్రంలో 6,500 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 14 వేల మెగావాట్లకు ఎలా చేరిందని షబ్బీర్ అలీ ప్రశ్నించారు. వచ్చే ఏడాది నాటికి 28 వేల మెగావాట్లకు ఎలా చేరుకుంటుందో సీఎం ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో ప్రజలపై కరెంట్ భారం పడబోతోందని హెచ్చరించారు. ఛత్తీస్‌గఢ్‌తో లోపభూయిష్ట ఒప్పందం కుదుర్చుకున్నారని, బహిరంగ మార్కెట్‌లో యూనిట్ ధర రూ.3.50 నుంచి రూ.4 ఉంటే.. ప్రభుత్వం మాత్రం రూ.6 చెల్లిస్తోందని, దీంతో ప్రజలపై ఏటా రూ.1,200 కోట్ల భారం పడుతుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దాసోజు శ్రవణ్ పేర్కొన్నారు.

కొత్తగా 26 ప్రభుత్వ బ్లడ్ బ్యాంకులు

పేదలకు సేవలందించేలా ఆస్పత్రుల్లో నిర్మాణం

సాక్షి, హైదరాబాద్: బాలింతల ఆరోగ్య పరిరక్షణలో వైద్య, ఆరోగ్యశాఖ మరో ముందడుగు వేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుత అవసరాలకు తగినట్లుగా బ్లడ్ బ్యాంకులను ఏర్పాటు చేస్తోంది. ఉత్తమ ప్రమాణాలతో కూడిన రక్తాన్ని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటోంది. కొత్తగా 26 బ్లడ్ బ్యాంకులను ఏర్పాటు చేస్తోంది. అందులో జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్ఎం) ఆధ్వర్యంలో 13, వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో మరో 13 బ్లడ్ బ్యాంకులను ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రంలో ఎన్‌హెచ్ఎం ఆధ్వర్యంలో బ్లడ్ బ్యాంకులను ఏర్పాటు చేయడం ఇదే తొలిసారి. భూపాలపల్లి, అచ్చంపేట, మల్కాజ్‌గిరిలోని బ్లడ్ బ్యాంకులను జనవరి 15న ప్రారంభించేందుకు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఈ 26 కొత్త బ్లడ్ బ్యాంకుల్లో 6 నెలల్లోపు పూర్తి స్థాయి సేవలు ప్రారంభం కానున్నాయి. పేదలకు ఉపయోగపడేందుకు వీలుగా ప్రభుత్వ ఆస్పత్రుల ప్రాంగణంలోనే వీటి నిర్మాణం జరుగుతోంది. కాన్పు సమయంలో అధిక రక్తస్రావం జరిగే సందర్భాల్లో ఒక్కోసారి 2 నుంచి 10 యూనిట్ల వరకు రక్తం అవసరమవుతోంది. సరిపడా రక్తం అందుబాటులో లేకపోవడం వల్ల కొన్నిసార్లు బాలింత మరణాలు సంభవిస్తున్నాయి. దీంతో ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే బ్లడ్ బ్యాంకులను ఏర్పాటు చేస్తున్నారు.

కొత్త బ్లడ్ బ్యాంకులు

జాతీయ ఆరోగ్య మిషన్: మలక్‌పేట, నాంపల్లి, నారాయణపేట్, అచ్చంపేట, మల్కాజ్‌గిరి, షాద్‌నగర్, బాన్సువాడ, భైంసా, పెద్దపల్లి, పరకాల, భూపాలపల్లి, ఏటూరునాగారం, మంథని.

రాష్ట్ర వైద్య విధాన పరిషత్: నాగర్‌కర్నూల్, ఘట్‌కేసర్, కొండాపూర్, మెదక్, బోధన్, ఉట్నూరు, ఆసిఫాబాద్, గోదావరిఖని, నర్సంపేట, మహబూబాబాద్, ములుగు, భువనగిరి, కింగ్‌కోఠి (హైదరాబాద్).

పార్వతి పరార్!

గజల్ శ్రీనివాస్ కేసులో రెండో నిందితురాలు

సాక్షి, హైదరాబాద్: గాయకుడు గజల్ శ్రీనివాస్ ఓ మహిళను లైంగిక వేధింపులకు గురిచేసిన కేసులో రెండో నిందితురాలిగా ఉన్న పార్వతి పరారీలో ఉంది. ఆమెకు నోటీసులు జారీ చేయడానికి పంజాగుట్ట పోలీసులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. గజల్ శ్రీనివాస్ లైంగిక వేధింపులకు సహకరించిన పార్వతి.. శ్రీనివాస్ చెప్పినట్లుగా వినాలని బాధితురాలిపై ఒత్తిడి తీసుకువచ్చిందని ప్రధాన ఆరోపణ. మంగళవారం ఉదయం పోలీసులు శ్రీనివాస్‌ను అరెస్టు చేయగా.. ఆ రోజు సాయంత్రం వరకు కూడా పార్వతి సేవ్ టెంపుల్స్ సంస్థ కార్యాలయం వద్ద ఉంది. గజల్ శ్రీనివాస్ తనకు తండ్రిలాంటి వాడని, 20 ఏళ్లుగా తాను అక్కడే పనిచేస్తున్నా ఎలాంటి ఇబ్బందులు రాలేదని మీడియాకు చెప్పింది. బాధితురాలు ఎందుకు ఫిర్యాదు చేసిందో అర్థం కావడం లేదనీ పేర్కొంది. కానీ బాధితురాలు చేసిన స్టింగ్ ఆపరేషన్ వీడియోలు మంగళవారం సాయంత్రం బయటకు వచ్చాయి. అందులో పార్వతి, గజల్ శ్రీనివాస్‌ల రాసలీలలు స్పష్టంగా కనిపించాయి. ఆ తర్వాతి నుంచి పార్వతి అజ్ఞాతంలోకి వెళ్లిపోయింది. ఈ కేసులో నిందితురాలిగా ఉన్న ఆమెకు నోటీసులు ఇచ్చేందుకు పంజాగుట్ట పోలీసులు ప్రయత్నించినా ఆచూకీ దొరకలేదు. ఆమె సెల్‌ఫోన్ సైతం స్విచ్ఛాఫ్ చేసి ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. దీంతో పార్వతి ఆచూకీ కోసం సేవ్ టెంపుల్స్ కార్యాలయం, ఆమె ఇల్లు, స్నేహితుల వద్ద ఆరా తీస్తున్నారు.

బాధితురాలి సాహసంపై సోషల్ మీడియాలో ప్రశంసలు

గజల్ శ్రీనివాస్‌కున్న పెద్దమనిషి ముసుగు తొలగించడానికి, ఆయన నిజ స్వరూపం బయటపెట్టడానికి స్టింగ్ ఆపరేషన్ చేసిన బాధితురాలిపై సోషల్ మీడియాలో ప్రశంసల జల్లు కురుస్తోంది. అంతటి సాహసం చేసిన ఆమెకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలంటూ అభిప్రాయం వెలిబుచ్చుతున్నారు. కాగా.. 'సాక్షి'తో మాట్లాడిన బాధితురాలు.. తనకు ఎదురైన చేదు అనుభవాలు వివరించారు. వెంటనే స్పందించిన పోలీసులు తనకు ఎంతో ధైర్యం ఇచ్చారంటూ ధన్యవాదాలు తెలిపారు.

కస్టడీపై నేడు నిర్ణయం

విచారణ నిమిత్తం గజల్ శ్రీనివాస్‌ను తమ కస్టడీకి అప్పగించాలంటూ పోలీసులు నాంపల్లి కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై బుధవారం వాదనలు ముగిశాయి. న్యాయస్థానం గురువారం తీర్పు వెలువరించనుంది. ఇక అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన గజల్ శ్రీనివాస్‌పై సేవ్ టెంపుల్స్ సంస్థ వేటు వేసింది. ఆయనను బ్రాండ్ అంబాసిడర్‌గా తొలగించినట్లు సంస్థ అధ్యక్షుడు ప్రకాశ్‌రావు వెలగపూడి ఓ ప్రకటన విడుదల చేశారు. తమ సంస్థ కార్యాలయాలను దేవాలయాలుగా పరిగణిస్తామని, అక్కడ పనిచేసే మహిళల్ని తాము గౌరవంగా చూసుకుంటామని పేర్కొన్నారు.

సీఎంవి పచ్చి అబద్ధాలు: లక్ష్మణ్



సాక్షి, హైదరాబాద్: రైతులకు నిరంతర విద్యుత్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చేసిందేమీ లేదని, కేంద్రం చొరవ వల్లనే ఇది సాధ్యమైందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ పేర్కొన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత అదనంగా ఒక్క మెగావాట్ విద్యుత్ కూడా ఉత్పత్తి చేయలేకపోయిన రాష్ట్ర ప్రభుత్వం అబద్ధపు ప్రకటనలతో మోసం చేసేందుకు యత్నిస్తోందని ఆరోపించారు. ప్రధాని కృషి ఫలితంగా ఏకంగా 19 రాష్ట్రాల్లో మిగులు కరెంటు ఉండేలా చేశారని, అందులో తెలంగాణ కూడా భాగమన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్రం చొరవతో రాష్ట్రంలో 3,500 మెగావాట్ల ఉత్పత్తికి ఆస్కారం ఏర్పడిందని, విద్యుదుత్పత్తి కోసం రాష్ట్రానికి రుణసాయం పెంచటం, నార్త్–సౌత్ గ్రిడ్ అనుసంధానం, ఉదయ్ పథకంలో రాష్ట్రం చేరేలా చేయటం తదితర చర్యల వల్లనే ఇది సాధ్యమైందని లక్ష్మణ్ స్పష్టం చేశారు. ఈ వాస్తవాలను పక్కన పెట్టి కేవలం తన ఘనత వల్లనే నిరంతర విద్యుత్ సాధ్యమైందన్నట్టుగా కేసీఆర్ చెప్పుకుంటున్నారని, కాగా, తెలంగాణలోనూ అధికారం సాధిస్తామని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కైలాశ్ ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలోనూ పార్టీని బలోపేతం చేస్తున్నామన్నారు.

క్వాలిటీ మేరకే ఆ రేటు!

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి, హైదరాబాద్: పాఠశాల విద్యాశాఖకు సరఫరా చేసిన డ్యుయల్ డెస్కుల పరిమాణం, నాణ్యతను బట్టే రూ. 5,050 ధరను నిర్ణయించామని చర్లపల్లి జైలు సూపరింటెండెంట్ అర్జునరావు తెలిపారు. 'సబ్బు బిళ్ల.. స్కూలు బల్ల.. కాదేదీ అవినీతికి అనర్హం!'శీర్షికన బుధవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. పాఠశాల విద్యా శాఖ సూచించిన ప్రమాణాల ప్రకారమే డెస్కులను తయారు చేశామన్నారు. డ్యుయల్ డెస్కుల ధరలను చర్లపల్లి సెంట్రల్ జైలే నిర్ణయించిందని పాఠశాల విద్యా కమిషనర్ కిషన్ తెలిపారు.

వెటర్నరీ అసిస్టెంట్ 'జిల్లా' వెబ్ ఆప్షన్లకు అవకాశం

సాక్షి, హైదరాబాద్: వెటర్నరీ అసిస్టెంట్ పోస్టుల భర్తీలో భాగంగా సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరైన అభ్యర్థుల్లో కొందరు జిల్లాల ప్రాధాన్యాత ఆప్షన్లు, ఖాళీ పీడీఎఫ్‌లను సమర్పించారని టీఎస్‌పీఎస్సీ తెలిపింది. దీంతో జిల్లాల ప్రాధాన్యాలపై వెబ్ ఆప్షన్లకు మరోసారి అవకాశం ఇవ్వనున్నట్లు పేర్కొంది. అభ్యర్థులు ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు ఆప్షన్లు ఇచ్చుకోవాలని సూచించింది.

సీబీఐపీ అవార్డు అందుకున్న ట్రాన్స్‌కో సీఎండీ

సాక్షి, న్యూఢిల్లీ: విద్యుత్ సరఫరా రంగంలో తెలంగాణ ట్రాన్స్‌కోను అగ్రగామిగా నిలిపిన సంస్థ సీఎండీ డి.ప్రభాకర్‌రావుకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇరిగేషన్ అండ్ పవర్ (సీబీఐపీ) అవార్డు దక్కింది. సీబీఐపీ వార్షిక అవార్డుల ప్రదానోత్సవం బుధవారం ఢిల్లీలో జరిగింది. కేంద్ర మంత్రులు రాజ్‌కుమార్ సింగ్, సత్యపాల్ సింగ్, సీబీఐపీ అధ్యక్షుడు రవీంద్రకుమార్ వర్మ చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు. మూడున్నరేళ్లలో తెలంగాణలో కొత్తగా 514 సబ్‌స్టేషన్లు, 1,724 పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, 19,154 కి.మీ మేర కొత్త లైన్లు నిర్మించి మెరుగైన విద్యుత్ సరఫరాకు ఆయన కృషి చేశారు. రాష్ట్ర తలసరి విద్యుత్ వినియోగం జాతీయ సగటును మించినా కూడా అవాంతరాలు లేకుండా సరఫరా వ్యవస్థను తీర్చిదిద్దారు.

కీలక జీవోలో అన్నీ తప్పులే

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే అధికారిక ఉత్తర్వులు తప్పుల తడకగా ఉంటున్నాయి. ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం గజ్వేల్‌లో ప్రస్తుతం 50 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఉంది. దీన్ని 100 పడకల సామర్థ్యానికి పెంచేందుకు అనుమతిస్తూ వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారీ ఉత్తర్వులు జారీ చేశారు. హెల్త్ సెంటర్ అభివృద్ధి చేసేందుకు రూ.21 కోట్లను మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే ఈ ఉత్తర్వులో అన్ని విషయాలూ తప్పుగానే ఉన్నాయి. గజ్వేల్ మెదక్ జిల్లాలో ఉందని పేర్కొన్నారు. ఉత్తర్వులో మరికొన్ని తప్పులు చేశారు. గజ్వేల్ జిల్లాగా ఉన్నట్లుగా పేర్కొన్నారు. ఇలా కీలకమైన జీవోలో అన్ని తప్పులే ఉండడం అందరినీ విస్మయానికి గురి చేసింది.

మార్గదర్శకాల ప్రకారమే కాలుష్య నియంత్రణ

సాక్షి కథనానికి ఎయిర్‌పోర్టు నిర్వహణ సంస్థ జీఎంఆర్ వివరణ

సాక్షి,హైదరాబాద్: కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ, కాలుష్య నియంత్రణ మండలి, డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) మార్గదర్శకాల ప్రకారమే విమానాల కాలుష్యం (ఏరోసాల్స్)ను నియంత్రిస్తున్నట్లు ఎయిర్‌పోర్టు నిర్వహణ సంస్థ జీఎంఆర్ తెలిపింది. 'ఎగిరే లోహవిహంగం ఈ నగరం'శీర్షికతో బుధవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఈ సంస్థ వివరణ ఇచ్చింది. విమానాశ్రయం పరిసరాల్లో వాయు కాలుష్యాన్ని లెక్కించే యంత్రాంగం నిరంతరం పనిచేస్తుందన్నారు. నైట్రోజన్ ఆక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్, సల్ఫర్ డయాక్సైడ్, సూక్ష్మ,స్థూల ధూళికణాలను లెక్కించేందుకు వేర్వేరు యంత్ర పరికరాలు ఏర్పాటు చేశామన్నారు.

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
గురువారం ॥ 4-1-2018



అమ్మ కావాలి

● ఐశ్వర్యారాయ్



● సంగీత్ కుమార్

పాపం ఆ 'పిల్లవాడు' అమ్మకోసం అలమటిస్తూ రెండు రోజులుగా వైజాగ్ వీధుల్లో తిరుగుతున్నాడు. వాడి చేతిలో ఒక సెల్‌ఫోన్ ఉంది. ఆ ఫోన్‌లో వాడి చిన్నప్పటి ఫొటో ఉంది. కనిపించిన వారందరికీ ఆ ఫొటో చూపిస్తున్నాడు. 'ఇది నేనే' అంటున్నాడు. ''నువ్వు సరే. మీ అమ్మ ఎక్కడుందీ?'' అని అడిగితే.. ''ముంబైలో'' అని చెబుతున్నాడు. ''ఎవరు మీ అమ్మ?'' అని అడిగితే ''ఐశ్వర్యారాయ్'' అంటున్నాడు. 'అయ్యో.. వీడికి ఆమ్ ఎవరు పెడతారు? లాల ఎవరు పోస్తారు?' అని బాధపడకండి. వాడి వయసు 29 ఏళ్లు. వాళ్ల అమ్మ ఐశ్వర్యారాయే వాడికి సంగీత్ కుమార్ అని పేరు పెట్టిందట! ఇదేం చోద్యం అని వైజాగ్ పౌరులు సంగీత్‌ని అనుమానంగా చూస్తున్నారు. ''అలా చూడకండి, నాకు బాధేస్తుంది. నన్ను నమ్మండి. మా అమ్మకి నేను 'ఐవీఎఫ్' ద్వారా 1988లో పుట్టాను. లండన్‌లో మా అమ్మ నన్ను ప్రసవించింది. మొదటి రెండేళ్లు మా అమ్మ వాళ్ల అమ్మానాన్నల దగ్గర నేను పెరిగాను'' అని ఆవేదనగా అంటున్నాడు సంగీత్! తల్లికి పదిహేనేళ్ల వయసులో ఈ కొడుకు పుట్టి ఉంటాడని లాజికల్‌గా చెప్పుకున్నా అతడి దగ్గర చాలా ప్రశ్నలకు సమాధానాలు లేవు. ఊరికే.. 'ఐశ్వర్య మా అమ్మ.. ఐశ్వర్య మా అమ్మ' అంటూ తిరుగుతున్నాడు! ఎందుకైనా మంచిదని జనం అతణ్ణి తప్పుకుని తిరుగుతున్నారు.

జేమ్సా? హ్యారీనా?



డైలమాలో బ్రిటన్ రాకుమారి: మేఘన్ మార్కల్



● ప్రిన్స్ హ్యారీ, మేఘన్ మార్కల్

హాలీవుడ్‌ని వదిలేసి, ప్రిన్స్ హ్యారీని పెళ్లి చేసుకుని బ్రిటన్ వెళ్లిపోవాలని డిసైడ్ అయిన అమెరికన్ నటి మేఘన్ మార్కల్‌ని.. హాలీవుడ్ మాత్రం వదులుకునేందుకు సిద్ధంగా లేనట్లుంది! టీవీలో 'సూట్స్' అనే లీగల్ డ్రామా సిరీస్‌లో 'రేచల్ జేన్'గా ఆడియెన్స్‌ని ఇంప్రెస్ చేసిన మార్కల్‌ని జేమ్స్ బాండ్ గర్ల్‌గా తీసుకునేందుకు ఆ సినిమా నిర్మాతలు ఉవ్విళ్లూరుతున్నారు. అయితే మార్కల్ ఆల్రెడీ వాళ్లకు 'నో' అని చెప్పేశారు. ఈ ఏడాది మే 19న మార్కల్, ప్రిన్స్ హ్యారీల వివాహం. పెళ్లి పనులు కూడా ఆల్రెడీ మొదలైపోయాయి. ఆ లోపే నటిగా తన షెడ్యూళ్లన్నింటినీ పూర్తి చేసుకుని, కొత్త ఒప్పందాలేవీ ఒప్పుకోకూడదని మార్కల్ నిర్ణయించుకున్నారు. అయితే ఇప్పుడు 25వ బాండ్ మూవీకి ఆమె పేరు షార్ట్‌లిస్ట్ అయింది! ఆమె 'నో' అంటున్న కొద్దీ వాళ్లు 'ప్లీజ్' అంటున్నారు. అందులో బాండ్‌గా నటించబోయే డేనియల్ క్రెయిగ్ పక్కన బాండ్ గర్ల్‌గా 36 ఏళ్ల మార్కల్ అయితే బాగుంటుందని ప్రొడ్యూసర్లు ముచ్చట పడుతున్నారు మరి. జేమ్స్ బాండ్ సిరీస్‌లోని 24వ చిత్రం 'స్పెక్టర్' 2015లో విడుదలైంది. స్పెక్టర్ అంటే.. వెంటాడే భయం. అంత మంచి చాన్స్‌ను మిస్ చేసుకోకూడదని మార్కల్ అనుకుంటే.. కొత్త పెళ్లి కూతురు కారణంగా బాండ్ మూవీ షూటింగ్‌కి, షూటింగుల కారణంగా వీళ్ల కొత్త దాంపత్యానికీ 'స్పెక్టర్'లాంటి ప్రాబ్లం ఏదైనా తప్పకపోవచ్చు. చూడాలి! బాండ్ గెలుస్తాడా? బాండింగ్ నిలుస్తుందా?

సెటైరమ్మా.. సెటైరూ..!

త్వరలో సెల్ఫీ ఎక్స్‌పర్ట్‌లు!

ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ)కి కొత్త సమస్య వచ్చి పడింది! కొత్తది సరే. పాతది ఏంటో? తాజ్‌మహల్‌ను చూడ్డానికి వచ్చేవాళ్ల సంఖ్య పెరిగిపోతోందట! దాని వల్ల నష్టం ఏంటి? చేతులతో టచ్ చెయ్యడం వల్ల అరిగిపోతోందట. అరిగిపోయి, అసలు రూపం 'డిమ్' అయిపోతోందట! పౌర్ణమి నాడు కూడా తాజ్‌లో బ్రైట్‌నెస్ కనిపించడం లేదట. ఇక కొత్త సమస్య ఏంటి? సెల్ఫీలు! తాజ్ దగ్గరికి వచ్చేవాళ్లెవరూ తాజ్ మహల్‌ను చూడ్డానికి రావడం లేదనీ, తాజ్‌తో కలిసి సెల్ఫీలు తీసుకోడానికి మాత్రమే వస్తున్నారని ఏఎస్ఐ వాపోతోంది. సెల్ఫీలు తీసుకుంటే వాళ్లకేమిటి నష్టం? తాజ్ అరిగేం పోదు కదా! 'పోదు నిజమే కానీ, సెల్ఫీలీ తీసుకున్నవాళ్లు ఊరికే ఉంటున్నారా? వాటిని ఎఫ్‌బీల్లో, ట్వీటర్‌లో, ఇన్‌స్టాగ్రామ్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. చేతయ్యీ చేతకాక తీసిన ఫొటోలలో తాజ్ మహల్ వంకర టింకరగా, ఒక ప్రపోర్షన్ లేకుండా పోవడంతో ఇంటర్నేషనల్‌గా తాజ్ మీద ఇంట్రెస్ట్ తగ్గిపోతోంది. తాజ్ ఇమేజ్‌కి డ్యామేజ్ జరుగుతోంది'' అని ఏఎస్ఐ హెడ్డు ఫీలవుతున్నారు. ఏమిటి దీనికి సొల్యూషన్. ఏఎస్ఐ వాళ్లే కొంతమంది సెల్ఫీ ఎక్స్‌పర్ట్‌లను పెట్టి వచ్చినవాళ్లందరికీ ఫొటోలు తీయించడమే. అప్పుడు ప్రతి ఫొటోలోనూ, తాజ్‌తో పాటు సెల్ఫీ ఎక్స్‌పర్ట్ కూడా ఉంటాడేమో!





బాధ అన్నది ఆకలైతే
ఫుడ్ అన్నది ఆనందం ఇస్తుంది.
ఆనందం అన్నది దుఃఖం లాగే
మన శరీరంలో కలిగే ఒక రసాయనిక చర్య.
మనం ఆనందంగా ఉండాలనుకుంటే
పాజిటివ్‌గా ఉండాలనుకుంటే
సంతోష రసాయనాలు స్రవిస్తాయి.
సో... ఆనందం అన్నది
మన చేతుల్లోనే ఉంది.
ఏదీ... చెయ్యి చాపండి
ఒక హ్యాపీ పీస్ అందుకోండి.

ఆహాహ్హాహారం



సంతోషం సగం బలం మాత్రమే కాదు... ఇప్పుడు సంతోషం సంపూర్ణ బలం. ఈ రోజుల్లో రకరకాల ఆర్థిక, సామాజిక కారణాలతో సంతోషం దొరకడం చాలా కష్టమైపోతోంది. పైగా న్యూ ఇయర్ వచ్చి జస్ట్ నాలుగు రోజులే. మిగిలిన 360 రోజులూ... ఆపైన బతికి ఉన్న మిగతా రోజుల్లోనూ కావాల్సింది కూడా సంతోషమే. అప్పుడు బతుకు ఆనందమానందమానందమే అనిపిస్తుంది. మరి అలాంటి ఆనందం పొందేదెలా? చాలా సింపుల్. ఈ కథనం చదివితే చాలు.

- ఆనందాన్ని ఇచ్చే ఈ ఆహారాలన్నీ కేవలం సంతోషం కోసం మాత్రమే గాక పక్షవాతం, గుండెపోటు, మతిమరపు (డిమెన్షియా) వచ్చే ముప్పును 30 శాతానికి పైగా తగ్గిస్తాయని అనేక అధ్యయనాల్లో తేలింది.
- ఎండార్ఫిన్ ప్రధాన సోర్స్ పాయింట్ వ్యాయామం. మనం బాగా వ్యాయమం చేశాక మనలో ఒక సంతోషం నెలకొన్న భావన కలుగుతుంది. సాధారణంగా వ్యాయామం చేసే వాళ్లు, అంతా పూర్తయ్యాక ఒక తృప్తికరమైన, సంతోషకరమైన ఫీలింగ్‌లోనే ఉంటారు. అలా అనుభూతి కలిగించేది ఈ ఎండార్ఫినే! ఈ రకంగా చూస్తే సంతోషానికి మరో సోర్స్ ఎండార్ఫిన్ రూపంలో ప్రధానంగా జిమ్‌లో ఉంటుందన్నమాట.

ఆనందం అనేది మరెక్కడో లేదు. మన మెదడులోనే ఉంటుంది. ఇదేదో వ్యక్తిత్వ వికాస ఉపన్యాసంలోని గంభీరమైన మాటో లేదా ఆధ్యాత్మిక ప్రవచనంలోని బ్రహ్మాండమైన వాక్యమో కాదు. అవును ఆనందం అన్నది అక్షరాలా మన మెదడులోనే ఉంటుంది. అక్కడ కొన్ని స్రావాలు రూపంలో సంతోషం ప్రవహిస్తూ ఉంటుంది. ఆ స్రావాల ఊరుతూ, పెరుగుతున్నకొద్దీ సంతోషం కట్టలు తెంచుకుంటుంది. సంతోషాన్ని కలిగించే ఆ మెదడు స్రావాల్లో కొన్ని సెరిటోనిన్, ఎండార్ఫిన్, డోపమైన్, ఫినైల్ ఇథిలమైన్ అనే రసాయనాలు. అవి స్రవించడానికి దోహదపడేవి మనం దాదాపుగా రోజూ తీసుకునే ఆహార పదార్థాలు. అవేమిటో తెలుసుకుంటే సంతోషాన్ని హ్యాపీగా కొనుగోలు చేయవచ్చు కదా. అవేమిటో ఎక్కడ దొరుకుతాయో చూద్దాం.

ఒక సంతోష స్రావం సెరిటోనిన్

పొద్దున్నే గిన్నెలో కాచీ కాచగానే... జాయ్ అనేది చాయ్ రూపంలోనో లేదా కాఫీ అనే మారువేషంలోనో మొదట గ్లాసులోకి జర్రున జారుతుంది. తర్వాత చుర్రున కాలుతూ నోట్లోకి చేరుతుంది. అక్కణ్నుంచి మెల్లగా హాయిగా గొంతులోకి దిగుతుంది. దాంతో మెదడులో సంతోషం సర్రున పారుతుంది. అది పాల రూపంలో. దీనికి సోర్స్ పాయింట్ మన పాలపార్లర్లు. ఇక మన కాలనీలోకి వచ్చే తోపుడు బండి మీద కూడా సంతోషం గుట్టలు గుట్టలుగా పేర్చి ఉంటుంది పైనాపిల్ రూపంలో! అరటిపండ్ల రూపంలో గెలలుగా వేలాడుతూనూ ఉంటుంది. ఎలాగంటారా? ఈ అన్నిట్లో సెరిటోనిన్ ఉంటుంది.

ఏంటా సెరిటోనిన్... ఏమా



కథ: మనకు సంతోష భావనను ఇచ్చే రసాయనాల్లో ముఖ్యమైనది సెరిటోనిన్. అందుకే దీన్ని 'హ్యాపీనెస్ హార్మోన్' అని కూడా అంటారు.

ఎక్కడెక్కడ దొరుకుతుంది: పాలలో ట్రిప్టోఫాన్ అనే అమైనో ఆసిడ్ ఉంటుంది. అది సెరిటోనిన్ స్రావం పెరిగేలా చేస్తుంది. ద్రాక్ష, నారింజల్లోనూ ట్రిప్టోఫాన్ ఎక్కువే. వెన్నలో, విటమిన్ బి6 లభించే పొట్టుతో ఉండే ఆహారధాన్యాలు, బఠాణీలు, కాలీఫ్లవర్, అవకాడోలో, గుమ్మడిగింజల్లో సెరిటోనిన్ పుష్కలంగా ఉంటుంది. ఉచితంగా ప్రతిరోజూ ప్రతి ఒక్కరికీ సెరిటోనిన్ లభించే మార్గం సూర్మరశ్మి. ఎక్కువగా నవ్వేవాళ్లలో సెరిటోనిన్ అధికంగా విడుదలవుతుంది. ఇక కాలేయం, కిడ్నీ, తాజామాంసం, కోడిమాంసంతో పాటు ఇటు క్యాబేజీ, బ్రకోలీ వంటివి కూడా సెరిటోనిన్ స్రవించేందుకు దోహదపడతాయి. ఇక ఒమెగా 3 ఫ్యాటీ ఆసిడ్స్ ఎక్కువగా ఉండే అవకాడో, వాల్‌నట్‌లూ సెరిటోనిన్‌కు సోర్స్‌లే.

ఇంకో సంతోష స్రావం డోపమైన్

మీరు చాలాకాలం తర్వాత కలిసిన ఆ ఫ్రెండ్‌ను చూసి ఆనందోద్వేగాలకు లోనవుతున్నారా? దానికి కారణం మన మెదడులో స్రవించే డోపమైన్.

ఏమిటా డోపమైన్ : ఇది మన మెదడు చురుగ్గా ఉంచేలా చేసే రసాయనం. ఏదైనా సంతోషం కలిగినప్పుడు దాంతోపాటు మనలోకి ప్రవేశించే ఆ చురుకుదనానికి కారణం డోపమైన్. అలాగే ఏదైనా వేదన లేదా బాధ కలిగించే పరిస్థితి వచ్చినప్పుడు దాన్ని ఎదుర్కోడానికి తగిన చురుకుదనాన్ని ఇచ్చేది కూడా ఇదే.

ఎక్కడెక్కడ దొరుకుతుంది: ఇది కూడా అరటిపండ్ల బండి మీదే దొరుకుతుంది! పక్వానికి వచ్చిన అరటిపండులో టైరోసిన్ అనే అమైనో యాసిడ్ పాళ్లు ఎక్కువ. ఈ అమైనోఆసిడ్... డోపమైన్ రసాయనాన్ని స్రవించేలా చేస్తుంది. బీట్‌రూట్ డోపమైన్‌తో పాటు సెరిటోనిన్‌నూ స్రవించేలా చేస్తుంది. నువ్వులు, స్ట్రాబెర్రీలలో టైరోసిన్ చాలాఎక్కువ కావడంతో ఇవీ డోపమైన్‌ను విడుదలయ్యేలా చేస్తాయి. తాజా చికెన్ కూడా నార్‌ఎపీనెఫ్రిన్ అనే న్యూరోట్రాన్స్‌మిటర్‌తో పాటు డోపమైన్ స్రావానికి దోహదపడుతుంది. వెన్నలోని ప్రొటీన్‌లో ఉండే అమైనో ఆసిడ్స్ సైతం డోపమైన్‌ను స్రవించేలా చేస్తాయి. వెజిటేరియన్లను మినహాయిస్తే నాన్-వెజ్ ప్రియులకు ఇది మాంసం దుకాణాల్లోనూ, పెద్ద పెద్ద మాల్స్‌లోని నాన్-వెజ్ ఆహారాలు విక్రయించే కార్నర్‌లోనూ దొరుకుతుంది. ఎందుకంటే ఇది మాంసాహారం, గుడ్లు, చేపలు, సీఫుడ్స్‌లో ఉంటుంది.



మరో సంతోష రసాయనం ఫినైల్

ఇథిలమైన్ : మీ ఆత్మీయులను చూడగానే మీ ముఖం ఆనందంతో ఎందుకు వికసిస్తుంది? మీలో చాలా ఉల్లాసపూరితమైన సంతోషభావన ఎందుకు కలుగుతుంది? ఇందుకు కారణం 'ఫినైల్ ఇథిలమైన్' అనే మరో మెదడు రసాయనం.

ఎక్కడెక్కడ దొరుకుతుంది: చాక్లెట్ అనేది ఒక సంతోషసాగరం. చాలా ఆనందాలకు చాక్లెట్ మూలం. అలాగే ఫినైల్ ఇథమైన్‌కు కూడా ప్రధాన వనరు చాకోలెటే. అందుకేనేమో... కొత్తగా ఫ్రెండ్‌షిప్ ఏర్పడినప్పుడు చాకోలెట్స్ ఇచ్చిపుచ్చుకుంటారు. చాకోలెట్‌లో ఉండే ఫినైల్ ఎథిలమైన్ మూడ్స్‌ను చక్కదిద్దుతుంది. మరింత ఆహ్లాదకరంగా మారుస్తుంది. అందులోని కెఫిన్ మనసును ఉత్తేజ పరుస్తుంది. అలాగే న్యూరోట్రాన్స్‌మిటర్ అయిన సెరిటోనిన్‌ను కూడా చాకోలెట్ స్రవింపజేస్తుంది. డార్క్ చాక్లెట్స్ వల్ల ఈ ప్రయోజనాలు ఒనగూరుతాయి.

మరో ఆనంద స్రావం ఎండార్ఫిన్

సపోజ్... ఏదో సమస్య మీలో బోల్డంత ఒత్తిడి కలుగుతూ మీకు బాధ కలిగిస్తోందనుకుందాం. అకస్మాత్తుగా ఒక పరిష్కారం దొరికి ఆ ఒత్తిడంతా తొలగిపోయినప్పుడు కలిగే సంతోషాన్ని గుర్తుతెచ్చుకోండి. హాయైన ఆ భావన కలగజేసే రసాయనమే ఎండార్ఫిన్. మనలో ఒత్తిడి కొండలా పేరుకుపోయిన ఉన్నప్పుడు ఆ గుట్టను పక్కకు తీసిన భావననిస్తూ మనలో యాంగ్జైటీని తొలగించే రసాయనం ఇది. దాంతో ఇది స్రవించినప్పుడు మనలో ఒక 'ఫీల్ గుడ్' భావన కలుగుతుంది. ఏదైనా నొప్పి కలిగినప్పుడు దాని నుంచి ఉపశమనం కలగడానికి దోహదం చేసేది ఎండార్ఫినే.

ఎక్కడెక్కడ దొరుకుతుంది: నిజానికి ఎండార్ఫిన్ ప్రధానంగా లభించేది వ్యాయామంతోనే. అయితే వ్యాయామం తర్వాత ఆహారాల్లో చూస్తే దాని ప్రధాన వనరు చాక్‌లేట్లు. ఆ తర్వాత విటమిన్-సి ఎక్కువగా ఉండే స్ట్రాబెర్రీస్ ఎండార్ఫిన్ స్రావానికి బాగా ఉపయోగపడతాయి. ఇక తియ్యటి ద్రాక్షలో కూడా ఎండార్ఫిన్స్ స్రవించేలా చేసే సామర్థ్యం ఉంది. విటమిన్-సి ఎక్కువగా ఉండే నారింజ, నిమ్మ జాతి పండ్లు సైతం ఎండార్ఫిన్స్‌ను ఎక్కువగా స్రవించేలా చేయగలవు. ఒక్కమాట గుర్తుంచుకోవాలి. ఎండార్ఫిన్ స్రవించాలంటే విటమిన్-సి కావాలి. కాబట్టి నిమ్మజాతి పండ్లు తింటే ఎండార్ఫిన్‌ను తీసుకున్నట్లే. ఇలా చాక్లెట్ల దుకాణంతో పాటు మళ్లీ పండ్ల బండిపైనే ఎండార్ఫిన్ పుష్కలంగా దొరుకుతుంది.



అలాగే విషాదాహారాలూ ఉన్నాయి. అవి ఇవే...

సంతోషాలను ఇచ్చే ఆహారాల్లాగే విషాదాలను కలగజేసే ఆహారాలూ ఉంటాయి. అవి సెరిటోనిన్, డోపమైన్, ఎండార్ఫిన్ స్రావాల్ని తగ్గిస్తాయి. అవేమిటో చూద్దాం. కాఫీ మొదట్లో కాస్తంత ఉత్తేజం కలిగించినా అందులోని మితిమీరిన కెఫిన్ క్లేశాన్ని కలిగిస్తుంది. సిగరెట్‌లోని నికోటిన్. ఆల్కహాల్‌లు కూడా అంటే. నిషేధిత మాదకద్రవ్యాలైతే అకస్మాత్తుగా సెరిటోనిన్, డోపమైన్, ఎండార్ఫిన్ పాళ్లను మొదట ఎక్కువయ్యేలా చేసి, ఆ తర్వాత అవి ఎంత మోతాదులో విడుదల కావాలో అంత మోతాదులో కాకుండా... నియంత్రణ లోపించినట్లుగా విడుదలయ్యేలా చేస్తాయి. దాంతో ఆయా రసాయనాల మధ్య ఉండాల్సిన సమతౌల్యం లోపిస్తుంది. అందుకే ఇవన్నీ తొలుత తాత్కాలికంగా ఆహ్లాదం కలిగించినా... తీవ్రమైన విచారంలో ముంచి, తర్వాత ఆరోగ్యానికీ హాని చేస్తాయి. ప్యాకేజ్‌డ్ ఫుడ్స్‌లోని మోనోసోడియమ్ గ్లుటామేట్, ఐస్‌క్రీమ్స్, డోనట్స్, ఆర్టిఫిషియల్ స్వీటెనర్స్, వైట్‌బ్రెడ్‌లు విషాదం కలిగించే ఆహారాలే.



డాక్టర్ బి. చంద్రశేఖర్‌రెడ్డి
సీనియర్ న్యూరోఫిజీషియన్, సిటీ న్యూరో సెంటర్,
రోడ్ నెం. 12 బంజారాహిల్స్, హైదరాబాద్

చెట్టు నీడ

ముఖ్యమైనవాళ్లు

మీకు తెలిసిన కథే. ఒక వైద్యుడు, ఒక న్యాయవాది, ఒక మతబోధకుడు, ఒక చిన్నపిల్లవాడు ఓ చిన్న విమానంలో ప్రయాణిస్తున్నారు. అనూహ్యంగా విమానంలో ఏదో లోపం తలెత్తింది. లోపల ఉండే నిపుణులు ప్రయత్నించారు కానీ మరమ్మతు చేయలేకపోయారు. చివరికి పైలట్ నుంచి ప్రకటన వెలువడింది. ''నన్ను క్షమించండి. నా చేతుల్లో ఏమీ లేకుండా పోయింది'' అని చెప్తూనే ప్యారాచ్యూట్ నుంచి కిందికి దూకేశాడు. దురదృష్టవశాత్తూ విమానంలో ఇంకా మూడు మాత్రమే ప్యారాచ్యూట్‌లు మిగిలి ఉన్నాయి. వెంటనే వైద్యుడు ఒక ప్యారాచ్యూట్ అందుకున్నాడు. ''నా జీవితం చాలా ముఖ్యమైనది. నేను బతికి ఉండడం చాలా ముఖ్యం. నేను బతికి ఉంటే నా జీవితకాలంలో అనేకమందిని నా వైద్యంతో బతికించవచ్చు'' అని చెప్పి విమానం నుంచి కింది దూకేశాడు.

రెండో ప్యారాచ్యూట్‌ను న్యాయవాది లాగేసుకున్నాడు. ''నేను తెలివైన వాడిని. నా వంటి తెలివైన వాడు లోకానికి అవసరం'' అని నిముషం కూడా ఆలస్యం చేయకుండా దడేల్మని కింది దూకేశాడు.

ఇక మిగిలింది ఒకటే ప్యారాచ్యూట్. మిగిలినవారు ఆ పిల్లవాడు, ఆ మత బోధకుడు. ''త్వరగా ఆ ప్యారాచ్యూట్ తీసుకుని కిందికి దూకెయ్. నేను ఎంతో జీవితాన్ని గడిపాను. నువ్వు చిన్నపిల్లవాడివి నీకింకా చాలా జీవితం ఉంది. నువ్వు బతకాలి, దూకెయ్'' అని తొందరపెట్టాడు మతబోధకుడు.

ఆ బాలుడు మత బోధకునికి ప్యారాచ్యూట్ ఇచ్చి, ''మీరూ దూకేయొచ్చు ఫాదర్. ఇంతక్రితం ఆ న్యాయవాది తీసుకెళ్లింది ప్యారాచ్యూట్ కాదు, నా లెదర్ బ్యాగ్'' అని చెప్పాడు.

తెలివైనవాళ్లమని, ప్రపంచానికి ముఖ్యులం అని అనుకుంటూ తిరిగేవాళ్లు చాలాసార్లు తమను తాము తెలుసుకోవడంలో తప్పటడుగు వేస్తారు. (కథ కోసం ఇందులో కొన్ని వృత్తులను పేర్కొడం జరిగింది తప్ప, ఎవరినీ వేలెత్తి చూపాలన్న ఉద్దేశం లేదు) ●

గుడ్‌ఫుడ్

జీర్ణశక్తిని పెంచే బొప్పాయి!



బొప్పాయి పండుతో ఆరోగ్యానికి సమకూరే ప్రయోజనాల జాబితాకు అంతు లేదు. జీర్ణక్రియకు తోడ్పడటం మొదలుకొని... అది జరిగే సమయంలోనే అందులోని హానికరమైన క్రిములను తుదముట్టించడం వరకు అనేక మేళ్లు చేస్తుంది బొప్పాయి. అందులో కొన్ని...

● బొప్పాయి కంటికి మేలు చేస్తుంది. కంటికి వచ్చే మాక్యులార్ డీజనరేషన్ అనే కంటి జబ్బును నివారిస్తుంది. ● ఎముకలు బలహీనంగా మారే ఆస్టియోఆర్థ్రైటిస్‌ను బొప్పాయి అరికడుతుంది.● బొప్పాయి తినేవారిలో రోగనిరోధక శక్తి ఎక్కువ ● అనేక రకాల క్యాన్సర్లతో బొప్పాయి పోరాడుతుంది ● మహిళల్లో రుతుక్రమాన్ని చక్కబరుస్తుంది.

గర్భవతుల విషయంలో ఒక జాగ్రత్త : పండిన బొప్పాయి గర్భవతులకు మేలే అయినప్పటికీ వారికి బొప్పాయి పెట్టే విషయంలో ఒకింత జాగ్రత్త అవసరం. పూర్తిగా పండనిదీ, లేదా బాగా పచ్చిగా ఉన్న బొప్పాయిలో 'పపాయిన్' అనే ఎంజైమ్ ఉంటుంది. ఇది గర్భసంచిని ముడుచుకుపోయేలా చేసి కొన్నిసార్లు గర్భస్రావానికి దారితీసేలా చేయవచ్చు. అందుకే పచ్చిది, పాక్షికంగా పండినవాటిని మాత్రం వారు తినకూడదు.

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
గురువారం
4-1-2018

యోగా



'చలి'ంచక... చేద్దాం చకచకా

చలికాలం కొన్ని ప్రత్యేకమైన శారీరక ఇబ్బందులకు నిలయం. ముఖ్యంగా కండరాలు బిగువుగా మారడం వలన జాయింట్లు పట్టుకుంటాయి. జీర్ణక్రియ (మెటబాలిక్ రేటు) సహజంగానే తక్కువగా ఉంటుంది. ఆక్సిజన్ సరఫరా, శరీరంలో ఆక్సిజన్ లెవల్స్ తక్కువగా ఉంటాయి. దీనికితోడు డీ హైడ్రేషన్ కూడా ఎక్కువగా ఉంటుంది. వేసవి కాలంలో చెమట ద్వారా ఎక్కువ నీరు బయటకు పోవడం, చలికాలంలో శరీరంలో తగినంత నీరు లేక డీ హైడ్రేషన్‌కు కారణమవుతుంది.. వేసవి కాలంలో నీరుతాగడం ఎంత ముఖ్యమో చలికాలంలో కూడా అంతే అవసరం ఉంటుంది. ఎక్కువగా నీరు తాగడం వలన పెదవులు ఎండిపోవడం, చర్మం పొడి పొడిగా ఉండడం, పగుళ్ల వంటివి నివారించవచ్చు. వీటి వలన జలుబు, దగ్గు గొంతు నొప్పి మంట ఆస్తమా కాళ్లు, చేతులు చల్లబడిపోవడం పొడిచర్మం, గుండెపోటు సమస్యలు ఎక్కువ అవుతాయి. శరీరంలో అన్ని కండరాలతోనూ, జాయింట్స్‌తోనూ పనిచేయడం ముఖ్యం. అందుకు సంబంధించిన అంగచాలనాలు, అంగ బంధనాలు, ఎక్సర్‌సైజులు చేయడం ముఖ్యం. ఆసనాలు చేయడానికి ముందు శరీరాన్ని బాగా సిద్ధం చేయాలి. ప్రాణాయామాలలో మూడు రకాల ప్రాణాయామాలు ఉంటాయి.

1. శీతలీకరణ ప్రాణాయామాలు 2. సమశీతోష్ణ క్రియ ప్రాణాయామాలు 3. ఉష్ణక్రియ ప్రాణాయామాలు

వీటిలో ఉష్ణం జనింపజేసేటువంటి సూర్యబేధి, భస్త్రిక, కపాలభాతి, అగ్నిసార, ఉడ్డియాన ప్రాణాయామాలు చేయాలి. ఆక్సిజన్ తక్కువగా ఉండటం వలన షుగర్ మెటబాలైజ్ కాదు. అందువలన పాల పదార్థాలు, ఐస్‌క్రీమ్స్, స్వీట్లు తినడం మంచిది కాదు. ఇక చలికాలపు సమస్యలకు చెక్‌పెట్టేందుకు చేయాల్సిన ఆసనాల గురించి తెలుసుకుందాం.

1. తాడాసన

సమస్థితిలో నిలబడి చేతులు రెండూ పైకి తీసుకు వెళ్లి ఇంటర్ లాక్ చేయాలి. శ్వాస తీసుకుంటూ మడమలు పైకి తిప్పుతూ ముందరి కాలి వేళ్ల మీద నిలబడి శరీరాన్ని నడుం భాగం నుంచి పూర్తిగా పైకి సాగదీయాలి. శ్వాస వదులుతూ తిరిగి పాదాలు భూమి మీద పూర్తిగా ఆనించి చేతులు ఇంటర్‌లాక్ చేసిన స్థితిలోనే తల మీద పెట్టుకుని కొంచెం రిలాక్స్ అయి, మళ్లీ శ్వాస తీసుకుంటూ పైకి, శ్వాస వదులుతూ కిందకు... 5 లేదా 10 రిపిటీషన్స్ చేయాలి. తొందరపాటు లేకుండా నెమ్మదిగా ప్రశాంతంగా చేయడం చాలా ముఖ్యం.

1

2. కటి చక్రాసన: ఇందులో ఐదారు రకాల ఆసనాలున్నాయి. కాని ఈ క్రియకు సంబంధించినంతవరకూ ఈ ఫొటోల్లో చూపిన కటి చక్రాసనం చాలా ఎఫెక్టివ్‌గా ఉంటుంది. కాళ్ళ మధ్య వీలైనంత దూరం ఉంచి, ముందుకు వంగి శ్వాసతీసుకుంటూ కుడి చెయ్యి ఎడమ పాదానికి దగ్గరగా ఎడమచెయ్యి పైకి, మళ్ళీ శ్వాస వదులుతూ ఎడమవైపుకు ఎడమ చెయ్యి పైకి మళ్ళీ శ్వాస వదులుతూ ఎడమ వైపుకు ఎడమచెయ్యి కుడి పాదానికి దగ్గరగా కుడి చేయిపైకి తీసుకువెళ్ళాలి. ఈ విధంగా కుడికి ఎడమకు 5సార్లు చొప్పున చేయాలి. అవసరమైతే మోకాళ్ళు ముందుకు కొంచెం వంచవచ్చు. సర్వైకల్ స్పాండిలోసిస్ సమస్య ఉంటే చేతులు ఎంతవరకు తీసుకువెళ్లగల్గితే అంతవరకే తీసుకువెళ్లండి.



ఎ.ఎల్.వి కుమార్
ట్రెడిషనల్ యోగా ఫౌండేషన్



2

3. ఊర్ధ్వ మేరు చాలన (వామ దక్షిణ) ఎడమ వైపునకు చాలనం చేసేటప్పుడు కుడి చేతిని పక్క నుంచి పైకి తీసుకెళ్లి మోచేయి పైకి చూపించే విధంగా కుడి అరచేయి ఎడమ భుజంపైకి, ఎడమ చేయి కింద నుంచి నడుం వెనుకకు వచ్చే విధంగా చేయాలి. ఇదే విధంగా మళ్లీ రెండవవైపు కూడా చేయాలి. ఒక కాలు స్థిరంగా ఉంచి రెండవ కాలి మడమపైకి లేపి చేసినట్లయితే పూర్తి స్థాయిలో ట్విస్టు అయిన అనుభూతి పొందవచ్చు. ఇలా 5 లేదా 10 రిపిటీషన్లు చేయాలి.


ఉపయోగాలు: ఊ;టరితిత్తుల పై భాగాలకు, మెదడులోని భాగాలకు ఆక్సిజన్ సరఫరా పెరుగుతుంది. దీని వలన అల్జీమర్స్, పార్కిన్‌సన్, బ్రెయిన్ ఎటక్సియా వంటి సమస్యలు పరిష్కారమవుతాయి. భుజాలు, పై భాగాలకు, మెడకు మంచి వ్యాయామం అందుతుంది. స్టెర్నో క్లెయిడో మస్టాయిడ్ కండరాలకు, డీప్ నెక్ ఫ్లెక్సార్ కండరాలకు వ్యాయామం జరిగి మెడకు సంబంధించిన సమస్యలతో పాటు, సర్వైకల్ స్పాండిలైటిస్, మైగ్రేన్ సమస్యల నుంచి విముక్తికి సహకరిస్తుంది.

ముఖ్య గమనిక: అన్ని చాలనములు చేసేటప్పుడు ఎటువంటి తొందరపాటు పనికిరాదు. శ్వాస తీసుకుంటూ, వదులుతూ నిదానంగా చేయడం, చేతుల కదలికల స్థాయి కొంచెం ఎక్కువగా ఉండేట్టు జాగ్రత్తగా చేయడం ముఖ్యం. అప్పుడే పూర్తి ఫలితం లభిస్తుంది. ఈ మూడు చాలనములు చేయడం వలన వృద్ధాప్యంలో వచ్చే లోడోసిస్, కైపోసిస్, స్కోలియోసిస్ సమస్యలను నివారించవచ్చు. ఒకవేళ ఇప్పటికే అటువంటి డీవియేషన్ ఉన్నట్టయితే వాటి కరెక్షన్‌కు ఉపకరిస్తుంది.

– సమన్వయం: **ఎస్. సత్యబాబు**
మోడల్: **ఈషా హిందోచా,** ఫొటోలు: **పోచంపల్లి మోహనాచారి**



3
ఊర్ధ్వ మేరు చాలన (వామ దక్షిణ)



ఇక మనం చూడాలి

నేడు ప్రపంచ అంధుల దినోత్సవం

అది నిర్మల్ జిల్లాకేంద్రంలోని సోఫీనగర్‌లో ఓ చిన్న టీకొట్టు. దాన్ని నడిపేది అబ్దుల్ రషీద్, అబీదాబేగం. ఉదయం నాలుగు గంటలకే పెద్దకొడుకు ఫహీమ్ నిద్రలేచి.. తండ్రి కంటే ముందే ఇంటికి దగ్గరలోనే ఉన్న చాయ్‌హోటల్‌కు వెళ్లి తెరుస్తున్నాడు. రషీద్ వచ్చే సరికి సామగ్రిని సర్దిపెట్టేస్తాడు. చిన్నవాడైన నహీమ్ తండ్రితోపాటు హోటల్‌కు వస్తాడు. రషీద్ పొయ్యి వెలిగించి ఇస్తే.. ఫహీమ్ చాయ్ చేయడం మొదలు పెడతాడు. నహీమ్ గ్లాసులు, పాత్రలు శుభ్రం చేయడం, వచ్చిన వాళ్లకు టీ అందించడం తదితర పనులు చేసి పెడుతున్నాడు. ఇక రహీమ్ ఇంటి బాధ్యతను తీసుకున్నాడు. ఇంట్లోకి కావల్సిన వస్తువులను తానే దగ్గరలోని కిరాణ దుకాణానికి వెళ్లి తీసుకువస్తున్నాడు. ఇంటిపట్టునే ఉంటూ ఇల్లును చూసుకోవడమే తన బాధ్యత అని గర్వంగా చెబుతున్నాడు. ఇందులో ప్రత్యేకత ఏముంది అని పెదవి విరుస్తున్నారా? అయితే మీరు తప్పులో కాలేసినట్టే!

ఎందుకంటే రషీద్‌కన్నా ముందే లేచి చాయ్ దుకాణాన్ని తెరిచే ఫహీమ్‌కి కానీ, వచ్చిన వాళ్లకి టీ అందించే నహీమ్‌కి గానీ, ఇంటి దగ్గరే ఉండి ఇల్లు చూసుకుంటూ, ఇంట్లోకి కావలసిన వెచ్చాలు తెచ్చే రహీమ్‌కిగానీ కళ్లు కనిపించవు. అయినా, వాళ్లు ఏ మాత్రం నిరాశ పడటం లేదు. 'హమ్ అంధే హై.. మగర్ హమ్ భీ బాబాకే సాథ్ కామ్ కర్తే..' అని చెబుతూ, తండ్రికి చేదోడు వాదోడుగా నిలుస్తున్న వాళ్ల ధీమాను చూసి మెచ్చుకోవాలో, వారి అంధత్వాన్ని చూసి బాధపడాలో అర్థం కావడం లేదని స్థానికులు చెప్పుకుంటుంటారు. పెద్దకొడుకు ఫహీమ్‌కి మూడుపదులుండగా... మిగతా ఇద్దరు పిల్లలకూ పాతికేళ్లుంటాయి. కళ్లు బాగున్న రెండవకొడుకు సలీమ్ మాత్రం వేరుగా ఉంటూ తన కుటుంబాన్ని తను పోషించుకుంటున్నాడు. తర్వాత పుట్టిన ముగ్గురు ఆడపిల్లలు బీడీలు చుడుతూ వేణ్ణీళ్లకు చన్నీళ్లలా తండ్రి, అన్నలు నడిపే చాయ్ దుకాణం నుంచి వచ్చే ఆదాయానికి మరికొంత జత చేస్తూ, నడుము, కాళ్లు చచ్చుబడిపోయి పసిపాపలా పాకుతూనే ఇంటిపనులు చేసుకునే తల్లికి తోడుగా ఉంటున్నారు.

అంధులైన వాళ్లకి ప్రభుత్వం ఇచ్చే పింఛను వారి అవసరాలకు ఏ మూలకూ చాలని పరిస్థితి. అద్దె ఇల్లు తప్ప సొంత ఇల్లు కూడా లేని ఆ కుటుంబం తమను ఆదుకునే దాతల కోసం గంపెడంత ఆశతో దీనంగా ఎదురు చూస్తోంది.

– **రాసం శ్రీధర్**
సాక్షి, నిర్మల్
ఫొటోలు: **బాతూరి కైలాష్**

నా కన్ను ఇస్తానన్నా...



పెద్దకొడుకు ఫహీమ్ పుట్టినప్పుడే మస్తు దవాఖానాలు తిరిగినా. ఆఖరికి హైదరాబాద్‌లోని ఎల్.వి.ప్రసాద్ హాస్పిటల్‌కు తీసుకుపోయిన. అక్కడ అన్ని టెస్టులు చేసి.. మీ కొడుక్కి కళ్లు రావని చెప్పింద్రు. సార్.. నాకన్ను ఇస్త.. నాకొడుక్కి పెట్టుండ్రి.. అని బతిమిలాడిన. అప్పుడు నాకు సమజయ్యేటట్లు డాక్టర్లు చెప్పింద్రు. మాది మేనరికం వివాహం కావడం వల్లే పిల్లలకు చూపు రాలేదన్నరు. ఇగ ఏం చేయలేక ఏడుసుకుంట అచ్చిన. కనిపించకున్నా.. అందాజా (అంచనా) కొద్ది హోటల్ పనిలో తోడుంటున్నారు.

– **అబ్దుల్ రషీద్,** తండ్రి

కళ్లల్ల నీళ్లు ఇంకిపోతున్నయి...



ముగ్గురు కొడుకులూ కళ్లు లేకుండనే పుట్టారు. వాళ్లు పుట్టినప్పుడల్లా ఏడ్చి..ఏడ్చి.. నా కళ్లల నీళ్లు ఇంకిపోతుండే. 'ఏంజేస్తం.. నీకట్ల రాసి పెట్టుంది.. వాళ్లనే మంచిగ చూసుకో..' అని అందరూ చెబుతుండేటోళ్లు. అట్లనన్న చూసుకుందామంటే.. నా కాళ్లు పని చేయకుండ అయినై. ఇగ నా బిడ్డలే అన్నలను, ఇల్లు చూసుకుంటున్నరు. కన్నబిడ్డలకు ఏం చేయలేకపోతున్నామన్న బాధ మనసుల పట్టనీయట్లేదు.

– **అబీదా బేగం,** తల్లి

లవ్ డాక్టర్ నన్నడగొద్దు ప్లీజ్



ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ అన్నయ్యా.. మీరు చాలా సమాధానాల్లో అబ్బాయిలది లవ్ కాదు పొసెసివ్‌నెస్ అని చెబుతుంటారు. పొసెసివ్‌నెస్ ఉన్నవాడితో సంతోషంగా ఉండలేం, దూరంగా ఉండమని చెప్పారు. అసలు పొసెసివ్‌నెస్ అంటే ఏంటి? నేను ఇష్టపడ్డ అబ్బాయిది కూడా పొసెసివ్‌నెస్ అని నా ఫ్రెండ్స్ అంటున్నారు. తనకి నేనంటే చాలా ఇష్టం. నాకు తనని మార్చుకోవడానికి ఏదైనా సలహా ఇవ్వండి. ఏం చేస్తే తను మారతాడో చెప్పండి. తెలియని కొత్త వ్యక్తిని పెళ్లి చేసుకునే కంటే.. అన్నీ తెలిసిన తననే చేసుకుంటే నేను హ్యాపీగా ఉంటాననిపిస్తోంది. నిజానికి తను లేకుండా నేను బతకలేను. సలహా ఇవ్వండి ప్లీజ్.

– **సమత**

సమతా.. నీకు దండం పెడతా నాన్నా..!
పొసెసివ్‌నెస్ లవ్‌గా మారదు..!
అదొక జబ్బురా బంగారం...!!
అనవసరంగా నీ లైఫ్‌లోకి ఒక డిసీజ్‌ని ఇన్వైట్ చేయొద్దు!
చాలా కష్టపడతావు ఛాంపియన్!!
అతిగా ప్రేమించే వాడు చాలా ముచ్చటగా అనిపిస్తాడు...!
ఎంత ప్రేమలేకపోతే నన్ను అంతగా ఆరాధిస్తాడు అని అనిపిస్తుంది!
కానీ, చెబుతున్నా.. నా మాట జాగ్రత్తగా విను..!!
ఊపిరి పోసేది ప్రేమ...!
ఊపిరి ఆడనివ్వనిది పొసెసివ్‌నెస్..!!
తేడా అర్థం చేసుకో..!!
ఇలాంటివాళ్లే కంట్రోల్ తప్పుతారు..!
నిన్ను కంట్రోల్‌లో ఉంచుకోవడానికి ఏదైనా చేస్తారు..!
కొత్త వాడితో కాంప్రమైజ్ అవడం కన్నా...
ఈ మానసిక రోగితో అడ్జెస్ట్ అయిపోతాననుకోవడం..
ఇట్ ఈజ్ డేంజరస్...
నీకు నీవు కీడు చేసుకున్న దానివి అవుతావు..
నీకు దండం పెడతా ఆ ట్రాప్‌లో పడకు నాన్నా..!
డోంట్ బి ఎమోషనల్లీ వీక్..
డోంట్ బ్రేక్‌డౌన్ అండ్ మేక్ ఎ మిస్టేక్.
వెంటనే దూరంగా ఉండడం నేర్చుకో...
నీకు ఒక ఫ్రెండ్‌గా.. ఒక అన్నగా.. ఒక శ్రేయోభిలాషిగా..
అర్థిస్తున్నాను.. ఐ యామ్ బెగ్గింగ్ యూ టు కీప్ అవే ఫ్రమ్ హిమ్!
'సార్ మీరు ఆన్సర్ ఇస్తుంటే అసలు ఆటపట్టించాలని అనిపించలేదు...
నిజం సార్ అలాంటి వాడు సమత లైఫ్‌ని డిస్టర్బ్ చేసేస్తాడు..
మీరు చెప్పిందే కరెక్ట్.. ఒక అమ్మాయిగా నాకూ భయంగా ఉంది..
సమతా.. మీ అన్న చెప్పింది తప్పకుండా పాటించు. లవ్ యు రా!'

లవ్ డాక్టర్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నంబరు 1, బంజారాహిల్స్, హైదరాబాద్-34.
lovedoctorram@sakshi.com

హోమియో కౌన్సెలింగ్స్

ఫ్యామిలీ డాక్టర్

నిద్రలో పక్క తడుపుతున్నాడు.. పరిష్కారం ఏంటి?

మా బాబుకు 12 ఏళ్లు. చిన్నప్పటి నుంచి రాత్రిళ్లు నిద్రలో పక్కతడిపే అలవాటు ఉంది. ఈ సమస్య వల్ల బయటకు ఎక్కడికైనా వెళ్లాలంటే చాలా ఇబ్బందిగా ఉంది. హోమియో చికిత్స ద్వారా ఈ సమస్యను పూర్తిగా తగ్గించే అవకాశం ఉందా?

– సుహాసిని, అశ్వారావుపేట

రాత్రుళ్లు నిద్రలో పక్క తడిపే ఈ అలవాటును వైద్య పరిభాషలో నాక్చర్నల్ ఎన్యూరెసిస్ అంటారు. ఈ సమస్యతో బాధపడే పిల్లలు, వారి తల్లిదండ్రులు చాలా బాధపడతారు. ఇది కొంత మంది పెద్దల్లోనూ ఉంటుంది. సాధారణంగా పిల్లల్లో రాత్రి సమయంలో మూత్రవిసర్జనపై అదుపు రెండు నుంచి ఐదేళ్ల వయసులో వస్తుంటుంది. కానీ ఐదు శాతం మంది పిల్లల్లో పదేళ్ల వయసు తర్వాత కూడా మూత్రవిసర్జనపై అదుపు సాధించడం జరగకపోవచ్చు. ఐదేళ్ల వయసు తర్వాత కూడా తరచూ పక్కతడిపే అలవాటు ఉండటాన్ని ప్రైమరీ ఎన్యూరెసిస్ అంటారు. సాధారణంగా ఇది కొన్నాళ్లలోనే తగ్గిపోతుంది. ఎదుగుదల సమయంలో వచ్చే లోపం వల్ల ఇలా జరుగుతుండవచ్చు. అయితే కొంత మంది పిల్లలు పక్క తడపడం మానివేశాక, మళ్లీ ఆర్నెల్ల తర్వాత సమస్య తిరగబెట్టవచ్చు. ఈ పరిస్థితిని 'సెకండరీ ఎన్యూరెసిస్' అంటారు.

కారణాలు: నాడీ వ్యవస్థ ఎదుగుదల లోపాలు, జన్యుపరమైన సమస్యలు, ఇన్ఫెక్షన్లు, మూత్రాశయ సమస్యలు, వంశపారంపర్య కారణాల వల్ల, కొంతమంది పిల్లల్లో కండరాలు ఎక్కువసార్లు అనియంత్రితంగా సంకోచం చెందడం వంటి కారణాలతోనూ ఈ సమస్య కనిపించవచ్చు. టైప్–1 డయాబెటిస్, మలబద్ధకం వల్ల మూత్రాశయంపై ఒత్తిడి పడటం వల్ల, కెఫిన్ ఎక్కువగా తీసుకోవడం వల్ల కూడా ఈ సమస్య రావచ్చు. మానసిక ఒత్తిడి, భయం వల్ల కూడా తెలియకుండానే మూత్రవిసర్జన జరిగిపోవచ్చు.

చికిత్స: పక్క తడిపే పిల్లలను మందలించడం, దండించడం తగదు. హోమియో చికిత్సతో పిల్లల్లో ఈ అలవాటు పూర్తిగా మాన్పించడానికి అవకాశం ఉంది. కాబట్టి మీరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.



డాక్టర్ శ్రీకాంత్ మొర్లావర్, సీఎండీ, హోమియోకేర్ ఇంటర్నేషనల్, హైదరాబాద్

మూడేళ్లుగా రుతు సమస్య... పీసీఓడీ అంటున్నారు!

నా వయసు 25 ఏళ్లు. మూడేళ్లుగా రుతు సమస్యతో బాధపడుతున్నాను. డాక్టర్‌ను సంప్రదిస్తే పీసీఓడీ అంటున్నారు. పరిష్కారం చెప్పండి.

– రమ్య, హైదరాబాద్

ఈమధ్య ఈ సమస్యతో బాధపడే స్త్రీల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. సరైన జీవనశైలి కొరవడటం, వ్యాయామం చేయకపోవడం, జంక్‌ఫుడ్ వంటి ఆహారపు అలవాట్లతో ఈ వ్యాధి విస్తృతి పెరుగుతోంది. పీసీఓడీ వల్ల మహిళలు చాలా సమస్యలను ఎదుర్కొంటున్నారు. వాటిల్లో సంతానలేమి, రుతుసమస్యలు ముఖ్యమైనవి. ఈ ఒవేరియన్ సిస్ట్ సమస్యలో హార్మోన్ల అసమతౌల్యత వల్ల అండాశయం (ఓవరీ)లో నీటిబుడగలు ఏర్పడతాయి. అండాశయం చుట్టూ దళసరి పొర ఏర్పడుతుంది. వీటి వల్ల రుతుచక్రమంలో అండం విడుదలకు ఆటంకం కలుగుతుంది. కాబట్టి రుతుక్రమంలో మార్పులు జరిగి సంతానలేమి సమస్యకు దారితీస్తుంది.

కారణాలు: అధిక బరువు, జంక్‌ఫుడ్ తినడం ● హార్మోన్ల అసమతౌల్యత ● డయాబెటిస్, హైపోథైరాయిడ్ సమస్యలు ● గర్భనిరోధక మాత్రలు వాడటం...

లక్షణాలు: రుతుక్రమం సరిగా రాకపోవడం ● రుతుక్రమం వచ్చినప్పుడు అధిక రక్తస్రావం ● అవాంఛిత రోమాలు ● ముఖంపై మొటిమలు ● రుతుక్రమం సరిగా ఉన్నా ఒక్కోసారి అండం సరిగా విడుదల కాకపోవడం.

వ్యాధి నిర్ధారణ: అల్ట్రాసౌండ్ పెల్విక్ ఆర్గాన్ ● ఎఫ్ఎస్‌హెచ్, ప్రోలాక్టిన్ మొదలైన హార్మోన్ పరీక్షలు ● టీ3, టీ4, టీఎస్‌హెచ్ పరీక్షలు

చికిత్స: పాలిసిస్టిక్ ఒవేరియన్ డిసీజ్ (పీసీఓడీ)కు హోమియోలో మంచి పరిష్కారం ఉంది. వ్యక్తి మానసిక, శారీరక లక్షణాలను పరిగణనలోకి తీసుకొని హోమియో మందులు ఇస్తారు. దీనికి సెపియా, గ్రాఫైటిస్, పల్సటిల్లా, కాల్కేరియా కార్బ్, ఇగ్నీషియా, తూజ వంటి మందులు అందుబాటులో ఉన్నాయి. వీటిని అనుభవజ్ఞులైన డాక్టర్ల పర్యవేక్షణలో వాడితే వ్యాధి సమూలంగా నయమవుతుంది.



డాక్టర్ మురళి కె. అంకిరెడ్డి, ఎండీ (హోమియో), స్టార్ హోమియోపతి, హైదరాబాద్

సోరియాసిస్ సమస్య వేధిస్తోంది...

నా వయసు 32 ఏళ్లు. మూడు సంవత్సరాలుగా చర్మంపైన మచ్చలుగా ఏర్పడి పొట్టు రాలిపోతున్నది. ఎన్ని మందులు వాడినా తాత్కాలికమైన ఉపశమనమే ఉంది. కీళ్లనొప్పులు కూడా వస్తున్నాయి. దీనికి హోమియోలో మందు ఉందా?

– ఎమ్. రాజేశ్వరరావు, గుంటూరు

మీరు చెబుతున్న లక్షణాలను బట్టి చూస్తే మీ వ్యాధి సోరియాసిస్‌గా తెలుస్తోంది. సోరియాసిస్ సాధారణంగా 15–30 ఏళ్ల మధ్యవయస్కులకి ఎక్కువగా వస్తుంది. కానీ వంశపారంపర్యంగా ఏ వయసు వారికైనా రావచ్చు.

కారణాలు : వంశపారంపర్యం లేదా అధిక ఒత్తిడి ముఖ్యంగా ఆటో ఇమ్యూన్ డిజార్డర్లు సోరియాసిస్‌కు ప్రధాన కారణం.

లక్షణాలు: ● చేతులు, కాళ్లు, తల, ముఖం, చర్మంపై మచ్చలు లేదా బొబ్బలు వచ్చి చేప పొలుసులుగా చర్మం ఊడిపోతుంది ● కేవలం చర్మం మీద మాత్రమే గాక గోళ్లపై మచ్చలు రావడం, కీళ్లనొప్పులు ఉంటాయి ● తలపై చుండ్రులాగా పొలుసులతో పాటు జుట్టు కూడా రాలిపోతుంది. ఈ వ్యాధితో బాధపడుతున్న వారు తాము చూడటానికి కూడా బాగాలేకపోవడంతో మానసిక క్షోభకు గురయ్యే ప్రమాదం కూడా ఉంది.

ఇటీవలి వ్యాధి ట్రెండ్: ఆధునిక జీవన శైలి వల్ల ఇటీవల వంశపారంపర్యంగా వ్యాధి లేని వారిలోనూ ఇది కనిపిస్తుండటం ఆందోళన కలిగించే అంశం. చాలా హడావుడి, ఆదుర్దా కలిగిన జీవన శైలి వల్ల ఇది చాలామందిలో కనిపిస్తోంది. కాబట్టి ఒత్తిడిని వీలైనంత దూరంగా ఉంచుతూ, మంచి పౌష్టికాహారం తీసుకుంటూ ఉండాలి. చర్మం మరీ పొడిబారిపోకుండా తగిన మోతాదులో నీళ్ల తీసుకోవాలి.

చికిత్స: రోగి స్వభావం, తత్వం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని వాళ్లలో వ్యాధి నిరోధక శక్తి పెంచేలా జెనెటిక్ కన్‌స్టిట్యూషన్ పద్ధతిలో చికిత్స చేయడం ద్వారా సమస్యకు సమూలమైన చికిత్స అందించడం హోమియో ప్రక్రియలో పూర్తిగా సాధ్యమవుతుంది.




డాక్టర్ ఎ.ఎం. రెడ్డి, సీఎండీ, పాజిటివ్ హోమియోపతి, హైదరాబాద్

పాశుర ప్రభాతం

20వ పాశురం

ముప్పత్తు మూవ రమరర్కు మున్‌శెన్ఱు,
కప్పమ్ తవిర్కుమ్ కలియే! తుయిలెళాయ్,
శెప్ప ముడైయాయ్! తిఱలుడైయాయ్! శెత్తార్కు
వెప్పం కొడుక్కుమ్ విమలా! తుయిలెళాయ్,
శెప్పన్న మెన్‌ములై శెవ్వాయ్ శిఱుమరుంగుల్,
నప్పిన్నై నంగాయ్! తిరువే! తుయిలెళాయ్,
ఉక్కముమ్ తట్టొళియుమ్ తన్దున్‌మణాళనై,
ఇప్పోదే ఎమ్మై నీరాట్టేలో రెమ్బావాయ్.

భావం



ముప్పది మూడుకోట్ల దేవతలకు, వారికి ఆపద కలగక ముందే, వారివద్దకు పోయి తోడుగా నిలిచి భయాన్ని తొలగించు బలశాలీ! మేల్కొనుము. ఋజు ప్రవర్తన కలవాడా! నిన్ను ఆశ్రయించినవారికి శత్రు భయం లేకుండా రక్షించగల శక్తిగలవాడా! నిర్మలస్వభావుడా! మేల్కొనుము. బంగారు కలశాలను పోలిన వక్షోజాలను, ఎర్రని దొండపండువంటి పెదవి, సన్నని నడుము కలిగిన ఓ నీళాదేవీ! ఓ పరిపూర్ణురాలా! లక్ష్మీ సమానురాలా! మేల్కొనుము. విసనకర్రను, అద్దాన్ని మాకు ఇచ్చి నీకు పరమ ప్రియుడైన శ్రీ కృష్ణునితో కలిసి మేము స్నానం చేయునట్లు చేయి.

– **ఎస్. శ్రీప్రియ**

కాసుకో సుడోకు

								4
4		2	1			3	5	6
			5	4			9	8
				8	6	4	3	1
6		1				2		9
8	9	4	2	3				
1	2			5	9			
9	5	3			4	6		2
7								

నిన్నటి జవాబు

8	9	4	5	2	7	1	6	3
3	1	5	6	4	9	2	7	8
6	2	7	3	1	8	5	9	4
5	3	1	9	7	4	6	8	2
9	6	8	1	3	2	4	5	7
4	7	2	8	6	5	3	1	9
2	5	3	7	8	1	9	4	6
1	8	6	4	9	3	7	2	5
7	4	9	2	5	6	8	3	1

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా,నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

భక్తుడు: స్వామీ! పెళ్లి అయిన తర్వాత అరుంధతి నక్షత్రం చూపించడంలో దేవరహస్యం ఏమిటి?
స్వామి: దేవ రహస్యం ఏమీ లేదు నాయనా! ఆ క్షణం నుంచి నువ్వు నీ భార్య మాట వినకపోతే నీకు చుక్కలు చూపిస్తుంది అని దానర్థం నాయనా!!

* * *

టీచర్: రామూ పది పెంపుడు జంతువుల పేర్లు చెప్పు.
రాము: ఐదు కుక్కలు, ఐదు పిల్లులు!

పరి పరిశోధన

సాలెగూడు స్ఫూర్తితో టైప్ -1 మధుమేహానికి కొత్త చికిత్స!



టైప్–1 మధుమేహానికి చికిత్సను ఆవిష్కరించారు చైనా శాస్త్రవేత్తలు. సాలెగూడు స్ఫూర్తిగా తయారుచేసిన ఓ పోగులో ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేసే ఐస్‌లెట్ కణాలు వేలకు వేలు ఉంచి.. శరీరంలో అమర్చడం ఈ పద్ధతిలో కీలకమైన అంశం. ఈ రకమైన మధుమేహంలో శరీరంలోని రోగనిరోధక వ్యవస్థ స్వయంగా క్లోమగ్రంథిలో ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేసే కణాలను నాశనం చేస్తుందన్నది తెలిసిన విషయమే. ఫలితంగా టైప్–1 మధుమేహం బారిన పడినవారు తరచు ఇన్సులిన్‌ను ఎక్కించుకోవలసి వస్తుంది. ఎప్పటికప్పుడు కొత్త ఐస్‌లెట్ కణాలను శరీరంలోకి చొప్పించడం ద్వారా వ్యాధిని నియంత్రించేందుకు శాస్త్రవేత్తలు ఇప్పటిరవకూ బోలెడు ప్రయత్నాలు చేసి విఫలమయ్యారు. శరీరం ఈ కొత్త కణాలను నిరోధించే సమస్యను ఎదుర్కొనేందుకు మరిన్ని మందులు వాడవలసి రావడం దీనికి ఒక కారణం. ఈ నేపథ్యంలో చైనా శాస్త్రవేత్తలు నానో స్థాయిలో అతి సూక్ష్మమైన రంధ్రాలున్న ఓ పోగును తయారుచేసి అందులో ఈ ఐస్‌లెట్ కణాలను ఉంచారు. సాలెగూడు పోగంత పలుచగా ఉండటమే కాకుండా... కణాలను తనలో దాచుకోగలగడం వీటి ప్రత్యేకత. అవసరమైనప్పుడు దీన్ని సులువుగా తీసేసే అవకాశమూ ఉంటుంది. ఎలుకలపై జరిపిన ప్రయోగాల్లో ఒక అంగుళం పొడవైన పోగును రెండు రోజుల పాటు ఇన్సులిన్ అవసరం లేకుండా చేసినట్లు శాస్త్రవేత్తలు తెలిపారు.

ఎంఆర్‌ఐ తోనే క్యాన్సర్ కణుతుల గుర్తింపు...



శరీరంలో ఏవైనా లోటుపాట్లు ఉంటే చేయించుకునే ఎంఆర్‌ఐ పరీక్షలు ఇకపై క్యాన్సర్ కణుతుల గుర్తింపుకి కూడా ఉపయోగపడనున్నాయి. ఇదంతా యూనివర్శిటీ ఆఫ్ టెక్సస్ సౌత్ వెస్టర్న్ శాస్త్రవేత్తల పరిశోధనల ఫలితం. శరీరంలో కణుతులు ఏర్పడటం కొన్ని సందర్భాల్లో సహజం. అన్నీ క్యాన్సర్‌కు దారితీయవు. ఏది వ్యాధిగా మారుతుందో గుర్తించాలంటే.. ఆ కణజాలాన్ని బయటకు తీసి పరీక్షించాల్సి ఉంటుంది. కొన్నిసార్లు కత్తికి అందనిచోట్ల కూడా కణుతులు ఏర్పడటం కద్దు. ఈ నేపథ్యంలో టెక్సస్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు కిడ్నీల్లో ఏర్పడే కణుతులపై పరిశోధనలు జరిపారు. సాధారణ ఎంఆర్‌ఐ పరీక్షలకే కొన్ని మార్పులు చేయడం ద్వారా కణితి ప్రమాదకరమైనదా? కాదా? అందులో ఉన్న పదార్థం ఎలాంటిది? వంటి అన్ని అంశాలను విశ్లేషించగలిగారు. బోలెడన్ని ఎంఆర్‌ఐ చిత్రాల ఆధారంగా నిర్దిష్ట ప్రాంతంలో ఉండే కణితి లోపల అతి సూక్ష్మస్థాయిలో ఉండే కొవ్వు కణాలను కూడా ఇది గుర్తించగలదు. ఈ పద్ధతి దాదాపు 80 శాతం కచ్చితత్వంతో ప్రమాదకరమైన కణుతులను గుర్తించగలదని జెఫ్రీ కాడెడూ అనే శాస్త్రవేత్త తెలిపారు. ఇందుకోసం శాస్త్రవేత్తలు ప్రత్యేకమైన అల్గారిథమ్‌ను అభివృద్ధి చేశారు. ప్రస్తుతానికి ఇది శస్త్రచికిత్సకు ప్రత్యామ్నాయం కాదని.. అనవసరంగా పదే పదే శస్త్రచికిత్సలు చేసే అవసరాన్ని తగ్గించేందుకు ఉపయోగపడుతుందని శాస్త్రవేత్తలు అంటున్నారు.

గర్భ సంచి తొలగింపుతో దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు...



మహిళలల్లో గర్భ సంచి తొలగింపు అనేక దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు కారణమవుతోందని మేయో క్లినిక్ శాస్త్రవేత్తలు జరిపిన అధ్యయనం మరోసారి స్పష్టం చేసింది. మెనోపాజ్ జర్నల్‌లో ప్రచురితమైన అధ్యయన వివరాల ప్రకారం... రెండు అండాశయాలను అలాగే ఉంచి... గర్భాశయాన్ని మాత్రమే తొలగించిన సందర్భాల్లోనూ మహిళలకు గుండె జబ్బులు మొదలుకొని జీవక్రియ సంబంధిత దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు తప్పడం లేదు. ఇప్పటివరకూ అండాశయాల తొలగింపుతోనే సమస్యలన్న అంచనా ఉండేదని, తాజా అధ్యయనం అది తప్పని చెబుతోందని షానన్ లాగ్లిన్ టొమ్మాసో అనే శాస్త్రవేత్త తెలిపారు. మహిళల వయసు 35 ఏళ్ల కంటే తక్కువ ఉంటే వారికి ఈ సమస్యలు మరింత ఎక్కువ ఇబ్బందిపెట్టే అవకాశముందని తెలిపారు. 1980 –2002 మధ్యకాలంలో అండాశయాలను ఉంచి, గర్భాశయం మాత్రమే తొలగించిన రెండు వేల మంది మహిళల వివరాలను... రెండింటినీ తొలగించిన వారితో పోల్చి చూడటం ద్వారా తాము ఈ అంచనాకు వచ్చామని వివరించారు. గర్భాశయం మాత్రమే తొలగించిన వారిలో 14 శాతం మందికి కొలెస్ట్రాల్ సమస్యలు ఎదురుకాగా, 13 శాతం మంది అధిక రక్తపోటు, 18 శాతం మంది ఊబకాయం, 33 శాతం మంది గుండెజబ్బులకు గురయ్యారని 35 ఏళ్ల లోపు వారిలో ఈ సమస్యలు నాలుగు రెట్లు ఎక్కువగా ఉన్నట్లు తెలిసిందని విరించారు. గర్భాశయ తొలగింపు విషయంలో మహిళలు మరింత జాగరూకతతో వ్యవహరించేందుకు ఈ అధ్యయనం ఉపకరిస్తుందని తాము భావిస్తున్నట్లు చెప్పారు.

వీడినుంచి బచావ్

గుడిని కాపాడతాడట... వీడి సంస్థ పేరే సేవ్ టెంపుల్... ఉద్యోగాన్ని భక్తితో చేసే వాళ్లనే మలినం చేసే రకం. వీడి దుంపతెగ. వీడేంటి గుడిని బచాయించేది? వీడినుంచి ఆడపిల్లల్ని బచాయించాలి అంటుంది ఈ బాధితురాలు. గజల్ శ్రీనివాస్ చేతిలో లైంగిక వేధింపులకు గురైన ఈ అమ్మాయి సాక్షి టీవీకి ఇచ్చిన ఎక్స్‌క్లూజివ్ ఇంటర్వ్యూ ఇది.



‘నలుగురిలో ఉన్నప్పుడు పెద్దమనిషిగా, ఆధ్యాత్మికవేత్తగా చెలామణి అవుతాడు. ఎవరూ లేనప్పుడు అతడిలోని రాక్షసుడు నిద్ర లేచి వేధింపులు ప్రారంభిస్తాడు. ఆ కార్యాలయంలో పని చేసినన్నాళ్ళూ ఒక్కో క్షణం ఒక్కో నరకం అనుభవించా’ అని ఆమె కన్నీరు పెట్టుకున్నారు. బుధవారం ఆమె సాక్షి ప్రతినిధితో మాట్లాడుతూ గజల్ శ్రీనివాస్‌తో ఎదురైన చేదు అనుభవాలు, తాను అనుభవించిన నరకాన్ని గురించి చెప్పారు. ‘సేవ్ టెంపుల్ సంస్థ చేస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలకు స్ఫూర్తి పొందే జీతంలో పెరుగుదల లేకపోయినా పాత ఉద్యోగం మాని అక్కడ చేరాలని భావించా. సంస్థ చైర్మన్ ప్రకాష్‌తోపాటు గజల్ శ్రీనివాస్ నన్ను ఇంటర్వ్యూ చేశారు. జూన్ 3న ఉద్యోగంలో చేరిన తర్వాత కొంతకాలం చైర్మన్ మా కార్యాలయంలోనే ఉన్నారు. ఆయన వెళ్ళిపోయిన తర్వాతే గజల్ శ్రీనివాస్ తన నిజస్వరూపం బయటపడింది. ఒక్కసారిగా గర్జించిన సింహంలా మారిపోయి పంజా విసరడం ప్రారంభించాడు. నాలుగు నెలల నుంచి విచిత్రమైన ప్రవర్తన, వెకిలి చేష్టలు ప్రారంభమయ్యాయి. పనివేళలతో నిమిత్తం లేకుండా నన్ను ఆఫీస్‌లో ఉండమనేవాడు. ఇతర ఉద్యోగుల్ని పంపేసి నన్ను ఒంటరిగా ఉంచడానికి చూసేవాడు. ఎవరైనా మహిళా గెస్టులు వస్తే వారితో గంటల తరబడి మాట్లాడేవాడు. ‘వాళ్ళు వెళ్ళేవరకు నువ్వు ఉండాలి’ అనేవాడు. అలా కుదరదని చెప్పినందుకు ఓసారి నోటికొచ్చినట్లు తిట్టాడు. ఏడుస్తున్నా కనికరం లేకుండా ప్రవర్తించాడు. రెండోరోజు ఆఫీస్‌కు వచ్చిన వెంటనే నేను వెళ్ళిపోతా అని చెప్పా. ‘నాకు పలుకుబడి ఉంది, నేను పంపకుండా నువ్వు వెళ్ళిపోతానంటే ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్ ఇవ్వను, శాలరీ సర్టిఫికెట్ ఇవ్వను. ఒకవేళ అవి వద్దనుకుని వెళ్ళిపోవాలని చూస్తే నిన్ను ఏదో ఒక కేసులో ఇరికిస్తా’ అంటూ బెదిరించాడు. తనకు నచ్చిన ఆడవాళ్ళను ఆఫీస్‌కు తీసుకువచ్చే అతడు... ఆ సమయంలో మాత్రం టైమ్ కాకపోయినా కార్యాలయం నుంచి అందరినీ పంపించేసేవాడు. నేను సీఎం పక్క ఉంటా, త్వరలో గవర్నర్ అవుతా, నాకు ఎంతో పలుకుబడి ఉందంటూ లోబరుచుకునే ప్రయత్నం చేసేవాడు. చివరలో అతడి వేధింపులు మరీ ఎక్కువయ్యాయి. హత్తుకుందాం... లాంటి మాటలు అనేవాడు. నేను అతడికి లొంగట్లేదని నాపై కక్షకట్టాడు. రేడియో జాకీ అయిన నాతో నానా చాకిరీ చేయించాడు. టిష్యూ పేపర్స్‌ను అపరిశుభ్రంగా చేసి నేలపై పడేసేవాడు. ఆపై బెల్ కొట్టి నన్ను పిలిచి ‘స్వచ్ఛ భారత్’ అంటూ అవి కనిపించట్లేదా... తియ్ అనేవాడు. అతిథులు తాగిన కాఫీ, టీ కప్పుల్నీ నాతోనే తీయించేవాడు.

ఆడపిల్లలు ఇందుకే ఆత్మహత్యలు చేసుకుని చనిపోతుంటారా అని అతడు పెట్టే బాధలు చవిచూసినప్పుడు నాకు అనిపించింది. దీంతో రెండు నెలల పాటు చివరకు అన్నం తినేప్పుడూ ఏడుస్తూనే ఉన్నా. నాకు నమ్మకమైన స్నేహితులకు విషయం చెప్తే ఉద్యోగం మానేయమని అన్నారు. తోటి ఉద్యోగులకు చెప్తే ఆయనతో ఎందుకు పెట్టుకుంటావ్ అనే వాళ్ళు. ఆయన భార్య కొన్నాళ్ళ క్రితం వరకు ఆఫీస్‌కు వచ్చినా.. ఆపై మానేశారు. ‘మేడం మీరు రాకపోతే ఆఫీస్ మరో రకంగా ఉంటోంది’ అని ఆమెకు పరోక్షంగా హెచ్చరించి చెప్పినా ప్రయోజనం లేదు. తన నిజస్వరూపం బయటకు తెలియకూడదనే అన్నీ గదిలోనే చేస్తుంటాడు. కన్నతండ్రిలాంటి వెలగపూడి ప్రకాశరావు గారికి కూడా ద్రోహం చేశారు.

ఆ ఆఫీస్‌లో పని చేసే పార్వతి ‘‘నువ్వంటే సార్‌కు ఇష్టం... సహకరిస్తే అన్నీ చూసుకుంటాడు’’ అనేది. రోజులు గడిచేకొద్దీ వేధింపులు శృతిమించాయి. నేను ఉద్యోగం మానేసి వెళ్ళిపోతే నా తర్వాత వచ్చే మరో అమ్మాయి బలవుతుందని భావించా. నాలా మరొకరు బలి కాకూడదంటే గజల్ శ్రీనివాస్‌కు బుద్ధి చెప్పాలనుకున్నా. ఎంతో పేరున్న మనిషి కాబట్టి బయటకు వచ్చి ‘అసలు విషయం’ చెప్తే ఎవరూ నమ్మే పరిస్థితి లేదు. అందుకే సాక్ష్యాధారాలతో అతడి నిజస్వరూపాన్ని సమాజానికి చూపించాలి అనుకున్నా. పెద్దమనిషి ముసుగులో చాలా చిన్నపనులు... అకృత్యాలు చేసే గజల్ శ్రీనివాస్ చాలా సెక్యూర్డ్‌గా ఉంటాడు. ఎక్కడా ఎలాంటి ఆధారాలూ దొరకనీయడు. అందుకే స్టింగ్ ఆపరేషన్ చేయడానికి పెద్ద గ్రౌండ్ వర్క్ చేశా. కార్యాలయంలోని అతడి బెడ్‌రూమ్‌లోనూ మంచం మినహా ఇంకేమీ ఉండవు. అయినప్పటికీ ధైర్యం చేసి స్పై కెమెరా ఏర్పాటు చేశా. విషయం పసిగడితే నన్ను అక్కడే చంపేస్తాడని తెలుసు. అందుకే నాకు నమ్మకమైన ఓ స్నేహితురాలికి విషయం చెప్పా– ఏ రోజైనా నేను ఆఫీస్ నుంచి తిరిగి రాకపోతే... ఫలానా చోట కెమెరా పెట్టాను తీసుకోండి అని సూచించా.

పక్కా ఆధారాల కోసమే నేను ఈ మధ్య ఆయన పిలిచినప్పుడు గదిలోకి వెళ్ళి కాళ్ళు నొక్కడం, ముట్టుకోవడం చేశా. ఇదంతా కెమెరాలో రికార్డు అవుతుందనే చేశా. పోలీసుల వద్దకు వెళ్ళేప్పుడు భయపడ్డా. అయితే ఏసీపీ విజయ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ రవీందర్ నాకు ధైర్యం చెప్పారు. నేను చేసిన సాహసానికి న్యాయం చేస్తూ గజల్ శ్రీనివాస్‌ను అరెస్టు చేశారు. వారితో పాటు తెలంగాణ పోలీసుకి ఎంతో రుణపడి ఉన్నా. సాధారణంగా ఓ ఆడపిల్ల తనకు ఎదురైన లైంగిక వేధింపుల్ని మౌనంగా భరిస్తుంది తప్ప బయటకు చెప్పుకోలేదు. తెగించి అలా చెప్పిందంటే అవి శృతిమించాయని, నిజమని నమ్మాల్సిందే. నేను ఇన్ని ఆధారాలు, వీడియోలతో పోలీసులకు ఫిర్యాదు చేసినా కొందరు అనుమానిస్తున్నారు. ఇలా చేస్తే భవిష్యత్తులో మరో బాధితురాలు బయటకు వచ్చేందుకు కూడా ధైర్యం చేయదు. మృగాళ్లకు చెక్ పడదు. ప్రతి ఇంట్లోనూ ఆడపిల్ల ఉంటుంది. ఆమెకే ఇలాంటి పరిస్థితి ఎదురైతే– అని అంతా ఆలోచించాలి.

ఇది కేవలం శృతి తప్పడం కాదు... తీవ్రమైన అపశృతి. ఆయనకు పరిచితులైన కళాకారులు ముందు ఆశ్చర్యపోతారు, ఆ తరవాత ఈ దుర్బుద్ధి ఎలా పుట్టిందా అనుకుంటారు.

మహిళలందరూ తమని తాము కాపాడుకోవడానికి బయటకు రావాలని చెబుతున్నాను. పోలీసులకు ధన్యవాదాలు చెబుతున్నాను.

గజల్ శ్రీనివాస్‌ను తమ సంస్థ ప్రచార బాధ్యతల నుంచి తీసేస్తున్నట్లు ‘సేవ్ టెంపుల్’ ఆర్గనైజేషన్ అధ్యక్షులు వెలగపూడి ప్రకాశ్‌రావు ప్రకటించారు.

లైక్ డాడ్ లైక్ సన్



మహేష్‌బాబు



మహేశ్‌బాబు · గౌతమ్

ప్యారాగ్లైడింగ్ చేయాలంటే గుండెలో దమ్ముండాలి. మరి.. ఆకాశంలో అంత ఎత్తున ఎగరడమంటే మాటలా? మహేశ్‌బాబుకి ఆ దమ్ముంది. అందుకే రివ్వున ఎగిరారు. డాడీకి తగ్గ సన్ గౌతమ్. ‘నేను కూడా చేయగలను’ అంటూ ధైర్యంగా ప్యారాగ్లైడింగ్‌కి రెడీ అయ్యాడు. న్యూ ఇయర్ సందర్భంగా మహేశ్ తన భార్యపిల్లలు నమ్రత, గౌతమ్, సితారలతో కలసి హాలిడే ట్రిప్ వెళ్లారు. ఒమన్‌లో భర్త, కొడుకు చేసిన సందడిని నమ్రత సోషల్ మీడియా ద్వారా బయటపెట్టారు. అంతకుముందు మహేశ్ చాలాసార్లు ప్యారాగ్లైడింగ్ చేశారు. ఈసారి గౌతమ్ కూడా ఉత్సాహపడ్డాడు. తండ్రీ కొడుకులిద్దరూ గాల్లో కొద్ది సేపు చక్కర్లు కొట్టారు. ‘‘గౌతమ్ తొలిసారిగా ప్యారాగ్లైడింగ్ చేశాడు. అప్పుడే పిల్లలు పెద్దవాళ్లు అయిపోతున్నారు’’ అని ఈ సందర్భంగా నమ్రత పేర్కొన్నారు. ఈ ట్రిప్ అయిపోయిన తర్వాత మహేశ్‌బాబు తిరిగి ‘భరత్ అను నేను’ సినిమా షూటింగ్‌లో పాల్గొంటారు. కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను డీవీవీ దానయ్య నిర్మిస్తున్నారు. కియారా అద్వానీ హీరోయిన్‌గా పరిచయం అవుతున్న ఈ సినిమా ఏప్రిల్ 27న రిలీజ్ కానుంది.

‘2.0’తో ఆ థియేటర్లు స్టార్ట్



రజనీకాంత్

తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్–శంకర్ కాంబినేషన్‌లో ‘రోబో’కి సీక్వెల్‌గా తెరకెక్కిన చిత్రం ‘2.0’. ఏప్రిల్ 14న ఈ సినిమా విడుదల కానుందని సమాచారం. బడ్జెట్.. విజువల్ ఎఫెక్ట్స్.. ఎక్కువ భాషల్లో రిలీజ్ కానున్న సినిమాగా ఇప్పటికే పలు రికార్డులు క్రియేట్ చేసిన ‘2.0’ మరో అరుదైన ఘనతనూ సొంతం చేసుకోనుంది. అది కూడా అరబ్ దేశమైన సౌదీ అరేబియాలో కావడం విశేషం. సినిమాలు మత సిద్ధాంతాలకు విరుద్ధం అంటూ 1980లలో సౌదీలో సినిమా హాళ్లను మూసేసిన విషయం తెలిసిందే. థియేటర్ల ఏర్పాటు, సినిమాల ప్రదర్శనకు సౌదీ ప్రభుత్వం ఇటీవల మళ్లీ అనుమతి ఇచ్చింది. 35 ఏళ్ల తర్వాత సౌదీలో థియేటర్లు ఏర్పాటు చేశాక విడుదలయ్యే తొలి భారతీయ సినిమా, అది కూడా ఓ సౌత్ సినిమా ‘2.0’ కావడం గర్వించదగ్గ విషయమే. ఈ సినిమా పాటల విడుదల వేడుకను దుబాయ్‌లో ఎంత గ్రాండ్‌గా చేశారో ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. ఈ ఏడాది మార్చి చివరికల్లా సౌదీలో థియేటర్లు ప్రారంభించే అవకాశం ఉందట. ఏప్రిల్‌లో రిలీజ్ కానున్న ‘2.0’ సినిమాని అక్కడ ప్రదర్శించేందుకు చిత్రబృందం సౌదీ ప్రభుత్వంతో చర్చలు జరపగా విడుదలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారట.

29 గంటల్లో కోటి

డిజిటల్ వ్యూస్‌లో అల్లు అర్జున్ మరోసారి తన సత్తా చాటారు. ఆయన నటిస్తున్న తాజా చిత్రం ‘నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా’ ఫస్ట్ ఇంపాక్ట్ 29గంటల్లోనే కోటి డిజిటల్ వ్యూస్‌ని రాబట్టుకోవడం విశేషం. జనవరి 1 సాయంత్రం 5 గంటలకి డిజిటల్ మీడియాలో విడుదల చేసిన ‘నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా’ ఫస్ట్ ఇంపాక్ట్ కోటి వ్యూస్‌తో నాన్ ‘బాహుబలి’ రికార్డులో తొలి స్థానంలో నిలిచినట్లు చిత్రబృందం ప్రకటించింది. రచయిత వక్కంతం వంశీని దర్శకునిగా పరిచయం చేస్తూ కె.నాగబాబు సమర్పణలో లగడపాటి శిరీషా శ్రీధర్ నిర్మిస్తున్న ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. ఏప్రిల్ 27న సినిమా విడుదల చేస్తున్నారు. ‘‘మా సినిమా ఫస్ట్ ఇంపాక్ట్‌కి ఇంత మంచి రెస్పాన్స్ రావడం చాలా ఆనందంగా ఉంది. ఇందుకు ప్రపంచంలోని తెలుగు ప్రేక్షకులందరికి నా ధన్యవాదాలు’’ అన్నారు అల్లు అర్జున్. ఇందులో అనూ ఇమ్మాన్యుయేల్ కథానాయిక. యాక్షన్ కింగ్ అర్జున్, శరత్ కుమార్ ప్రధానపాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: రాజీవ్ రవి, సంగీతం: విశాల్–శేఖర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: బాబు, సహ నిర్మాత: బన్నీ వాసు.



అల్లు అర్జున్

బర్త్‌డే మంత్‌లో స్టార్ట్!

ఇక్కడ రాజమౌళి, ఎన్టీఆర్, రామ్‌చరణ్... ముగ్గురి ఫొటోలున్నాయి. ఎవరి బర్త్‌డే మంత్‌లో ఏం స్టార్ట్ కాబోతోంది అనుకుంటున్నారా? పుట్టిన రోజు నెల రాజమౌళిది. స్టార్ట్ కాబోతున్నది సినిమా. ఎన్టీఆర్, రామ్‌చరణ్ క్రేజీ కాంబినేషన్‌లో రాజమౌళి ఓ సినిమా ప్లాన్ చేస్తున్నారనే విషయం తెలిసిందే. ఈ సినిమాను ఎప్పుడు మొదలుపెడతారు? అనే విషయంలో చిన్నపాటి క్లారిటీ వచ్చింది. అక్టోబర్‌లో స్టార్ట్ చేయాలనుకుంటున్నారట. రాజమౌళి పుట్టింది ఆ నెలలోనే. పదో నెల పదో తేదీన పుట్టారు. ప్రస్తుతం స్క్రిప్ట్ వర్క్ జరుగుతోంది. మరోవైపు ఎన్టీఆర్ త్వరలో త్రివిక్రమ్‌తో సినిమా మొదలుపెట్టనున్నారు. అక్టోబర్‌కల్లా ఈ మూవీ కంప్లీట్ అవుతుంది. ఇక రామ్‌చరణ్ ఆల్రెడీ ‘రంగస్థలం’తో బిజీగా ఉన్నారు. ఈ నెలలోనే ఈ సినిమా పూర్తవుతుంది. ఇదే నెలలోనే బోయపాటి దర్శకత్వంలో చరణ్ చేయనున్న సినిమా మొదలవుతుంది. ఇది కూడా అక్టోబర్‌కల్లా పూర్తయిపోతుంది. సో.. రాజమౌళి సినిమా చేయడానికి ఎన్టీఆర్, రామ్‌చరణ్ పదో నెలకి ఫ్రీ అయిపోతారు. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ని డీవీవీ దానయ్య నిర్మించనున్నారు.



రామ్‌చరణ్



ఎన్టీఆర్



రాజమౌళి

ముగ్గు-ముచ్చట

21 చుక్కలు
1 వచ్చే వరకు






ఎస్. శ్రీవాణి
కురబలకోట
చిత్తూరు జిల్లా



కనుకుంట్ల ఉమారాణి
న్యూ విద్యానగర్ కాలనీ
నల్లగొండ

21 చుక్కలు
7 వరుసలు
7 వచ్చే వరకు

24 చుక్కలు
2 వచ్చేవరకు
2 వరుసలు



కె. విజయదుర్గ
కోటనెమలిపురి
గుంటూరు జిల్లా

ముగ్గులకు ఆహ్వానం ముగ్గులు పంపవలసిన చిరునామా ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ, 6-3-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. muggulu.sakshi@gmail.com



● షారుక్ ఖాన్

అది బిడియమా? పొగరా?




● జాన్వీ కపూర్

జాన్వీ కపూర్ డాటరాఫ్ శ్రీదేవి గురించి బాలీవుడ్‌లో చాలామంది చేస్తున్న కామెంట్ 'తనకు బిడియమా? పొగరా' అని. సెలబ్రిటీల వారసులకు కొన్ని తిప్పలు తప్పవు. ఎక్కడికెళ్లినా, ఏం చేసినా టాపిక్కే. జాన్వీ కపూర్ అయితే సినిమాల్లోకి రాకముందు నుంచీ వార్తల్లో నిలిచింది.

ఎక్కడ కనిపించినా కెమెరాలు వెంటాడుతుంటాయి. రూమర్స్ క్రియేట్ చేయడానికి ఔత్సాహికరాయుళ్లు ఎలానూ ఉంటారు. ఇక, సినిమాల్లోకొచ్చేస్తే డోస్ ఇంకా పెరుగుతుంది. ప్రస్తుతం జాన్వీ 'ధడక్' చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో ఇషాన్ కట్టర్ హీరో. ఈ ఇద్దరూ కలసి సరదాగా డిన్నర్‌కి వెళ్లారు. డిన్నర్ అంతా బాగానే సాగింది. ఫైనల్లీ 'మళ్లీ కలుద్దాం' అంటూ ఇషాన్ బై చెప్పి వెళుతుండగా, ఓ కుర్రాడు జాన్వీ దగ్గరకొచ్చి 'సెల్ఫీ ప్లీజ్' అన్నాడు. జాన్వీ అతన్ని లెక్క చేయకుండా అక్కణ్ణుంచి నిష్క్రమించింది. పాపం.. టీనేజ్ అమ్మాయి. ఎంత సినిమా వాతావరణంలో పెరిగినా ఫ్యాన్స్ దూసుకొస్తే కంగారుగానే ఉంటుంది కదా. బహుశా సెల్ఫీ ఇవ్వాలో లేదో తెలియక జాన్వీ తికమకపడిం దేమో అన్నది కొందరి అభిప్రాయం. ఇంకొందరు మాత్రం 'అది బిడియమా? పొగరా?' అనే ప్రచారం మొదలుపెట్టారు. కానీ, మొదటిదే కరెక్ట్ అయ్యుండొచ్చేమో.

నోలన్ - అమితాబ్ మీట్.. దేనికోసం!?



● అమితాబ్

హాలీవుడ్ సూపర్‌స్టార్ డైరెక్టర్ క్రిస్టఫర్ నోలన్ ఫ్యాన్స్‌కు ఒక శుభవార్త! ఆయన మార్చి నెలలో ఇండియా వస్తున్నారట!! హాలీవుడ్ సినిమా పరిచయమున్న ఈ తరం ఇండియన్ సినీ అభిమానికి నోలన్ పేరు ఎక్కడో ఓ దగ్గర వినిపించే ఉంటుంది. అలాంటి సినిమాలు తీశారాయన. ఈ డిజిటల్ యుగంలోనూ ఫిల్మ్‌పైనే సినిమా తీస్తానని పట్టుబట్టి, ఆ రకంగానూ పాత ట్రెండ్‌నే కొత్తగా పరిచయం చేసిన నోలన్ ఇండియా వస్తున్నారన్న విషయాన్ని బిగ్ బీ అమితాబ్ బచ్చన్ స్వయంగా తెలియజేశారు.

నోలన్ ఇండియా రావడానికి, బిగ్ బీ అది అనౌన్స్ చేయడానికి సంబంధం ఏంటనేగా? వీరిద్దరి కాంబినేషన్లో ఏదైనా సినిమా వస్తుందా అని కూడా అనేసుకుంటున్నారా? ప్రస్తుతానికి అదైతే కాదు కానీ, కొడాక్ కంపెనీ ఇండియాలో ఫెసిలిటీ లాంచ్ చేస్తోంది. ఇప్పుడు మరుగున పడిన ఫిల్మ్‌కు మళ్లీ క్రేజ్ తెచ్చే దిశగా, ఫిల్మ్‌లో కింగ్ అనిపించుకున్న కొడాక్ కంపెనీ ప్రయత్నిస్తోందట. అందుకే డిజిటల్ నుంచి సినిమాను ఫిల్మ్ వైపుకు మళ్లిస్తోన్న నోలన్ చేతుల మీదుగా లాంచ్ చేస్తే బాగుంటుందని ఆయనను ఇన్వైట్ చేసిందట. అంటే త్వరలోనే ఈ సూపర్‌స్టార్స్‌ను ఒక దగ్గర చూడొచ్చు! 2012 తర్వాత నోలన్ మళ్లీ ఇండియా రాలేదు. దీంతో ఇది ఆయన అభిమానులకు స్పెషల్ అకేషనే!!

బాలీవుడ్ స్పైస్



● అటల్ బిహారీ వాజపేయి

యుగపురుష్

టాలీవుడ్ టు బాలీవుడ్ ఇప్పుడంతా బయోపిక్ (జీవిత కథ) సీజన్ నడుస్తోంది. తెలుగులో మహానటి సావిత్రి, తెలంగాణ ముఖ్యమంతి కేసీఆర్ బయోపిక్‌లు తెర కెక్కుతుండగా, ఎన్టీఆర్ బయోపిక్‌లు సెట్స్‌పైకి వెళ్లనున్నాయి. తెలుగు క్రీడాకారులు సానియా మీర్జా, సైనా నెహ్వాల్, పుల్లెల గోపీచంద్, పీవీ సింధులతో పాటు శివసేన అధినేత బాల్ ఠాక్రే, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, బాలీవుడ్ నటుడు సంజయ్‌దత్ తదితరుల బయోపిక్స్ తెరకెక్కుతున్నాయి. తాజాగా ఈ జాబితాలోకి మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజపేయి బయోపిక్ కూడా చేరింది. 'యుగపురుష్ అటల్' టైటిల్‌తో ఈ చిత్రం రూపొందనుంది. 'కాలా సచ్' ఫేమ్ మయాంక్ పి. శ్రీ వాస్తవ దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కనుంది. స్పెక్ట్రమ్ మూవీస్ పతాకంపై రాజీవ్ ధమీజా, అమిత్ జోషి, రంజిత్ శర్మ ఈ సినిమా నిర్మించనున్నారు. వాజపేయి గతంలో రాసిన ఓ కవిత్వం ఆధారంగా సంగీత దర్శకుడు బప్పీ లహరి 'యుగపురుష్ అటల్' చిత్రంలోని ఓ పాటకు సంగీతం అందించడం విశేషం. త్వరలో ఈ సినిమా పట్టాలెక్కనుంది.

పర్సనల్.. పర్సనల్...





● ఆనంద్‌తో సోనమ్

బాలీవుడ్ అభిమానులకు సినిమాలు ఎంత ఎంటర్‌టైన్‌మెంటో.. ఆ సినిమాల్లోని స్టార్స్ పర్సనల్ విషయాలూ అంతే ఎంటర్‌టైన్‌మెంట్! పర్సనల్ అంటే ముఖ్యంగా వాళ్ల ఫేవరెట్ స్టార్స్ ఎవరితో డేట్ చేస్తున్నారు? ఎవరెవరు ప్రేమించుకుంటున్నారు? ఎవరి పెళ్లి ఎప్పుడు జరుగుతుంది? ఎవరెవరు గొడవ పడుతున్నారు? ఇలాంటివి. దీపికా, కత్రినా, సల్మాన్‌ఖాన్, రణ్‌బీర్ కపూర్, అనుష్క శర్మ.. ఇలా ఈ స్టార్స్ లవ్‌స్టోరీలన్నీ పాతబడిపోయాయి. ఇప్పుడు కొత్తగా ఓ లవ్‌స్టోరీ బాలీవుడ్ సర్కిల్లో బాగా చక్కర్లు కొడుతోంది. అదే మన సోనమ్ కపూర్-ఆనంద్ అహుజాలది. సోనమ్ కపూర్ బాలీవుడ్ స్టార్ హీరోయిన్లలో ఒకరు సరే, ఈ ఆనంద్ అహుజా ఎవరు? ఆనంద్.. సోనమ్ కపూర్ బాయ్‌ఫ్రెండ్. తనకంటూ ఒక స్టైల్ సెట్ చేసుకుంటోన్న బిజినెస్‌మేన్ ఆనంద్. ఇప్పుడు ఎక్కడ చూసినా ఈ జంట కబుర్లే! మొన్న కొత్త సంవత్సర వేడుకల కోసం కూడా ఈ జంట లండన్ వెళ్లింది. సెలెబ్రేషన్ అంతా అక్కడే! ఇద్దరూ కలిసి దిగిన ఫోటోలు, తీసుకున్న వీడియోలు.. సోషల్ మీడియాలో హల్‌చల్. ఇంకేముంది? అందరూ ''ఆనంద్‌తో లవ్వా?'' అని అడిగేస్తున్నారు సోనమ్‌ను. ''అవన్నీ పర్సనల్.. పర్సనల్.. చెప్పను. అలాగని దాచడానికీ ఏం లేదు..'' అనేసింది సోనమ్. సోనమ్ తండ్రి అనిల్ కపూర్ కూడా.. ''అది వాళ్ల పర్సనల్..'' అనేశాడు. వీళ్లు చెప్పకున్నా అభిమానులు మాట్లాడుకోకుండా ఉండరుగా!!

బాదుతా.. జీరో కాదు!

షారుక్ ఖాన్.. బాలీవుడ్ బాద్‌షా. సూపర్‌స్టార్. ఒక రెండు, మూడు తరాలను తన వైపుకు తిప్పేసుకున్న పాపులర్ ఫిగర్. అంతకుమించి.. ఇండియన్ సినిమాలో షారుక్ అంటే అదొక బ్రాండ్. చెప్పకోవడానికి ఇదంతా బాగానే ఉంది కానీ షారుక్ ఖాన్‌తో సరితూగే స్టార్‌డమ్ ఉన్న ఆమిర్ ఖాన్, సల్మాన్ ఖాన్ ఇప్పటికే చెరో రెండేసి 300కోట్ల క్లబ్‌లో చేరిపోయే సినిమాలనిచ్చారు. సల్మాన్ అయితే మరో వారంలో మూడో 300కోట్ల సినిమా ('టైగర్ జిందా హై') కూడా ఇస్తున్నాడు. షారుక్ మాత్రం 200కోట్ల క్లబ్ దగ్గరే ఆగిపోయాడు. ఎప్పటికైనా ఆయన 300కోట్ల క్లబ్‌లో చేరకపోతాడా అని అభిమానులంతా వెయిటింగ్!!

ఎప్పుడు మొదలైందీ 300కోట్ల క్లబ్..

ఆమిర్ ఖాన్ 'పీకే' సినిమాతో మొదలైందీ 300కోట్ల క్లబ్. 2014లో విడుదలైందీ సినిమా. ఆ తర్వాత వెంటనే 'భజరంగీ భాయ్‌జాన్'తో 300కోట్ల క్లబ్‌లో ఆమిర్ సరసన చేరిపోయాడు సల్మాన్ ఖాన్. ఇది 2015లో విడుదలైంది. 2016లో 'దంగల్', 'సుల్తాన్'లతో చెరో 300కోట్ల సినిమాలు ఖాతాలో వేసుకున్నారు ఆమిర్, సల్మాన్. 2017లో 'బాహుబలి 2' వచ్చేసి ఈ 300కోట్ల క్లబ్‌ను చాలా చిన్న విషయం చేసేసి 500కోట్ల క్లబ్‌ను సృష్టించింది. సరే, 'బాహుబలి 2' ఇండియన్ సినిమా ఐకాన్ అనుకుంటే, తాజాగా 'టైగర్ జిందా హై'తో మరో వారం రోజుల్లో సల్మాన్ మూడో 300కోట్ల సినిమా కొడుతున్నాడు. అంటే, 300కోట్ల క్లబ్ అనేది ఒకటి బాలీవుడ్‌లో మొదలై మూడేళ్లు అయింది. ఈ గ్యాప్‌లో షారుక్ నటించిన ఐదు సినిమాలొచ్చాయి. అందులో ఒక్కటీ ఈ 300కోట్ల క్లబ్‌కు దగ్గరకు కూడా రాలేకపోయింది. దీంతో షారుక్ పనైపోయింది అంటున్నారంతా! గతేడాది వచ్చిన 'జబ్ హ్యారీ మెట్ సాజల్' అయితే ఘోరంగా ఫ్లాప్ అయింది. కనీసం షారుక్ ఫ్లాప్ సినిమా అనే స్థాయిలో కూడా ఆ సినిమా ఆడలేదు. దీంతో అభిమానులు సైతం షారుక్ 300కోట్లు కొడతాడన్న ఆశలు వదిలేసుకున్నారు.



'జీరో' ఆశలు.. : షారుక్ అభిమానుల ఆశలు జీరో అయిపోతే, మళ్లీ 'జీరో' వచ్చి కొత్త ఆశలు పుట్టిస్తున్నాడు. ఇక్కడ జీరో షారుక్ కొత్త సినిమా పేరు. ఆ ఆశలకు కారణం, షారుక్ మళ్లీ ప్రయోగం చేయడమే! ఈసారి మరుగుజ్జు పాత్రలో కనిపిస్తూ షారుక్ మెప్పిస్తున్నాడు. కమర్షియల్ సినిమా కమర్షియల్ సినిమా అని ఫార్మాట్‌ను పట్టుకున్న బాలీవుడ్‌లో, షారుక్‌లాంటి స్టార్ ఇలా ఒక ప్రయోగం చేయడం విశేషమే! మరి ఆ 'జీరో' నిలబడతాడా? 300కోట్లు కొడతాడా?

'జీరో' జోక్స్..: జీరో టీజర్ మొన్న విడుదలైంది. దీని మీద వచ్చిన జోక్స్ నంబర్ కాదు జీరో. జీరో మీద వచ్చిన జోక్సే ఇప్పుడు ట్రెండింగ్! 'షారుక్ సినిమా విడుదలైతే థియేటర్లో ఉండే జనాల సంఖ్య', 'షారుక్ సినిమా బాక్సాఫీస్ వసూళ్లివి.' ఇలాంటి జోక్స్ లెక్కలేనన్ని వినిపిస్తున్నాయి 'జీరో' టైటిల్‌నే ఉద్దేశిస్తూ. ఆ జోక్స్ రోజురోజుకీ పెరిగిపోతూనే ఉన్నాయి. దీనంతటికీ కారణం, బాద్‌షా తన రేంజ్‌లో ఒక సాలిడ్ బాక్సాఫీస్ హిట్ ఇవ్వకపోవడమే!

మరి ఇన్ని సవాళ్ల మధ్య, ఇన్ని జోక్స్ మధ్య, ఇంత ట్రోలింగ్ మధ్య బాద్‌షా 'జీరో'తో అయినా 300కోట్ల క్లబ్‌లో చేరతాడా? తన బాక్సాఫీస్ స్టామినా ఏంటో నిరూపించుకుంటాడా? జోక్స్ చేస్తే చేసుకోవచ్చుగాక, కానీ అక్కడ ఉన్నది షారుక్ ఖాన్ అన్నది మరచిపోవద్దు. తన రేంజ్‌కి తగ్గ హిట్ కొడితే షారుక్‌కి ఇదేం పెద్ద విషయం కాకపోవచ్చు. కానీ టైమ్ రావాలి. 'జీరో'తో ఆ టైమ్ వస్తుందని ఫ్యాన్స్ నమ్ముతున్నారు. షారుక్ కూడా నమ్ముతున్నట్లే కనిపిస్తున్నారు. ఈ బాద్‌షా 300 కోట్లు బాదేట్లే ఉన్నాడు. డిసెంబర్ 21, 2018న విడుదలవుతుంది 'జీరో'. ఆనంద్.ఎల్ రాయ్ దర్శకుడు. ఆరోజు బాద్‌షా టైమ్ వస్తుందా? చూడాలి!!

ఎవరేమనుకున్నా నా నిర్ణయం అదే



● కరణ్ జోహార్

బాలీవుడ్‌లో ఎవరైనా టాప్ సెలబ్రిటీస్ వారసులను పరిచయం చేయాలంటే ముందుగా వినిపించేది దర్శక-నిర్మాత కరణ్ జోహార్ పేరు. ప్రస్తుతం అందాల తార శ్రీదేవి తనయ జాన్వీ కపూర్, షాహిద్ కపూర్ తమ్ముడు ఇషాన్ కట్టర్‌ను హిందీ తెరకు పరిచయం చేస్తున్నారు కరణ్ జోహార్. 'ధడక్' పేరుతో రూపొందుతున్న ఈ సినిమాకు కరణ్ జోహార్ నిర్మాతగా వ్యవహరించనున్నారు. మరాఠి సూపర్ హిట్ సినిమా 'సైరట్'కు ఇది అఫీషియల్ రీమేక్. న్యూ ఇయర్ సందర్భంగా జాన్వీ, ఇషాన్‌కు కరణ్ జోహార్ ఓ లేఖ రాశారు. 'కాలింగ్ కరణ్' షోలో దాన్ని చదివి వినిపించారు కూడా. ''మై డియర్ జాన్వీ, ఇషాన్ ఈ సంవత్సరంతో మీ లైఫ్‌లో సరికొత్త జర్నీ మొదలు కాబోతోంది. ఈ ఇయర్ మీకు చాలా ఫస్ట్ టైమ్ ఎక్స్‌పీరియన్స్‌లు ఇవ్వనుంది. తొలి సినిమా రిలీజ్, ప్రమోషన్స్, లింక్ అప్స్, క్రిటిసిజం, పొగడ్తలు, ఫేమ్, ఫెయిల్యూర్ ఇలా ఎన్నో చూడబోతున్నారు. మీకో చిన్న సలహా ఇవ్వాలనుకుంటున్నాను. వీటన్నింటిని అంత సీరియస్‌గా తీసుకోకండి. ఈ ఇనిషియల్ డేస్‌ను బాగా ఆస్వాదించండి. ఇవి మళ్లీ తిరిగి రావు. మీలోని బెస్ట్ క్వాలిటీస్ ఏంటంటే మీరింకా విద్యార్థులే. మీ నమ్మకాలు, మీ ఇన్నోసెన్స్ కోల్పోకుండా అలాగే ఉండాలని కోరుకుంటున్నాను'' అని చెప్పుకొచ్చారు కరణ్.

నో మోర్ డిప్లొమసీ: బాలీవుడ్ అగ్ర దర్శక-నిర్మాత కరణ్ జోహార్ న్యూ ఇయర్ సందర్భంగా కొన్ని న్యూ రిజల్యూషన్స్ తీసుకున్నారు. ఈ సంవత్సరం నుంచి నా మిత్రుల బర్త్‌డేస్‌కు స్వయంగా కలిసి విష్ చేయాలనుకుంటున్నాను. ఇక నుంచి ట్రైలర్స్ అయినా, సినిమాలైనా నాకు మనస్ఫూర్తిగా నచ్చితేనే పొగుడుతాను. ఇదీ వరకు డిప్లొమసి ప్రదర్శించినందుకు సారీ. నా సినిమాల ప్రమోషన్ విరివిగా చేసుకోవాలనుకుంటున్నాను... ఎవరేమనుకున్నా సరే... అంటూ తన నిర్ణయాలను ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు కరణ్.

రణ్‌బీర్ బ్రహ్మాస్త్రం తీశాడు..!



● రణ్‌బీర్ కపూర్, అయాన్ ముఖర్జీ ఆలియా భట్

రణ్‌బీర్ కపూర్‌పై బాలీవుడ్‌కు భారీ ఆశలున్నాయి. నెక్స్ట్ సూపర్‌స్టార్ రణ్‌బీరే అని అందరూ అనుకోవడం ఎప్పుడూ జరిగేదే! అయితే యాక్టింగ్ పరంగా ది బెస్ట్ అనిపించుకుంటాడు కానీ, బాక్సాఫీస్ వద్ద ఓ రేంజ్ హిట్ ఎప్పుడూ కొట్టలేక పోతుంటాడు. ప్రస్తుతానికి బాలీవుడ్ టాప్ డైరెక్టర్ రాజ్‌కుమార్ హిరానితో 'సంజు' సినిమా చేస్తున్నాడు రణ్‌బీర్. బాలీవుడ్ స్టార్ సంజయ్‌దత్ జీవిత కథ ఆధారంగా ఈ సినిమా తెరకెక్కుతోంది. మార్చిలో రిలీజ్. ఈ సినిమాతో రణ్‌బీర్ బాలీవుడ్‌లో టాప్ రేసులోకి దూసుకెళతాడని ట్రేడ్ భావిస్తోంది. దీని తర్వాత వచ్చే సినిమా కూడా అదే రేంజ్‌లో ఉండాలని రణ్‌బీర్ భావిస్తున్నాడట. అందుకే ఈసారి ఏకంగా బ్రహ్మాస్త్రం తీశాడు. బ్రహ్మాస్త్రం అంటే మామూలు విషయమా? శక్తులన్నీ కూడగట్టి బలాన్ని చూపించడం. 'వేక్ అప్ సిద్', 'యే జవానీ హై దీవానీ' సినిమాలతో తనకు సూపర్‌హిట్స్ ఇచ్చిన అయాన్ ముఖర్జీతో హ్యాట్రిక్ కోసం 'బ్రహ్మాస్త్ర' టైటిల్‌తో వచ్చేస్తున్నాడు రణ్‌బీర్. ఇందులో హీరోయిన్ ఆలియా భట్. అమితాబ్ బచ్చన్ కీ రోల్‌లో కనిపిస్తారు. ఇదొక సూపర్ హీరో జానర్ అని టాక్. ఫిబ్రవరిలో సెట్స్‌పైకి వెళుతుంది సినిమా. ఇప్పటికే టీమ్ ఇజ్రాయిల్‌లో లొకేషన్ హంట్‌లో ఉంది. 'సంజు', 'బ్రహ్మాస్త్ర' ప్లాన్ చేసినట్లుగా, అందరూ అనుకున్నట్లుగా పెద్ద కమర్షియల్ హిట్స్ అయిపోతే రణ్‌బీర్ టాప్ రేసులోకి వెళ్లినట్టే!!!

రేపటి నుంచి గేట్-2018 అడ్మిట్ కార్డుల డౌన్‌లోడ్

GATE 2018

గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్(గేట్)-2018 అడ్మిట్ కార్డులు ఈ నెల 5(శుక్రవారం) నుంచి ఆన్‌లైన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఐఐటీజీ వెబ్‌సైట్‌లో ఎన్‌రోల్‌మెంట్ ఐడీ లేదా రిజిస్టర్డ్ ఈమెయిల్ ఐడీ, పాస్‌వర్డ్ నమోదు చేసి కార్డును పొందవచ్చు. ఇందులో అభ్యర్థుల పేరు, రోల్ నెంబరు, పరీక్ష తేదీ, సమయంతోపాటు పరీక్ష కేంద్రం వివరాలూ ఉంటాయి. అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి అడ్మిట్‌కార్డుతోపాటు ఏదైనా గుర్తింపు ధ్రువపత్రం(పాస్‌పోర్ట్/ఆధార్ కార్డ్/పాన్ కార్డ్/ ఓటర్ ఐడీ/ డ్రైవింగ్ లైసెన్స్) తప్పకుండా తీసుకురావాలి. లేకపోతే పరీక్ష కేంద్రంలోకి అనుమతించరు. అడ్మిట్‌కార్డులు డౌన్‌లోడ్‌కు వెబ్‌సైట్: www.gate.iitg.ac.in

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా

సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్,
సాక్షి దినపత్రిక,
రోడ్ నంబర్-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

మాక్ టెస్టులతో మేలు



పరీక్షలకు నేరుగా హాజరయ్యే వారికి, ప్రాక్టీస్ చేసి పరీక్షకు వెళ్లే వారికి ఎంతో తేడా ఉంటుంది. పరీక్ష విధానం, సమయ పాలనపై ముందస్తు అవగాహన కలిగిన విద్యార్థులు ఎలాంటి ఆందోళన లేకుండా పరీక్ష రాస్తారు. నేరుగా ప్రధాన పరీక్షకు హాజరయ్యే వారు ఆందోళనచెందడంతోపాటు, సమయ పాలన పాటించలేరు. గేట్ మాక్ టెస్టుల ప్రాక్టీస్‌కు వీలు కల్పిస్తూ.. గేట్ నిర్వాహక సంస్థ ఐఐటీ గువహటి మాక్ ప్రాక్టీస్ టెస్టుల లింక్‌ను అభ్యర్థులకు అందుబాటులో ఉంచింది. గేట్‌ను పూర్తిగా ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్న దృష్ట్యా ఈ మాక్ టెస్టులను ప్రాక్టీస్ చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. .మాక్ టెస్టులు రాయడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి తెలుసుకుందాం..

గేట్ 2018

ఎంటెక్, ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ, పీహెచ్‌డీ, ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగాలు.. ఇలా పలు ప్రయోజనాలున్న గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్(గేట్) పరీక్షను 2018 ఫిబ్రవరి 3, 4, 10, 11 తేదీల్లో ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నారు. ఈ పరీక్షలో మెరిసేందుకు మాక్ టెస్టులు ఎంతో ఉపకరిస్తాయి. అధికారిక వెబ్‌సైట్ www.gate.iitg.ac.inలో మాక్‌టెస్టులు ప్రాక్టీస్ చేసుకోవచ్చు.

ఈ బ్రాంచీల వారికి మాక్ టెస్టులు

ఏరోస్పేస్ ఇంజనీరింగ్, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్, ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్, బయోటెక్నాలజీ, సివిల్, కెమికల్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కెమిస్ట్రీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎకాలజీ అండ్ ఎవాల్యూషన్, జియాలజీ అండ్ జియోఫిజిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్, మెకానికల్ ఇంజనీరింగ్, మైనింగ్ ఇంజనీరింగ్, మెటలర్జికల్ ఇంజనీరింగ్, పెట్రోలియం ఇంజనీరింగ్, ఫిజిక్స్, ప్రొడక్షన్ అండ్ ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్, టెక్స్‌టైల్ ఇంజనీరింగ్ అండ్ ఫైబర్ సైన్స్, ఇంజనీరింగ్ సైన్సెస్, లైఫ్ సైన్సెస్.

పరీక్ష శైలిపై అవగాహన

మాక్ టెస్ట్‌ల వల్ల కలిగే మొదటి ప్రయోజనం.. పరీక్ష శైలిపై అవగాహన. మాక్ టెస్టులు పూర్తిగా వాస్తవ పరీక్ష తరహాలో ఉండటం వల్ల గేట్ పరీక్ష శైలిపై పూర్తి అవగాహన కలుగుతుంది. ప్రశ్నలు అడిగే తీరు, ఏ తరహా ప్రశ్నలు వస్తాయి? వంటి వాటి విషయంలో స్పష్టత వస్తుంది. గేట్ పరీక్ష ఔత్సాహికుల్లో దాదాపు అందరూ ఇంజనీరింగ్ నేపథ్యం ఉన్నవారే హాజరవుతుండటంతో ఆన్‌లైన్ పరీక్ష విధానంలో పెద్దగా ఇబ్బందులు ఎదురుకాకపోవచ్చు. కానీ కంప్యూటర్‌పై అంతగా పట్టులేని గ్రామీణ విద్యార్థులు.. ఆన్‌లైన్ పరీక్షకు సిద్ధం కావడానికి ఇప్పటి నుంచైనా కృషిచేయాలి. వీలైనన్ని మాక్ టెస్టులు ప్రాక్టీస్ చేయాలి.

ఒత్తిడికి దూరం

మాక్‌టెస్టులతో పరీక్ష ఒత్తిడి నుంచి బయటపడవచ్చు అంటున్నారు నిపుణులు. పరీక్ష పట్ల ఉండే భయాన్ని దూరం చేస్తాయి మాక్‌టెస్టులు. అప్పటికే పరీక్ష రాసిన భావన ఉండటంతో విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా.. ఎగ్జామ్ డే టెన్షన్ నుంచి ఉపశమనం పొందొచ్చు. మాక్ టెస్టులతో పరీక్ష సమయంలో అనుసరించాల్సిన విధానంపైనా అవగాహన ఏర్పడుతుంది. దీంతో మెరుగ్గా పరీక్ష రాస్తారు.

టాప్‌స్కోరుకు టిప్స్

- ప్రాథమిక భావనలపై పట్టు
- ఏకాగ్రత, సాధించాలనే తపన
- తెల్లవారుజామున(ఎర్లీమార్నింగ్) స్టడీ
- ఎక్కువసార్లు పునశ్చరణ(రివిజన్)
- వీలైనన్ని ఆన్‌లైన్, మాక్ టెస్టుల సాధన
- గత ప్రశ్నపత్రాలను సాధన చేయాలి

మాక్ టెస్ట్స్ ప్రయోజనాలు

- ఎగ్జామ్ ప్యాట్రన్‌పై అవగాహన
- టైం మేనేజ్‌మెంట్ అలవడుతుంది
- సబ్జెక్టులలో నైపుణ్యం స్థాయిపై అవగాహన
- సమాధానాలివ్వాల్సిన తీరు తెలుస్తుంది
- వీలైన సమయంలో హాజరయ్యే అవకాశం
- ప్రిపరేషన్‌ను మెరుగుపరచుకునే ఆస్కారం
- నిరంతరం ప్రోగ్రెస్‌ను సమీక్షించుకునే వీలు
- ఎగ్జామ్ డే ఒత్తిడి నుంచి ఉపశమనం

పరీక్ష రోజు ఇలా

- ప్రశాంతంగా ఉండాలి.
- పరీక్షకు ముందు ముఖ్యమైన పాయింట్స్ మాత్రమే చదవాలి.
- పరీక్ష కేంద్రం, ప్రదేశం గురించి ముందుగానే తెలుసుకోవాలి.
- పరీక్షకు కావలసిన హాల్‌టికెట్, పెన్ను, గుర్తింపు కార్డు మొదలైనవ్నీ చెక్ చేసుకోవాలి.
- సానుకూల దృక్పథంతో పరీక్షకు హాజరుకావాలి.
- ఆందోళన చెందొద్దు.
- చివరి నిమిషంలో చదివి గందరగోళానికి గురి కావద్దు.
- అతి విశ్వాసం ప్రదర్శించవద్దు.

రైల్వే.. కొలువులు



జాబ్ ఇన్ఫో

భారత రైల్వే.. రవాణా వ్యవస్థకు వెన్నుముక. దేశంలో రైల్వేరవాణా భౌగోళికంగా కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు విస్తరించి.. ప్రయాణికులతోపాటు వస్తువుల రవాణాకు పెద్ద దిక్కుగా నిలుస్తోంది. రైల్వేలో పెద్ద సంఖ్యలో ఖాళీలు ఉన్నట్లు ఆ శాఖ మంత్రి పీయూష్ గోయల్ ఇటీవల పార్లమెంట్‌లో వెల్లడించారు. ఈ ఏడాది ఏప్రిల్ 1 నాటికి వివిధ జోన్లల్లో గెజిటెడ్, నాన్ గెజిటెడ్ కేటగిరీల్లో మొత్తంగా 2,22,159 ఖాళీలు ఉన్నట్లు ఆయన లోక్‌సభలో ఓ పార్లమెంట్ సభ్యుడు అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఈ ఖాళీల్లో గ్రూప్-ఏ మొదలు గ్రూపు-డీ వరకు పోస్టులు ఉన్నాయి. ఈ ఖాళీలను నిర్వహణ అవసరాల మేరకు భర్తీ చేసే అవకాశముంది.

ఆరునెలల్లోనే భర్తీ

రైల్వే బోర్డులు చేపట్టే నియామకాలు పూర్తికావడానికి ఏళ్ల కొద్దీ పడుతుందనే విమర్శ ఉంది. ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహిస్తున్నా.. తుది ఫలితాల వెల్లడికి సుదీర్ఘం కాలం పడుతోంది. దరఖాస్తు ప్రక్రియ మొదలు, తుది ఫలితాలు వెలువడే సరికి దాదాపు రెండేళ్లు పడుతుంది. దీంతో అభ్యర్థులుప్రత్యామ్నాయ ఉద్యోగ అవకాశాలు వెతుక్కోవడంతోపాటు రైల్వే రిక్రూట్‌మెంట్స్‌పై నమ్మకం కోల్పోయే పరిస్థితి. ఈ నేపథ్యంలో ఇటీవల రైల్వే బోర్డు చైర్మన్.. నియామక ప్రక్రియ వేగవంతం చేయాలని రైల్వేబోర్డ్ జోనల్ అధికారులకు సూచించారు. ఆయా నోటిఫికేషన్లకు భర్తీ ప్రక్రియను ఆరు నెలలలోపే పూర్తి చేసేలా డెడ్‌లైన్లు విధించుకోవాలని పేర్కొన్నారు.

'సేఫ్టీ' పోస్టులే ఎక్కువ

- దేశంలో వరుసగా రైల్వే ప్రమాదాలు చోటుచేసుకోవడంతో అప్రమత్తమైన రైల్వేశాఖ.. ఉద్యోగుల కొరత కూడా ప్రమాదాలకు ప్రధాన కారణమని భావించింది. జోన్లవారిగా ఉన్న ఖాళీల వివరాలు సేకరించిన రెల్వే బోర్డు.. ఎక్కువగా సేఫ్టీ సంబంధిత ఉద్యోగ ఖాళీలు ఉన్నట్లు గుర్తించింది. వీటిల్లో డ్రైవర్, గార్డులు, గ్యాంగ్‌మెన్, ఇతర టెక్నికల్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలుస్తోంది.

RPF

అసిస్టెంట్ లోకోపైలట్, టెక్నీషియన్ పోస్టులు

- అసిస్టెంట్ లోకోపైలట్, టెక్నీషియన్ పోస్టులకు నోటిఫికేషన్లు వెలువడే అవకాశముంది. దాదాపు ఈ రెండు పోస్టులకు ఒకేసారి నోటిఫికేషన్లు వెలువడుతాయి.

అర్హతలు: అసిస్టెంట్ లోకోపైలట్ పోస్టులకు పదోతరగతితోపాటు ఐటీఐ లేదా మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్ ఇంజనీరింగ్‌లో డిప్లొమా లేదా ఉన్నత స్థాయి కోర్సులు పూర్తిచేసిన వారు అర్హులు.



- టెక్నీషియన్ కేటగిరీలో పలు ఉద్యోగాల ఖాళీలు ఉన్నాయి. వీటికి అర్హతలు వేర్వేరుగా ఉంటాయి. జాబ్ ప్రొఫైల్ ఆధారంగా పదో తరగతితోపాటు ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి. లేదా మ్యాథమెటిక్స్, ఫిజిక్స్‌లతో 10+2 ఉత్తీర్ణత అవసరం లేదా డిప్లొమా పూర్తి చేసి ఉండాలి. కొన్ని టెక్నీషియన్ పోస్టులకు పదో తరగతితోపాటు ఆయా విభాగాల్లో ఐటీఐ చదివి ఉండాలి.

రాత పరీక్ష: అసిస్టెంట్ లోకో పైలట్, టెక్నీషియన్ పోస్టులకు ఉమ్మడి రాత పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. దేశంలోని ఆర్‌ఆర్‌బీలన్నీ ఒకే రోజు పరీక్ష నిర్వహిస్తాయి. అభ్యర్థులు తాము దరఖాస్తు చేసుకున్న బోర్డు పరిధిలో పరీక్ష రాయొచ్చు. పరీక్షలో 100 నుంచి 120 ప్రశ్నలు ఉంటాయి. నెగిటివ్ మార్కింగ్ కూడా ఉంది. ప్రశ్నపత్రంలో జనరల్ అవేర్‌నెస్, అర్థమెటిక్, జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్, జనరల్ సైన్స్ అండ్ టెక్నికల్ ఎబిలిటీకి సంబంధించిన ప్రశ్నలు ఉంటాయి.

ఎంపిక: అసిస్టెంట్ లోకో పైలట్‌కు మొత్తం మూడు దశల్లో ఎంపిక విధానం ఉంటుంది. మొదటి దశలో రాత పరీక్ష, తర్వాత ఆప్టిట్యూడ్ టెస్ట్, చివరగా మెడికల్ టెస్ట్ నిర్వహిస్తారు. టెక్నీషియన్ పోస్టులకు రాత పరీక్ష ద్వారా నియామకాలు జరుపుతారు.

ఇంజనీరింగ్ పోస్టులు

రైల్వే నుంచి రాబోయే నోటిఫికేషన్లలో ముఖ్యమైనవి.. జూనియర్ ఇంజనీర్, సీనియర్ సెక్షన్ ఇంజనీర్ ఉద్యోగాలు. ఈ పోస్టుల సంఖ్య ఎక్కువగా ఉండే అవకాశముంది. వీటికి డిప్లొమా, ఇంజనీరింగ్ ఉత్తీర్ణులు అర్హులు. సీనియర్ సెక్షన్ ఇంజనీర్/సీనియర్ సెక్షన్ రీసెర్చ్ ఇంజనీర్/ఇంజనీర్ పోస్టులకు-సంబంధిత బ్రాంచీలో నాలుగేళ్ల ఇంజనీర్ డిగ్రీ(బీఈ/బీటెక్) ఉండాలి. జూనియర్ ఇంజనీర్ పోస్టులకు సంబంధిత బ్రాంచీలో ఇంజనీరింగ్ డిప్లొమా అవసరం. గత నోటిఫికేషన్ ప్రకారం- కెమికల్ అండ్ మెటలర్జికల్ అసిస్టెంట్ పోస్టులకు-మెటలర్జీ/కెమికల్ ఇంజనీర్‌లో డిగ్రీ లేదా ఎమ్మెస్సీ కెమిస్ట్రీ లేదా అప్లయిడ్ కెమిస్ట్రీ చేసిన వారికి అవకాశం ఇచ్చారు. ఈ పోస్టుల ఎంపికలో ఆన్‌లైన్ టెస్టులో వచ్చిన మార్కుల ఆధారంగానే ఎంపిక ఉంటుంది. ఇంటర్వ్యూలు ఉండవు.

గ్రూప్-డి పోస్టులు

- రైల్వేలో పదోతరగతి లేదా ఐటీఐ లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణతతో కొన్ని ఉద్యోగ ప్రకటనలు వెలువడుతుంటాయి. వాటిల్లో ప్యూన్, హెల్పర్, కామాటి, సఫాయివాలా, గ్యాంగ్‌మెన్ మొదలైన పోస్టులు ఉంటాయి. రాతపరీక్ష, ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్‌ల ఆధారంగా ఎంపిక జరుగుతుంది. అన్ని పోస్టుల కంటే ఈ ఖాళీలే ఎక్కువగా ఉండే అవకాశముంది.
- ఇక ముఖ్యంగా రైల్వే ప్రొటక్షన్ ఫోర్స్(ఆర్‌పీఎఫ్) విభాగంలో అతిపెద్ద ఉద్యోగ నోటిఫికేషన్‌ను విడుదల చేసేందుకు రైల్వే శాఖ యోచిస్తుంది. రైల్వేశాఖలో ఆర్పీఎఫ్ ఉద్యోగానికి పదోతరగతి ఉత్తీర్ణత అర్హతగా కేటాయించారు. 18 నుంచి 25 ఏళ్ల వయస్సు ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

నాన్ టెక్నికల్ పాపులర్ కేటగిరీ (ఎన్‌టీపీసీ) పోస్టులు



డిగ్రీ ఉత్తీర్ణతతోఈ కేటగిరీ కింద పలు ముఖ్యమైన ఉద్యోగాలకు ప్రకటన విడుదల అయ్యే అవకాశం ఉంది. కమర్షియల్ అప్రెంటీస్, ట్రాఫిక్ అప్రెంటీస్, ఎంక్వైరీ కమ్ రిజర్వేషన్ క్లర్క్, గూడ్స్ గార్డ్, జూనియర్ అకౌంట్స్ అసిస్టెంట్/టైపిస్ట్, సీనియర్ క్లర్క్ కమ్ టైపిస్ట్, అసిస్టెంట్ స్టేషన్ మాస్టర్, ట్రాఫిక్ అసిస్టెంట్, సీనియర్ టైం కీపర్... లాంటి పోస్టులకు ఉమ్మడిగా నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశముంది. కొన్ని పోస్టులకు స్పెషలైజ్డ్ విద్యార్హతలు అడుగుతారు. కంప్యూటర్ పరిజ్ఞానం కూడా పరీక్షించే వీలు ఉంటుంది.

అంతా ఆన్‌లైనే

దరఖాస్తు ప్రక్రియ మొదలు కంప్యూటర్ టైపింగ్ టెస్ట్ వరకు అంతా ఆన్‌లైన్‌లోనే నిర్వహిస్తారు. ఇది అభ్యర్థులకు కలిసొచ్చే అంశం. దరఖాస్తులు, పరీక్షలు, ఫలితాలు.. ఇలా మొత్తం నియామక ప్రక్రియ త్వరగా పూర్తవుతుంది.

- ముఖ్య సమాచారం కోసం ఎప్పటికప్పుడు వెబ్‌సైట్: http://rrbsecunderabad.nic.in/ చూడవచ్చు.

ప్రపంచ ర్యాపిడ్ టైటిల్ నెగ్గిన విశ్వనాథన్ ఆనంద్

కాంపిటీటివ్ గైడెన్స్

కరెంట్ అఫైర్స్

అంతర్జాతీయం

చైనా, పాక్, అఫ్గాన్ విదేశాంగ మంత్రుల భేటీ



చైనా, పాకిస్థాన్, అఫ్గానిస్థాన్ విదేశీ వ్యవహారాల మంత్రుల తొలి త్రైపాక్షిక సమావేశం డిసెంబర్ 26న బీజింగ్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఉగ్రవాదులతో సంబంధాలు కలిగిన సంస్థలు, బృందాలు, వ్యక్తులకు తమ భూభాగాల్లో ఆశ్రయం కల్పించరాదని మూడు దేశాలు తీర్మానించాయి. సమావేశానికి అధ్యక్షత వహించిన చైనా విదేశీ వ్యవహారాల మంత్రి వాంగ్ యి మాట్లాడుతూ అఫ్గానిస్థాన్ ఒప్పుకుంటే చైనా-పాకిస్థాన్ ఆర్థిక నడవా(సీపీఈసీ)ను అఫ్గాన్ వరకు విస్తరిస్తామని ప్రతిపాదించారు.

ఈజిప్ట్ మాజీ అధ్యక్షుడికి మూడేళ్లు జైలు

న్యాయ వ్యవస్థను దూషించినందుకు ఈజిప్ట్ మాజీ అధ్యక్షుడు మొహమ్మద్ మోర్సీకి ఆ దేశ న్యాయస్థానం డిసెంబర్ 30న మూడేళ్ల జైలుశిక్షతోపాటు 20 లక్షల పౌండ్ల జరిమానా విధించింది.

లైబీరియా కొత్త అధ్యక్షుడిగా జార్జ్ వేహ్

లైబీరియాలో జరిగిన ఎన్నికల్లో దేశ అధ్యక్షుడిగా జార్జ్ వేహ్ ఎన్నికైనట్లు ఎన్నికల బోర్డ్ డిసెంబర్ 29న ప్రకటించింది. ఆయన జనవరి 22న అధ్యక్ష పదవి చేపట్టనున్నారు.

జాతీయం

తలాక్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం



ట్రిపుల్ తలాక్ పద్ధతిని నేరంగా పరిగణించే ముస్లిం మహిళల వివాహ హక్కుల రక్షణ బిల్లు-2017ను లోక్‌సభ డిసెంబర్ 28న మూజువాణి ఓటుతో ఆమోదించింది. ఈ బిల్లు చట్టంగా మారితే ఏ రూపంలో ట్రిపుల్ తలాక్ చెప్పినా నేరమే అవుతుంది. అలాంటి వారికి మూడేళ్ల జైలుశిక్ష, జరిమానా విధిస్తారు.

అసోం తొలి ఎన్‌ఆర్‌సీ ముసాయిదా విడుదల

జాతీయ పౌర రిజిస్టర్(ఎన్‌ఆర్‌సీ-నేషనల్ రిజిస్ట్రార్ ఆఫ్ సిటిజన్స్) తొలి ముసాయిదాను అసోం జనవరి 1న ప్రచురించింది. రాష్ట్రంలోని మొత్తం 3.29 కోట్ల దరఖాస్తుదారుల్లో 1.9 కోట్ల మంది పేర్లను ఇందులో చేర్చారు.

బ్రహ్మపుత్రలో జలరవాణా ప్రారంభం

కేంద్ర నౌకాయాన శాఖ మంత్రి నితిన్ గడ్కరీ డిసెంబర్ 29న బ్రహ్మపుత్ర నదిలో పాండు-ధుబ్రి మధ్య కార్గో రవాణాను ప్రారంభించారు. ఎగువ అసోంలోని సాదియా నుంచి పశ్చిమ బెంగాల్ సరిహద్దుల్లోని ధుబ్రి మధ్య బ్రహ్మపుత్ర నదిలో 891 కి.మీ. పొడవున అభివృద్ధి చేసిన జలరవాణా మార్గాన్ని జాతీయ జలమార్గం-2గా ప్రకటించారు. దీన్ని ప్రారంభించడంతో 300 కి.మీ. మేర రహదారి ప్రయాణం తగ్గడంతోపాటు రవాణా ఖర్చులు ఆదా అవుతాయి.

వార్తల్లో వ్యక్తులు

గుజరాత్ సీఎంగా రూపానీ ప్రమాణస్వీకారం



గుజరాత్ ముఖ్యమంత్రిగా విజయ్ రూపానీ వరుసగా రెండోసారి డిసెంబర్ 26న ప్రమాణస్వీకారం చేశారు. ఉప ముఖ్యమంత్రిగా నితిన్ పటేల్, మరో 18 మంది మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా, ఆ పార్టీ అగ్రనేత ఎల్‌కే అద్వానీ, పలువురు కేంద్రమంత్రులు, బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎం లు, బిహార్ సీఎం నితీశ్ కుమార్ తదితరులు హాజరయ్యారు.

విదేశాంగ కార్యదర్శిగా విజయ్ గోఖలే

సీనియర్ దౌత్యవేత్త విజయ్ కేశవ్ గోఖలే భారత విదేశాంగ శాఖ కార్యదర్శిగా జనవరి 1న నియమితులయ్యారు. గోఖలే రెండేళ్లపాటు పదవిలో కొనసాగుతారు.

ఏపీ డీజీపీగా మాలకొండయ్య



ఆంధ్రప్రదేశ్ నూతన డీజీపీగా డా.ఎం.మాలకొండయ్య డిసెంబర్ 31న బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ మాన్యువల్ ఆధారంగా నేర నియంత్రణకు కృషి చేస్తానన్నారు.

హిమాచల్ సీఎంగా ఠాకూర్ ప్రమాణస్వీకారం

హిమాచల్‌ప్రదేశ్ 14వ ముఖ్యమంత్రిగా జైరాం ఠాకూర్ డిసెంబర్ 27న ప్రమాణస్వీకారం చేశారు. ఆయనతోపాటు 11 మంది మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రధానితోపాటు పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

సైన్స్ అండ్ టెక్నాలజీ

మణిపూర్ వర్సిటీలో ఇండియన్ సైన్స్ కాంగ్రెస్

105వ ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌కు ఇంఫాల్‌లోని మణిపూర్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ మేరకు ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అసోసియేషన్ డిసెంబర్ 27న ప్రకటన చేసింది. సైన్స్ కాంగ్రెస్ మార్చిలో జరగనుంది.

సూపర్‌సోనిక్ క్షిపణి పరీక్ష విజయవంతం

స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన అడ్వాన్స్‌డ్ ఎయిర్ డిఫెన్స్(ఏఏడీ) సూపర్‌సోనిక్ క్షిపణిని భారత్ డిసెంబర్ 28న ఒడిశాలోని బాలాసోర్ నుంచి విజయవంతంగా పరీక్షించింది. దీనికి 30 కి.మీ.ఎత్తులో శత్రు క్షిపణిని నేలకూల్చే సామర్థ్యం ఉంది.

రాష్ట్రీయం

గుంటూరులో భారత ఆర్థిక సంఘం సదస్సు

భారత ఆర్థిక సంఘం(ఐఈఏ) శత వార్షిక సదస్సును రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ డిసెంబర్ 27న గుంటూరులోప్రారంభించారు. ఈ సదస్సు డిసెంబర్ 30 వరకు జరిగింది. ప్రారంభ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్, సీఎం చంద్రబాబునాయుడు, నోబెల్ పురస్కార గ్రహీత మహమ్మద్ యూనస్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఫైబర్ గ్రిడ్ ప్రాజెక్ట్ జాతికి అంకితం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన ఏపీ ఫైబర్ గ్రిడ్ ప్రాజెక్ట్‌ను భారత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ డిసెంబర్ 27న వెలగపూడిలోని సచివాలయంలో జాతికి అంకితం చేశారు. ఇళ్లు, వ్యాపార సంస్థలకు హైస్పీడ్ ఇంటర్నెట్ కనెక్టివిటీ సౌకర్యం కల్పించడమే ఈ ప్రాజెక్టు లక్ష్యం. ఈ ప్రాజెక్ట్ కింద రూ.149కు టెలిఫోన్, ఇంటర్నెట్, టీవీ ప్రసార సేవలు అందిస్తారు.

ఏపీ పోలీస్ యాక్ట్‌ను సవరిస్తూ ఆర్డినెన్స్


డీజీపీని ఎంపిక చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికే ఉండేలా ఆంధ్రప్రదేశ్ పోలీస్ యాక్ట్‌ను సవరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్ 26న ఆర్డినెన్స్ జారీ చేసింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ పోలీస్(రిఫార్మ్స్)అండ్ అడ్మినిస్ట్రేటివ్) ఆర్డినెన్స్ నంబర్ 4-2017 జారీ అయింది. ఆర్డినెన్స్‌కు డిసెంబర్ 25న గవర్నర్ నరసింహన్ ఆమోదముద్ర వేసినట్టు ప్రభుత్వం పేర్కొంది.

హిజ్రాలకు ప్రత్యేక విధానం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం డిసెంబర్ 30న హిజ్రా (ట్రాన్స్‌జెండర్స్)ల కోసం ప్రత్యేక విధానం ప్రకటించింది. ఈ విధానంలో భాగంగా 18 సంవత్సరాలు పైబడిన హిజ్రాలకు రూ.1500 అందించనుంది.

క్రీడలు

ప్రపంచ ర్యాపిడ్ టైటిల్ నెగ్గిన విశ్వనాథన్ ఆనంద్



ఐదుసార్లు ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన భారత చెస్ దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ ప్రపంచ ర్యాపిడ్ చెస్ టైటిల్ గెలుచుకున్నాడు. రియాద్‌లో డిసెంబర్ 28న ముగిసిన పోటీలో వ్లాదిమర్ ఫెడసీవ్(రష్యా)ను ఆనంద్ ఓడించాడు. టైటిల్ నెగ్గిన ఆనంద్‌కు రూ.1.6 కోట్ల ప్రైజ్‌మనీ దక్కింది.

రంజీ ట్రోఫీ గెలుచుకున్న విదర్భ

విదర్భ జట్టు తొలిసారి రంజీ ట్రోఫీ విజేతగా నిలిచింది. ఇండోర్‌లో జనవరి 1న జరిగిన ఫైనల్లో ఢిల్లీపై విదర్భ విజయం సాధించింది. ప్రైజ్‌మనీగా విదర్భకు రూ.2 కోట్లు దక్కింది.



ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి
కరెంట్ అఫైర్స్ నిపుణులు
ఆర్‌సీ రెడ్డి స్టడీ సర్కిల్, హైదరాబాద్

బులెటిన్ బోర్డ్

సీఈసీఆర్‌ఐలో 13 ప్రాజెక్ట్ అసిస్టెంట్లు

ఫెలోషిప్స్

తమిళనాడులోని శివగంగ జిల్లా కరైకుడిలో ఉన్న సెంట్రల్ ఎలక్ట్రోకెమికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(సీఈసీఆర్ఐ) 13 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టు పేరు:** ప్రాజెక్ట్ అసిస్టెంట్-II.
- **స్టైపెండ్:** రూ.25,000.
- **అర్హతలు:** కనీసం 55శాతం(ఎస్సీ/ఎస్టీలకు 50శాతం) మార్కులతోఎంఎస్సీ(కెమిస్ట్రీ/మెటీరియల్స్ సైన్స్/అప్లైడ్ కెమిస్ట్రీ)/ బీఈ/బీటెక్(కెమికల్ ఇంజనీరింగ్/మెటలర్జికల్ ఇంజనీరింగ్/ఎలక్ట్రోకెమికల్ ఇంజనీరింగ్/మెటీరియల్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్/కెమికల్ టెక్నాలజీ).
- **వయస్సు:** 30 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **ఎంపిక:** వాకిన్ ఇంటర్వ్యూ.
- **దరఖాస్తు విధానం:** నిర్దేశిత విధానంలో దరఖాస్తు పత్రంలో వివరాలు నింపి, దానికి సంబంధిత ధ్రువపత్రాలు జతచేసి నేరుగా కరైకుడిలోని సీఈసీఆర్ఐ కార్యాలయంలో వాకిన్ ఇంటర్వ్యూకు హాజరుకావాలి.
- **వాకిన్ ఇంటర్వ్యూ తేదీ:** జనవరి 5, 2018(ఉదయం 9గంటలకు).
- **వెబ్‌సైట్:** www.cecri.res.in

వరంగల్ నిట్‌లో జేఆర్‌ఎఫ్

వరంగల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ).. జూనియర్ రీసెర్చ్ ఫెలో(జేఆర్‌ఎఫ్) పోస్టుకు దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టు-ఖాళీలు:** జేఆర్‌ఎఫ్-1.
- **ఫెలోషిప్:** రూ.30,000.
- **వ్యవధి:** రెండేళ్లు.
- **అర్హతలు:** కెమికల్ ఇంజనీరింగ్‌లో బీఈ/బీటెక్‌తోపాటు ఎంఈ/ఎంటెక్ ప్రథమశ్రేణిలో/తత్సమాన గ్రేడ్‌లో ఉత్తీర్ణత, అలాగే గేట్ స్కోర్.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్/ఈమెయిల్.
- **చివరి తేదీ:** జనవరి 12, 2018.
- **వెబ్‌సైట్:** www.nitw.ac.in

ఆంధ్ర యూనివర్సిటీలో జేఆర్‌ఎఫ్

విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీ(ఏయూ).. జూని యర్ రీసెర్చ్ ఫెలో(జేఆర్‌ఎఫ్) ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టు-ఖాళీలు:** జేఆర్‌ఎఫ్-1.
- **ఫెలోషిప్:** రూ.16,000+హెచ్ఆర్ఏ.
- **అర్హతలు:** ఎంఎస్సీ/ఎంఎస్సీ(టెక్) జియోఫిజిక్స్/ఎంఎస్సీ(మెరైన్ జియోఫిజిక్స్).
- **దరఖాస్తు విధానం:** ఈమెయిల్.
- **చివరి తేదీ:** జనవరి 10, 2018.
- **వెబ్‌సైట్:** www.andhrauniversity.edu.in

సాక్షి బిజినెస్
గురువారం 4-1-2018
WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్	19 ▼	33,793
నిఫ్టీ	1 ▲	10,443

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (రాత్రి రెండు రాత్రి 11.30కి)			
నాస్‌డాక్	7,052	▲	46
డోజోన్స్	24,858	▲	33
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,671	▲	23
డాక్స్	12,978	▲	107
షాంఘై	3,370	▲	22
నికాయ్ (శుక్రవారం ముగింపు)	22,765	▽	19

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			● కొనుగోలు	● అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	64.30	64.43
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	87.77	87.95
€	యూరో	ఎస్‌బీఐ	77.80	77.96
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	57.46	57.58
AUS$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	50.48	50.58
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	48.44	48.53
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	15.37	18.22
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	15.73	18.39
¥	చైనా యువాన్	థామస్‌కుక్	6.91	11.20

పెట్రో కంపెనీలకు క్రూడ్ సెగ

31 నెలల గరిష్ఠ స్థాయికి చమురు

- కంపెనీల లాభాలపై ప్రభావం
- మార్జిన్లు మరింత తగ్గే అవకాశం



ముంబై: ముడి చమురు ధరలు భగ్గుమంటుండటంతో దేశీయ చమురు మార్కెటింగ్ కంపెనీల (ఓఎంసీ) లాభదాయకతకు చిల్లుపడే అవకాశాలు కనిపిస్తున్నాయి. భారత్ తన అవసరాలకు భారీగా దిగుమతి చేసుకునే బ్రెంట్ క్రూడ్ ధర బుధవారం రాత్రి 9.30 గంటల సమయానికి అంతర్జాతీయ మార్కెట్‌లో ఏకంగా బ్యారెల్ 67.50 డాలర్ల స్థాయికి చేరింది. 2016 చివరి నాటికి బ్యారెల్ ధర 48 డాలర్ల స్థాయిలో ఉండేది. అంటే గడిచిన ఏడాది కాలంలో ఏకంగా 40 శాతానికిపైగా పెరిగింది.

ధరలెందుకు పెరుగుతున్నాయంటే...

- అమెరికాలో సంభవించిన 'ఇర్మా' హరికేన్‌తో రిఫైనరీలు కొన్నాళ్లు మూతబడ్డాయి. కానీ తుఫాను ప్రభావం తగ్గడంతో రిఫైనరీలన్నీ తెరుచుకుని ఒక్కసారిగా క్రూడ్‌కు డిమాండ్ పెరిగింది.
- దాదాపు ఇదే సమయంలో క్రూడ్ ఆయిల్ ఉత్పత్తి కోతను పొడిగించాలని ఒపెక్ నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం మరింత భారీ పెరుగుదలకు దారితీసింది.
- డాలర్ ఇండెక్స్ బలహీనత కూడా క్రూడ్ ధరల పెరుగుదలకు కారణాల్లో ఒకటిగా చెప్పొచ్చు. డాలర్ తగ్గుదల వల్ల చమురు ప్రాజెక్టులపై వ్యయాలు తగ్గుతాయి.
- ఇక ఉత్తరకొరియా, ఇరాక్ దేశాలకు సంబంధించి భౌగోళిక ఉద్రికత్తలు చమురు మంటకు ఆజ్యం పోశాయి.
- ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటు మెరుగుపడుతున్న ధోరణి కూడా ముడి చమురుకు డిమాండ్‌ను పెంచింది.
- వీటన్నింటికీ తోడు కొన్ని దేశాల్లో పైపులైన్లు పేలుళ్లు, అంతర్గత ఉద్రిక్తతల వంటి అంశాలు చమురు ధరలను పెంచాయి.

దేశీయ ఓఎంసీలపై ప్రభావం...

బీఎస్‌ఈ ఆయిల్ అండ్ గ్యాస్ ఇండెక్స్ గడచిన 3 నెలల్లో 9.71% పెరిగింది. బెంచ్ మార్క్ సెన్సెక్స్ సూచీ 8.86 శాతం ఎగసింది. కానీ బీపీసీఎల్, ఐఓసీ, హెచ్‌పీసీఎల్ వంటి చమురు మార్కెటింగ్ కంపెనీల షేర్లు మాత్రం తీవ్ర నష్టాలను ఎదుర్కొన్నాయి. ఐఓసీ షేర్ 3 శాతం, హెచ్‌పీసీఎల్ షేర్ 2.5 శాతం తగ్గింది. అయితే గెయిల్ కొనుగోలు వార్తలతో బీపీసీఎల్ 10% పెరిగింది.

పడిపోతున్న మార్జిన్లు...రక్షిస్తున్న రూపాయి

నిజానికి క్రూడ్ ధరలు పెరగటం వల్ల చమురు కంపెనీల మార్జిన్లు గణనీయంగా పడిపోతున్నాయి. రూపాయి బాగా బలపడటం వీటిని కొంత వరకూ ఆదుకున్నదనే చెప్పాలి. ఈ ఆర్థిక సంవత్సరం రెండవ త్రైమాసికంలో డీజిల్, పెట్రోల్‌పై మార్కెటింగ్ మార్జిన్ లీటరుకు 3.10 పైసలు ఉంటే, ప్రస్తుతం ఇది రూపాయికి పడింది. అంతర్జాతీయంగా ధరలు పెరిగినా, దీనికనుగుణంగా దేశీయంగా ధరలు పెంచకపోవడం దీనికి కారణమనేది కంపెనీల మాట. అయితే, అం తర్జాతీయంగా ధరలు తగ్గినపుడు దేశీయంగా తగ్గలేదన్న విషయాన్ని విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు.



కష్టకాలమే..!

క్రూడ్ ఆయిల్ ధరల్లో పెరుగుదల చమురు మార్కెటింగ్ కంపెనీల రోజూవారీ వ్యయ అవసరాలను పెంచుతుంది. దీనికితోడు స్వల్పకాలిక రుణ స్థాయిలపై సైతం ఇది ప్రభావం చూపుతుంది. భారత ఎంసీఏల లాభదాయకతపై ఇది ప్రభావం చూపుతుంది. స్థూల అండర్ రికవరీలల్లో నుంచి కేటాయింపులు జరుపుకోవాలని ప్రభుత్వ రంగంలోని ఓఎంసీలకు ఆదేశాలు జారీ అయినా... అదీ ఆయా కంపెనీల లాభదాయకతకు దెబ్బే. ఇక మార్కెట్ నిర్ధారిత స్థాయిల వద్ద ఆటో ఫ్యూయెల్స్ ధరలను కొనసాగించాలన్న ప్రభుత్వ నిర్ణయానికీ తాజా పరిస్థితి పరీక్ష వంటిదే. అంతర్జాతీయ ధరలకు అనుగుణంగా దేశంలో పెట్రో ధర పెంచితే, దేశంలో అన్ని స్థాయిల్లో ధరల పరిస్థితి తీవ్రరూపం దాల్చుతుంది. ఇక దేశీయంగా ఆర్థిక అంశాలను చూస్తే, 2016–17తో పోలిస్తే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం కరెంట్ అకౌంట్ లోటు (క్యాడ్) రెట్టింపయ్యే అవకాశం ఉంది. స్థూల దేశీయోత్పత్తిలో (జీడీపీ) క్యాడ్ 1.5%కి చేరే వీలుంది.

– కె.రవిచంద్రన్, ఇక్రా

> ముడి చమురు ధరలు పెరిగితే చమురు కంపెనీల మార్కెటింగ్ మార్జిన్లు తగ్గుతాయి. మూలధన ప్రణాళికలపై ప్రతికూల ప్రభావం పడుతుంది. నగదు నిల్వలు హరించుకుపోతాయి. ఈ కంపెనీల షేర్ల అవుట్‌లుక్ పెద్దగా ఆశావహంగా కూడా ఏమీ లేదు.
>
> – కోటక్ ఇన్‌స్టిట్యూషనల్ ఈక్విటీస్

విస్తరణపై పోస్టల్ పేమెంట్ బ్యాంకు దృష్టి

ఏప్రిల్ నాటికి 650 శాఖలు ప్రారంభం



న్యూఢిల్లీ: తపాలా విభాగానికి చెందిన ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ (ఐపీపీబీ) తన కార్యకలాపాలు విస్తరించడంపై దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా ఈ ఏడాది ఏప్రిల్ నాటికి ఐపీపీబీ మొత్తం 650 శాఖలను ప్రారంభించే అవకాశం ఉన్నట్లు లోక్‌సభకిచ్చిన లిఖిత పూర్వక సమాధానంలో కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి మనోజ్ సిన్హా తెలిపారు. పేమెంట్స్ బ్యాంక్ కార్యకలాపాలు సాగించేందుకు గతేడాది జనవరి 20న ఐపీపీబీకి ఆర్‌బీఐ లైసెన్సు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఐపీపీబీ గతేడాది జనవరి 30న ప్రయోగాత్మకంగా రాయ్‌పూర్ (ఛత్తీస్‌గఢ్), రాంచీ (జార్ఖండ్)లో రెండు శాఖలను మాత్రమే ప్రారంభించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి దాకా శాఖలను విస్తరించలేదు. దేశవ్యాప్తంగా కార్యకలాపాలు విస్తరించాలని భావిస్తున్న ఐపీపీబీ.. వీలును బట్టి మొత్తం పోస్టాఫీసులన్నింటినీ (సుమారు 1.55 లక్షలు) బ్యాంకింగ్ పథకాలు, సర్వీసులను అందించడానికి ఉపయోగించుకునే అవకాశం ఉన్నట్లు మనోజ్ సిన్హా తెలిపారు. మరోవైపు, ఇతర బ్యాంకింగ్, ఆర్థిక సంస్థలతో కూడా ఐపీపీబీ ఒప్పందాలు కుదుర్చుకోవాలని భావిస్తున్నట్లు మంత్రి తెలిపారు. దీనిపై ఇప్పటికే పలు సంస్థలు ఆసక్తి వ్యక్తపర్చాయని, ప్రాథమిక స్థాయిలో చర్చలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికే పంజాబ్ నేషనల్ బ్యాంకు, పీఎన్‌బీ మెట్‌లైఫ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీలతో ఐపీపీబీ అవగాహన ఒప్పందం కుదుర్చుకుందని మనోజ్ సిన్హా చెప్పారు.

పరిశీలనలో బీఎస్‌ఎన్‌ఎల్ 4జీ స్పెక్ట్రం దరఖాస్తు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ టెలికం దిగ్గజం బీఎస్‌ఎన్‌ఎల్‌కి 4జీ స్పెక్ట్రం కేటాయించే అంశం పరిశీలనలో ఉందని కేంద్ర టెలికం శాఖ మంత్రి మనోజ్ సిన్హా తెలిపారు. 4జీ/ఎల్‌టీఈ సేవలు అందించేందుకు దేశవ్యాప్తంగా (ఢిల్లీ, ముంబై మినహా) 700 మెగాహెర్ట్జ్ బ్యాండ్‌లో ఒక్క 5 మెగాహెర్ట్జ్ స్లాట్ కేటాయించాలని బీఎస్‌ఎన్‌ఎల్ కోరినట్లు లోక్‌సభకి ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో మంత్రి వివరించారు. అలా కుదరని పక్షంలో చెల్లింపు ప్రాతిపదికన ఏడాది వ్యవధికి తాత్కాలికంగా 2100 మెగాహెర్ట్జ్ బ్యాండ్‌లో 5 మెగాహెర్ట్జ్ స్లాట్‌నైనా కేటాయించాలని సంస్థ విజ్ఞప్తి చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కంపెనీ ప్రతిపాదన పరిశీలనలో ఉందని తెలిపారు. మరోవైపు, మొబైల్ సర్వీసులతో పాటు స్మార్ట్ సిటీలకు అవసరమైన ప్రాథమిక మౌలిక సదుపాయాలు, యాప్స్‌ను అందించడం ద్వారా అదనపు ఆదాయాన్ని సమకూర్చుకోవాలని బీఎస్‌ఎన్‌ఎల్ యోచిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

కొత్త టెలికం పాలసీపై కసరత్తు

చర్చా పత్రం విడుదల చేసిన ట్రాయ్



న్యూఢిల్లీ: ఈ ఏడాది మార్చిలోగా కొత్త జాతీయ టెలికం విధానాన్ని (ఎన్‌టీపీ) ఖరారు చేసే ప్రక్రియ మరింత వేగం పుంజుకుంది. ఇందులో భాగంగా టెలికం రంగ నియంత్రణ సంస్థ ట్రాయ్ బుధవారం చర్చాపత్రాన్ని విడుదల చేసింది. టెలికం ఆపరేటర్లు, పరికరాల తయారీ సంస్థలు, పరిశ్రమ వర్గాలు, క్లౌడ్ సర్వీస్ ప్రొవైడర్లు మొదలైన వారితో ప్రాథమికంగా సంప్రతింపులు జరిపిన అనంతరం తమ అభిప్రాయాలను క్రోడీకరించి ఈ చర్చాపత్రాన్ని రూపొందించినట్లు ట్రాయ్ తెలిపింది. జాతీయ టెలికం విధానంలో భాగంగా నిర్దేశించుకున్న కోటి బహిరంగ వై–ఫై హాట్‌స్పాట్స్ ఏర్పాటు, 2 ఎంబీపీఎస్ కనీస డౌన్‌లోడ్ స్పీడుతో 90 కోట్ల బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్లు, వైర్‌లెస్ ఇంటర్నెట్ కనెక్టివిటీకి సంబంధించి సగటున 20 ఎంబీపీఎస్ స్పీడు సాధించడం తదితర లక్ష్యాలను చర్చాపత్రంలో ట్రాయ్ పొందుపర్చింది.

ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐవోటీ)పై ప్రధానంగా దృష్టి సారించడంతో పాటు కమ్యూనికేషన్స్ రంగంలో 100 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యాలు కూడా ఉన్నాయి. లైసెన్సు ఫీజు, స్పెక్ట్రం చార్జీలను పునఃసమీక్షించడం, దేశవ్యాప్తంగా సర్వీసులకు ఒకే లైసెన్సు విధానం, మౌలిక రంగం స్థాయిలో కమ్యూనికేషన్ ఇన్‌ఫ్రా ప్రాజెక్టులకు రుణ సదుపాయం అందుబాటులో ఉంచడం తదితర వ్యూహాల ద్వారా ఈ లక్ష్యాలు సాధించవచ్చని చర్చాపత్రంలో ట్రాయ్ వివరించింది. చర్చాపత్రంలో పొందుపర్చిన అంశాలపై సంబంధిత వర్గాలు జనవరి 19లోగా తమ అభిప్రాయాలు రాతపూర్వకంగా తెలియజేయాల్సి ఉంటుందని పేర్కొంది. ఈ ఏడాది మార్చి నాటికి కొత్త టెలికం విధానాన్ని ఖరారు చేయాలని టెలికం శాఖ యోచిస్తోంది.

'ఫ్యూచర్' చేతికి స్నాప్‌డీల్ 'వల్కన్'!

డీల్ విలువ రూ.50 కోట్లు

- మరి కొన్ని వారాల్లో ఒప్పందం పూర్తి

ముంబై: ఆన్‌లైన్ మార్కెట్ ప్లేస్ స్నాప్‌డీల్‌కు చెందిన లాజిస్టిక్స్ విభాగం, వల్కన్ ఎక్స్‌ప్రెస్‌ను ఫ్యూచర్ గ్రూప్ కొనుగోలు చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ డీల్ విలువ రూ.50 కోట్లు ఉండొచ్చు. తన సరఫరా చెయిన్ వ్యాపారాన్ని మరింత పటిష్టవంతం చేసుకునే ప్రయత్నాల్లో భాగంగా ఫ్యూచర్‌గ్రూప్ వల్కన్ ఎక్స్‌ప్రెస్‌ను కొనుగోలు చేయనున్నదని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈ డీల్‌కు సంబంధించి చర్చలు ఆరంభ దశలో ఉన్నాయని, మరికొన్ని వారాల్లో ఖరారు కావచ్చని ఆ వర్గాలు పేర్కొన్నాయి. ఈ డీల్‌లో భాగంగా వల్కన్ సిబ్బంది ఫ్యూచర్ గ్రూప్‌కు బదిలీ అవుతారు. వల్కన్ ఎక్స్‌ప్రెస్ చేరికతో ఫ్యూచర్ గ్రూప్ థర్డ్ పార్టీ లాజిస్టిక్స్ కార్యకలాపాలు మరింత శక్తివంతమవుతాయి. ఈ వార్తలపై వ్యాఖ్యానించడానికి స్నాప్‌డీల్, ఫ్యూచర్‌గ్రూప్‌లు నిరాకరించాయి.





వంద నగరాల్లో వల్కన్ కార్యకలాపాలు...

వల్కన్ ఎక్స్‌ప్రెస్ రిటైల్ కంపెనీలకు ముఖ్యంగా ఈ కామర్స్ సంస్థలకు సరఫరా సేవలందిస్తోంది. మొత్తం వంద నగరాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఇక ఫ్యూచర్ గ్రూప్‌కు సొంత లాజిస్టిక్స్ సంస్థ ఉంది. ఇటీవలే ఈ సంస్థ, ఫ్యూచర్ సప్లై చెయిన్ సొల్యూషన్స్ ఐపీఓ (ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్) ద్వారా రూ.650 కోట్లు సమీకరించింది. రిటైల్, ఫ్యాషన్, ఆటోమోటివ్, ఇంజినీరింగ్, ఫుడ్, బేవరేజెస్, ఎఫ్‌ఎమ్‌సీజీ, ఈ కామర్స్, హెల్త్‌కేర్, ఎలక్ట్రానిక్స్, టెక్నాలజీ రంగాల సంస్థలకు లాజిస్టిక్స్ సేవలందిస్తోంది.

కీలకం కాని ఆస్తుల విక్రయంలో భాగంగా స్నాప్‌డీల్ సంస్థ వల్కన్ ఎక్స్‌ప్రెస్‌ను విక్రయిస్తోంది. అత్యంత తీవ్రమైన పోటీ ఉన్న ఈ కామర్స్ మార్కెట్లో ఫ్లిప్‌కార్ట్, అమెజాన్‌ల నుంచి నిలదొక్కుకోవడానికి కావలసిన నిధులను ఇలాంటి కీలకం కాని ఆస్తుల విక్రయం ద్వారా సమకూర్చుకుంటోంది. గత ఏడాది జూలైలో తన పేమెంట్ వాలెట్ ఫ్రీచార్జ్‌ను స్నాప్‌డీల్ కంపెనీ యాక్సిస్ బ్యాంక్‌కు రూ.385 కోట్లకు విక్రయించింది.

డేటా భద్రతపై తక్షణం చట్టం తేవాలి


పార్లమెంటరీ కమిటీ సిఫార్సు



న్యూఢిల్లీ: డిజిటలైజేషన్ పెరుగుతున్న నేపథ్యంలో డేటా ప్రైవసీకి సంబంధించి సాధ్యమైనంత త్వరలో ఒక చట్టాన్ని రూపొందించాలని ఆర్థిక అంశాల పార్లమెంటరీ స్థాయీ సంఘం.. ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. అలాగే, సమాచార మౌలిక అంశాలపై సమన్వయం కోసం ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేయాలని పేర్కొంది. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత ఎం వీరప్పమొయిలీ సారథ్యంలోని స్థాయీ సంఘం ఈ మేరకు డిజిటల్ ఎకానమీపై నివేదికను పార్లమెంటుకు సమర్పించింది. సైబర్ నేరాలను సమర్థంగా ఎదుర్కొనేందుకు సుశిక్షితులైన నిపుణుల కొరతపై కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. దేశం డిజిటల్ వైపు మళ్లుతున్న తరుణంలో క్లోనింగ్ వంటి ఏటీఎం మోసాలు మొదలైనవి భారీగా పెరుగుతున్నాయని, సామాన్యులు మోసాలబారిన పడుతున్నారని పేర్కొంది. ఈ నేపథ్యంలో డేటా భద్రత కోసం చట్టం తేవాలని, మోసాలపై ఫిర్యాదులు చేసేందుకు హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయాలని సూచించింది.

బోర్డు నుంచి వెంకటేశన్, కుద్వాలను తొలగించండి

ఇన్ఫీ మాజీ సీఎఫ్‌వో వి.బాలకృష్ణన్ డిమాండ్




హైదరాబాద్: దేశంలో రెండో అతిపెద్ద ఐటీ కంపెనీ 'ఇన్ఫోసిస్' ఏదో ఒక రూపంలో నిత్యం వార్తల్లో ఉంటోంది. తాజాగా సంస్థకు చెందిన మాజీ సీఎఫ్‌వో వి.బాలకృష్ణన్... బోర్డులోని కొందరు సభ్యులపై వ్యతిరేక వ్యాఖ్యలు చేశారు. ఇన్ఫీ మాజీ కో–చైర్మన్ రవి వెంకటేశన్‌ను, ఆడిట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ రూప కుద్వాను బోర్డు నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. మంగళవారం ఇన్ఫోసిస్ కొత్త సీఈవోగా సలీల్ పరేఖ్ పగ్గాలు చేపట్టిన మరుసటి రోజే బాలకృష్ణన్ ఈ వ్యాఖ్యలు చేయడం మరంత ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. కంపెనీ బోర్డును పునర్నిర్మించాల్సిన అవసరముందని బాలకృష్ణన్ తెలిపారు. 'నందన్ (కంపెనీ చైర్మన్) త్వరితగతిన బోర్డు పునర్నిర్మాణాన్ని పూర్తి చేయాలి. మాజీ కో–చైర్మన్, ఆడిట్ కమిటీ చైర్మన్‌లను మార్చేయాలి. పూర్తి శక్తి సామర్థ్యాలతో పనిచేసేందుకు వీలుగా పరేఖ్‌కు స్వచ్ఛమైన బోర్డును అందించాలి' అని వివరించారు. బోర్డుకు వన్నె తెచ్చేవారిని నియమించుకోవాలని సూచించారు. 'కంపెనీని రూపాంతరం చెందించడానికి సలీల్ పరేఖ్‌కు గొప్ప అవకాశం అందుబాటులో ఉంది. ఈయన బ్యాక్‌గ్రౌండ్, నిర్వర్తించిన బాధ్యతలు కంపెనీని ముందుకు నడిపించడానికి ఉపయోగపడతాయి. సీఈవో పదవికి పరేఖ్ అనువైన వ్యక్తి. గత మేనేజ్‌మెంట్ చేసిన తప్పులు ఈయన చేయడని భావిస్తున్నాం. కంపెనీ విలువలకు కట్టుబడి ఉండాలి' అన్నారు. టెక్నాలజీలో వస్తున్న మార్పులు సహా పలు సవాళ్లను పరేఖ్ ఎదుర్కోవలసి ఉందని పేర్కొన్నారు. కాగా సంస్థలో కార్పొరేట్ గవర్నెన్స్ బాగోలేదని ఇదివరకే ఆరోపణలొచ్చాయి. సంస్థ మాజీ సీఎఫ్‌వో రాజీవ్ బన్సాల్‌కు అధిక పేమెంట్‌పై పెద్ద వివాదం చెలరేగిన విషయం తెలిసిందే. ఈ సమస్య పరిష్కారానికి సంబంధించి కంపెనీ గత నెల సెబీకి సెటిల్‌మెంట్ విజ్ఞప్తిని పంపింది.

అపారెల్‌ను లాభాల్లోకి తెస్తాం

'సాక్షి'తో పోకర్ణ సీఎండీ గౌతమ్ చంద్ జైన్

రిటైల్ విభాగాన్ని మరింత విస్తరిస్తాం ● హైదరాబాద్ వద్ద కొత్తగా ప్లాంటు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వివిధ రంగాల్లో ఉన్న పోకర్ణ గ్రూప్... కొత్త ఏడాది సరికొత్త వ్యూహాలతో రంగంలోకి దిగుతోంది. నష్టాల్లో ఉన్న అపారెల్ విభాగాన్ని గాడిలో పెట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. స్టాంజా బ్రాండ్ ఇమేజ్‌ను మరిన్ని నగరాలకు విస్తరించాలని నిర్ణయించింది. అలాగే గుండ్లపోచంపల్లిలో ఉన్న దుస్తుల తయారీ ప్లాంటుకు పూర్వ వైభవం తీసుకొస్తామని పోకర్ణ గ్రూప్ సీఎండీ గౌతమ్ చంద్ జైన్ తెలిపారు. క్వార్జ్, అపారెల్ విభాగాల్లో కంపెనీ ప్రణాళికలను 'సాక్షి' బిజినెస్ బ్యూరో ప్రతినిధికిచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు. అవి ఆయన మాటల్లోనే..

లాభాల్లోకి తీసుకొస్తాం..

గ్రూప్ ఆదాయంలో 30 శాతం సమకూర్చిన అపారెల్ విభాగం కొన్నేళ్లుగా నష్టాలను చవిచూస్తోంది. గుండ్లపోచంపల్లిలో ఉన్న దుస్తుల తయారీ ప్లాంటుకు రూ.40 కోట్లకు పైగా వెచ్చించాం. నెదర్లాండ్స్, ఇటలీ, యూఎస్, జర్మనీ కంపెనీలకు థర్డ్ పార్టీగా దుస్తులను తయారు చేసి సరఫరా చేశాం. ఉత్పాదన హై క్వాలిటీ కావడం, ఆ కంపెనీలిచ్చే ధర తయారీ ఖర్చు కంటే తక్కువగా ఉండడంతో సరఫరా మానేశాం. దీంతో నిర్వహణ భారం పెరిగింది. ఉత్పత్తి సామర్థ్యంలో 10 శాతం వినియోగానికే పరిమితమయ్యాం. ప్లాంటులో ఉత్పత్తి పెరిగితేనే నష్టాల నుంచి గట్టెక్కుతాం. యూనిట్లో వాటా విక్రయానికి, లేదా లీజుకివ్వటానికి భాగస్వామిని చూస్తున్నాం. రిటైల్‌ను విస్తరిస్తాం కనక తయారీ కూడా పెరుగుతుంది.

స్టాంజా స్టోర్లు పెంచుతాం..

ఒకానొక స్థాయిలో స్టాంజా స్టోర్లు 15 దాకా ఏర్పాటయ్యాయి. కానీ నష్టాలొస్తున్న 7 స్టోర్లను మూసేశాం. ఇపుడున్న ఔట్‌లెట్లలో స్థలాన్ని కుదించాం. రెండేళ్లలో మరో 18 ఔట్‌లెట్లు ప్రారంభిస్తాం. నాణ్యతలో రాజీ లేకుండా సరైన ధరలో ఉత్పత్తులను తెస్తాం. రూ.10 కోట్లుగా ఉన్న అపారెల్ విభాగ నష్టాలిపుడు రూ.1–2 కోట్ల స్థాయికి వచ్చాయి. రిటైల్ లాభాలు సమకూరుస్తోంది కనక అపారెల్ నష్టాలు తగ్గుతూ వచ్చాయి. ఈ విభాగాన్ని త్వరలోనే లాభాల్లోకి మళ్లిస్తాం.

క్వాంట్రాకు ఆదరణ..

నేచురల్ క్వార్జ్ సర్ఫేసెస్ ఉత్పాదన అయిన పోకర్ణ బ్రాండ్ 'క్వాంట్రా'కు విదేశాల్లో మంచి ఆదరణ ఉంది. ఈ రంగంలో విజయవంతంగా యూఎస్‌లో అమ్ముడవుతున్న మేడ్ ఇన్ ఇండియా ప్రొడక్టు మాదే. ఇటలీకి చెందిన బ్రెటన్‌స్టోన్ పేటెంటెడ్ టెక్నాలజీ వాడుతున్నాం. 200 డిజైన్లు చేస్తున్నాం. పలు దిగ్గజ కంపెనీలకు థర్డ్ పార్టీగా కూడా క్వార్జ్ సర్ఫేసెస్ సరఫరా చేస్తున్నాం. కిచెన్ కౌంటర్ టాప్స్‌కు అనువైన ఈ ఉత్పాదనను భారత్‌లో ఐకియా కూడా పోకర్ణ నుంచే కొనుగోలు చేయబోతోంది. గ్రూప్ టర్నోవరులో క్వార్జ్ విభాగం వాటా 50 శాతం దాటింది. ఇందులో క్వాంట్రా 30 శాతం సమకూరుస్తోంది.

హైదరాబాద్ వద్దే ప్లాంటు..

గ్రూప్ అనుబంధ కంపెనీ అయిన పోకర్ణ ఇంజనీర్డ్ స్టోన్‌కు విశాఖపట్నం సమీపంలో నేచురల్ క్వార్జ్ సర్ఫేసెస్ తయారీ ప్లాంటు ఉంది. ఇది పూర్తి స్థాయిలో నడుస్తోంది. మరో ప్లాంటు వస్తేనే కంపెనీ వృద్ధికి ఆస్కారముంది. అందుకే హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో 50 ఎకరాల్లో కొత్త ప్లాంటు ఏర్పాటుకు కార్యాచరణ మొదలుపెట్టాం. ఈ యూనిట్‌కు రూ.325 కోట్లు ఖర్చు చేస్తాం. బ్యాంకు రూ.250 కోట్ల రుణం మంజూరు చేసింది. ప్రత్యక్షంగా 500 మందికి, పరోక్షంగా 3,000 మందికి ఉపాధి లభిస్తుంది. న్యాయపర ఒప్పందాలు పూర్తి అయ్యాక 18 నెలల్లో ప్లాంటు రెడీ అవుతుంది. 2019–20లోనే ప్లాంటు కార్యరూపం దాలుస్తుంది.

కేపీఎమ్‌జీ చేతికి 'సైబర్ ఐఎన్‌సీ'!

డీల్ విలువ రూ.217 కోట్లు



న్యూఢిల్లీ: ముంబైకు చెందిన ఐటీ సంస్థ ఆరియన్ ప్రొ అనుబంధ సంస్థ, సైబర్ ఐఎన్‌సీ తన ఐడెంటిటీ అండ్ యాక్సెస్ మేనేజ్‌మెంట్ (ఐయామ్) వ్యాపారాన్ని అమెరికాకు చెందిన కేపీఎమ్‌జీ ఎల్‌ఎల్‌పీకి విక్రయించింది. ఈ విక్రయం ఈ నెల 31కల్లా పూర్తవుతుందని, డీల్ విలువ రూ.217 కోట్లని, అంతా నగదు లావాదేవీయేనని ఆరియన్‌ప్రొ వెల్లడించింది. సైబర్ ఐఎన్‌సీ.. ప్రపంచంలోనే అతి పెద్ద ఇండిపెండెంట్ ఐయామ్ టెక్నాలజీ సేవలందించే సంస్థ అని, అమెరికా, భారత్, ఆస్ట్రేలియా, యూకేలో కార్యకాలాపాలు నిర్వహిస్తోందని పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా మొత్తం 190 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని తెలిపింది. సైబర్‌ఐఎన్‌సీ గత ఆర్థిక సంవత్సరంలో రూ.172 కోట్ల అంతర్జాతీయ ఆదాయం సాధించిందని, భారత ఆదాయం రూ.90 కోట్లని పేర్కొంది. సైబర్‌ఐఆన్‌సీ ఐయామ్ వ్యాపారం చేజిక్కించుకోవడం వల్ల ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ కన్సల్టింగ్‌లో తమ అగ్రస్థానం పటిష్టమవుతుందని కేపీఎమ్‌జీ పేర్కొంది.

నిత్యావసరాల ధరలు (హోల్‌సేల్/క్వింటాల్‌కు)

పత్తి (వరంగల్, వ్యాపారస్తులు)	--	--
మిర్చి (వరంగల్, తేజ)	--	--
పసుపు (నిజామాబాద్, కొమ్ము)	రూ.5,500 (కనిష్ఠం)	రూ.7,822 (గరిష్ఠం)
ఉల్లి (కర్నూలు)	రూ.1,500 (కనిష్ఠం)	రూ.3,760 (గరిష్ఠం)
చక్కెర (చెన్నై)	రూ.3,700	
బియ్యం (కరీంనగర్)	--	(హెచ్ఎంటీ)
కందిపప్పు (చెన్నై)	రూ.7,100	
సుబాబులు (కృష్ణా)	రూ.4,400	(టన్నుకు)
ఆయిల్ పామ్ (పశ్చిమ గోదావరి)	--	

ప్రభుత్వానికి యూకో బ్యాంక్ షేర్లు

రూ.1,375 కోట్ల పెట్టుబడులకు ప్రతిగా వాటా

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ యూకో బ్యాంక్ ప్రభుత్వానికి ప్రిఫరెన్షియల్ ప్రాతిపదికన ఈక్విటీ షేర్లను జారీ చేయనుంది. ప్రభుత్వం తమకు రూ.1,375 కోట్ల మూలధన నిధులను ఇవ్వనుండటంతో, ఈ నిధులకు గాను కేంద్ర ప్రభుత్వానికి ప్రిఫరెన్షియల్ ప్రాతిపదికన ఈక్విటీ షేర్లను జారీ చేయడానికి డైరెక్టర్ల బోర్డ్ ఆమోదం తెలిపిందని యూకో బ్యాంక్ పేర్కొంది. మొండి బకాయిలతో కుదేలైన బ్యాంకులను గట్టెక్కించడానికి రూ.2.11 లక్షల కోట్ల నిధులు ఇచ్చే ప్రణాళికను గత ఏడాది అక్టోబర్ 24న కేంద్ర ప్రభుత్వం ఆవిష్కరించిన సంగతి తెలిసిందే. రీ క్యాపిటలైజేషన్ బాండ్లు, బడ్జెట్ కేటాయింపులు, వాటా విక్రయాల ద్వారా ఈ నిధులను కేంద్రం అందించనుంది. కాగా ప్రభుత్వానికి షేర్ల కేటాయింపు నేపథ్యంలో బీఎస్ఈలో యూకో బ్యాంక్ షేర్ 1 శాతం లాభంతో రూ.30.60 వద్ద ముగిసింది.

దిద్దుబాటు చర్యల పరిధిలోకి అలహాబాద్ బ్యాంక్

న్యూఢిల్లీ: ఆర్‌బీఐ దిద్దుబాటు చర్యల పరిధి లోకి తాజాగా అలహాబాద్ బ్యాంకు కూడా వచ్చి చేరింది. 2016–17లో అలహాబాద్ బ్యాంకు పరిధిలో అధిక మొండి బకాయిలు (ఎన్‌పీఏ), ఆస్తులపై ప్రతికూల రాబడుల ఉన్నట్టు ఆర్‌బీఐ క్షేత్రస్థాయి పరిశీలనలో తేలింది. దీంతో 'కచ్చిత దిద్దుబాటు చర్యల కార్యాచరణ' పరిధిలోకి అలహాబాద్ బ్యాంకును తీసుకొస్తూ ఆర్‌బీఐ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఆర్‌బీఐ నుంచి తమకు ఈ నెల 2న లేఖ అందినట్టు అలహాబాద్ బ్యాంకు స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు సమాచారం పంపింది.

నేటి బోర్డ్ మీటింగ్స్

జీఎమ్ బ్రూవరీస్, ఏషియానా హౌసింగ్, ట్రాన్స్‌పోర్ట్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, బయోప్యాక్ ఇండియా కార్పొ

బులియన్ (రూ.లలో)

ముంబై		
బంగారం (99.9, 10గ్రా)	29,585	▲ 45
బంగారం (99.5, 10గ్రా)	29,435	▲ 45
వెండి (కిలో)	38,695	▲ 20
చెన్నై		
బంగారం (24 క్యారెట్లు)	– –	
బంగారం (22 క్యారెట్లు)	28,190	▲ 30
వెండి (కిలో)	– –	
హైదరాబాద్		
బంగారం (24 క్యారెట్లు)	30,140	▲ 50
బంగారం (22 క్యారెట్లు)	28,190	▲ 70
వెండి(కిలో)	39,110	▲ 185
ప్రొద్దుటూరు		
బంగారం (24 క్యారెట్లు)	30,400	0
బంగారం (22 క్యారెట్లు)	28,200	▲ 20
వెండి(కిలో)	39,900	0
విశాఖపట్నం		
బంగారం (24 క్యారెట్లు)	30,220	0
బంగారం (22 క్యారెట్లు)	28,100	0
వెండి(కిలో)	39,900	0
విజయవాడ		
బంగారం (24 క్యారెట్లు)	30,500	▲ 50
బంగారం (22 క్యారెట్లు)	28,250	0
వెండి(కిలో)	39,900	▼ 100
ఏపీ బులియన్ అసోసియేషన్		
బంగారం (24 క్యారెట్లు)	30,480	▲ 30
బంగారం (22 క్యారెట్లు)	28,190	▲ 30
వెండి(కిలో)	42,000	▲ 2,200

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

వడ్డీ రేట్లు

బేస్‌రేట్ రేంజ్	8.85 – 9.45
డిపాజిట్ రేట్ రేంజ్	6.00 – 6.75
డాలర్ లిబార్(6 నెలలు)	1.83

అంకెలు శాతాల్లో

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	61.45 (రాత్రి 11.30కు)	$60.37 (మంగళవారం ముగింపు)
బ్రెంట్	67.58 (రాత్రి 11.30కు)	$66.57 (మంగళవారం ముగింపు)

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 4-1-2018

విశాఖ	390–00
చిత్తూరు	388–00
వరంగల్	385–00
ముంబై	425–00
చెన్నై	395–00
విజయవాడ	385–00
గోదావరి	385–00
నమక్కల్	375–00
3-1-2018 ఫామ్ ధర...	
హైదరాబాద్	383–00
రిటైల్ (ఒక గుడ్డుకు)	4.45
బెంగళూరు	380–00
ఢిల్లీ	435–00
కోల్‌కతా	422–00

చివర్లో లాభాల స్వీకరణ...

- 233 పాయింట్ల శ్రేణిలో తిరిగిన సెన్సెక్స్
- 19 పాయింట్ల నష్టంతో 33,793కు సెన్సెక్స్
- 1 పాయింట్ లాభంతో 10,443కు నిఫ్టీ



ఆద్యంతం ఒడిదుడుకులమయంగా సాగిన బుధవారం నాటి ట్రేడింగ్‌లో చివరకు స్టాక్ మార్కెట్ మిశ్రమంగా ముగిసింది. చివరి గంటలో అమ్మకాల కారణంగా ఆరంభ లాభాలన్నీ కోల్పోయి సెన్సెక్స్ స్వల్పంగా నష్టపోగా, నిఫ్టీ ఫ్లాట్‌గా ముగిసింది. కంపెనీల ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాలు త్వరలో వెలువడనుండటంతో ఇన్వెస్టర్లు జాగరూకతతో వ్యవహరించారు. ట్రేడింగ్ చివర్లో ఫార్మా, ఐటీ, ఆయిల్, గ్యాస్, టెక్నాలజీ, హెల్త్‌కేర్ షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకోవడం ప్రతికూల ప్రభావం చూపించాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 19 పాయింట్ల నష్టంతో 33,793 పాయింట్ల వద్ద, ఎన్ఎస్ఈ నిఫ్టీ 1 పాయింట్ లాభంతో 10,443 పాయింట్ల వద్ద ముగిశాయి.

ఒడిదుడుకులు...

సెన్సెక్స్ 33,930 పాయింట్ల వద్ద లాభాల్లోనే ప్రారంభమైంది. కొనుగోళ్ల జోరుతో 186 పాయింట్ల లాభంతో 33,998 పాయింట్ల గరిష్ట స్థాయిని తాకింది. చివర్లో అమ్మకాలు వెల్లువెత్తడంతో 47 పాయింట్ల నష్టంతో 33,765 పాయింట్ల కనిష్ట స్థాయిని తాకింది. రోజు మొత్తంలో 233 పాయింట్ల రేంజ్‌లో కదలాడింది.

ముడి చమురు సెగ...

ముడి చమురు ధరలు ఎగియడంతో ఆరంభ లాభాలన్నీ ఆవిరయ్యాయని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ చెప్పారు. ఇటీవల బాగా పెరిగిన వాహన షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకుందని, ఆదాయ వృద్ధి బాగా ఉంటుందనే అంచనాలతో లోహ షేర్లు లాభపడ్డాయని వివరించారు.

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	4,784
ఎన్ఎస్ఈ (ఈక్విటీ)	33,292
ఎన్ఎస్ఈ (డెరివేటివ్స్)	5,74,382
ఎఫ్ఐఐ	96
డీఐఐ	-269

ఏడాది గరిష్టానికి 120 షేర్లు..

జామ్‌నగర్‌లో కొత్తగా రిఫైనరీ ఆఫ్‌–గ్యాస్ క్రాకర్ కార్యకలాపాలు ప్రారంభం కావడంతో రిలయన్స్ ఇండస్ట్రీస్ 0.5 శాతం లాభపడి రూ.916 వద్ద ముగిసింది. అంచనాలకు అనుగుణంగానే మూడో క్వార్టర్ అమ్మకాలు ఉన్నాయని వెల్లడించడంతో టైటాన్ కంపెనీ 1.3 శాతం పెరిగింది. అదానీ పోర్ట్స్ 2.7 శాతం పెరిగింది.

క్రిప్టోకరెన్సీలపై తక్షణ చర్యలేమీ లేవు

కమిటీ నివేదిక తర్వాతే నిర్ణయం: కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ



న్యూఢిల్లీ: బిట్‌కాయిన్స్ వంటి క్రిప్టోకరెన్సీలపై ప్రస్తుతం తక్షణ చర్యలు తీసుకునే యోచనేదీ లేదని కేంద్రం స్పష్టం చేసింది. వర్చువల్ కరెన్సీలపై అధ్యయనానికి నియమించిన నిపుణుల కమిటీ నివేదిక కోసం ఎదురుచూస్తున్నామని, ఆ తర్వాతే తగు చర్యలు తీసుకుంటామని పేర్కొంది. కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ బుధవారం రాజ్యసభలో ఈ విషయాలు తెలిపారు. పెట్టుబడులు వెల్లువతో బిట్‌కాయిన్ విలువ రూ.10 లక్షల స్థాయి పైగా ఎగిసింది. ఈ నేపథ్యంలో ఇటీవల క్రిప్టోకరెన్సీలు మోసపూరిత పోంజీ స్కీముల్లాంటివని, వీటికి దూరంగా ఉండాలని కేంద్రం, ఆర్‌బీఐ హెచ్చరిస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే వర్చువల్ కరెన్సీలు, వాటి ద్వారా మనీలాండరింగ్ అవకాశాలు, వినియోగదారుల ప్రయోజనాల పరిరక్షణ తదితర అంశాల్లో అధ్యయనం చేసేందుకు కేంద్రం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసింది. ఆర్థిక శాఖ, హోం శాఖ, ఆర్‌బీఐ అధికారులు ఇందులో సభ్యులుగా ఉన్నారు.

వీసాల వివాదం భారత్, అమెరికాకు ప్రతికూలమే: నాస్కామ్



న్యూఢిల్లీ: హెచ్–1బీ వీసాల వివాదం మరింతగా ముదిరితే భారత్, అమెరికా రెండు దేశాల ప్రయోజనాలకూ విఘాతం కలుగుతుందని దేశీ ఐటీ సంస్థల సమాఖ్య నాస్కామ్ ప్రెసిడెంట్ ఆర్.చంద్రశేఖర్ తెలిపారు. అమెరికన్ ఉద్యోగాలను కాపాడే పేరుతో... విదేశీయుల హెచ్–1బీ వీసాల గడువు పొడిగించకుండా కొత్త నిబంధన చేర్చేందుకు అమెరికా కసరత్తు చేస్తోందన్న వార్తల నేపథ్యంలో ఆయన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కొత్త నిబంధనలు అమల్లోకి వచ్చిన పక్షంలో గ్రీన్ కార్డుల కోసం నిరీక్షిస్తున్న పది లక్షల మంది పైగా హెచ్–1బీ వీసా హోల్డర్లను కూడా (ఇందులో సింహభాగం భారతీయులే ఉన్నారు) వారి వారి స్వదేశాలకు పంపించేసే అవకాశం ఉంది. 'ఇలాంటి పరిణామం కేవలం భారతీయ ఐటీ పరిశ్రమకే కాకుండా హెచ్–1బీ వీసాలను ఉపయోగించే భారతీయులందరిపైనా ప్రభావం చూపుతుంది. అమెరికాలో అసలు సమస్యల్లా.. సుశిక్షితులైన నిపుణులు తగినంత మంది దొరక్కపోవడమే. ఈ పరిస్థితుల్లో వీసాలపరంగా ఏ ప్రతికూల నిర్ణయం తీసుకున్నా అది ఇటు భారత్, అటు అమెరికా ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తుంది' అని చంద్రశేఖర్ చెప్పారు. వీసా నిబంధనల్లో మార్పులతో భారత ఐటీ కంపెనీల వ్యయాలు ఏటా 5–10 శాతం మేర పెరిగిపోయే అవకాశం ఉందని గ్రేహౌండ్ రీసెర్చ్ వ్యవస్థాపకుడు, చీఫ్ అనలిస్ట్ సంచిత్ వీర్ గోగియా పేర్కొన్నారు. మరోవైపు, మహీంద్రా గ్రూప్ చీఫ్ ఆనంద్ మహీంద్రా మాత్రం వీసాల వివాద తీవ్రతను కాస్త తగ్గించే ప్రయత్నం చేశారు. వీసాల వివాదం కారణంగా తిరిగివచ్చే వారందరికీ తాను స్వాగతం పలుకుతానని, భారత వృద్ధికి తమ వంతు కృషి చేసేందుకు వారు సరైన సమయంలో తిరిగొచ్చినట్లు అవుతుందని సోషల్ నెట్‌వర్కింగ్ సైట్ ట్విటర్‌లో పేర్కొన్నారు.

ఇంకొన్నాళ్లు గోనెసంచుల్లోనే ప్యాకింగ్

- చక్కెర, ఆహార ధాన్యాలపై కేంద్రం ఉత్తర్వు
- ఈ ఏడాది జూన్ వరకూ పొడిగింపు

న్యూఢిల్లీ: ఆహార ధాన్యాలు, పంచదార ఉత్పత్తుల ప్యాకింగ్‌కు గోనె సంచులను తప్పనిసరిగా వాడాలన్న నిబంధనను ఈ ఏడాది జూన్ వరకూ ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు కేబినెట్ ఆర్థిక వ్యవహారాల కమిటీ (సీసీఈఏ) నిర్ణయం తీసుకుంది. జ్యూట్ ప్యాకేజింగ్ మెటీరియల్ యాక్ట్, 1987 కింద గోనెసంచులతో తప్పనిసరి ప్యాకింగ్ నిబంధనలను పొడిగిస్తున్నట్లు ప్రభుత్వం వివరించింది. 90 శాతం వరకూ ఆహార పదార్థాలను, 20 శాతం వరకూ పంచదార ఉత్పత్తులను విధిగా గోనె సంచుల్లోనే ప్యాకింగ్ చేయాలన్న నిబంధనల వల్ల ఈ రంగంపై ఆధారపడిన 40 లక్షల మంది రైతులకు, 3.7 లక్షల మంది శ్రామికులకు ప్రయోజనం కలుగుతుందని కేంద్ర టెక్స్‌టైల్స్ మంత్రి స్మృతి ఇరానీ ట్వీట్ చేశారు. ప్రభుత్వ తాజా నిర్ణయం వల్ల పశ్చిమ బెంగాల్, బీహార్, ఒరిస్సా, అస్సాం, ఆంధ్రప్రదేశ్, మేఘాలయ, త్రిపుర రాష్ట్రాల్లో ఈ రంగంపై ఆధారపడిన రైతులు, శ్రామికుల జీవనోపాధికి తోడ్పాటు లభిస్తుందన్నారు. మరోవైపు జ్యూట్ మిల్లు కార్మికులు వేతన బకాయిల కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సకాలంలో చెల్లింపుల కోసం ఒక ప్రత్యేక విధానాన్ని ఏర్పాటు చేయనున్నామని వివరించారు. జ్యూట్ పరిశ్రమ పూర్తిగా ప్రభుత్వంపైనే ఆధారపడి ఉంది. ప్రభుత్వం ప్రతి ఏడాది రూ.5,500 కోట్ల విలువైన జ్యూట్ ఉత్పత్తులను కొనుగోలు చేస్తుంది.

ఆరు బ్యాంకులకు రూ. 7.5 వేల కోట్లు

ప్రతిపాదనకు కేంద్ర ఆర్థిక శాఖ ఆమోదముద్ర

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకులకు మరింత మూలధనం సమకూర్చే ప్రయత్నాల్లో భాగంగా.. బలహీనంగా ఉన్న ఆరు పీఎస్‌బీలకు రూ. 7,577 కోట్లు అందించే ప్రతిపాదనకు కేంద్ర ఆర్థిక శాఖ ఆమోదముద్ర వేసింది. బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఐడీబీఐ బ్యాంక్, యూకో బ్యాంకు, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, దేనా బ్యాంక్ వీటిలో ఉన్నాయి. మొండిబాకీల భారం అధికంగా ఉన్న ఈ బ్యాంకులన్నిటా ఆర్‌బీఐ సత్వర పరిష్కార చర్యలను అమలు చేస్తోంది. షేర్ల ప్రిఫరెన్షియల్ ఇష్యూ ద్వారా ఇవి అదనపు మూలధనాన్ని సమకూర్చుకోనున్నాయి. షేర్ల జారీ కోసం తమ బోర్డులు ఆమోదముద్ర వేసినట్లు యూకో బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ వెల్లడించాయి. నియంత్రణ సంస్థలు, షేర్‌హోల్డర్ల నుంచి అనుమతులు వచ్చిన తర్వాతే నిధులు లభిస్తాయి. ప్రభుత్వ రంగ బ్యాంకులు (పీఎస్‌బీ) తగినంత స్థాయిలో క్యాపిటల్ అడెక్వసీ రేషియో (సీఏఆర్) కలిగి ఉండేలా చూసేందుకు కేంద్రం.. ఇంద్రధనుస్సు ప్రణాళిక కింద బ్యాంకులకు నాలుగేళ్ల వ్యవధిలో (2019 మార్చి దాకా) రూ. 70,000 కోట్ల మేర అదనపు మూలధనం సమకూరుస్తోన్న సంగతి తెలిసిందే. ఈ ప్రణాళిక కిందే తాజా ప్రతిపాదనకు ఆమోదముద్ర వేసింది. ఇందులో యూకో బ్యాంకుకు రూ. 1,375 కోట్లు, సెంట్రల్ బ్యాంక్‌కు రూ. 323 కోట్లు, బ్యాంక్ ఆఫ్ ఇండియాకి రూ. 2,257 కోట్లు, ఐడీబీఐ బ్యాంక్‌కు రూ. 2,729 కోట్లు, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రకి రూ. 650 కోట్లు, దేనా బ్యాంక్‌కు రూ. 243 కోట్లు లభించనున్నాయి.

రిలయన్స్‌కు భారీగా నగదు నిల్వలు

రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు ఈ ఆర్థిక సంవత్సరంలో భారీగా నగదు నిల్వలు సమకూరుతాయని అంతర్జాతీయ బ్రోకరేజ్ సంస్థ, సీఎల్ఎస్ఏ అంచనా వేసింది. 4,000 కోట్ల డాలర్ల ప్రాజెక్టులు పూర్తి స్థాయిలో కార్యకలాపాలు ప్రారంభిస్తాయని, దీంతో రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు భారీగా నగదు నిల్వలు లభిస్తాయని తన తాజా నివేదికలో సీఎల్ఎస్ఏ పేర్కొంది. ఇటీవలే ప్రారంభమైన రిఫైనరీ ఆఫ్‌–గ్యాస్ క్రాకర్,(ఆర్ఓజీసీ) త్వరలో ప్రారంభం కానున్న పెట్‌కోక్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టుల వల్ల ఇబిటా మరింత జోరుగా పెరుగుతుందని సంస్థ తెలిపింది.

ఎన్ఎస్ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ADANI PO	407.65	397.4
AMBUJA C	272.6	268.15
ASIAN PA	1141.9	1142.75
AXIS BAN	560.45	559.5
BAJAJ AU	3241.05	3294.75
BAJAJ FI	1715.3	1724.65
BHARTI A	518.2	516.55
BOSCH LI	19692.95	19721.75
BHARAT P	494.9	499.8
CIPLA LT	606.8	607.8
COAL IND	271.85	270.05
EICHER M	28814.35	28670.15
GAIL (IN	490.1	494.35
HCL TECH	897.3	892.8
HDFC LTD	1700.8	1703.25
HDFC BAN	1852.65	1872.35
HERO MOT	3755.2	3743.85
HINDALCO	276.5	271.9
HIND.petrol	410.95	406.4
HIND.unilever	1350.35	1338.6
INDIABUL	1185.65	1183.55
ICICI BA	315	309.7
INDUSIND	1630.25	1643.95
BHARTI I	378.65	378.8
INFOSYS	1021.3	1029.7
INDIAN O	386.3	386.4
ITC LTD	261.15	260.75
KOTAK MA	1000.1	1003.2
LARSEN &	1275.3	1249.75
LUPIN LI	878.95	875.15
MAHINDRA	754.9	752.9
MARUTI S	9416.6	9554.05
NTPC LTD	177.05	178.9
OIL AND	193.45	196.85
POWER GR	201.65	200.75
RELIANCE	914.8	911.15
STATE BA	302.85	303.25
SUN PHAR	569.05	572.15
TATA MOT	433.9	439.3
TATA STE	734.95	729.3
TATA CON	2638.65	2631.2
TECH MAH	519.45	513.95
ULTRATEC	4301.95	4252.3
UPL LIMI	775.8	773.45
VEDANTA	332.5	327.75
WIPRO LT	309.95	318.7
YES BANK	315.85	311.65
ZEE ENTE	579.75	578.15

నిఫ్టీ నెక్ట్స్ ఫిఫ్టీ

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ABB INDI	1414.45	1400.2
ACC LIMI	1774.6	1743.2
ASHOK LE	124.5	123.35
BAJAJ FI	5099.45	5101.1
BANK OF	157.85	157.95
BHARAT E	181	181.65
BHEL	98.55	98.2
BRITANNI	4680.95	4656.05
CADILA H	428.5	428.3
COLGATE	1098.35	1100.75
CONTAINE	1370.05	1352.7
CUMMINS	931.35	922.3
DABUR IN	354.65	349.05
DLF LIMI	258.3	253.9
AVENUE S	1184.55	1160
EMAMI LI	1321.95	1310.25
GLAXOSMI	2459.3	2466
GLENMARK	591.85	592.8
GODREJ C	986.4	981.55
GLAXOSMI	6414.35	6464.5
HAVELLS	555.65	549.25
HIND.zinc	312	309.4
ICICI PR	376.7	375.2
IDEA CEL	102.7	100.7
INTERGLO	1208.4	1201.4
JSW STEE	268.7	264.55
LIC HOUS	566.85	562.75
MARICO L	320.85	325.7
UNITED S	3598.15	3592
MOTHERSO	373.9	378.8
MRF LTD	71173.35	71246.1
NHPC LTD	32.7	31.85
NMDC LTD	149.25	148.6
ORACLE F	4163.05	4000.25
OIL INDI	376.9	374.25
PIRAMAL	2850.05	2848.45
PETRONET	253.6	252.75
POWER FI	123.75	123.65
P&G HYGI	9412.85	9388.75
PIDILITE	913.95	889.2
PUNJAB N	166.6	166.4
RURAL EL	157.85	157.65
STEEL AU	93.8	91.85
SHREE CE	18099.55	18000.35
SIEMENS	1258.15	1258.9
SHRIRAM	1452.1	1463.35
SUN TV N	1004.7	995.2
TATA POW	100.8	99.7
TITAN CO	856.3	845.15
TORRENT	1378.55	1395.1

A B C D

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
20 MICRO	59.2	58.05
3M INDIA	19400.4	18904.05
5PAISA C	332.5	339.6
63 MOONS	119.4	117.75
8K MILES	884.35	891.2
AARTI DR	708	636.35
AARTI IN	1151.85	1132.9
AARVI EN	106	105
ABAN OFF	205.05	205.45
ABBOTT I	5436.25	5443.55
ACCEL FR	66.15	60.15
ACCELYA	1434.1	1431.85
ACCORD S	56	56
ACTION C	141.65	140.15
ADANI EN	176.2	163.9
ADANI TR	212	210.5
ADF FOOD	313.1	307.55
ADITYA B	99.9	94.6
ADITYA B	171.8	171.2
ADITYA B	184.6	185.25
ADOR WEL	603.85	514.4
ADVANCED	302	309.15
ADVANI H	77.65	77.4
AEGIS LO	286.4	282.5
AGRI-TEC	123.55	116.1
AGRO TEC	717.7	703.3
AHLUWALI	378.8	378.7
AIA ENGI	1539.75	1525.4
AIRAN LI	224	228.8
AIRO LAM	56	57.1
AJANTA P	1461.95	1472.5
AJMERA R	327.5	321.45
AKASH IN	83.9	70
AKSHARCH	765.4	770.65
AKZO NOB	1849	1846.45
ALANKIT	80.55	76.75
ALBERT D	399.75	385.2
ALEMBIC	59.95	60.15
ALEMBIC	524.05	526.45
ALICON C	687.8	687.1
ALKALI M	81.4	80.25
ALKEM LA	2213.05	2200.1
ALKYL AM	654.55	640.2
ALLAHABA	72.2	72.15
ALLCARGO	210.6	205.3
ALLSEC T	445.2	436.35
ALPHAGEO	909.15	906.75
AMBIKA C	1655.55	1379.65
AMRUTAJA	650.45	640.1
ANANT RA	71.35	70.85
ANI INTE	165.85	164.85
ANJANI P	238.15	235
APAR IND	823.25	795.6
APCOTEX	486.9	487.75
APEX FRO	813.3	812.45
APL APOL	2111.1	1980.15
APOLLO H	1176.5	1191.95
APOLLO S	1578.55	1435.05
APOLLO T	269.95	267.55
APTECH L	361.2	362.25
ARCHIDPL	113.8	113.8
ARCOTECH	54.35	56.15
ARIHANT	172.55	172.6
ARO GRAN	81	79.8
ARROW GR	481.8	482.25
ARSHIYA	105.3	105.6
ARTEM GL	116.4	117
ARVIND L	443.5	440.55
ARVIND S	197.5	193.25
ASAHI IN	366.15	367.9
ASAHI SO	357.5	359.85
ASHAPURA	95.85	95.35
ASHAPURA	450.35	454.25
ASHIANA	182.4	182.1
ASHOKA B	250.9	243.35
ASIAN GR	571.95	567.8
ASIAN HO	173.05	176.3
ASIAN HO	279.55	272.7
ASPINWAL	518.2	511.55
ASTEC LI	557.55	554.95
ASTRA MI	121.2	118.65
ASTRAL P	818.4	829.65
ASTRAZEN	1231.95	1187.75
ATLANTA	120.85	115.8
ATUL AUT	456.3	454.05
ATUL LTD	2738.65	2716.5
AU SMALL	669.75	661.4
AURIONPR	247.35	246.6
AUSOM EN	71.4	73.25
AUTOLITE	69.3	69
AUTOMOTI	98.95	98.25
AUTOMOTI	1652.15	1540.55
AVADH SU	803.6	799.75
AVANTI F	2561.75	2591.25
AVT NATU	56.4	56.1
AXISCADE	214.8	201.55
AYM SYNT	66.55	66
B.L.KASH	62.85	62.25
BAJAJ CO	486.15	488.85
BAJAJ EL	533.45	489.8
BAJAJ HO	2843.55	2839.8
BAL PHAR	117.4	116.6
BALAJI T	153.95	152.65
BALKRISH	104.95	101.7
BALKRISH	1189.05	1173.25
BALMER L	270.75	267.8
BALRAMPU	137.25	135.55
BANARAS	98.1	99.9
BANCO PR	256.95	255.6
BANK OF	168.35	167.3
BANNARI	324.65	325.6
BANNARI	2126.65	2100.95
BANSAL M	112	117
BANSWARA	146.95	141.95
BASF IND	2119.45	2094.2
BATA IND	772.4	753.9
BAYER CR	4513.25	4466.85
BEARDSEL	67.65	65.2
BEML LIM	1523.9	1575
BERGER P	263.2	264.25
BETA DRU	189.75	184
BF INVES	394.75	386.6
BF UTILI	510.95	496.55
BGR ENER	138.9	138.7
BHAGERIA	273.75	275.35
BHAGYANA	51.2	51.35
BHANSALI	197.45	194.95
BHARAT B	1379.55	1286.6
BHARAT F	733.1	728.05
BHARAT F	993.4	993.6
BHARAT G	208	205.3
BHARAT R	186.8	187.7
BHARAT R	4092.2	4099.35
BHARAT W	140.25	140.45
BHARTIYA	515.55	512
BHUSHAN	67.3	67.3
BIGBLOC	139.25	138.9
BINANI I	139.55	138.25
BIOCON L	541.85	541.7
BIRLA CO	1226.15	1229.9
BLISS GV	206.55	209.2
BLS INTL	260.2	261.15
BLUE COA	129.65	136.4
BLUE DAR	4598.05	4587.25
BLUE STA	818.2	817.8
BODAL CH	163.75	161.95
BOMBAY B	1628.55	1629.2
BOMBAY D	279.5	280.6
BOMBAY R	106.3	111.85
BPL LTD	112.2	104.8
BRIGADE	307.95	307.35
BROOKS L	110.3	109.2
BSE LIMI	936.4	940
BSL LTD	122.9	125.25
CADSYS (	118.1	120.5
CAMBRIDG	83.6	82
CAMLIN F	129.85	129.9
CAN FIN	476.4	473.65
CANARA B	352.8	352.05
CANTABIL	113.9	111.65
CAPACITE	404.05	396.85
CAPITAL	513.6	516.55
CAPITAL	721.4	698.3
CAPLIN P	632.4	631.95
CAPRI GL	125.85	123.75
CARBORUN	390.8	374.3
CARE RAT	1330.7	1321.4
CAREER P	127.25	127
CASTROL	191.25	191.25
CCL PROD	298.45	299.65
CEAT LIM	1945.55	1919.65
CENTRAL	75.9	74.95
CENTRAL	350.6	352
CENTUM E	719.95	648.15
CENTURY	334.8	332.15
CENTURY	342.65	338.85
CENTURY	1409.35	1406.55
CERA SAN	3728.6	3774.85
CESC LTD	1058	1052.05
CG POWER	91.2	90.55
CHAMBAL	160.2	157.65
CHENNAI	426.15	430.05
CHOLAMAN	1309.35	1296.4
CINELINE	113.1	112.95
CITY UNI	178.4	177.35
CL EDUCA	289.95	289.3
CLARIANT	611	614.85
CMI LIMI	286.1	283.15
CMM INFR	98	95.9
COCHIN S	543.3	545
COFFEE D	273.1	272.6
COMPUAGE	61.1	55.55
CONSO. F	87.55	88.3
CONTROL	471.7	467.55
CORAL IN	59.05	58.35
COROMAND	568.45	542.65
COSMO FI	368	366.3
COX & KI	268.1	276.8
CREATIVE	98.55	102
CREST VE	269.65	270.5
CRISIL L	1855.6	1886.6
CROMPT G	280.15	277.8
CROWN LI	75.55	79.5
CUPID LI	302.85	298
CYBERTEC	84.5	81.75
CYIENT L	576.9	575.3
D B REAL	67.85	70
D P WIRE	103	96.7
D-LINK I	133.3	125.5
D. P. AB	79.95	77.5
D.B.CORP	353.4	356.1
DALMIA B	136.6	135.25
DALMIA B	3103.75	3113.1
DAMODAR	129.85	126
DATAMATI	141.6	140.1
DCB BANK	191.85	193.75
DCM LTD	114.1	112.5
DCM SHRI	549.65	535.9
DE NORA	285.4	287.1
DECCAN C	569.05	560.1
DEEP IND	205.5	206.35
DEEPAK F	425.9	420.35
DEEPAK N	233.45	232.85
DELTA CO	300.8	298.8
DELTA MA	73.95	70.45
DEN NETW	108.35	108.45
DEV INFO	81.25	80
DEWAN HO	587.65	583.4
DFM FOOD	1959.9	1975.55
DHAMPUR	212.4	212
DHANUKA	764.1	747.3
DHUNSERI	163	159.2
DHUNSERI	484.9	404.1
DIC INDI	560.6	564.05
DILIP BU	980.45	976.25
DISH TV	85.05	85
DISHMAN	316.45	317.6
DIXON TE	4200.45	4137.1
DOLLAR I	457.2	458.95
DOLPHIN	124.5	126.4
DR. LAL	885.8	882.35
DYNACONS	61.35	55.8
DYNAMATI	2274.85	2197.05

E F G H

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ECE INDU	392.4	397.8
ECLERX S	1552.2	1564.7
EDELWEIS	282.45	285.5
EID PARR	382.55	380.8
EIH ASSO	431.65	397.35
EIH LIMI	149.2	146.4
EIMCO EL	523.25	539
ELECON E	108.35	104.85
ELECTROT	158.35	156.6
ELGI EQU	303.85	300.95
ELGI RUB	51.25	50.65
EMAMI IN	275.3	271.85
EMKAY GL	212.9	217.85
EMMBI IN	228.2	228.05
ENDURANC	1370.15	1369.35
ENGINEER	199.45	194.25
ENTERTAI	736.1	737
EQUITAS	144.8	146.25
ERIS LIF	781.6	779
EROS INT	220.65	223.55
ESAB IND	943.1	789.6
ESCORTS	772.95	772.75
ESSEL PR	289.6	291.1
ESTER IN	62.4	63.75
EURO (I)	150	152.35
EVEREADY	438.75	439
EVEREST	68.1	67.25
EVEREST	589.5	589.25
EXCEL CR	2327.2	2147.25
EXCEL IN	649.35	609.25
EXIDE IN	223.35	221.7
FACT LTD	58.95	53.6
FAIRCHEM	477.5	489.9
FDC LIMI	245.3	243.5
FEDDERS	76.35	77.6
FEDERAL	107.7	107.6
FEDERAL-	526.6	524.8
FIEM IND	1024.3	1006.65
FILATEX	222.5	219.95
FINEOTEX	101.1	91.95
FINOLEX	659.95	655.35
FINOLEX	689.05	688.1
FLEXITUF	97	102.25
FOCUS LI	175	170
FORTIS H	163.25	154.75
FORTUNE	281.95	282.75
FOSECO I	2168.35	1971.25
FOURTH D	182.95	174.55
FUT LIFE	360.35	351.65
FUTURE C	74.65	74.15
FUTURE M	140.2	140.6
FUTURE R	523.3	511.25
FUTURE S	676.85	679.7
G M BREW	965.1	948.7
GABRIEL	198.55	199.5
GALLANTT	289.45	263.15
GANDHI S	430.05	425.45
GANESH H	173.05	173.45
GANESHA	402.2	405.25
GARWARE-	918.85	915.05
GATEWAY	234.15	233.75
GAYATRI	227.45	226.65
GE POWER	736.45	727.5
GE T&D I	435.3	438.75
GEECEE V	173.6	174.4
GENERAL	765.85	762.75
GENESYS	330.75	312.35
GENUS PO	75.35	75.2
GEOJIT F	118.1	118.85
GHCL LIM	324.4	314.75
GIC HOUS	458.05	456.15
GILLETTE	6746.1	6762.95
GITANJAL	75.25	72.6
GKW LIMI	632.5	575
GLOBAL E	234.95	244.9
GLOBAL V	182.7	173.3
GNA AXLE	428.1	426.5
GOA CARB	976.1	929.65
GOCL COR	606.6	583.6
GODAWARI	372.65	361.65
GODFREY	986.35	986.05
GODREJ A	610.15	600
GODREJ I	607.8	601.7
GODREJ P	710.75	703.65
GOKALDAS	127.1	128
GOLDIAM	85.4	83.4
GOODLUCK	92.6	89.9
GP PETRO	83.85	83.9
GPT INFR	196.4	195.25
GRAPHITE	866.85	788.05
GRASIM I	1127.2	1139.55
GRAVITA	160.8	164.05
GREAVES	139.8	139.25
GREENLAM	1268.2	1260.4
GREENPLY	359.9	357.9
GRINDWEL	547.15	540.4
GRP LIMI	1729.35	1671.05
GRUH FIN	499.1	496.85
GTPL HAT	163.15	163.35
GUFIC BI	133.55	122.65
GUJ IND	133.4	132.05
GUJ NAR	486.7	481
GUJ STAT	150.45	146.9
GUJ. APO	235.2	235
GUJARAT	137.95	138.55
GUJARAT	171.65	168.15
GUJARAT	203.5	195.25
GUJARAT	220.7	222.7
GUJARAT	743.45	739.05
GUJARAT	873.2	847
GUJARAT	890.45	893.15
GULF OIL	997.1	1003.05
GULSHAN	85.2	85.15
HARITA S	961.9	946.35
HATSUN A	829.4	829.85
HCL INFO	59.65	59
HDFC BAN	1880	1886
HDFC STA	385.65	395.5
HEALTHCA	279.9	279.9
HEC INFR	167.65	159.7
HEG LTD	2676.6	2553.95
HEIDELBE	157.35	152.35
HERCULES	156.1	147.25
HESTER B	1775	1796.5
HEXAWARE	350.4	341.1
HI-TECH	373.5	394.35
HIKAL LI	239.9	238.75
HIL LIMI	1508.85	1520.35
HIMADRI	174.25	168.55
HIMATSIN	395.95	394.8
HIND NAT	159	160.05
HIND REC	136.85	130.15
HINDUJA	759.1	759.75
HINDUJA	883.8	880.35
HIND.copper	100.1	97.8
HIND.oil explo	130.4	132.05
HIND.media	254.8	257.1
HIND.composites	535.35	529.1
HITECH C	184	178.7
HONDA SI	1516.9	1503.1
HONEYWEL	18800.1	18854.75
HOUSING	62.65	61.85
HPL ELEC	154.9	156.75
HSG & UR	83.35	82
HSIL LIM	498.8	497
HT MEDIA	102.45	102.35
HUBTOWN	136.7	132.8
HUHTAMAK	360	358.35

I J K L

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
I G PETR	739.65	754
ICE MAKE	120.95	120.1
ICICI LO	800.3	800.05
ICRA LIM	3964.95	3978.65
IDBI BAN	59.5	59.4
IDFC BAN	54.15	53.95
IDFC LIM	61.7	61.6
IFB INDU	1307.25	1328.4
IFGL REF	311.1	312.1
IGARASHI	849.85	844.4
IIFL HOL	644.45	647.75
IL&FS TR	93.05	81.55
IND MOTO	1117.55	1078.35
IND SWIF	77.8	78.85
IND TERR	218.75	215.9
INDIA GL	461.5	443.5
INDIA GR	94.21	94.1
INDIA NI	1092.55	1091.85
INDIA TO	511.85	515.35
INDIABUL	216	215.5
INDIABUL	259.45	255.75
INDIAN B	373.2	375.55
INDIAN C	199.95	197.4
INDIAN E	1598.25	1607
INDIAN H	445.45	449.55
INDIAN M	724.25	668.7
INDO COU	118.85	117.95
INDO TEC	226.6	223.15
INDO THA	89.65	79.45
INDOCO R	280.95	280.55
INDRAPRA	62.1	61.95
INDRAPRA	332.75	335.2
INEOS ST	1071.6	1044.3
INFIBEAM	143.95	143
INFINITE	272.1	272.2
INFO EDG	1358.35	1345
INFOBEAN	76	76.9
INGERSOL	859.5	854.5
INNOVANA	204.5	194.8
INNOVATI	51.55	50.2
INOX LEI	281	280.85
INOX WIN	145.2	145
INSECTIC	819.25	797.65
INTELLEC	167.6	160.9
INTENSE	111.95	107.45
INTERNAT	331.85	317.45
INTRASOF	781.4	763.35
IPCA LAB	584.7	587.55
IRB INFR	236.1	228.95
IRB INVI	87.97	87.96
ITD CEME	215.85	212.5
ITI LTD	140.8	144.8
IVP LTD	197.45	197.45
IZMO LIM	80.05	74.4
J & K BA	82.05	81.55
J B CHEM	329.75	328.75
JAGRAN P	179.95	179.95
JAI CORP	207.15	204.55
JAIN DVR	77.9	76.5
JAIN IRR	128.75	128.7
JALAN TR	59.75	55.1
JAMNA AU	80.65	81.6
JASH ENG	186.7	185.8
JAY BHAR	570.35	574.75
JAYANT A	392.4	396.15
JBF INDU	229.75	226.85
JBM AUTO	526.9	543.2
JET AIRW	870.6	831.4
JET FREI	116	118.5
JET KNIT	120	123.65
JHS SVEN	73.7	73.55
JIND POL	82.5	79.3
JINDAL D	174.9	176.3
JINDAL P	420.1	408.45
JINDAL S	107	106.95
JINDAL S	150.15	142.45
JINDAL S	219.55	203.4
JINDAL S	224.05	221.3
JINDAL W	581.2	586.3
JK CEMEN	1114	1114.2
JK LAKSH	441.9	440.8
JK PAPER	145.45	136.9
JK TYRE	148.8	144.65
JKUMAR I	316	307.85
JM FINAN	155.05	156.05
JMC PROJ	633.95	617.1
JOCIL LI	203.2	197.05
JOHNSON	2619.5	2655.8
JSW ENER	90.3	89.85
JSW HOLD	1781.65	1797.35
JUBILANT	257.55	258.85
JUBILANT	763.05	756.65
JUBILANT	1850.55	1792.35
JULLUNDU	251.7	257.85
JUSTDIAL	515.4	517.2
JYOTHY L	379.05	379.55
KABRA EX	127.55	128.95
KAJARIA	736.95	712.95
KALPATAR	482.9	475.7
KALYANI	398.45	393.75
KALYANI	2632.7	2627.45
KAMAT HO	121.9	121.2
KANORIA	96.95	97
KANSAI N	562.2	563.6
KARNATAK	153.15	153.85
KARUR VY	121.1	121.7
KAVERI S	536.75	539.45
KAYA LIM	978.15	976.5
KEC INTL	372.8	381.4
KEI INDU	377.15	373.6
KESAR EN	67.45	63.6
KESAR TE	180.35	179.35
KESORAM	140.7	135.6
KEWAL KI	1874.5	1861.1
KEYNOTE	66	64.45
KHADIM I	664.85	665.2
KILITCH	89.8	87.75
KINGFA S	828.95	824.9
KIOCL LI	386.45	383.15
KIRI IND	545.85	507.25
KIRLOSKA	348.8	347.5
KIRLOSKA	383.55	382.75
KIRLOSKA	1476.2	1522.7
KITEX GA	307.05	306.5
KKV AGRO	535	496
KOHINOOR	75.9	73.6
KOKUYO C	129.25	130.35
KOLTE PA	357.45	358.55
KOPRAN L	71.6	67.35
KOTHARI	220.7	208.5
KPIT TEC	198.6	190.15
KPR MILL	815.95	809.5
KRBL LIM	605.25	600.2
KRIDHAN	131.25	124.1
KSB PUMP	885.75	873.65
KWALITY	111.55	111.3
L&T FINA	170.05	170.75
L&T INFO	1124.8	1149
L&T TECH	1137.75	1105.55
LA OPALA	651.25	602.1
LAKSHMI	148.55	149.85
LAKSHMI	5803.55	5804.6
LAMBODHA	73.15	73.45
LAURUS L	536.85	535.95
LEEL ELE	287.25	283.5
LEXUS GR	124.95	125.2
LG BALAK	1058.35	1061.25
LIBERTY	263.8	261.4
LINC PEN	402.7	386.55
LINCOLN	232.05	234
LINDE IN	528.25	520.05
LOVABLE	240.9	241.35
LT FOODS	96.7	90.65
LUMAX AU	816.9	808
LUMAX IN	2097.8	2109.2
LUX INDU	1503.6	1499.35
LYKA LAB	63.95	62.7

M N O P

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
M P TODA	130.05	126.8
M&M FIN.	464.6	462.8
MAAN ALU	144.25	142.35
MADHAV M	72.2	71.65
MAGADH S	173.7	171.8
MAGMA FI	167.6	163.55
MAHAMAYA	80.55	83.1
MAHANAGA	1098	1095.55
MAHARASH	533.2	511.4
MAHARASH	2740.05	2750.85
MAHESHWA	212.1	209
MAHINDRA	250.1	250.55
MAHINDRA	334.7	333.9
MAHINDRA	442.55	448.55
MAHINDRA	462.75	465
MAITHAN	831.6	794.7
MAJESCO	508.25	509.5
MAN INDU	143.1	130.4
MAN INFR	67.8	65.95
MANAKSIA	73.8	73.3
MANAPPUR	119.4	119.25
MANG.CHE	82.15	79.25
MANGALAM	212.05	210.4
MANGALAM	391.1	365
MANPASAN	473.8	462.05
MANUGRAP	57.85	57.45
MARAL OV	55.15	54
MARATHON	643.75	630.4
MAS FINA	614.15	615.35
MASTEK L	375.9	372.05
MATRIMON	924.85	924.5
MAWANA S	81.1	80.8
MAX FINA	584.1	584.6
MAX INDI	123.35	122.3
MAX VENT	91.6	90.8
MAYUR UN	514.95	503.6
MAZDA LI	406.5	412.35
MCLEOD R	198.7	198.95
MEGHMANI	109.45	105.9
MENON BE	96.7	95.55
MEP INFR	100.05	92.55
MERCK LI	1320.25	1305.3
MINDA CO	211.55	212.85
MINDA IN	1253.3	1276.25
MINDTECK	78.2	78.1
MINDTREE	599.3	605.05
MIRC ELE	57.2	54.5
MIRZA IN	161.15	158.6
MITCON C	77	77
MM FORGI	1151.7	1181.4
MMTC LIM	71.5	71.05
MOHOTA I	399.8	403.7
MOIL LIM	239.45	236.9
MOLD-TEK	326.55	324.5
MONSANTO	2485.55	2492.75
MONTE CA	610.85	601.45
MORARJEE	55.75	54.4
MOTILAL	1479.3	1454.35
MPHASIS	720.05	734.65
MPS LIMI	646.2	637.95
MRPL	126.35	125.35
MUKAND E	61	59.55
MUKAND L	89.55	87.9
MUKTA AR	105.65	100.4
MULTI CO	910.55	908.45
MUNJAL A	87.05	87.25
MUNJAL S	287.4	286.45
MURUDESH	50.7	50
MUSIC BR	377.75	378.25
MUTHOOT	457.35	458.9
MUTHOOT	629.05	633.9
N R AGAR	427.8	419
N.B.I. I	1840.9	1861.05
NACL IND	62.2	59.55
NAGA DHU	1983.3	1888.9
NAGREEKA	58.15	55.4
NAHAR CA	203.7	194.55
NAHAR IN	108.35	109.05
NAHAR PO	72.5	73.7
NAHAR SP	126.8	124.3
NALWA SO	1477.9	1426
NANDAN D	162.15	162.7
NANDANI	95	98
NARAYANA	297.8	298.55
NATH BIO	486.55	460.55
NATIONAL	77.15	74.1
NALCO	86.3	85.5
NAVIN FL	813.8	810
NAVKAR C	203.05	188.95
NAVNEET	158.15	159.9
NBCC (IN	243.45	243.55
NCC LIMI	130.05	130.45
NELCAST	95.35	94.55
NELCO LT	125.35	121.05
NESCO LT	557.25	527.5
NESTLE I	7860.1	7863.55
NETWORK1	58.85	58.95
NIIT LIM	108.65	100.15
NIIT TEC	645.95	642.55
NILKAMAL	1975.65	1888.35
NITCO LI	116.05	111.8
NITIN SP	111.2	110.85
NLC INDI	108.8	108.75
NOCIL LI	193.65	181.7
NRB BEAR	166.4	168.7
NUCLEUS	511.45	501.25
OBEROI R	479.6	480.4
OCL INDI	1459	1470.35
OM METAL	69.2	64.2
OMAX AUT	100.05	95.7
OMAXE LI	228.85	228.55
OMKAR SP	72.85	73.2
ONE POIN	103.4	106.8
ONMOBILE	63.35	62.75
ONWARD T	134.2	136.45
ORBIT EX	174.7	156.25
ORICON E	61.8	61.85
ORIENT A	54.9	55.3
ORIENT B	310.05	310.15
ORIENT C	169.45	166.6
ORIENT P	158.2	159.35
ORIENT P	196.75	206.6
ORIENT R	166.45	165.85
ORIENTAL	119.7	120
ORIENTAL	1354.65	1224.1
ORISSA M	2037.5	2065.75
PAGE IND	24680.45	24411.45
PALRED T	92.1	92.55
PANACEA	244.5	237
PANACHE	96.2	95.8
PANAMA P	245.45	243.05
PARAG MI	303.85	297.45
PATEL EN	78.6	76.4
PATEL IN	82.1	81.55
PC JEWEL	475.8	466.3
PDS MULT	304.6	302.95
PEARL GL	137	139.05
PENNAR E	94.9	95.15
PENNAR I	67.3	67.15
PERSISTE	696	709.15
PETRON E	147.7	142.45
PFIZER L	2017.15	2049.5
PG ELECT	415.1	411.85
PHILIPS	1173.25	1015.4
PI INDUS	955.95	942.2
PIONEER	202.3	199.8
PLASTIBL	234.6	237.55
PNB HOUS	1305.4	1309.35
PNC INFR	205.5	209.65
PODDAR H	1339.75	1359.5
PODDAR P	296.2	291.05
POKARNA	221.05	218.8
POLY MED	277.35	279.5
POLYPLEX	551.5	549.85
PONNIE S	173	171.05
POWER ME	870.4	768.55
PPAP AUT	688.7	697.7
PRABHAT	242.1	215.1
PRAJ IND	109.25	109
PRAKASH	209.4	202.25
PRATAAP	1246.15	1236.5
PRECISIO	139.05	134.35
PRECISIO	291.95	293.05
PRECOT M	94.65	93.8
PREMIER	434.35	430.45
PRESSMAN	78.45	77.1
PRESTIGE	321	321.5
PRICOL L	134.45	118.1
PRIME FO	127.9	125.35
PRIME SE	57.2	56.9
PROZONE	72.8	70.4
PSP PROJ	510.1	513.45
PTC INDI	118.8	119.25
PULZ ELE	53.5	51.3
PUNJAB C	473.9	468.1
PURAVANK	166.15	160.85
PUSHPA R	91.5	92
PVR LIMI	1401.8	1402.8
QUESS CO	1159.35	1178.55
QUICK HE	315.05	304.1

R S T U

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
R M DRIP	74.8	75
R. S. SO	86.9	86.05
R.P.P IN	302.1	298.05
RADICO K	297.8	292.15
RAIN IND	438.3	399.3
RAJ TV N	60.8	58.95
RAJESH E	809.75	816.25
RAJSHREE	57.25	57.45
RALLIS I	269.55	265.35
RAMA STE	212.05	210.2
RAMCO IN	290.45	283.9
RAMCO SY	562.35	559.85
RAMKRISH	859.55	866.15
RAMKY IN	221.85	221
RANE (MA	724.3	713.3
RANE BRA	1186.7	1165.6
RANE ENG	627.45	624
RANE HOL	2463.4	2360.3
RASHTRIY	100.95	95.65
RATNAMAN	1093.25	1090.85
RAYMOND	1055.9	1045.8
RBL BANK	514.9	511.65
REDINGTO	184.25	185.5
RELAXO F	686	670.9
RELIABLE	71	67.1
RELIANCE	56.95	56.85
RELIANCE	58.6	59.7
RELIANCE	93.6	93.9
RELIANCE	296.8	287.8
RELIANCE	562.55	563.4
RELIANCE	599.8	596.75
RELIANCE	639.9	659.75
RELIGARE	70.4	70.7
RENAISSA	327.3	324.7
REPCO HO	692.75	687.25
REPRO IN	775.4	771.15
REVATHI	719.1	719.9
RICO AUT	102.15	101.75
RKEC PRO	162.5	166.7
ROLTA IN	70.8	71.2
ROSSELL	120.3	117.75
ROYAL OR	166.2	162.35
RPG LIFE	486.5	483.35
RSWM LIM	404.4	384.25
RUCHIRA	206.25	200.05
RUPA & C	478.15	471.55
RUSHIL D	933.85	903.35
S CHAND	518.2	513.5
S H KELK	294	287
S. P. AP	399.95	405.3
S.E. INV	208.9	209.75
SADBHAV	143.5	143.25
SADBHAV	417.2	426.9
SAKSOFT	229.95	228.8
SALASAR	338.25	328.6
SALONA C	187.85	186.35
SALZER E	228	227.7
SANCO IN	54.25	56.2
SANDESH	1390.25	1403.5
SANGAM (	193.9	192.8
SANGHVI	187.25	191
SANOFI I	4661.85	4676.15
SARDA EN	510	499.85
SAREGAMA	853.4	792.8
SARLA PE	76.65	73.2
SASKEN T	744.75	737.15
SATIN CR	433.45	428.85
SAVITA O	1627.55	1603.8
SBI LIFE	690.5	685.1
SCHAEFFL	5747.6	5749.7
SCHNEIDE	129.65	129
SECUR CR	226	226
SECURITY	1166.55	1137.85
SEQUENT	97.4	98.2
SESHASAY	911.05	888
SETCO AU	61.8	61.75
SHAKTI P	486.6	454.2
SHALBY L	238.8	235.75
SHALIM P	198.6	199.9
SHANKARA	1772.65	1775.05
SHANTHI	160	162.25
SHARDA C	453.35	455.35
SHARDA M	2525.25	2528.35
SHEELA F	1688.25	1704.35
SHEMAROO	425.6	427.45
SHILPA M	610.4	614.7
SHIPPING	96.05	93.8
SHIRPUR	195.5	191.5
SHIVAM A	101.5	101.2
SHOPPERS	533.25	536.05
SHRADHA	71	70.3
SHRE PUS	302.45	297.8
SHREE TI	65	63.25
SHRENIK	579.8	563.3
SHREYANS	208	206.95
SHREYAS	593.85	594.2
SHRIRAM	2095.4	2109.8
SICAGEN	51.6	51.85
SICAL LO	252	254.6
SILVER T	126.35	126
SIMPLEX	582.55	576.85
SINTEX P	81.3	80.9
SIYARAM	713.15	721.65
SKF INDI	1857.7	1853.2
SKIPPER	264.1	265.75
SKM EGG	95.55	94.1
SMARTLIN	118.75	108.4
SML ISUZ	910.8	904.65
SMS LIFE	429.9	428.9
SMS PHAR	101.65	101.85
SNOWMAN	59.45	59.6
SOBHA LI	603.25	589.55
SOLAR IN	1178.6	1172.85
SOM DIST	182.95	177.25
SOMANY C	934.25	910.5
SOMI CON	77.9	71.6
SONA KOY	108.8	109.05
SONATA S	267.3	273.85
SORIL IN	310.85	306.5
SPECIALI	182.4	179.85
SPML INF	154.05	154.4
SQS INDI	531	524.9
SREELEAT	297	289.4
SREI INF	98.35	98.85
SRF LTD	1921.4	1945.5
SRIKALAH	405.05	392.7
STAR CEM	138.1	136.55
STAR PAP	281.4	280.8
STEEL CI	129	129
STEEL ST	1173.45	1150.2
STEL HOL	133.75	121.6
STERLING	429.15	426
STERLITE	303.6	290.7
STRIDES	818.5	816.8
SUBROS L	306.75	303.75
SUDARSHA	392.55	391.05
SUMMIT S	1303.8	1276
SUN PHAR	500.3	490.95
SUNDARAM	701.35	700.15
SUNDARAM	1850.95	1854.1
SUNDARAM	5334.85	5324.8
SUNDRAM	573.65	574.7
SUNFLAG	82.65	81
SUNTECK	414.45	418.65
SUPERHOU	187.25	178.2
SUPRAJIT	339	327.4
SUPREME	60.5	60.85
SUPREME	124	118.65
SUPREME	389.65	384.1
SUPREME	1294.9	1300.25
SUREVIN	88	90.3
SURYA RO	379.8	379.65
SUTLEJ T	99.15	96.55
SWAN ENE	193.85	194.9
SWARAJ E	2146.5	2091.75
SWELECT	499.45	494.45
SYMPHONY	1717.1	1693.45
SYNDICAT	79.4	78.65
SYNGENE	566.55	560.2
T T LIMI	136.3	113.95
TAINWALA	124.65	125.75
TAKE SOL	168.45	164.6
TALBROS	332.15	325.65
TALWALKA	303.4	313.7
TAMILNAD	71.6	69.45
TAMILNAD	442.8	439.25
TARMAT L	67.1	66.75
TASTY BI	9420.6	7850.5
TATA CHE	755.9	730.1
TATA COF	165.7	165
TATA COM	668.65	670.75
TATA ELX	994.05	977.85
TATA GLO	311.2	311.15
TATA INV	883.9	891.45
TATA MET	860.55	872.65
TATA MOT	255.15	253.1
TATA SPO	992.95	997.75
TCI EXPR	567.3	567.35
TCPL PAC	697.35	704.4
TD POWER	187.75	189.95
TEAMLEAS	2320.95	2358.4
TECHNO E	399.35	400.6
TECHNOCR	525	522.6
TEJAS NE	417.65	415.85
TERA SOF	70.1	70.85
TEXMACO	68.9	69.2
TEXMACO	113.8	112.45
TGB BANQ	59.55	58.55
THANGAMA	621.9	607.35
THE BYKE	179.4	179.7
THE GE S	404.9	401.05
THE GROB	1613.35	1536.55
THE HI-T	541.5	554.7
THE INDI	121.35	118.5
THE INDI	186.4	180.1
THE MAND	156.4	157
THE NEW	621.15	614.95
THE P K	390.9	395.3
THE PHOE	618.25	635.2
THE RAMC	793.8	775.5
THE RUBY	405.65	397.55
THE TINP	259.8	259.85
THEJO EN	565	565
THEMIS M	704	737.05
THERMAX	1238.15	1209.75
THIRU AR	59.2	58.65
THIRUMAL	2128.2	2124.3
THOMAS C	250.8	251.3
THYROCAR	683.7	685.3
TI FINAN	695.9	700.9
TIDE WAT	7071.95	7004.75
TIL LTD	621.7	609.4
TIME TEC	209.3	208.15
TIMES GU	74.05	70.8
TIMKEN I	897.35	874.8
TIRUPATI	71.35	70.9
TITAGARH	172.65	168.25
TOKYO PL	139.3	133.95
TORRENT	278.25	277.85
TOTAL TR	67.9	62.35
TOUCHWOO	70.25	63.9
TOURISM	155.65	155.9
TPL PLAS	770	743.3
TRENT LT	328.5	327.1
TRIB BHI	122	122.15
TRIDENT	89.2	88.4
TRIGYN T	129.1	129
TRIVENI	78.25	78.05
TRIVENI	129.85	129.45
TTK HEAL	820.5	819.95
TTK PRES	7748.35	7770.65
TUBE INV	273.85	268.15
TV TODAY	430.05	428.5
TV18 BRO	60.5	59.95
TVS MOTO	769.85	774.85
TVS SRIC	3803.85	3826.95
UCAL FUE	294.2	293.2
UFLEX LI	480.35	481.5
UFO MOVI	517.85	502.55
UJJIVAN	397.65	386
UMANG DA	82.05	79.5
UNICHEM	332.6	324.9
UNION BA	143.15	141.95
UNIPHOS	93.3	92.1
UNIPLY I	428.45	433.05
UNITED B	1077.55	1030.7
UNIVASTU	71	60
UNIVERSA	179	178.8
UTTAM SU	148	143.05

V W X Z

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
V-GUARD	235.4	236.65
V2 RETAI	467.4	465.4
VA TECH	629.95	622.95
VADILAL	970.55	970.05
VADIVARH	135.9	132
VAIBHAV	708.7	713.7
VAKRANGE	417.65	420.15
VARDHAMA	53.75	55.05
VARDHMAN	169.85	166.85
VARDHMAN	1486.55	1427.4
VARDHMAN	5203.35	5172.9
VARUN BE	708.5	702.4
VENKY'S	2751.9	2785.1
VENUS RE	103.75	103.25
VERTOZ A	264.9	276.95
VESUVIUS	1348.9	1333.85
VETO SWI	251.3	253.6
VIDHI SP	101.95	102.9
VIJAYA B	66.8	68.15
VINATI O	995.6	993.5
VINDHYA	1301.35	1280.55
VINYL CH	113.25	108.5
VIP CLOT	81.05	76.9
VIP INDU	344.6	347.15
VIPUL LI	75.55	74.3
VLS FINA	93.65	92.85
VMART RE	1503	1479.35
VOLTAMP	1106	1092.6
VOLTAS L	643.6	647.4
VRL LOGI	424.05	427.6
VST TILL	2561.2	2447.35
WABCO IN	7492.85	7213
WALCHAND	252.3	247.7
WEBSOL E	131.6	128.5
WEIZMANN	67.35	66.6
WEIZMANN	1417.35	1415.45
WELSPUN	71.4	71.7
WELSPUN	142.3	135.95
WELSPUN	177.45	174.65
WENDT (I	4121.8	4046.2
WEST COA	318.5	308.2
WHEELS I	2156.9	2071.95
WHIRLPOO	1572.65	1599.6
WINDSOR	109.8	105.9
WOCKHARD	933.75	903.3
WONDERLA	361.7	360.85
WORTH PE	110.75	110.1
XCHANGIN	61.2	60.5
XPRO IND	63.25	61.95
ZEN TECH	149.2	147.8
ZENITH E	57.4	58.5
ZENSAR T	867.05	857.4
ZODIAC C	229.65	228.3
ZODIAC E	52.6	52.9
ZOTA HEA	216.05	218
ZUARI AG	547.35	533.8
ZUARI GL	250	244.95
ZYDUS WE	1022	1017.35

బీఎస్ఈలో ఏపీ,టీఎస్ స్టాక్స్

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
AditSpin	8.51	8.81
Alphageo	910.5	906.4
Alu Flouride	136	135.45
Amar Raja Bat	848	829.5
And Bank	57.35	57.35
And Cemen	13.75	13.67
And Paper	332	317.95
And Petro	58	60.95
Anjani Portl	237	233.3
Aries Agro Ltd	245	241.65
Aurobindo Ph	666.5	671.85
Avantel Soft	484.85	467.45
Avanti Feeds	2563.25	2587.5
AvonOrg	16.48	15.7
BN Rathi Sec	55.5	53.75
Balaji Amin	623.6	622.55
Bambino Agro	325	327
Bartronics	15.22	15.06
Bhagira Chem	314.75	323.65
Bhagya Nag	51.4	51.25
Bhagya Wood	30.25	29.45
Brilliant Sec	12.21	11.63
CIL Securi	37.3	36.7
Color Chip	49.95	46
Cont Coffee	299.85	298.85
CoroFert	572	542
Cosboard Ind	45	43.8
Country Club	20.85	19.75
Cubex Tub	28.5	28.1
Cybermate	3.46	3.5
DR Reddy	2336.2	2407.7
Danlaw Tec	77	73.5
DecCement	570.6	560
Divi's Lab	1098.2	1079.2
Divya Granit	101.1	104.9
Dolphin Medi	2	1.91
Dredgin Corp	856.55	821.3
Empee Sugars	5.59	5.33
Essen Supple	22.1	21.05
Everest Org	136.5	137
Fortune Info	111.4	107.4
Four Soft	92.15	93.3
GMR Ferro	3.65	3.5
GMR Infra	21.8	21.65
GVK Power	19.25	18.6
Galada Tele	5.15	5.42
Gati Corpn	135.4	133.25
Gayatri Proj	228.1	227.25
Gayatri Sugrs	11.74	11.19
Gennex Lab	6.08	6.15
GodavDru	43.4	42.55
GoldCarpe	5.16	5.43
Goldstn Tele	199.7	201.85
Goldstone Tech	15.35	16.15
Granules (I)	134.8	134.3
HBL Nife Pow	73.05	73.05
HYDIndus	1509.85	1514.2
Heritage Food	803.15	803.1
Hifco Marwel	33.8	32.2
ICSA Ltd	4.67	4.25
IDL Industrs	605	577.3
IQMS Soft	15.85	15.8
IVRCL Infras	6.85	7.33
Incap	120.65	114.95
IndoNationl	901	901.1
Infotech En	577.5	573.25
Innaredy Com	4.67	4.25
Invinex Lab	91.05	89.3
JSTL	55.7	56.85
KCP LTD	147.2	143.85
KNR Constructio	312.95	308.85
Kabsons Indu	8.52	8.36
KakatiCem	395.6	396.3
KakatiTex	3	3
Kallam Spg	26	23.6
Kernex Micro	46.45	45.4
Krebs Bio	161.4	153.75
LGS Global	5.98	6.13
LancoIndus	405.2	391.95
Lokesh Mach	77.65	71.95
MIC Elec	9.56	9.42
Madhucon Proje	35.6	35.8
Maytas Infra	56.45	53.8
Mold-tek	75	75.5
Moldtek Plastic	325	321.15
Moschip Semi	39.55	39.35
NCLInd	265.7	251.3
NETTLINX	81.1	80.7
NMDC Ltd	149.2	148.6
NagarAgrich	62.2	59.65
NagarAgrite	8.08	7.7
NagarConst	130	130.45
Natco Pharma	976	967.6
Nava Bh Ventur	163	153.65
Neha Inter	10.35	9.94
Neocure Ther	4.04	3.9
Neuland Lab	879.65	886.35
Nihar Info Glo	14.3	14.8
Nile	912	895.65
Oil Country	64.2	54.75
Ortin labs	29.25	29.05
Padmalaya Tele	5.85	5.76
Pankaj Poly	24.15	23
Panyam Cemen	62.35	60.7
PennInd	67.55	67.2
Phytochem I	74.4	75.8
Pitti Lamin	105	102
Pokarna	220.4	218.8
Prajay Engs	15.97	15.21
PremiExpl	433	430.25
Prism Cement	115.4	115.5
Rain Industries	438.95	400.05
Raj Packagin	38	39.4
Ram Informat	41.45	43
RavilFin	15.26	14.55
RavilGr	32.8	34.5
Reg.Ceramic	9.21	9.37
Restile Cer	9.79	9.85
Roopa Indus	13.16	13.49
SS Organics	6.65	7
Sagar Cem	1011	912.75
Sai Wires(I)	2.45	2.5
Samkrg Pist	347.8	347.6
Sampre Nutri	90.4	95.15
SangInd	139.6	135.5
Satvah. Ispat	34.2	33.85
Saven Techno	24.7	25.3
Softpro Sys	5.26	5.01
Softsol	46	46
South Bio Tech	3.46	3.37
South Magnes	37.2	35.5
SrRayAlk	79.75	72.95
Srinivasa Ship	85.05	84.9
Sujana Metal	1.76	1.82
Sujana Towers	4.9	4.84
Sujana Univers	0.9	0.88
Surana Tele	6.25	6.27
Suryachakra Pow	1.36	1.3
Suryalata Sp	168.6	161.2
SuvarCem	171.05	171.45
Suven Pharma	202.7	202.4
TCI Finance	27.85	27.5
Taj Gvk Hotel	177.35	178.3
Tanla Solutions	40.7	38.55
Trans Biotek	2.37	2.3
Transport Co	290.8	287.2
Trendy Knit	0.2	0.21
Usher Agro	8.85	8.59
VBC Ferro	45.85	44.05
VST Indus	3201.95	3157.8
Vamshi Rubb	52.45	54.85
Viceroy Hotels	20.45	18.3
VijayTextil	44	43.75
Vimta Labs	170	167.75
Virat Crane	45.85	45
Virinchi Con	126.45	125.35
VisakaInd	663	647.75
Vision Tech	1.99	2
Vista Pharma	41.5	40.65
Vivimed Labs	104.35	105
ZenoTech Lab	47	47

ఓ రైతూ.. నెల తర్వాత రా!



కందుల అమ్మకానికి తేదీ నిర్ణయిస్తున్న 'హాకా'

గోదాములు నిండిపోయాయని వెల్లడి
అధికారుల తీరుతో ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్న రైతులు
వ్యాపారస్తులు, అధికారులు కుమ్మక్కయ్యారని ఆరోపణ

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: కరువు కాటకాలతో కొట్టుమిట్టాడే పాలమూరు ప్రాంతంలో వ్యవసాయరంగం కత్తి మీద సాము వంటిది. దీనికి తోడు అధికారులు వ్యవహరించే తీరుతో ఈ ప్రాంత రైతాంగానికి కొత్త కష్టం వచ్చిపడింది. మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వం 'హాకా'ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రాల అధికారులు చేతులెత్తేస్తుండటంతో రైతులు దిక్కుతోచని పరిస్థితి ఎదుర్కొంటున్నారు.

అధికారుల ఆంక్షలు

జిల్లాలోని నారాయణపేటలో 'హాకా' కేంద్రం ఆధ్వర్యాన కందుల కొనుగోళ్లు జరుగుతున్నాయి. అయితే, గోదాం నిండిపోయింది, తరలించేందుకు సమయం పట్టనున్నందున ఇప్పటికిప్పుడు కందులు కొనుగోలు చేయలేమని అధికారులు చెబుతున్నారు. కందులతో వచ్చిన రైతులకు తేదీ చెబుతూ ఆ రోజు రావాలని సూచిస్తున్నారు. దీంతో రైతులు చేసేదేంలేక ప్రైవేట్ వ్యాపారులు చెప్పిన ధరలకు అమ్ముకుంటున్నారు. కొందరు రైతులు మాత్రం ఇంట్లోనే నిల్వ చేస్తున్నారు. గత నెల 27న కందుల ధర గరిష్టంగా రూ.5,031 పలకగా.. బుధవారానికి రూ.4,200కు చేరింది. హాకా ద్వారా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.5,450 కాగా.. ప్రైవేట్ వ్యాపారులు రూ.4,250కే కొంటుండటంతో క్వింటాపై రూ.1200 వరకు రైతులు నష్టపోతున్నారు.

కుమ్మక్కయ్యారా ?

గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది కంది దిగుబడి తక్కువగానే ఉందని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. కానీ కొనుగోలు చేయడంలో అధికారులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారో అర్థం కావడం లేదంటూ రైతు సంఘాల నేతలు వాపోతున్నారు. వ్యాపారులతో మార్కెట్ అధికారులు, హాకా నిర్వాహకులు కుమ్మక్కు కావడంతోనే ఈ పరిస్థితి నెలకొందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొనుగోలు చేసేందుకు నెల రోజుల గడువు.. డబ్బులు ఇచ్చేందుకు మరో 15 రోజులు ఇలా మొత్తం మీద నెలన్నర రోజులు పడుతుందని అధికారులే స్పష్టం చేస్తున్నారు. దీంతో చేసేది లేక మార్కెట్‌లోనే కమీషన్ ఏజెంట్లను రైతులు ఆశ్రయించాల్సి వస్తోంది. డిసెంబర్ 27 నుంచి 5 పని దినాలలో మహబూబ్‌నగర్ జిల్లా మొత్తంలో ప్రైవేట్ వ్యాపారులు 11,679 క్వింటాళ్లు కొనుగోలు చేయగా.. హాకా 3 వేల క్వింటాళ్లు కూడా కొనుగోలు చేయలేకపోయింది. ఒక్క నారాయణపేట మార్కెట్‌లో కమీషన్ ఏజెంట్లు 7,744 క్వింటాళ్లు కొనుగోలు చేయగా.. హాకా 1,200 క్వింటాళ్ల మాత్రమే సేకరించింది.

కొనసాగుతున్న జీరో దందా..



మహబూబ్‌నగర్ జిల్లాలోని పలు మార్కెట్ యార్డుల్లో జీరో వ్యాపారం జోరుగా సాగుతోంది. అధికారుల కళ్లు గప్పి వ్యాపారులు తమదైన శైలిలో జీరో వ్యాపారం చేస్తున్నారు. రైతులు తెచ్చిన పంటలో కొంత మొత్తానికి టోకెన్లు తీసుకోవడం.. మరికొంత టెండర్ల ద్వారా కొనుగోలు చేస్తూ మార్కెట్ ఆదాయానికి గండి కొడుతున్నట్లు సమాచారం. మార్కెట్ అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో వ్యాపారులు ఆడిందే ఆట పాడిందే పాటగా సాగుతోంది.

45 రోజులు ఆగాలట




ఆరుగాలం కష్టం చేసిన పండించిన పంటను అమ్ముకోవడానికి కూడా అగచాట్లు పడాల్సి వస్తోంది. కాస్తో కూస్తో పండిన కందులను అమ్ముకుందామని మార్కెట్‌కు వస్తే నెల రోజుల తర్వాత రమ్మని చీటీ రాసిండ్రు. అప్పుడు కూడా పంటను అమ్మినా తర్వాత 15 రోజులకు డబ్బు బ్యాంకు ఖాతాలో వేస్తరట. మేం పెట్టుబడి కోసం చేసిన అప్పుల మిత్తిలు పెరిగిపోతున్నయి. చేసేదేం లేక కమీషన్ ఏజెంట్లకు అమ్ముకుంటున్నం. – వెంకట్‌రెడ్డి, రైతు, ఎక్లాస్‌పూర్

చివరి గింజా కొంటాం

ప్రభుత్వం తరఫున హాకా ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశాం. రైతులు ఇక్కడికి తెచ్చిన కందులను చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం. రోజురోజుకు కందులు తెచ్చే రైతులు పెరుగుతున్నారు. నిన్నటి వరకు టోకెన్లు ఇచ్చాం. ఇప్పుడు తెచ్చిన రైతులను క్యూలో ఉంచి కందులను కొనుగోలు చేస్తున్నాం. 15 రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బు జమ చేస్తాం. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. అందరి కందులనూ కొనుగోలు చేస్తాం. –శ్రీనివాస్ మూర్తి, హాకా మేనేజర్

ఇంట్లో పెట్టుకున్నాం



మద్దతు ధర వస్తదని హాకా కేంద్రానికి వెళ్లినం. శాంపిల్ చూపిస్తే 12శాతం తేమ ఉండాలన్నారు. ఆ తర్వాత ఒక చీటీ రాసిచ్చారు. నెల రోజుల తర్వాత తీసుకొస్తే కొనుగోలు చేస్తమని చెప్పిండ్రు. కమీషన్ ఏజెంట్ల దగ్గరికి వెళ్తే ధర తక్కువ వస్తుందని.. కంది బ్యాగులను ఇంట్లో నిల్వ చేసుకున్నాం. – శివరామకృష్ణ, నారాయణపేట

పడిపోయిన పత్తి ధర

ఆందోళనకు దిగిన రైతులు ● వేలం రద్దు చేసిన అధికారులు



జడ్చర్ల: మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పత్తి మార్కెట్‌లో బుధవారం పత్తి ధరలు ఒక్కసారిగా పడిపోయాయి. నెల రోజులుగా పైపైకి వెళ్తున్న ధరలు.. ఒక్కసారిగా పడిపోవడంతో రైతులు ఆందోళనకు దిగారు. యార్డు ప్రధాన గేటుకు తాళం వేసి నిరసన తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి బుధవారం జడ్చర్ల మార్కెట్‌కు 3,500 క్వింటాళ్ల పత్తిని రైతులు తీసుకొచ్చారు. అయితే, ఒకటి, రెండు కుప్పలకు క్వింటా రూ.4 వేల పైన ధర ప్రకటించిన వ్యాపారులు.. మిగతా వాటికి రూ.2 వేల వరకే ఇస్తామని చెప్పారు. దీంతో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గతవారం క్వింటా పత్తికి గరిష్టంగా రూ.5,100 వరకు ధర పలుకగా.. ఇప్పుడు రూ.3 వేల నుంచి రూ.2,069 కి పడిపోవడం ఏమిటని నిలదీశారు. అక్కడికి చేరుకున్న మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోవర్ధన్‌రెడ్డి, కార్యదర్శి భాస్కరయ్యలతో వాగ్వాదానికి దిగారు. అనంతరం వారు వ్యాపారులతో చర్చించి .. బుధవారం నాటి వేలంను రద్దు చేయించారు. తిరిగి గురువారం వేలం వేసి నూతన ధర నిర్ణయించనున్నట్లు ప్రకటించడంతో రైతులు శాంతించారు.

జగిత్యాల జిల్లా సారంగాపూర్‌కు చెందిన రైతు అత్తిని మహిపాల్(30) తన ఐదు ఎకరాలతో పాటు మరో నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకొని వరి, పత్తి వేశాడు. రూ. 2 లక్షలతో బావి తవ్వాడు. గతంలో గల్ఫ్‌కు వెళ్లి వచ్చాడు. అప్పు రూ. 5 లక్షలకు చేరింది. మంగళవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

జెడ్పీ చైర్‌పర్సన్ గెస్ట్‌హౌస్‌లో విందు బాగోతం

- అర్ధరాత్రి మీడియాకు చిక్కిన జెడ్పీ ఉద్యోగులు
- మెమోలు జారీ చేసిన సీఈవో రవి



సంగారెడ్డి జోన్: జిల్లా ప్రజాపరిషత్ చైర్‌పర్సన్ గెస్ట్‌హౌస్ విందు, వినోదాలకు అడ్డాగా మారింది. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని అక్కడ పనిచేసే కొంత మంది ఉద్యోగులు గెస్ట్‌హౌస్‌లో మద్యం సేవించి హంగామా సృష్టించారు. సమాచారం అందుకున్న వివిధ మీడియాచానళ్లు ఈ విందు బాగోతాన్ని తమ కెమెరాలో బంధించేందుకు యత్నించగా.. గమనించిన కొందరు ఉద్యోగులు పలాయనం చిత్తగించారు. మరికొందరు మరుగుదొడ్లలో దాక్కున్నారు. జెడ్పీ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే కలెక్టర్, జాయింట్ కలెక్టర్ల నివాసాలు ఉన్నాయి. అయినా, దర్జాగా విందు చేసుకున్నారు. కాగా, బాధ్యులైన ఉద్యోగులు కె.రంగాచార్యులు, మనోజ్‌కుమార్, రవీందర్, బల్‌రాం, శ్రీనివాస్‌రెడ్డి, విజ్ఞాన్‌కుమార్, వేణుగోపాల్, బాగయ్య, నర్సింలు, రఘు తదితరులకు జెడ్పీ సీఈవో రవి మెమోలు జారీ చేశారు. వారిచ్చే వివరణ ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని సీఈవో తెలిపారు.

కాంట్రాక్ట్ నియామకాలు చట్టవిరుద్ధం

ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు జి.సంజీవరెడ్డి



హన్మకొండ: ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో కాంట్రాక్ట్ ఉద్యోగాల నియామకాలు చట్టవిరుద్ధమని ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు జి.సంజీవరెడ్డి అన్నారు. కాంట్రాక్ట్ వ్యవస్థను పూర్తిగా రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బుధవారం హన్మకొండలో తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల సంఘం 327 డైరీని ఆయన ఆవిష్కరించారు. క్యాలెండర్‌ను ఎస్పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి, సింగిల్ పేజీ క్యాలెండర్‌ను ఎన్పీడీసీఎల్ సీఎండీ అన్నమనేని గోపాల్‌రావు ఆవిష్కరించారు. దేశంలో ప్రతి ఏటా కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఖ్య పెరుగుతోందని, రెగ్యులర్ ఉద్యోగుల సంఖ్య తగ్గుతోందని సంజీవరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ ప్రభుత్వ రంగ సంస్థలను విక్రయించాలని చూస్తున్నారని ఆరోపించారు. కోల్ ఇండియా, బీహెచ్ఈఎల్, చివరకు రైల్వే వంటి ప్రభుత్వ రంగ సంస్థలను విక్రయించనున్నట్లు చెప్పారన్నారు. 110 రైల్వే స్టేషన్ల నిర్వహణను ప్రైవేట్ వారికి అప్పగించనున్నారన్నారు. పెన్షన్ సౌకర్యాన్ని పునరుద్ధరించాలని, పరిమితి లేని వైద్య సేవలు అందించాలని, అన్‌మ్యాన్డ్ వర్కర్లకు కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో సాగుకు 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నా.. తలసరి వినియోగం తక్కువేనని ఆయన చెప్పారు.

మూడు రోజుల్లో 10 వేల మెట్రిక్ టన్నులు

'ఆధార్' ద్వారా ఎరువులు కొనుగోలు చేసిన రైతులు

సాక్షి, హైదరాబాద్: ఆధార్ కార్డు ద్వారానే రైతులకు ఎరువులు విక్రయించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయం రాష్ట్రంలో విజయవంతంగా అమలవుతున్నట్లు వ్యవసాయ శాఖ వెల్లడించింది. ఎరువుల కొనుగోళ్లకు ఈ నెల ఒకటి నుంచి ఆధార్‌ను తప్పనిసరి చేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఇందుకోసం ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రైవేటు ఎరువుల దుకాణాలకు 6,641 పాయింట్ ఆఫ్ సేల్ (పీవోఎస్) యంత్రాలను సరఫరా చేసింది. ప్రైవేటు దుకాణదారులు ఈ మూడు రోజుల్లోనే 3,240 పీవోఎస్‌ల ద్వారా 10,045 మెట్రిక్ టన్నుల ఎరువులను విక్రయించినట్లు వ్యవసాయ శాఖ కార్యదర్శి సి.పార్థసారథి తెలిపారు. ఆధార్ కార్డు లేకుండా రైతులకు ఎరువులు అమ్మరని వ్యవసాయ శాఖ పెద్ద ఎత్తున ప్రచారం చేసిందన్నారు. దీంతో రైతులు ఆధార్ కార్డుతోనే కొనుగోళ్లు చేస్తున్నారని అన్నారు.

సౌదీలో ఉండలేక.. స్వదేశం రాలేక !

కార్మికుల నరకయాతన

- ఆరునెలల వేతనం ఇవ్వని కంపెనీ
- కోర్టును ఆశ్రయించినా ఫలితం శూన్యం
- ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలని వేడుకోలు..



మోర్తాడ్(బాల్కొండ): పొట్ట చేత పట్టుకుని.. పని కోసం సౌదీ వెళ్లిన తెలంగాణ కార్మికులు అక్కడి కంపెనీ చేసిన మోసంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. సౌదీ అరేబియా దమామ్‌లో ప్రాజెక్టు సిస్టమ్ గ్రూపు అనే జనరల్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ కాంట్రాక్టులను నిర్వహిస్తోంది. ఇందులో పని చేసేందుకు కార్మికులకు కంపెనీ వీసాలు జారీ చేసింది. తెలంగాణ జిల్లాల నుంచి పలువురు కార్మికులు వీసాలు పొంది అక్కడికి వెళ్లారు. ఇటీవల సౌదీలో ఏర్పడిన ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో కంపెనీ కాంట్రాక్టులు తగ్గించుకుంది. మొత్తం 56 మంది కార్మికులుండగా, 12 మందిని ఆరు నెలల క్రితం ఇళ్లకు పంపించి వేసింది. మిగిలిన వారికి అకామా ఇవ్వకుండా.. పని కూడా చెప్పకుండా సతాయిస్తోంది. ఆరు నెలలుగా వేతనాలు కూడా ఇవ్వటం లేదు. చివరికి అక్కడి లేబర్ కోర్టును ఆశ్రయించగా, కార్మికులకు అనుకూలంగా తీర్పు వచ్చింది. తమపై కోర్టుకు వెళ్లినందుకు కంపెనీ యాజమాన్యం ఆగ్రహం వ్యక్తం చేస్తూ భోజన, సరైన నీటి వసతి కూడా కల్పించడం లేదు. వేతనం.. పాస్‌పోర్టులు ఇస్తే ఇంటికి వెళ్తామని చెప్పినా వినటం లేదు. కార్మికులు అక్కడి మన విదేశాంగ శాఖలో ఫిర్యాదు చేసినా స్పందన లభించలేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి స్వదేశానికి రప్పించాలని కోరుతున్నారు.

నరకంలో ఉన్నట్లుంది...

కంపెనీ యాజమాన్యం వేధింపులు రోజురోజుకు ఎక్కువ అవుతున్నాయి. సౌదీలో ఉండటం అంటే నరకంలో ఉన్నట్లుగా ఉంది. పని లేక, సరైన తిండి, వసతి లేక ఎన్నో కష్టాలను అనుభవిస్తున్నాం. మమ్మల్ని ఎలాగైనా ఇళ్లకు రప్పించాలి. –రవీందర్, జక్రాన్‌పల్లి, నిజామాబాద్ జిల్లా

విదేశాంగ శాఖ దృష్టికి తీసుకువెళ్తాం

సౌదీలోని దమామ్‌లో తెలంగాణ కార్మికులు పడుతున్న ఇబ్బందులపై విదేశాంగ శాఖను ఆశ్రయిస్తాం. విదేశాంగ మంత్రి సుష్మ స్వరాజ్‌ను కలిసి బాధితులను ఇండ్లకు రప్పించడానికి చర్యలు తీసుకుంటాం. రాష్ట్ర ఎన్ఆర్ఐ మంత్రి కేటీఆర్‌కు సమస్యను విన్నవిస్తాం. –పాట్కూరి బసంత్‌రెడ్డి, తెలంగాణ గల్ఫ్ కల్చరల్ అసోషియేషన్ ప్రతినిధి



అంబులెన్స్‌లోనే పురుడు పోసిన వైద్యులు

నిజామాబాద్ అర్బన్: పురిటి నొప్పులతో వచ్చిన గర్భిణికి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు అత్యవసరంగా అంబులెన్స్‌లోనే ప్రసవం చేశారు. మహారాష్ట్రలోని ధర్మాబాద్‌కు చెందిన గౌసియాబేగం బుధవారం పురుటినొప్పులతో ఆస్పత్రికి చేరుకుంది. తీవ్రమైన నొప్పులతో బాధపడుతున్న ఆమెను ఆస్పత్రిలోకి కూడా తీసుకెళ్లేందుకు సమయం లేకపోవడంతో వైద్యులు అంబు లెన్స్‌లోనే పురుడు పోశారు. మగబిడ్డ జన్మించగా, తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. సకాలంలో స్పందించి వైద్యం అందించిన ఆస్పత్రి వర్గాలను పలువురు ప్రశంసించారు.

టీఆర్ఎస్‌ను గద్దె దింపడమే లక్ష్యం: తమ్మినేని



భద్రాచలం: అధికార మదంతో అరాచక పాలన చేస్తున్న టీఆర్ఎస్‌ను గద్దె దింపటమే లక్ష్యంగా రాష్ట్రంలో రాజకీయ ప్రత్యామ్నాయ ఫ్రంట్ ఏర్పాటుకు సమాలోచనలు చేస్తున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. బుధవారం భద్రాచలంలో ఆ పార్టీ జిల్లా మహాసభలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తమ్మినేని మాట్లాడారు. రాజకీయ ప్రత్యామ్నాయ వేదిక దిశగా ఇప్పటికే 31 పార్టీలు, సంఘాలు సానుకూలంగా స్పందించారని, ఈనెల 25న దీనిపై సమావేశమవుతున్నామన్నారు. ఆదివాసీ, లంబాడీల మధ్య పాలక పెద్దలు, టీఆర్ఎస్ నాయకులే చిచ్చు పెట్టారని ఆరోపించారు. మాదిగ, మాలల మధ్య అధికారంలో ఉన్న అప్పటి ప్రభుత్వం పెట్టిన చిచ్చు ఇంకా చల్లారలేదని, ఈ విషయంపై సీఎం కేసీఆర్ ఎందుకు నోరు మెదపడం లేదో చెప్పాలన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలో అధికారంలో ఉన్న టీఆర్ఎస్ వైఖరితో మాల, మాదిగల మధ్య ఇంకా అగాథం పెరుగుతోందన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే సున్నం రాజయ్య, రాష్ట్ర కార్యవర్గ కమిటీ సభ్యుడు ఏజే రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆగి ఉన్న డీసీఎంలను ఢీకొన్న లారీ

ముగ్గురు మృతి, ఆరుగురికి గాయాలు





అశ్వాపురం(భద్రాద్రి కొత్తగూడెం): ఆగి ఉన్న రెండు డీసీఎంలను వేగంగా వస్తున్న లారీ ఢీకొట్టగా.. ముగ్గురు వలస కూలీలు మృతి చెందగా, మరో ఆరుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్ల అశ్వాపురం మండలం మొండికుంటలో బుధవారం జరిగింది. అశ్వాపురం–కొత్తగూడెం ప్రధాన రహదారిలో బీఎస్ఎన్ఎల్ పైప్‌లైన్ తవ్వకం పనులు చేస్తున్నారు. నెల రోజులుగా 50 మంది కూలీలు పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో ఏపీలోని గుంటూరుకు చెందిన రెండు డీసీఎంల్లో పైపులు వచ్చాయి. వాటిని కూలీలు దింపుతుండగా.. మణుగూరు నుంచి కొత్తగూడెం వైపు వెళ్తున్న లారీ అతి వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో ఏపీ రాష్ట్రం గుంటూరు జిల్లా కొవ్వూరుకు చెందిన శివరాత్రి గోపయ్య(50), పత్తిపాడు మండలం యలమందలకు చెందిన తోడేటి భాగ్యారావు(26) అక్కడికక్కడే మృతి చెందారు. పశ్చిమగోదావరి జిల్లా జంగారెడ్డిగూడేనికి చెందిన సన్యాసిపేట కనకారావు(43) భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో మృతిచెందాడు. పశ్చిమగోదావరి జిల్లా జంగారెడ్డిగూడేనికి చెందిన శివరాత్రి రామచంద్రయ్య, శివరాత్రి శ్రీనివాస్, తురకా వెంకన్న, బెజవాడ రాజు, సంపంగి వెంకటేశ్, ఒల్లెపు భద్రాజి తీవ్రంగా గాయపడ్డారు. అశ్వాపురం సీఐ అల్లం నరేందర్, ఎస్ఐలు రాంజీ, రవీందర్‌లో సంఘటనా స్థలానికి వచ్చి గాయపడిన వారిని భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను కుటుంబసభ్యులకు అందించారు.

కేజీబీవీల కన్సల్టెంట్‌గా ప్రియదర్శిని

సాక్షి, హైదరాబాద్: కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయాల (కేజీబీవీ) కన్సల్టెంట్‌గా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి జీడీ ప్రియదర్శినిని బుధవారం ప్రభుత్వం నియమించింది. కేజీబీవీల అకడమిక్ విద్య సంబంధ అంశాలను ఆమె పర్యవేక్షించనున్నారు.

సాక్షి స్పోర్ట్స్
గురువారం 4-1-2018



ధావన్ సిద్ధం... జడేజా అనుమానం!

భారత ఓపెనర్ శిఖర్ ధావన్ పూర్తి ఫిట్‌నెస్‌తో తొలి టెస్టుకు అందుబాటులోకి వచ్చాడు. అయితే ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా అస్వస్థత జట్టును కలవరపరుస్తోంది. రేపటి నుంచి కేప్‌టౌన్ టెస్టు ప్రారంభమవుతుండగా... అతను వైరల్ జ్వరం బారిన పడ్డాడు. 'ధావన్ ఫిట్‌గా ఉన్నాడు. చీలమండ గాయంతోనే సఫారీకి బయల్దేరిన అతను తొలి టెస్టు ఆడేందుకు సిద్ధంగా ఉన్నాడు' అని బీసీసీఐ తెలిపింది. రెండు రోజులుగా వైరల్ జ్వరం బారిన పడిన జడేజాను బీసీసీఐ వైద్య సిబ్బంది, స్థానిక వైద్యులు పరీక్షించారు. మెరుగైన చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. అతను తుది జట్టులో ఉండేది లేనిది శుక్రవారమే తెలుస్తుంది.




కోహ్లి, ధోని... ఎక్కడివారక్కడే!

ఐపీఎల్ రిటెయిన్ జాబితా నేడే విడుదల

ముంబై: టీమిండియా అయినా... ఐపీఎల్ అయినా... కోహ్లి, ధోనీలే టాప్ స్టార్స్. అట్టిపెట్టుకునే అవకాశమే ఉన్నప్పుడు వీళ్లిద్దరినీ ఏ ఫ్రాంచైజీ అయినా ఎందుకు వదిలేస్తుంది. కాబట్టి రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) పంచనే విరాట్ కోహ్లి, చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) పెద్ద దిక్కుగా మహేంద్ర సింగ్ ధోని ఖాయమయ్యారు. వీరితో పాటు ఇంకా ఎవరెవరు ఏ ఏ ఫ్రాంచైజీ చేతిలో ఉంటారో నేడు తేలనుంది. భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) గురువారం అధికారికంగా అట్టిపెట్టుకున్న (రిటెయిన్) ఆటగాళ్ల జాబితాను విడుదల చేస్తుంది. తాజా రిటెయిన్ పాలసీ 2018 నుంచి 2020 వరకు మూడేళ్ల పాటు అమల్లో ఉంటుంది. మిగతా స్టార్ ఆటగాళ్లలో ముంబై ఇండియన్స్ విజయవంతమైన సారథి రోహిత్ శర్మ, ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా పాత జట్టుకే ఆడనున్నారు. గుజరాత్‌కు ఆడిన రవీంద్ర జడేజా మళ్లీ సీఎస్‌కేతో చేరే అవకాశముంది. ఆస్ట్రేలియన్ డాషింగ్ ఓపెనర్ వార్నర్‌ను సన్‌రైజర్స్ హైదరాబాద్ కొనసాగించేందుకే సిద్ధమైంది.

- రిటెన్షన్ పద్ధతిలో (వేలానికి ముందు) కానీ, రైట్ టు మ్యాచ్ (వేలం సమయంలో)తో కానీ ఒక ఫ్రాంచైజీ గరిష్టంగా ఐదుగురు ఆటగాళ్లను కొనసాగించుకునే వీలుంది.
- ఇందులో విదేశీ, స్వదేశీ పరిమితి కూడా ఉంది. అంటే ముగ్గురు భారత ఆటగాళ్లు (క్యాప్‌డ్), ఇద్దరు విదేశీ ఆటగాళ్లు, ఇద్దరు దేశవాళీ ఆటగాళ్ల (అన్ క్యాప్‌డ్) నుంచే తుది ఐదుగురి రిటెన్షన్ జరగాలి.
- రెండేళ్ల నిషేధానికి గురైన సీఎస్‌కే, రాజస్తాన్ రాయల్స్ జట్లు 2015కు ఆడిన బృందం నుంచి ఆటగాళ్లను అట్టిపెట్టుకోవచ్చు. 2018 నుంచి మూడు సీజన్ల పాటు ఆటగాళ్ల కొనుగోలు కోసం ఒక ఫ్రాంచైజీ వెచ్చించే మొత్తాన్ని కూడా పెంచారు. ఈ మూడేళ్లు వరుసగా రూ. 80 కోట్లు, రూ. 82 కోట్లు, రూ. 85 కోట్లను ఖర్చుపెట్టొచ్చు. ఇందులో కనీసం 75 శాతం తప్పకుండా ఖర్చు చేయాలనే నిబంధన కూడా ఉంది. అంటే రూ. 80 కోట్లలో రూ. 60 కోట్లతో ఆటగాళ్లను కొనాల్సిందే.
- ఒక ఫ్రాంచైజీ ముగ్గురు ఆటగాళ్లను రిటెయిన్ చేసుకోవాలనుకుంటే వారికి వరుసగా రూ. 15 కోట్లు... రూ. 11 కోట్లు... రూ. 7 కోట్లు చెల్లించాలి. ఇద్దరు ఆటగాళ్లను రిటెయిన్ చేసుకోవాలనుకుంటే వరుసగా రూ. 12.5 కోట్లు... రూ. 8.5 కోట్లు చెల్లించాలి.



యూకీ, రామ్ ఓటమి

పుణే: టాటా ఓపెన్ ఏటీపీ టెన్నిస్ టోర్నమెంట్ పురుషుల సింగిల్స్ విభాగంలో భారత క్రీడాకారుల పోరాటం ముగిసింది. భారత అగ్రశ్రేణి క్రీడాకారులు యూకీ బాంబ్రీ, రామ్‌కుమార్ రామనాథన్ రెండో రౌండ్‌లో నిష్క్రమించారు. 2014 యూఎస్ ఓపెన్ చాంపియన్ మారిన్ సిలిచ్ (క్రొయేషియా)తో జరిగిన మ్యాచ్‌లో రామ్‌కుమార్ 4–6, 3–6తో ఓటమి చెందగా... యూకీ బాంబ్రీ 6–4, 3–6, 4–6తో ఎనిమిదో సీడ్ పియరి హ్యూస్ హెర్బర్ట్ (ఫ్రాన్స్) చేతిలో పోరాడి ఓడిపోయాడు. మరోవైపు పురుషుల డబుల్స్‌లో యూకీ బాంబ్రీ–దివిజ్ శరణ్ (భారత్) ద్వయం క్వార్టర్ ఫైనల్‌కు చేరింది. తొలి రౌండ్‌లో యూకీ–దివిజ్ జంట 6–2, 6–2తో లాస్లో జెరీ (సెర్బియా)–బ్లాజ్ కావ్‌సిచ్ (స్లొవేనియా) జోడీపై విజయం సాధించింది.



సాహా

అశ్విన్

హార్దిక్ పాండ్యా

6 7 8 నిలిచేవారెవరు?

2014 డిసెంబర్ 13... వేదిక అడిలైడ్. ప్రత్యర్థి ఆస్ట్రేలియా. మ్యాచ్ చివరి రోజు లక్ష్యం 364. మురళీ విజయ్ (99), విరాట్ కోహ్లి (141) అద్భుతంగా ఆడుతున్నారు. భారత్ గెలుపు దిశగా దూసుకెళ్తోంది. ఇంతలో శతకం చేజార్చుకుంటూ విజయ్ అవుటయ్యాడు. అప్పటికి చేయాల్సింది 122 పరుగులే. మరో ఎండ్‌లో కోహ్లి పాతుకుపోయాడు. కానీ... తర్వాత అతడికి సహరించేవారు కరవయ్యారు. 78 పరుగుల వ్యవధిలో ఏడు వికెట్లు కోల్పోయిన భారత్ 48 పరుగుల తేడాతో ఓడిపోయింది. (ఈ జట్టులో అశ్విన్, జడేజా లేరు).

2015 నవంబర్... చండీగఢ్‌లో భారత్, దక్షిణాఫ్రికా టెస్టు. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 154 పరుగులకే 7 వికెట్లు కోల్పోయింది. ఈ దశలో జడేజా (38), అశ్విన్ (20) ఎనిమిదో వికెట్‌కు 42 పరుగులు జోడించారు. ఈ ఇన్నింగ్స్‌లో వీరిద్దరిదే రెండో అత్యధిక భాగస్వామ్యం. రెండు జట్ల తరఫున స్వల్ప స్కోర్లు నమోదైన ఈ టెస్టులో భారత్ 108 పరుగులతో గెలిచింది. - సాక్షి క్రీడావిభాగం

విదేశాల్లో వారిలా...

	టె	ఇ	ప	స	అ	100	50
సాహా	13	18	552	32.47	104	1	3
పాండ్యా	3	3	178	59.33	108	1	1
అశ్విన్	20	32	863	31.96	118	2	4
భువనేశ్వర్	8	13	297	27.00	63	0	3

నోట్: టె-టెస్టులు, ఇ-ఇన్నింగ్స్, ప-పరుగులు, స- సగటు, అ- అత్యధికం

...ఈ రెండు ఉదాహరణలు స్వదేశంలో అయినా, విదేశంలో అయినా టెస్టుల్లో 6,7,8 స్థానాల్లో బ్యాటింగ్ చేయగలిగినవారి ప్రాధాన్యతను చాటుతున్నాయి. మొదట బ్యాటింగ్ చేపడితే ప్రధాన బ్యాట్స్‌మెన్‌కు అండగా నిలుస్తూ, తమవంతుగా పరుగులు చేస్తూ భారీ స్కోరుకు దోహదపడటం, రెండోసారి బ్యాటింగ్ చేయాల్సి వస్తే ప్రత్యర్థి స్కోరును అందుకునేందుకు నిచ్చెనలా నిలవడం ఈ స్థానాల్లో ఆడేవారి బాధ్యత. ఒకవేళ బ్యాట్స్‌మెన్ పూర్తిగా విఫలమైతే ఫాలోఆన్ ప్రమాదాన్ని తప్పిస్తూ గౌరవప్రదమైన స్కోరుకు పాటుపడటం వీరి విధి. స్వదేశంలో ఈ విషయంలో మన జట్టుకు ఢోకా లేదు. కూర్పు మారిపోయి అదనంగా పేసర్‌ను ఆడించాల్సిన విదేశాల్లోనే ఈ ఇబ్బందంతా. భారత్ ప్రస్తుతం పాటిస్తున్న పద్ధతి ప్రకారం ఓపెనర్లు, పుజారా, కోహ్లి, రహానే/రోహిత్‌లు స్పెషలిస్ట్ బ్యాట్స్‌మెన్‌గా తొలి అయిదు స్థానాల్లో వస్తారు. ఆరో నంబరు వికెట్ కీపర్‌గా వృద్ధిమాన్ సాహాది. ఇక్కడ ఎలాగూ స్పిన్ పిచ్‌లే కాబట్టి అశ్విన్, జడేజా 7, 8 స్థానాల్లో ఆడేవారు. మ్యాచ్ పరిస్థితులరీత్యా కొంత మారినా అటుఇటుగా ఈ ముగ్గురిది మాత్రం ఇదే బ్యాటింగ్ ఆర్డర్. బయట మాత్రం ఇది చెల్లుబాటు కాదు.

విదేశాల్లో కూర్పు మార్పు...

అయిదుగురు బ్యాట్స్‌మెన్, కీపర్, ఒక ఆల్‌రౌండర్, ఒక స్పిన్నర్, ముగ్గురు పేసర్లు. బహుశా సఫారీ టూర్‌లో ఇదే భారత్ వ్యూహం. అలవాటైన వికెట్లపై మన బ్యాట్స్‌మన్ స్వదేశంలో పరుగుల వరద పారించేవారు. లోయర్ ఆర్డర్ ఆడినా, ఆడకున్నా ప్రభావం కనిపించేది కాదు. విదేశాల్లో విజయం సాధించాలంటే మాత్రం సమష్టిగా ఆడాల్సిందే. చివరి శ్రేణిలోని బౌలింగ్ ఆల్‌రౌండర్లు... టాప్, మిడిలార్డర్‌కు దన్నుగా నిలవాల్సిందే. వారు తమవంతుగా 20లు 30లైనా జత చేయాలి. అయితే పూర్తి పేస్ పిచ్‌లుండే దక్షిణాఫ్రికాలో ఒక్క స్పిన్నర్‌తోనే బరిలో దిగాల్సి ఉంటుంది. ఈ ప్రకారం 6, 7 స్థానాల్లో సాహా, హార్దిక్ పాండ్యా, 8లో అశ్విన్ వస్తారు. సరిగ్గా వీరే గెలుపునకు కీలకం అవుతారు. దేశంలో నంబర్‌వన్ టెస్టు కీపర్‌గా పేరున్న సాహా... మూడేళ్ల క్రితం ఆసీస్‌లో కీలక సమయంలో అనవసర దూకుడు కనబర్చి విమర్శలు ఎదుర్కొన్నాడు. అయితే గతేడాది వెస్టిండీస్‌లో శతకం సాధించి వాటికి తగిన జవాబిచ్చాడు. తెలివైన క్రికెటర్‌గా అశ్విన్ ఎక్కడైనా ఉపయోగపడేవాడే. దక్షిణాఫ్రికా బౌలింగ్ దాడిని కాచుకుంటూ వీరు నమోదు చేసే భాగస్వామ్యాలే జట్టుకు విలువైనవిగా మారతాయనడంతో సందేహం లేదు.

హార్దిక్ ఏం చేస్తాడో...?

పేస్ ఆల్‌రౌండర్‌గా తుది జట్టులో చోటు ఖాయంగా కనిపిస్తున్న హార్దిక్ పాండ్యాకు ఈ సిరీస్ కీలకం కానుంది. ఇటీవలే లంకపై అరంగేట్రం చేసిన పాండ్యా శతకం కూడా సాధించాడు. భారీ హిట్టింగ్‌తో బ్యాట్స్‌మన్‌గా నిరూపించుకున్న పాండ్యా... తన పేస్ పదును చూపాల్సిన సమయం వచ్చింది. మ్యాచ్ స్థితికి అనుగుణంగా తనను తాను మలుచుకోవాల్సి ఉంటుంది. తద్వారా 'కోహ్లికి పాండ్యా ఒక ఆయుధం' అన్న మాస్టర్ సచిన్ టెండూల్కర్ వ్యాఖ్యలకూ సార్థకత చేకూర్చిన వాడవుతాడు.

అచ్చొచ్చే(నా) '9'

9... ఈ సంఖ్యను చాలామంది ఇష్టపడతారు. ఇదే సంఖ్య సఫారీ పర్యటనలో భారత జట్టుకూ ఎంతోకొంత ఉపయోగపడుతుందేమో చూడాలి. ఎందుకంటే ఈ స్థానంలో బ్యాటింగ్ వచ్చేది పేసర్ భువనేశ్వర్. కొంతకాలంగా బౌలింగ్‌లో 140 కి.మీ. వేగం అందుకుంటున్న భువీ బ్యాటింగ్‌లోనూ ఓ చేయి వేస్తున్నాడు. శ్రీలంకతో వన్డేలో బ్యాట్స్‌మెన్ విఫలమైన చోట అతడు సాధించిన అర్ధ సెంచరీ జట్టును ఓటమి నుంచి గట్టెక్కించింది. స్ట్రోక్స్ ఆడటంలోనూ భువీ మెరుగయ్యాడు. ఈ నేపథ్యంలో దక్షిణాఫ్రికాలోనూ జట్టు బ్యాటింగ్ ప్రయోజనాలకు ఉపయోగపడతామో చూడాలి.



చెన్నైకు షాక్

లక్నో: ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ (పీబీఎల్)లో డిఫెండింగ్ చాంపియన్ చెన్నై స్మాషర్స్ జట్టుకు రెండో పరాజయం ఎదురైంది. ఢిల్లీ డాషర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో చెన్నై స్మాషర్స్ 0–3తో ఓడింది. ఢిల్లీ 'ట్రంప్' మ్యాచ్‌లో సుమీత్ రెడ్డి–యాంగ్ లీ (చెన్నై) జంట 15–13, 15–11తో ఇవనోవ్–సొజోనోవ్ జోడీపై నెగ్గింది. దాంతో చెన్నై ఖాతాలో పాయింట్ చేరగా... ఢిల్లీ స్కోరు –1గా నిలిచింది. అయితే తొలి పురుషుల సింగిల్స్‌లో విన్సెంట్ (ఢిల్లీ) 15–10, 15–13తో లెవర్‌డెజ్ (చెన్నై)ను ఓడించడంతో ఢిల్లీ స్కోరు 0–1గా మారింది. రెండో పురుషుల సింగిల్స్‌లో తియాన్ హువీ 15–14, 15–10తో సెన్‌సోమ్‌బున్‌సుక్ (చెన్నై)పై నెగ్గడంతో స్కోరు 1–1తో సమమైంది. మహిళల సింగిల్స్‌లో సుంగ్ జీ హున్ (ఢిల్లీ) 11–15, 15–13, 15–14తో పీవీ సింధు (చెన్నై)పై నెగ్గడంతో ఢిల్లీ 2–1తో ఆధిక్యంలోకి వెళ్లింది. చెన్నై ఎంచుకున్న మిక్స్‌డ్ డబుల్స్ 'ట్రంప్' మ్యాచ్‌లో గాయంతో క్రిస్ అడ్‌కాక్–గాబ్రియేలా (చెన్నై) జంట వైదొలిగింది. దాంతో అశ్విని పొన్నప్ప–ఇవనోవ్ (ఢిల్లీ) జంటను విజేతగా ప్రకటించారు. 'ట్రంప్' మ్యాచ్‌లో ఓడటంతో చెన్నై పాయింట్ చేజార్చుకోగా... ఢిల్లీ ఖాతాలో పాయింట్ చేరింది.



సింధు

చేజారితే మ్యాచ్ పోయినట్లే...

అవి అసలు సిసలు పేస్ పిచ్‌లు... బ్యాట్ అంచులకు తగిలిన బంతి స్లిప్‌లోకి వచ్చేందుకు క్షణం కూడా పట్టదు. అలాంటి వాటిని ఒడిసిపట్టాలంటే ఫీల్డర్‌కు ఓపికతో పాటు తీక్షణత అవసరం. గతంలో భారత్‌కు ఈ ఏరియాలో రాహుల్ ద్రవిడ్, లక్ష్మణ్ వంటివారు పెట్టని కోటగా ఉండేవారు. ప్రస్తుత జట్టులో రహానే తప్ప... స్లిప్ స్పెషలిస్టుల లోటు కనిపిస్తోంది. ఇతడికి తోడుగా మరో చురుకైన ఆటగాడిని ఎంచుకోవాలి. కోహ్లి... ఇటీవలి శ్రీలంక సిరీస్‌లో తరచూ స్లిప్ ఫీల్డర్లను మార్చి ప్రయోగం చేసినా ఫలితం రాబట్టలేకపోయాడు. పైగా విలువైన క్యాచ్‌లు నేలపాలయ్యాయి. ఇదే తీరు ఎల్గర్, ఆమ్లా, డివిలియర్స్, డుప్లెసిస్, డికాక్ వంటి బ్యాట్స్‌మన్ ఉన్న దక్షిణాఫ్రికాపైనా కొనసాగితే విజయం గురించి ఆలోచించడం సాహసమే అవుతుంది. ఒంటిచేత్తో ఫలితాన్ని మార్చేసే ఇలాంటివారి క్యాచ్‌లు చేజారిస్తే మ్యాచ్‌లో తిరిగి కోలుకోవడం కష్టం.

భారత్... అప్పటిలా లేదు!

సునీల్ గావస్కర్

కెన్యాలోని సుప్రసిద్ధ ఫించ్ హటన్స్‌లో నేను కొత్త సంవత్సర వేడుకల్ని ఆస్వాదిస్తున్నా. అక్కడ బౌలింగ్ దిగ్గజం మైకేల్ హోల్డింగ్‌తో మాటమాట కలిసింది. కొంతకాలంగా సఫారీ క్రికెట్‌ను కవర్ చేస్తున్న ఆయనతో భారత్–దక్షిణాఫ్రికా సిరీస్‌కు సంబంధించిన చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈసారి ఇరు జట్ల మధ్య సిరీస్ రసవత్తరంగా జరుగుతుందని విశ్లేషించారు. ప్రస్తుత భారత జట్టు లైనప్, అనుభవం దృష్ట్యా గతంలో సఫారీలో ఓడినట్లుగా ఈసారి జరగదన్నారు. భారత ప్రేక్షకులు ఈ క్రికెట్ విందును ఆస్వాదించవచ్చని చెప్పుకొచ్చారు. నిజమే..! గత ఫలితాలను చూసి జరగబోయే సిరీస్‌నూ తేలిగ్గా అంచనా వేస్తే అది తెలివితక్కువ తనమే అవుతుంది. కానీ ఓ విశేష అనుభవజ్ఞుడు చెబితే మాత్రం అది నిజమవుతుంది. హోల్డింగ్ చెప్పింది అదే! బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో కోహ్లి సేన అనుభవం సంపాదించింది. ఇంతకుముందు బౌన్సీ వికెట్‌పై తెల్లబోయినట్లు ఇప్పుడు జరగకపోవచ్చు. భారత ఓపెనర్లు ఇప్పటికే చాలాసార్లు స్టెయిన్, మోర్కెల్‌ల బౌన్సర్లను ఎదుర్కొన్నారు. ఇప్పుడు కొత్తగా భయపడాల్సిన పనిలేదు. మొండిగా పోరాడే పుజారా గతంలోనే ఇక్కడ భారీ సెంచరీ చేశాడు. కోహ్లి కూడా సెంచరీలతో చెలరేగాడు. రహానే ఇప్పుడు గొప్ప ఫామ్‌లో లేకపోవచ్చు... కానీ విదేశాల్లో అతనికి మెరుగైన రికార్డు ఉంది. ఈ నేపథ్యంలో భారత్ తప్పకుండా రాణిస్తుందనే చెప్పాలి. ఇక పేసర్లు కూడా అంతే. అనుభవం నేర్పిన పాఠాలతో రాటుదేలారు. లైన్ అండ్ లెంగ్త్‌పై మంచి అవగాహనతో ఉన్నారు. సీనియర్ స్పిన్నర్ల సంగతి సరే సరి. పిచ్ నుంచి ఏ మాత్రం టర్న్ దొరికినా ఏ ఒక్కరిని విడిచిపెట్టరు. దక్షిణాఫ్రికాకు ఇవేవి తెలియని విషయాలు కాదు... అందుకే పూర్తిస్థాయి జట్టుతో సమరానికి సిద్ధమైంది. సొంతగడ్డపై వచ్చే అనుకూలతలతో పాటు డివిలియర్స్ తిరిగి జట్టులోకి చేరడం దక్షిణాఫ్రికా బలాన్ని పెంచింది. ఓపెనింగ్‌లో మాత్రం ఎల్గర్, మర్‌క్రమ్‌లు ఈ సీజన్‌లో నాణ్యమైన బౌలింగ్‌ను ఎదుర్కొనలేదు. ఇప్పుడు భారత బౌలర్ల రూపంలో వాళ్లకు సవాల్ ఎదురుకానుంది. లెఫ్టార్మ్ స్పిన్నర్ కేశవ్ మహరాజ్ ఇటీవల బాగా ఆకట్టుకుంటున్నాడు. కీలకమైన వికెట్లు తీసి ప్రత్యర్థిని ఇబ్బందిపెడుతున్నాడు. ఇలాంటి వైరివర్గాలతో పోటీ రేకెత్తిస్తున్న ఈ సిరీస్ కోసం ఇంకా వేచిచూడటం కష్టమేమో!

మున్రో మెరుపులు...

- 53 బంతుల్లో 3 ఫోర్లు, 10 సిక్సర్లతో 104
- టి20ల్లో మూడు సెంచరీలు చేసిన ఏకైక బ్యాట్స్‌మన్‌గా రికార్డు
- విండీస్‌పై చివరి మ్యాచ్‌లోనూ న్యూజిలాండ్‌దే గెలుపు

మౌంట్ మాంగనీ: విండీస్ బౌలర్ల భరతం పట్టిన న్యూజిలాండ్ బ్యాట్స్‌మన్ కొలిన్ మున్రో (53 బంతుల్లో 104; 3 ఫోర్లు, 10 సిక్స్‌లు) ఆకాశమే హద్దుగా చెలరేగాడు. అంతర్జాతీయ టి20 క్రికెట్‌లో అత్యధికంగా మూడు సెంచరీలు చేసిన ఏకైక బ్యాట్స్‌మన్‌గా రికార్డు నెలకొల్పాడు. గతంలో మున్రో బంగ్లాదేశ్‌పై (101), భారత్ (109 నాటౌట్)పై ఒక్కో సెంచరీ చేశాడు. మున్రో మెరుపులకు తోడు బౌలర్లు సౌతీ (3/21), బౌల్ట్ (2/29), సోధి (2/25) రాణింపుతో వెస్టిండీస్‌తో జరిగిన చివరిదైన మూడో టి20 మ్యాచ్‌లో న్యూజిలాండ్ 119 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 2–0తో సొంతం చేసుకుంది. రెండో టి20 మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. ఇంతకుముందు టెస్టు, వన్డే సిరీస్‌లు కూడా న్యూజిలాండ్ ఖాతాలోకే వెళ్లడం విశేషం. దాంతో 1999–2000 తర్వాత తొలిసారి విండీస్ జట్టు న్యూజిలాండ్ గడ్డపై ఒక్క విజయం నమోదు చేయకుండానే వెనుదిరిగింది.

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న న్యూజిలాండ్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 243 పరుగులు సాధించి టి20ల్లో తమ అత్యధిక స్కోరును నమోదు చేసింది. మున్రో, గప్టిల్ (38 బంతుల్లో 63; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) తొలి వికెట్‌కు 11.1 ఓవర్లలో 136 పరుగులు జోడించడం విశేషం. గప్టిల్ అవుటయ్యాక మిగతా సహచరుల సహకారంతో మున్రో కదంతొక్కాడు. 47 బంతుల్లో తన సెంచరీని పూర్తి చేసుకున్న మున్రో ఇన్నింగ్స్ చివరి ఓవర్ తొలి బంతికి అవుటయ్యాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన విండీస్ జట్టు కివీస్ బౌలర్ల ధాటికి 16.3 ఓవర్లలో 124 పరుగులకే ఆలౌటైంది. టిమ్ సౌతీ తొలి ఓవర్‌లోనే విండీస్ ఓపెనర్లు క్రిస్‌గేల్, వాల్టన్‌లను డకౌట్ చేశాడు. ఫ్లెచర్ (32బంతుల్లో 46; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) దూకుడుగా ఆడినా మిగతా వారంతా విఫలమయ్యారు.

3 అంతర్జాతీయ టి20ల్లో మున్రో సెంచరీలు. క్రిస్ గేల్, లెవిస్ (వెస్టిండీస్), మెకల్లమ్ (న్యూజిలాండ్), రోహిత్ శర్మ (భారత్) రెండేసి సాధించారు.

1 ఈ సిరీస్ విజయంతో పాకిస్తాన్‌ను (124 పాయింట్లు) వెనక్కి నెట్టి న్యూజిలాండ్ 126 పాయింట్లతో టి20 ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి చేరుకుంది. భారత్ 121 పాయింట్లతో మూడో స్థానంలో ఉంది.



మున్రో





టైఫాయిడ్‌కు సరికొత్త వ్యాక్సిన్

- అభివృద్ధి చేసిన భారత్ బయోటెక్.. ఒక్క డోసుతో టైఫాయిడ్ నుంచి రక్షణ
- ప్రపంచంలోనే తొలి కాంజుగేట్ వ్యాక్సిన్‌గా టైఫ్‌బార్–టీసీవీ
- ప్రపంచవ్యాప్త పంపిణీకి అర్హత సాధించిన వ్యాక్సిన్

సాక్షి, హైదరాబాద్: టైఫాయిడ్ నుంచి ఏళ్లపాటు రక్షణ కల్పించే సరికొత్త వ్యాక్సిన్‌ను హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న భారత్ బయోటెక్ అభివృద్ధి చేసింది. సంప్రదాయ యాంటీబయాటిక్ మందులకు లొంగని టైఫాయిడ్‌ను కూడా నయం చేయగల ఈ మందు త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి రానుందని భారత్ బయోటెక్ సంస్థ చైర్మన్, ఎండీ డాక్టర్ కృష్ణ ఎల్లా తెలిపారు. తగిన అవకాశాలు కల్పిస్తే భారత్ ఎవరికీ తీసిపోదనేందుకు పూర్తిగా దేశీయ సాంకేతికతతో తయారైన ‘టైఫ్‌బార్–టీసీవీ’నిదర్శనమని పేర్కొన్నారు. తాజాగా అందరికీ పంపిణీ చేసేందుకు ఈ వ్యాక్సిన్ ప్రపంచ ఆరోగ్య సంస్థ నుంచి అర్హత సాధించింది. ఈ సందర్భంగా బుధవారం వ్యాక్సిన్ వివరాలను కృష్ణ ఎల్లా వివరించారు. వివరాలు ఆయన మాటల్లోనే..

అంత సామాన్యమైనది కాదు..

టైఫాయిడ్ అంటే ఒకట్రెండు ఇంజెక్షన్లు వేసుకుని నాలుగు మాత్రలు వాడితే తగ్గిపోయే వ్యాధి అన్నది చాలామందిలో ఉన్న అభిప్రాయం. అయితే వాస్తవ పరిస్థితులు అలా లేవు. కలుషిత ఆహారం, తాగునీటిలోని సాల్మొనెల్లా టైఫీ బ్యాక్టీరియా ద్వారా ఈ వ్యాధి వస్తుంది. జ్వరం, తలనొప్పి, అతిసారం వంటి లక్షణాలుండే టైఫాయిడ్ సోకితే మూడు రోజుల నుంచి 25 రోజుల పాటు ఉంటుంది. వ్యాధి చికిత్సకు ప్రస్తుతం మూడు రకాల యాంటీబయాటిక్స్ వాడుతున్నారు. ఎస్.టైఫీ బ్యాక్టీరియా ఈ మూడింటితో పాటు కొత్తగా అభివృద్ధి చేసిన నాలుగో తరం యాంటీబయాటిక్ మందుకూ నిరోధకత పెంచుకున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. అంతర్జాతీయ సంస్థల లెక్కల ప్రకారం టైఫాయిడ్ కారణంగా 2016లో దాదాపు 1.3 లక్షల మంది మరణించారంటే పరిస్థితి తీవ్రత ఏమిటో అర్థం చేసుకోవచ్చు. భారత్ బయోటెక్ 2001లోనే సరికొత్త వ్యాక్సిన్ తయారీకి ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఐదేళ్ల తర్వాత ప్రపంచంలోనే మొదటి కాంజుగేట్ వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేసింది. అన్ని రకాల పరీక్షలు నిర్వహించి వ్యాక్సిన్ పనితీరు, సమర్థతను పూర్తిస్థాయిలో అంచనా వేసింది.

సొంత డబ్బుతో పరిశోధనలు..

టైఫ్‌బార్–టీసీవీ వ్యాక్సిన్ అభివృద్ధికి భారత్ బయోటెక్ సొంత డబ్బుతో పరిశోధనలు చేసిందని.. మొత్తం తాము రూ.150 కోట్ల వరకు ఖర్చు చేశామని కృష్ణ తెలిపారు. 6 నెలల పిల్లల నుంచి పెద్దల వరకు ఎవరైనా ఈ వ్యాక్సిన్ వాడొచ్చని.. దాదాపు 25 మైక్రోగ్రాముల డోసుతో టైఫాయిడ్‌కు దూరం కావొచ్చని చెప్పా రు. ప్రస్తుతం ఒక్కో డోసుకు రూ.1,500 వరకు ఖర్చు అవుతుందని.. వాడకం పెరిగిన కొద్దీ ధరలు తగ్గుతాయని పేర్కొన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థకు సలహాలిచ్చే నిపుణుల బృందం కూడా ఈ వ్యాక్సిన్‌ను ప్రపంచవ్యాప్తంగా పంపిణీ చేయాల్సిందిగా సూచించిందని వివరించారు. జనాభా మొత్తానికి వేర్వేరు వ్యాధుల నుంచి టీకాల ద్వారా రక్షణ కల్పించేందుకు ఉద్దేశించిన ‘గావీ’సంస్థ వచ్చే ఏడాది దాదాపు 8.5 కోట్ల డాలర్లతో టైఫాయిడ్ వ్యాక్సిన్‌ను పంపిణీ చేసేందుకు భారత్ బయోటెక్ వర్సిటీ ఆఫ్ మేరీల్యాండ్, టైఫాయిడ్ వ్యాక్సిన్ కన్సార్షియం, ఆక్స్‌ఫర్డ్ యూని వర్సిటీ, పాథ్, గేట్స్ ఫౌండేషన్‌ల భాగస్వామ్యంతో నేపాల్, మలా వీ, బంగ్లాదేశ్‌లలో ఈ వ్యాక్సిన్‌పై మరిన్ని పరీక్షలు చేసేందుకు ప్రయత్నిస్తోందని వివరించారు.



పోలీసు శాఖకు ఆధునిక హంగులు

- రాష్ట్రవ్యాప్తంగా ఏకరూప పోలీసింగ్
- మూడేళ్లలో పది లక్షల సీసీ కెమెరాల ఏర్పాటే లక్ష్యం
- వెల్లడించిన డీజీపీ ఎం.మహేందర్‌రెడ్డి


హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన ట్రాఫిక్ కమాండ్ కంట్రోల్ సెంటర్

సాక్షి, హైదరాబాద్: పోలీసు శాఖ సాంకేతికమయం అవుతోంది. టెక్నాలజీ సహాయంతో నేరాలను నిరోధించడానికి, కేసుల్ని కొలిక్కి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటోంది. రాష్ట్రవ్యాప్తంగా ఏకరూప పోలీసింగ్ అమలు చేయాలని నిర్ణయించామని డీజీపీ ఎం.మహేందర్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ మాదిరిగా అన్ని జిల్లాలు, పోలీసు కమిషనరేట్లకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకువస్తున్నామని చెప్పారు. హైదరాబాద్ పోలీసు కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్, టెక్నాలజీ ఫ్యూజన్ సెంటర్‌లను ఆయన బుధవారం ప్రారంభించారు. డీజీపీ మాట్లాడుతూ ‘బంజారాహిల్స్‌లోని రోడ్ నంబర్ 12లో నిర్మితమవుతున్న ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ) ఆధునిక టెక్నాలజీకి కేరాఫ్ అడ్రస్‌గా ఉంటుంది. ఈ ఏడాది చివరి నాటికి దీని నిర్మాణం పూర్తి చేసి, రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలు, కమిషనరేట్లను అనుసంధానించి సేవలు అందించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నాం’ అని చెప్పారు. ‘హైదరాబాద్ కమిషనరేట్‌లో ఈ టెక్నాలజీ ఫ్యూజన్ సెంటర్ ఏర్పాటు చేశాం. తొలుత ఇక్కడ అమలులోకి తీసుకువచ్చే సాంకేతిక పరిజ్ఞానాన్ని అన్ని కోణాల్లోనూ అధ్యయనం చేస్తాం. లోపాలు బయటపడితే వాటిని సరిచేసి ఐసీసీసీ అందుబాటులోకి వచ్చేనాటికి పక్కాగా రూపొందిస్తాం’ అని పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురైతే వెంటనే అక్కడి సిబ్బందిని అప్రమత్తం చేయడానికి టెక్నా లజీ దోహదపడుతుందన్నారు. రాష్ట్రంలోని అన్ని కమిషనరేట్లు, జిల్లాల్లోని పోలీసులకు శిక్షణ ఇచ్చే బాధ్యతల్ని హైదరాబాద్ పోలీసు కమిషనర్‌కు అప్పగిస్తున్నామని అన్నారు. రాష్ట్రాన్ని శాంతిభద్రతలకు నిలయంగా మార్చి పెట్టుబడులకు కేంద్రాన్ని చేయాలన్నది రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమని పేర్కొన్నారు. రానున్న మూడేళ్లలో హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలో పది లక్షల సీసీ కెమెరాల ఏర్పాటు లక్ష్యంగా నిర్దేశించుకున్నామని చెప్పారు. ఈ అంశంలో 1.66 లక్షల కెమెరాల ఏర్పాటు చేయించిన హైదరాబాద్ కమిషనరేటే మిగిలిన వాటికి ఆదర్శం’అని అన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ ఇన్‌చార్జి పోలీసు కమిషనర్ వీవీ శ్రీనివాసరావుతోపాటు మూడు కమిషనరేట్ల అధికారులు పాల్గొన్నారు.



పౌరసత్వంపై హోంశాఖ నిర్ణయం చెల్లదు

కేంద్ర ఉత్తర్వులపై హైకోర్టులో చెన్నమనేని రమేశ్ పిటిషన్

సాక్షి, హైదరాబాద్: భారత పౌరుడిని కాదంటూ కేంద్ర హోం శాఖ తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ హైకోర్టును ఆశ్రయించారు. జర్మన్ పౌరసత్వాన్ని పొందిన రమేశ్ ఎమ్మెల్యేగా అనర్హుడని దాఖలైన కేసులో ఆయనకు వ్యతిరేకంగా గతంలో ఉత్తర్వులు వెలువడ్డాయి. భారత పౌరసత్వ చట్టం–1955లోని 10వ సెక్షన్ ప్రకారం కేంద్ర హోం శాఖ తీసుకున్న నిర్ణయాన్ని సమీక్షించాలని కోరే హక్కు తనకు ఉందంటూ గతేడాది రమేశ్ హైకోర్టును ఆశ్రయించారు. 6 వారాల్లోగా రమేశ్ చేసుకున్న దరఖాస్తుపై నిర్ణయం తీసుకోవాలని, ఆలోపు ఆయనకు వ్యతిరేకంగా ఉన్న ఉత్తర్వులను తాత్కాలికంగా నిలుపుదల చేయాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. రమేశ్ దాఖలు చేసుకున్న రివ్యూ పిటిషన్‌ను కేంద్ర హోంశాఖ 2017 డిసెంబర్ 13న తోసిపుచ్చింది.

ఏడో శతాబ్దపు నీడ.. ఆ గోడ!

జనగామలోని పురాతన ఇటుక గోడపై పురావస్తు అధికారుల అంచనా

సాక్షి, హైదరాబాద్: ఓ గొప్ప చారిత్రక వారసత్వ కేంద్రమది.. ఆదిమానవుల కాలం నుంచి మహారాజ్యాల పాలనకు సంబంధించిన ఎన్నో ఆధారాలు అక్కడ కొలువయ్యాయి. కానీ విచక్షణ లేకుండా సాగిన తవ్వకాలతో మొత్తం నాశనమయ్యాయి. జనగామ సమీపంలో తాజాగా వెలుగు చూసిన పురాతన నిర్మాణ అవశేషాలను ప్రాథమికంగా పరిశీలించిన పురావస్తు శాఖ ఇదే విషయాన్ని స్పష్టం చేస్తోంది. పెంబర్తి శివారు ఎల్లంల గ్రామంలో వెలుగుచూసిన పురాతన ఇటుక గోడ ప్రాంతాన్ని పురావస్తు శాఖ అధికారి భానుమూర్తి ఆధ్వర్యంలో సిబ్బంది పరిశీలించారు. ఆ నిర్మాణం ఏంటో, అది ఏ కాలానికి చెందిందో తేల్చనప్పటికీ.. అది దాదాపు ఏడో శతాబ్దానికి చెందిన కట్టడంలాగా ఉందని అధికారులు గుర్తించారు. ఇటుకల తీరు, నిర్మాణ పద్ధతి ఆధారంగా చాళుక్యుల కాలం నాటిది కావచ్చనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఇటుక గోడపైన రెండు మీటర్లకుపైగా ఎత్తుతో భారీగా ఇసుక మేట వేసి ఉందని, దాన్ని తొలగిస్తే గాని సరైన అంచనా రాదని వారు పేర్కొంటున్నారు. చుట్టూ తవ్వకాలు జరిపితేనే ఆ నిర్మాణం పూర్తిగా వెలుగు చూసే అవకాశం ఉందని చెబుతున్నారు. బుధవారం మరింత మేర తవ్వగా తొమ్మిది ఇటుక నిర్మాణ వరసలు వెలుగుచూశాయి. తాను గుర్తించిన వివరాలతో రెండు రోజుల్లో పురావస్తు శాఖ సంచాలకులు విశాలాచ్చికి నివేదిక ఇస్తానని భానుమూర్తి తెలిపారు. మరోవైపు గోడ అవశేషమే కాకుండా చుట్టు పక్కల ప్రాంతాల్లో మరెన్నో ఆధారాలు కనిపించాయి. ఆదిమానవుల ఆవాసం, వివిధ అవసరాల కోసం రూపొందించిన రాతి గుంతలు, వినియోగించిన వస్తువులు, సమాధులు కనిపించాయి. వాటిలో చాలావరకు దెబ్బతిన్నాయి. పురావస్తు శాఖ ఇక్కడ తవ్వకాలకు వెంటనే అనుమతించి పనులు చేపడితే నాటి నిర్మాణాలు వెలుగు చూసే అవకాశం ఉంది.

ట్రిపుల్ తలాక్‌పై తొందరెందుకు?

కేంద్రాన్ని ప్రశ్నించిన సురవరం

సాక్షి, హైదరాబాద్: ట్రిపుల్ తలాక్ విషయంలో ప్రధాని మోదీ ప్రభుత్వానికి అంత తొందరెందుకని సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి ప్రశ్నించారు. ట్రిపుల్ తలాక్ చట్టం మంచిదే అయినప్పటికీ కఠిన నిబంధనల వల్ల చట్టం ఉద్దేశం నెరవేరదన్నారు. బుధవారం మఖ్దూం భవన్‌లో చాడ వెంకటరెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. ట్రిపుల్ తలాక్‌కు సీపీఐ ఎప్పుడూ వ్యతిరేకమేనని, బిల్లులోని మూడేళ్ల జైలు శిక్ష ఒక మతం వారికే అమలు చేయడాన్ని వ్యతిరేకిస్తున్నా మన్నారు. ట్రిపుల్ తలాక్ బిల్లును పార్లమెంట్ సెలెక్ట్ కమిటీకి పంపాలని సూచించారు. విడాకుల బాధితులకు ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మహారాష్ట్రలో బుధవారం జరిగిన బంద్‌కు సీపీఐ మద్దతు ఇచ్చిందన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అరెస్టు దళితుల అణచివేతలో ఒక భాగమని విమర్శించారు. కేంద్రంలో ఇప్పుడు ఫ్రంట్ ఏర్పాటు చేసే ఆలోచన లేదన్నారు.

పవన్ కల్యాణ్‌కు ఇక్కడేం పని: చాడ

తెలంగాణ ఉద్యమంలో పాల్గొనని పవన్ కల్యాణ్‌కు ఇక్కడ ఏమి పనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి ప్రశ్నించారు. రాష్ట్ర సమస్యలపై పవన్‌కు అవగాహన లేదని, ఆయన ఒక సినీ నటుడు మాత్రమేనని విమర్శించారు. 24 గంటల కరెంటు ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. మంద కృష్ణను విడుదల చేయాలని, ఎస్సీ వర్గీకరణపై అఖిలపక్షాన్ని కేంద్రం వద్దకు తీసుకెళ్లాలని కోరారు.

వర్గీకరణకు వ్యతిరేకంగా ఢిల్లీలో ధర్నా

సాక్షి, న్యూఢిల్లీ: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఢిల్లీలోని పార్లమెంట్ స్ట్రీట్ వద్ద మాల మహానాడు బుధవారం ధర్నా చేపట్టింది. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై అఖిలపక్షాన్ని ఢిల్లీ తీసుకెళ్తామని సీఎం కేసీఆర్ ఇచ్చిన మాటను వెనక్కు తీసుకోవాలని సంఘం జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య డిమాండ్ చేశారు. అగ్రకుల నాయకులు మాల, మాదిగల మధ్య గొడవ పెట్టాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. వర్గీకరణను ఆపకపోతే దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

మైనారిటీ కమిషన్ చైర్మన్‌గా కమరుద్దీన్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ మైనారిటీ కమిషన్‌ను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. మహమ్మద్ కమరుద్దీన్‌ను కమిషన్ చైర్మన్‌గా, రాజారపు ప్రతాప్‌ను వైస్ చైర్మన్‌గా నియమించింది. సభ్యులుగా మహ్మద్ అర్షద్ అలీఖాన్, విద్యా స్రవంతి, గస్టీ నోరియా, బొమ్మల కట్టయ్య, సురేందర్ సింగ్ నియమితులయ్యారు. మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి సయ్యద్ ఒమర్ జలీల్ మంగళవారం ఈ ఉత్తర్వులు జారీచేశారు. చైర్మన్‌తో పాటు సభ్యుల పదవీ కాలం బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి మూడేళ్ల పాటు ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది.



Published and Printed by K. Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., Editor: V. Murali, Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792